www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

వెల: రూ. 5.00

సంపుటి: 14
సంచిక: 230

గురువారం | 1-3-2018 పేజీలు: 18 + 20

శ్రీహేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం; తిథి: చతుర్దశి ఉ. 8.58 తదుపరి పౌర్ణమి; నక్షత్రం: మఖ రా. 11.47 తదుపరి పుబ్బ; వర్జ్యం: మ. 12.46-2.14; దుర్ముహూర్తం: ఉ. 10.31-11.18, మ 3.12-3.58; అమృతఘడియలు: రా. 9.35-11.03; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 6.38; సూర్యాస్తమయం: 6.19 | నిజామాబాద్ సిటీ*

Nizamabad | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Bangalore and Chennai

కంచి పట్టుచీర కట్టి...
నుదుట పెద్ద బొట్టు దిద్ది...
పూల పల్లకీలో...
ఆమె ప్రయాణం!

అతిథిలా పలకరించి...
అంతలోనే మాయమై...
అందాల బొమ్మా
అంత తొందర దేనికమ్మా!!

బతుకులోని బంధమా..
పలుకలేని భావమా..
మరువలేని స్నేహమా..
మరల రావా నేస్తమా!!!



మల్లెపూల పల్లకిలో మరలిరాని లోకాలకు!

కన్నీటి ధారల నడుమ శ్రీదేవికి కడపటి వీడ్కోలు



కడసారి... కంచిపట్టు చీరలో శ్రీదేవి

7 కిలో మీటర్ల పొడవున అభిమాన జన సందోహం

కిక్కిరిసిన ముంబై రహదారులు

చితికి నిప్పంటించిన బోనీ, కూతుళ్లు

అందం అందనంత దూరానికి వెళ్లిపోయింది.. అమాయకమైన ఆ ముఖం సిందూరం దిద్దుకుని సాయం సంధ్యలో కలిసిపోయింది. చాందినీ.. తారాలోకానికి తరలిపోయింది. దేవ కన్య స్వర్గ సీమలకేగింది. పువ్వులాంటి ఆ పసిపాప నవ్వు ఇక సెలవంటూ కనుమరుగయింది. అవును.. శ్రీదేవి

మిగతా 8వ పేజీలో...

» తిరిగి రావా శ్రీదేవీ!!



తెల్లపూల రథంలో శ్రీదేవి భౌతికకాయం.. ఆర్తిగా వీడ్కోలు పలుకుతున్న అభిమాన జనం



తరలిన తారాలోకం.. టాబ్లాయిడ్ సెంటర్‌స్ప్రెడ్‌లో...

కంచి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి

మహా నిర్యాణం

గుండెపోటుతో ఆస్పత్రిలో తుదిశ్వాస.. 9 గంటలకు శివైక్యం

ఆయన
ఆశీర్వచనం...
అనుగ్రహ భాషణం...
ఆధ్యాత్మిక ప్రయాణం...
అభినవ శంకరుడి
ప్రవాహ బోధ...

అన్నీ ఆగిపోయాయి. శివశివ శంకర... హరహర శంకర నినాదంతో హైందవ మత వికాసం కోసం దేశం నలు చెరుగులా ప్రయాణించి, ఇతర దేశాల్లోనూ ప్రవచించిన ఆ మహనీయుడు మరి లేరు! అటు పరమాత్ముడి సేవ... ఇటు మానవ సేవతో తరించిన మహా మనీషి శివుడి సన్నిధికేగారు. శివైక్యం చెందారు. కంచి పీఠాధిపతి జగద్గురు శంకరాచార్య శ్రీ జయేంద్ర సరస్వతి భక్తులను శోకసముద్రంలో ముంచి.. తాను భగవంతుడి వద్దకు వెళ్లిపోయారు.

రోజూలాగానే బుధవారం ఉదయం

7.10 వరకూ భక్తులకు దర్శనం

అంతలోనే అస్వస్థత.. కన్నుమూత

పేదల జీవితాల్లో మార్పు తెచ్చారు: మోదీ

చెన్నై, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కంచి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి (82) మహా నిర్యాణం చెందారు. కొంతకాలంగా రక్తపోటు, తీవ్ర మధుమేహం, శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్న ఆయన బుధవారం ఉదయం 9 గంటలకు పరమపదించారు. రోజూలాగానే బుధవారం ఉదయం కూడా 7.10 గంటల వరకూ భక్తులకు

మిగతా 12వ పేజీలో...



పీఠాన్ని బడుగులకు చేరువ చేశారు: సీఎం కేసీఆర్

కంచి మఠాధిపతిగా విజయేంద్ర 12

తెలుగు కుటుంబంలో జననం.. 13వ ఏట సన్యాస దీక్ష



కేంద్ర మాజీ మంత్రి చిదంబరం కుమారుడు

కార్తి అరెస్ట్



ఢిల్లీలోని పటియాలా కోర్టు నుంచి బయటకు వస్తున్న కార్తీచిదంబరం

విమానాశ్రయంలో పట్టుకున్న సీబీఐ

కుమార్తె అడ్మిషన్ కోసం లండన్‌కు

తిరిగి రాగానే చెన్నైలో అదుపులోకి

విమానాశ్రయం నుంచి నేరుగా ఢిల్లీకి

ఒక రోజు కస్టడీకి కోర్టు అనుమతి

కార్తీ మిలియన్ డాలర్లు పుచ్చుకున్నారు

చుట్టుకున్న ఐఎన్ఎక్స్ మీడియా స్కాం

న్యూఢిల్లీ/చెన్నై, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): చెన్నై విమానాశ్రయం... తెలతెలవారుతోంది... అప్పుడే లండన్ నుంచి బ్రిటిష్ ఎయిర్‌వేస్ విమానం వచ్చివాలింది. కాంగ్రెస్ నేత, మాజీ ఆర్థిక మంత్రి చిదంబరం తనయుడు.. కార్తీచిదంబరం అందులోంచి దిగారు. సుప్రీంకోర్టు అనుమతితో లండన్ వెళ్లి కుమార్తెను కళాశాలలో చేర్పించి వస్తున్నారాయన. చెన్నై విమానాశ్రయంలో దిగగానే స్నేహితులు ఎదురొస్తారని అనుకున్నారాయన. కానీ ముందు రోజు నుంచే ఎదురు చూస్తున్న సీబీఐ అధికారులు ప్రత్యక్షమై తమ గుర్తింపు కార్డులను చూపి ఆయనను అదుపులోకి తీసుకున్నారు. బుధవారం ఉదయమే నాటకీయ ఫక్కీలో ఈ అరెస్టు జరిగింది. విమానాశ్రయంలోనే గంటసేపు

మిగతా 14వ పేజీలో...

పటియాలా కోర్టులో భారీ భద్రత

లండన్‌లో ఉన్న చిదంబరం

హుటాహుటిన ఢిల్లీకి పయనం

అరెస్టు ప్రతీకార చర్యే: కాంగ్రెస్

చట్టానికి అంతా సమానులే: బీజేపీ

ఐఎన్ఎక్స్ మీడియా స్కాం ఏమిటి?

-కథనాలు లోపలి పేజీల్లో..



14

తండ్రీకొడుకుల భయమే నిజమైంది!

అరెస్టుపై ముందే ఇద్దరి ఆందోళన

గురి 'నాన్న'పైనే

సాగర్ జగడం



సాగర్ డ్యాం వద్ద పోలీసుల బందోబస్తు

ఏపీకి నీటి విడుదల నిలిపివేత

మళ్లీ వదలాలని ఏపీ డిమాండ్

ఎక్కువ వాడేశారన్న తెలంగాణ

నాగార్జునసాగర్ వద్ద ఉద్రిక్తత

రోజుకు 2వేల క్యూసెక్కులు

5 రోజుల విడుదలకు బోర్డు నిర్ణయం.. రేపు భేటీ

హైదరాబాద్/నాగార్జునసాగర్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య మళ్లీ కృష్ణా జల వివాదం తలెత్తింది. ఈ సీజన్‌లో ఇప్పటికే కేటాయించిన కోటాను పూర్తిగా ఉపయోగించుకున్న ఆంధ్రప్రదేశ్.. మళ్లీ నీటిని విడుదల చేయాల్సిందిగా డిమాండ్ చేయడంతో తాజా వివాదం చోటుచేసుకుంది. నాగార్జున సాగర్ కుడి కాల్వకు నీటి విడుదలను నిలిపివేయాలని నిర్ణయించిన కృష్ణా బోర్డు.. ఏపీ డిమాండ్‌తో మరో 5 రోజుల పాటు రోజుకు 2,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడానికి

మిగతా 11వ పేజీలో...



'టీ-యాప్ ఫోలియో'ను రిమోట్ ద్వారా ఆవిష్కరిస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో ఎంపీ బూర నర్సయ్యగౌడ్, డీజీపీ మహేందర్‌రెడ్డి తదితరులు 11

ఒక్క యాప్.. 150 సేవలు

అందుబాటులోకి 'టీ-యాప్ ఫోలియో'

ఆవిష్కరించిన మంత్రి కేటీఆర్

ఏడాదిలోగా వెయ్యి సేవలు అందిస్తాం

రైతు వేదికలకూ ఉచితంగా టీ-ఫైబర్

త్వరలో 'ధరణి' యాప్.. మంత్రి వెల్లడి

గ్రూప్-2 ఓఎంఆర్ షీట్ల తనిఖీ

ముగ్గురు న్యాయవాదులతో కమిటీ.. 5 వేల అభ్యర్థుల షీట్లను పరిశీలించాలి

ఆరోపణలపై సత్వరం నివేదిక ఇవ్వాలి.. హైకోర్టు ఆదేశం.. 19న మలి విచారణ

టీఆర్టీకి పదో తరగతి హాల్‌టికెట్.. పేరు స్థానంలో టెన్త్ హాల్‌టికెట్ నంబరు 2

ఎంపీలు, ఎమ్మెల్యేలపై కేసుల విచారణకు ప్రత్యేక కోర్టు

తెలంగాణ సర్కారు ఉత్తర్వులు





ప్రణాళిక, కృషి, ఫలితం.. ముగ్గురమ్మలు

ఏదైనా గొప్ప పనిని సమర్థంగా చేసినపుడు, ఒక లక్ష్యాన్ని సాధించినపుడు దానివల్ల ఎంతో సంతోషాన్ని పొందుతాం. దాన్ని ఒక ఐశ్వర్యంగా భావిస్తాం. అలాంటి ఫలితాన్ని సాధించడానికి పూర్వరంగంలో ఒక ఆలోచన, తెలివైన ప్రణాళిక తప్పక ఉంటాయి. లక్ష్యం కోసం ప్రయత్నించే సమయంలో ఎంతో శ్రమ ఉంటుంది. ప్రతి గొప్ప విజయంలోనూ ప్రణాళిక, కృషి, ఫలితం అనే మూడు అంశాలు ఉంటాయి. ఈ మూడింటినీ మూడు శక్తులుగా, ముగ్గురు తల్లులుగా మన కథల్లో చూస్తాం. ఆలోచన అనేది సరస్వతి. కృషి లేదా శ్రమ దుర్గాదేవి, ఫలితం లక్ష్మీదేవి. వీరి ముగ్గురిని ముగురమ్మలు అన్నాడు పోతన. బ్రహ్మకు సృష్టించడానికి కావలసిన ఆలోచన, తెలివి అనే శక్తినే అతని భార్య సరస్వతి అన్నాం. ప్రపంచాన్ని పోషించే విష్ణువుకు అవసరమైన ఐశ్వర్యమే ఆయన భార్య లక్ష్మి. దుర్గ అంటే కష్టమైన పనిని సాధింపజేసే శక్తి. ఈమె శివుడి భార్య. ఈ మూడు శక్తుల్నీ ముగ్గురు మూర్తుల భార్యలుగా కథల్లో వర్ణించారు. ఉదయం లేస్తూనే చాలామంది చెప్పుకొనే శ్లోకం ఒకటుంది. అందులో "కరాగ్రే వసతే లక్ష్మీ".. అంటే ఒక పని పూర్తయిన తర్వాత లభించే ఉత్తమ ఫలితం. "కరమూలే సరస్వతి".. అంటే పని ప్రారంభించడానికి ముందున్న ప్రణాళిక. "కరమధ్యే స్థితా గౌరీ" ..అంటే లక్ష్యాన్ని సాధించే సమయంలో పడే శ్రమ. ప్రపంచంలో ఏ సమాజం వారికైనా వర్తించే మూల సూత్రమిది. అల్విన్ టాఫ్లర్ అనే సామాజిక శాస్త్రవేత్త 'పవర్ షిఫ్ట్' అనే పుస్తకంలో పై మూడు శక్తుల్నీ వివరించాడు. ఏ సమాజంలోనైనా విజ్ఞానం, ఆర్థిక బలం, ఆయుధ బలం అనే మూడు బలాలే ఉంటాయి. సమాజానికే కాక వ్యక్తులకు కూడా ఈ మూడూ వర్తిస్తాయని ఆ రచయిత వివరించాడు. ఆధునిక యుగంలో మిగతా రెండు బలాల కంటే విజ్ఞానం ముఖ్యమైనది. 'భారత' అనే పదానికి జ్ఞానం పై ఆసక్తి ఉన్నవాడు అని అర్థం. ప్రపంచీకరణ, ఆధునీకరణ సమాజాల్ని మార్చేస్తున్న ప్రస్తుత తరుణంలో బుద్ధిబలం ప్రాధాన్యాన్ని మనం గుర్తించాలి.

-కె.అరవిందరావు

Paramjyothi పరంజ్యోతి

106 సీట్లొస్తే నేను తప్పుకొంటా

రాకుంటే కేసీఆర్ వైదొలగుతారా?.. రాజకీయ సన్యాసంపై ఉత్తమ్ సవాల్

- కేసీఆర్ పచ్చి అబద్ధాల కోరు
- ప్రజాచైతన్య యాత్రలో పీసీసీ చీఫ్
- కేసీఆర్‌పై పోటీ చేస్తా: వెంకటరెడ్డి



ఉత్తమ్‌కు నాగలి అందజేసిన కార్యకర్తలు

జహీరాబాద్, సంగారెడ్డి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో నిరుద్యోగులు, రైతులు, దళితులకు అన్యాయం జరుగుతోందని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. సీఎం కేసీఆర్ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారన్నారు. ఆయన ప్రపంచంలోనే అతిపెద్ద అబద్ధాలకోరు అని విమర్శించారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలను దగా చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ప్రజల ఆకాంక్షలను దృష్టిలో పెట్టుకుని సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ఇస్తే దాన్ని కేసీఆర్ తమ కుటుంబానికి లాభం చేకూర్చే విధంగా మార్చుకుని పబ్బం గడుపుకొంటున్నారని ధ్వజమెత్తారు. బంగారు తెలంగాణ చేస్తానంటూ ప్రజలను భ్రమలో ఉంచి తన కుటుంబాన్ని బంగారుమయంగా చేసుకున్నాడని విమర్శించారు. బుధవారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్, నారాయణఖేడ్‌ల్లో నిర్వహించిన ప్రజా చైతన్య బస్సు యాత్ర బహిరంగసభల్లో ఆయన మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో కేసీఆర్ చెప్పినట్టు టీఆర్ఎస్‌కు 106 సీట్లు వస్తే తాను రాజకీయాల నుంచి తప్పుకొంటానని, ఒకవేళ టీఆర్ఎస్ గెలవకపోతే ఆయన రాజకీయాల నుంచి వైదొలగుతారా? అని ఉత్తమ్ సవాలు చేశారు. నాలుగేళ్ల పాలనలో కేసీఆర్ ప్రధాని మోదీకి తొత్తుగా వ్యవహరిస్తూ రాష్ట్ర ప్రయోజనాలను పణంగా పెట్టారన్నారు. మోదీ, కేసీఆర్ పాలనలో మైనారిటీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. దళితుడిని సీఎం చేస్తానన్న మాట ఏమైందని, మూడెకరాల పంపిణీ ఏమైందని? రెండు పడక గదుల ఇళ్లు ఎక్కడ నిర్మిస్తున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన పథకాలకే పేర్లు మార్చి వాటినీ పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడం టీఆర్ఎస్ ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమన్నారు. రైతుల పంటలకు గిట్టుబాటు ధర లేదని, తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అన్ని పంటలకు మెరుగైన గిట్టుబాటు ధరలు అందేలా చూస్తామని చెప్పారు. రానున్న ఎన్నికల్లో టీఆర్ఎస్‌కు ఓటు వేస్తే ఆయా వర్గాల వారు నష్టపోతారన్నారు. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి ఖుంటియా మాట్లాడుతూ.. కేసీఆర్ నియంతలా వ్యవహరిస్తున్నాడని, ఒంటెద్దు పోకడతో ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో అధిష్ఠానం ఆదేశిస్తే కేసీఆర్‌పై పోటీ చేసి ఓడిస్తానని నల్గొండ ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకటరెడ్డి చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాకపోతే తాను రాజకీయాల నుంచి వైదొలగుతానన్నారు. చంద్రబాబు కేసీఆర్‌కు మంత్రి పదవి ఇవ్వకపోవడం పొరపాటేనని పేర్కొనడం బాగుందంటూ 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రస్తావించారు. తెలంగాణ ఏర్పాటులో దళితుల కృషి కూడా ఉందని సర్వే సత్యనారాయణ చెప్పారు. కుటుంబానికి ఒక్క పింఛనే ఇస్తూ కేసీఆర్ పలు కుటుంబాల్లో చిచ్చు పెడుతున్నాడని షబ్బీర్ అలీ ఆరోపించారు.అంతకుముందు ఉత్తమ్ సంగారెడ్డిలోని ఓ హోటల్లో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారం చేపట్టగానే టీఆర్ఎస్ కమిటీలుగా ఉన్న రైతు సమన్వయ సమితులను రద్దు చేస్తామన్నారు. హోలీ సందర్భంగా ఈ నెల 1, 2 తేదీల్లో యాత్రకు విరామం ఇచ్చామన్నారు. 4న బోధన్, నిజామాబాద్‌ల్లో; 5న బాల్కొండ, ఆర్మూర్‌లలో; 6న నిర్మల్, మెట్‌పల్లిలో; 7న సిరిసిల్ల, మానకొండూర్‌లో; 8న హుస్నాబాద్, హుజురాబాద్‌లలో బస్సు యాత్ర ఉంటుందన్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల అనంతరం యాత్ర తిరిగి ప్రారంభించి అన్ని నియోజకవర్గాల్లో కొనసాగిస్తామని వివరించారు.

రైతు కుటుంబానికి రూ.లక్ష సాయం

రాష్ట్రంలో రైతులు అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకుంటుంటే ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని ఉత్తమ్ ఆరోపించారు. బాధిత కుటుంబాలను అధికారులు, ప్రజాప్రతినిధులు పరామర్శించిన పాపాన పోలేదన్నారు. సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం బొబ్బిలిగామలో ఆత్మహత్యకు పాల్పడిన పత్తి రైతు శ్రీశైలం కుటుంబాన్ని నేతలు పరామర్శించారు. మృతుని భార్య అంజమ్మకు కాంగ్రెస్ తరఫున రూ.లక్ష ఆర్థిక సాయాన్ని అందజేశారు.

మడమ తిప్పేది లేదు.. తేల్చుకుందాం: రేవంత్

కొడంగల్ : కొడంగల్ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రులు జూపల్లి, మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. అయితే, నందిగామలో బీటీ రోడ్డు శంకుస్థాపనకు మంత్రులు రాకపోవడంతో అక్కడి సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు టెంకాయలు కొట్టారు. ఈక్రమంలో కాంగ్రెస్, టీఆర్ఎస్ వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. అనంతరం రేవంత్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ తల తెగి పడినా మడమ తిప్పేది లేదని, దమ్ముంటే పోలీసులను పక్కన పెట్టి రండి తేల్చుకుందామని మంత్రులకు సవాల్ విసిరారు.

టీఆర్టీకి పదో తరగతి హాల్‌టికెట్!

- అభ్యర్థి పేరు స్థానంలో టెన్త్ హాల్‌టికెట్ నంబరు

తిమ్మాపూర్, ఫిబ్రవరి 28: ఉపాధ్యాయ నియామక పరీక్ష (టీఆర్టీ) రాసేందుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు పదో తరగతి పరీక్ష హాల్‌టికెట్లు వచ్చాయి. బుధవారం జరిగిన పీఈటీ పరీక్షకు సంబంధించి కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని పరీక్షా కేంద్రాల్లో ఈ పరిణామం చోటుచేసుకుంది. ఆంధ్రప్రదేశ్ నుంచి నాన్‌లోకల్‌గా దరఖాస్తు చేసుకున్న ఏడుగురు అభ్యర్థులకు వాగేశ్వరి ఇంజనీరింగ్ కళాశాలలో సెంటర్ పడింది. అయితే వీరి హాల్‌టికెట్లలో కొందరికి.. అభ్యర్థి పేరు స్థానంలో పదో తరగతి హాల్‌టికెట్ నంబర్లు, మరి కొందరికి బోర్డు ఆఫ్ సెకండరీ ఏపీ అని నమోదైంది. దీంతో అధికారులు వారిని ముందుగా పరీక్ష హాల్లోకి అనుమతించలేదు. చివరికి అబ్యర్థుల్ని ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్‌లో ఉన్న ఫొటో, ఆధార్‌కార్డు, ఇతర సర్టిఫికెట్లను పరిశీలించి పరీక్ష రాసేందుకు అనుమతించారు.

వెటర్నరీ సీట్లలో 15% నీట్ కోటా

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): భారత వెటర్నరీ కౌన్సిల్(వీసీఐ)గుర్తింపు పొందిన వెటర్నరీ కాలేజీల్లో 2018-19 విద్యా సంవత్సరంలోనూ 15 శాతం సీట్లు నీట్ ర్యాంకుల ఆధారంగా భర్తీ చేయనున్నట్లు కౌన్సిల్ తెలిపింది. ఈ మేరకు బుధవారం నోటిఫికేషన్ జారీ చేసింది. గతంలో ఈ సీట్లకు వెటర్నరీ కౌన్సిల్ ప్రవేశపరీక్షను నిర్వహించేది.

ఎంపీలు, ఎమ్మెల్యేలపై కేసుల విచారణకు ప్రత్యేక కోర్టు

హైదరాబాద్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని ఎంపీలు, ఎమ్మెల్యేలపై నమోదైన క్రిమినల్ కేసుల విచారణకు ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. హైదరాబాద్‌లో ఏర్పాటయ్యే ఈ ప్రత్యేక కోర్టుకు సిబ్బంది, బడ్జెట్ కేటాయింపులకు సంబంధించి ఆర్థిక శాఖ జీవో జారీ చేస్తుందని తెలిపింది. ఆ జీవో ప్రకారం హైకోర్టు రిజిస్ట్రార్ ప్రత్యేక కోర్టు ఏర్పాటుకు తదుపరి చర్యలు తీసుకుంటారని పేర్కొంది.

గవర్నర్, సీఎం హోలీ శుభాకాంక్షలు

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): హోలీ పండుగ సందర్భంగా ప్రజలకు గవర్నర్ నరసింహన్, సీఎం కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. రంగుల పండుగ ప్రజల జీవితాల్లో సంతోషం, సమాజంలో శాంతి, సామరస్యం నింపాలని ఆకాంక్షించారు. జాతీయ సమగ్రతను చాటుకునేలా పండుగ చేసుకోవాలని సూచించారు. హోలీ పండుగ ప్రజల జీవితాల్లో ఆనందం నింపి, రంగుల మయం చేయాలని కోరారు.

FORM IV
(Rule 8)
UNDER THE PRESS AND REGISTRATION OF BOOKS ACT, 1867 STATEMENT ABOUT OWNERSHIP AND OTHER PARTICULARS ABOUT NEWSPAPER ANDHRA JYOTHI

1. Place of Publication	: Hyderabad, Vijayawada, Visakhapatnam, Tirupati, Karimnagar, Ananthapur, Tanuku, Warangal, Guntur, Kurnool, Nellore, Srikakulam, Kakinada, Khammam, Kadapa, Ongole, Nalgonda, Nizamabad, Mahaboobnagar,Chennai.
2. Periodicity of its Publication	: DAILY
3. Printer's name	: KOGANTI VENKATA SESHAGIRI RAO
1 (a) Whether a citizen of india	: YES
(b) If a foreigner, The country of origin]	: -
Address	: Door No.: 8-2-293/82/J/68-B Journalist Colony, Jubilee Hills Hyderabad - 500 033. Telangana
4. Publisher's Name	: KOGANTI VENKATA SESHAGIRI RAO
1 (a) Whether a citizen of India	: YES
(b) If a foreigner, The country of origin]	: -
Address	: Door No.: 8-2-293/82/J/68-B Journalist Colony, Jubilee Hills Hyderabad - 500 033. Telangana
5. Editor's Name	: K.SRINIVAS
Nationality	: INDIAN
1 (a) Whether a citizen of India	: YES
(b) If a foreigner, the country of origin]	: -
Address	: 301, Sai Surabhi Apartments Durgabhai Deshmukh Colony, Hyderabad - 500 007.
6. Name's and Addresses of individuals Who own the Newspaper and partners or Shareholders holding more than one percent of the total capital	: (a) Aamoda Publication Pvt. Ltd Plot No.76, Road No.70, Ashwini Enclave, Huda Heights, Jubilee Hills, Hyderabad - 500 033.
	(b) V.Radha Krishna Plot No. 204, Road No.76 III Phase, Jubilee Hills Hyderabad - 500 033
	(c) K.Kanaka Durga Plot No. 204, Road No.76 III Phase, Jubilee Hills Hyderabad - 500 033
	(d) M.Prabhakara Rao H.No. 8-2-293/82/A, Plot No.543, Road No.26, Jubilee Hills, Hyderabad - 500 033.
	(e) D.Jai Ramesh Plot No.173,Road No.13, Jubilee Hills, Hyderabad - 500 033.
	(f) V.Aditya 8-3-293/82/J III/211-I, Road No.76,Phase-III Jubilee Hills,Hyderabad - 500 033.
	(g) Ch.Shruthi Keerthi 8-3-293/82/J III/211-I, Road No.76,Phase-III Jubilee Hills,Hyderabad - 500 033.
	(h) M/s Active Power Corporation Pvt Ltd Plot No.76,Road No.70, Aswani Layout,Huda Heights Jubilee Hills,Hyderabad - 500 033.
	(i) Vemuri Anusha H.No.204,211-1,Road No.76, Jubilee Hills,Hyderabad - 500 033.

I, KOGANTI VENKATA SESHAGIRI RAO, here by declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Sd/-
KOGANTI VENKATA SESHAGIRI RAO
Publisher

Date: 28.02.2018



'మాట్లాడే మొక్క'ను ప్రదర్శిస్తున్న మల్లేశం

మాట్లాడే మొక్క!

- సెన్సర్ సాయంతో సిరిసిల్ల వాసి అద్భుత సృష్టి

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): 'సర్.. మేడమ్.. ప్లీజ్! నీరు లేక ఎండిపోతున్నా! కొన్ని నీళ్లు పోసి నన్ను రక్షించండి! స్వచ్ఛమైన ఆక్సిజన్ అందించి.. మీ ఆరోగ్యాన్ని కాపాడుతా..' ఇవి మొక్క పలికిన పలుకులు! మొక్క మాట్లాడటమేమిటి అనుకుంటున్నారా!! నిజమండీ.. తన ఆవేదనను అర్థం చేసుకొమ్మంటూ వేడుకుంటోంది. సిరిసిల్లకు చెందిన బుధవారపు మల్లేశం 'వాటర్ ఆస్కింగ్ సెన్సర్'తో ఈ మాట్లాడే మొక్కను రూపొందించారు. బుధవారం హైదరాబాద్‌లోని బిర్లా సైన్స్ సెంటర్‌లో జరిగిన జాతీయ సైన్స్ దినోత్సవంలో 'మాట్లాడే మొక్క' అందరిని ఆలోచింపజేసింది.



పీఎఫ్‌సీ చైర్మన్ రాజీవ్‌శర్మకు జెన్‌కో అండ్ ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు స్వాగతం

విద్యుత్ ప్లాంట్ల నిర్మాణంలో తెలంగాణ ఆదర్శం

- ఇతర ప్రాజెక్టులకూ ఆర్థిక సాయం: పీఎఫ్‌సీ చైర్మన్

హైదరాబాద్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ప్లాంట్ల నిర్మాణాన్ని శరవేగంగా నిర్వహిస్తున్న తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందని పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్(పీఎఫ్‌సీ) ఛైర్మన్ రాజీవ్‌శర్మ అన్నారు. తెలంగాణ విద్యుత్ ప్రాజెక్టులతో పాటు ఇతర నిర్మాణాలకు కూడా ఆర్థిక సాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. బుధవారం సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషిని రాజీవ్‌శర్మ కలిశారు. తర్వాత విద్యుత్ సౌధలో జెన్‌కో సీఎండీ డి.ప్రభాకర్‌రావుతో సమావేశమై.. తెలంగాణలో జరుగుతున్న విద్యుత్ ప్లాంట్ల నిర్మాణంపై చర్చించారు.

కన్నీళ్లు పెట్టించిన 'నిమిషం'

- ఆలస్యంగా వచ్చిన 12 మంది
- పరీక్షకు అనుమతించని అధికారులు
- ఇంటర్ పరీక్ష తొలిరోజు 95.68 శాతం హాజరు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించేది లేదన్న ఇంటర్మీడియట్ బోర్డు ఆదేశాలు పక్కాగా అమలయ్యాయి. తొలి రోజు బుధవారం వివిధ కారణాలతో ఆలస్యంగా వచ్చిన పలువురు విద్యార్థులు పరీక్షకు దూరమయ్యారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం కోనాయిపల్లికి చెందిన బత్తిని కపిల్‌దేవ్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష రాయాల్సి ఉండగా 5నిమిషాలు ఆలస్యంగా వచ్చాడు. దీంతో అధికారులు అతణ్ని లోనికి అనుమతించలేదు. యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మల రామారంలో ఏడుగురు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నలుగురు విద్యార్థులు ఆలస్యంగా రావడంతో అధికారులు వెనక్కి పంపించారు. మరోవైపు నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని పద్మావతి కళాశాల పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు 20 నిమిషాలు ఆసల్యంగా ప్రశ్నపత్రం ఇచ్చారు. కానీ, తిరిగి తీసుకునేటప్పుడు అదనపు సమయం ఇవ్వకపోవడంతో విద్యార్థులు నష్టపోయారు. భువనగిరి పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రం (51004)లో ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్షకు సెకండ్ ఇయర్ విద్యార్థి హాజరయ్యాడు. వేముల కిరణ్‌కు మార్ ఇంటర్ రెండో సంవత్సరం తెలుగు పరీక్షను మార్చి 2న రాయాల్సి ఉండగా.. బుధవారం జరిగిన మొదటి సంవత్సరం తెలుగు పరీక్షకు వచ్చాడు. విద్యార్థే ఆ విషయం చెప్పే వరకూ ఇన్విజిలేటర్లు గుర్తించలేదు. మొత్తంగా ఇంటర్ తొలి రోజు పరీక్షకు 95.68 శాతం హాజరు నమోదైంది. 20,844 మంది పరీక్షకు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. తొలి రోజు 3 మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదయ్యాయి. హైదరాబాద్‌లోని బొల్లారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రైవేట్‌గా ఇంటర్ పరీక్షలు రాయడానికి తొమ్మిది మంది రూ.18 వేల చొప్పున ఫీజు చెల్లించగా, బోర్డుకు చెల్లించకుండా ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసులు, క్లర్క్ భాస్కర్ జేబులో వేసుకొన్నట్లు తెలిసింది. దీంతో విద్యార్థులు.. తల్లిదండ్రులు, ఏబీవీపీ కార్యకర్తలతో కలిసి కళాశాల వద్ద ఆందోళన చేపట్టారు. తండ్రి మృతి చెందాడన్న బాధను దిగమింగుకుంటూనే పరీక్షకు హాజరైంది ఓ విద్యార్థిని. ఒక్కగానొక్క కుమార్తె కావడంతో.. పరీక్ష పూర్తయ్యాక తండ్రికి అంతిమ సంస్కారాలు నిర్వహించింది మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మండలం యంనంపేట్‌కు చెందిన లావణ్య.

2న ఇంటర్ పరీక్ష యథాతథం

ఈ నెల 2వ తేదీన జరగాల్సిన ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం పరీక్ష యథాతథంగా కొనసాగుతుందని ఇంటర్‌బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది. పరీక్షను వాయిదా వేయలేదని పేర్కొంది.

గ్రూప్-2 ఓఎంఆర్ షీట్ల తనిఖీ

హైదరాబాద్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్‌సీ) నిర్వహించిన గ్రూప్-2 పోస్టుల భర్తీ ప్రక్రియ కీలక మలుపు తిరిగింది. ప్రస్తుతం సర్టిఫికెట్ల పరిశీలన దశలో ఉన్న నేపథ్యంలో... రాత పరీక్షలో అగ్రస్థానంలో ఉన్న ఐదు వేల మంది అభ్యర్థుల ఓఎంఆర్ షీట్ల పరిశీలనకు ముగ్గురు సీనియర్ న్యాయవాదులతో హైకోర్టు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో సీనియర్ న్యాయవాదులు ఎస్.నిరంజన్‌రెడ్డి, పి.శ్రీరఘురాం, ఆర్.రఘునందన్‌రావులు సభ్యులుగా ఉంటారని పేర్కొంది. ఓఎంఆర్ షీట్లతోపాటు అన్ని రికార్డులను ప్రత్యేక కమిటీకి అందుబాటులో ఉంచాలని టీఎస్‌పీఎస్సీని ఆదేశించింది. బబ్లింగ్, వైట్‌నర్ వాడారనే ఆరోపణల నేపథ్యంలో ఓఎంఆర్ షీట్లను పరిశీలించాల్సి ఉందని, ప్రత్యేక కమిటీ ఐదు వేల మంది ఓఎంఆర్ షీట్లను పరిశీలించి త్వరగా నివేదిక సమర్పించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ పి.నవీన్‌రావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి విచారణను మార్చి 19కి వాయిదా వేశారు.

అసలేం జరిగిందంటే..

గ్రూప్-2 పరీక్షలో ఓఎంఆర్ షీట్లలో తప్పుగా బబ్లింగ్ చేసిన, వైట్‌నర్ వాడిన వారిని ఎంపిక చేశారని, వ్యక్తిగత వివరాలను తప్పుగా నమోదు చేసిన, ఓంఎఆర్ షీట్‌లో కింద పేర్లను రాసిన వారిని అనర్హులుగా ప్రకటించాలని హైదరాబాద్‌కు చెందిన వి.రామచంద్రారెడ్డితో పాటు మరో 14 మంది, పి.చరణ్‌దాస్ గోస్వామితోపాటు మరో 20 మంది వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. అలాగే వైట్‌నర్ వాడిన వారిని ఎంపిక చేశారనే కారణంగా మొత్తం నియామక ప్రక్రియ నిలిపివేయడం సరికాదని మరికొందరు అభ్యర్థులు పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై న్యాయమూర్తి జస్టిస్ పి.నవీన్‌రావు బుధవారం మరోసారి విచారణ జరిపారు. ఈ మేరకు స్పందించిన న్యాయమూర్తి ముగ్గురు సీనియర్ న్యాయవాదులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. 5 వేల మంది ఓఎంఆర్ షీట్లతోపాటు రికార్డులను ఈ కమిటీకి ఇవ్వాలని, నివేదిక ఆధారంగా తదుపరిఉత్తర్వులు ఇస్తామని న్యాయమూర్తి వెల్లడించారు.

లోకం తీరు



ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	37.0	13.0
రామగుండం	38.1	16.4
ఖమ్మం	37.0	19.0
హైదరాబాద్	35.3	19.3
వరంగల్	36.5	20.0

ఖమ్మంలో భానుడి భగభగ

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎండలు మండుతున్నాయి. గత పదేళ్లలో ఫిబ్రవరి నెలలో ఖమ్మంలో అత్యధికంగా 33.2 డిగ్రీల మేర ఉష్ణోగ్రత నమోదవ్వగా.. మంగళవారం రికార్డుస్థాయిలో 35.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఈ రికార్డును తిరగరాస్తూ బుధవారం 36.8డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రాష్ట్రంలో అత్యధికంగా భద్రాచలంలో 37.8డిగ్రీల పగటి ఉష్ణోగ్రత నమోదైంది. రామగుండం, మహబూబ్‌నగర్‌లో 37.6 డిగ్రీలు, నిజామాబాద్‌లో 37.2 డిగ్రీలు, మెదక్‌లో 36.8 డిగ్రీలు, ఆదిలాబాద్‌లో 35.3 డిగ్రీలు, హైదరాబాద్‌లో 35.1 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



అవినీతి కేన్సర్‌కు సంస్కరణల కీమో

అవినీతి అనేది వ్యవస్థకు పట్టిన కేన్సర్. దీనిని తొలగించేందుకే సంస్కరణల కీమోథెరపీ చేపట్టాం. చికిత్స చేయకుంటే వ్యవస్థ మొత్తాన్ని కబళించే ప్రమాదం ఉంది.

- సౌదీ అరేబియా యువరాజు మహ్మద్ బిన్ సల్మాన్



స్కాంను కేన్సర్‌తో పోల్చొద్దు

పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ) స్కాంను కేన్సర్‌తో పోల్చడం తగదు. అవినీతి అనేది నేరం. సిగ్గుచేటైన విషయం. కేన్సర్ మాత్రం అలా కాదు. అపరాధ భావన, చేతకానితనానికి కేన్సర్ అనే పదం వాడటం తప్పు.

- కేన్సర్ స్పెషలిస్టు, పద్మవిభూషణ్ వి.శాంత (పీఎన్‌బీ స్కాంను కేన్సర్‌తో పోల్చిన బ్యాంక్ సీఈవో సునీల్ మెహతాకు రాసిన లేఖలో)

నేటి పెట్రో ధరలు (లీ.)

పెట్రోల్	డీజిల్
పాత ధర రూ.75.72	పాత ధర 67.52
కొత్త ధర రూ.75.79	కొత్త ధర 67.63
పెరిగింది : 7 పైసలు	పెరిగింది : 11 పైసలు



మూత్రపరీక్షతో రోగాల నిర్ధారణ

బీజింగ్, ఫిబ్రవరి 28: వయస్సు పైబడే కొద్దీ అనేక వ్యాధుల బారిన పడుతుంటారు. అయితే ఈ రోగాలు వచ్చే అవకాశాన్ని ముందుగానే గుర్తించే మూత్రపరీక్షను కనిపెట్టారు చైనాలోని సిచువాన్ యూనివర్సిటీ పరిశోధకులు. సాధారణంగా శరీరంలో ఆక్సీకరణ జరిగే సమయంలో నాశనమైన కణాలు మూత్రం ద్వారా బయటకు వచ్చేస్తుంటాయి. వయస్సు పెరిగే కొద్దీ ఈ నష్టం మరింత ఎక్కువ అవుతుంది. దీని ఆధారంగా వయస్సు పైబడినకొద్దీ వచ్చే వ్యాధులను ముందుగానే గుర్తించవచ్చని పరిశోధకులు తెలిపారు. వీటితోపాటు అకాల మరణాన్ని కూడా ముందుగానే గుర్తించవచ్చని చెబుతున్నారు.

డఫోడిల్ పూలతో కేన్సర్‌కు చెక్

లండన్, ఫిబ్రవరి 28: కేన్సర్ నివారణకు కీమోథెరపీ ఒక్కటే మార్గం. కాగా, కేన్సర్ వ్యాధికి ప్రకృతి సిద్ధమైన సమ్మేళనం ద్వారా కేన్సర్‌కు చెక్ పెట్టవచ్చంటున్నారు బెల్జియానికి చెందిన యూనివర్సిటీ లిబ్రె దె బ్రెక్సెల్స్(యూఎల్‌బీ) పరిశోధకులు. డఫోడిల్ అని పిలవబడే పూల నుంచి ఉద్గారమయ్యే ఆల్కలాయిడ్లు కేన్సర్ నివారణలో సహాయపడతాయని తెలిపారు. ఈ ఆల్కలాయిడ్‌లు కేన్సర్ కణతుల పెరుగుదల వేగాన్ని తగ్గిస్తాయని చెబుతున్నారు.

అదో ఖాప్ పంచాయతీ

- మాపై ఫత్వాలు జారీచేస్తోంది
- ఐఏఎస్‌ల సంఘంపై ఢిల్లీ ఉపముఖ్యమంత్రి ఫైర్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28: ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ సమక్షంలోనే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అంశు ప్రకాశ్‌పై దాడి వ్యవహారం దరిమిలా చెలరేగిన రాజకీయ రచ్చ కొనసాగుతోంది. రాష్ట్ర మంత్రులతో సమావేశాలను బహిష్కరిస్తున్న ఐఏఎస్ అధికారులపై ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ప్రభుత్వం విరుచుకుపడింది. ముఖ్యంగా ఐఏఎస్ అధికారుల సంఘాన్ని ఖాప్ పంచాయతీతో పోల్చింది. తమపై ఫత్వాలు జారీచేస్తోందని ఢిల్లీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోదియా మండిపడ్డారు. మంత్రులతో సమావేశాలను బహిష్కరించేలా అధికారులను ప్రోత్సహిస్తున్నారంటూ ఏకంగా లెఫ్టినెంట్ జనరల్ (ఎల్‌జీ) అనిల్ బైజ్వాల్‌కు ఆయన బుధవారం లేఖ రాశారు. సీఎస్‌పై ఆప్ ఎమ్మెల్యేల దాడి ఘటన దేశంలోని ప్రభుత్వ ఉద్యోగులందరినీ షాక్‌కు గురిచేసిందని.. వారి నైతిక స్థైర్యాన్ని దెబ్బతీసిందని.. ప్రజాప్రయోజనాల దృష్ట్యా అధికారులతో సర్దుకుపోవాలని, వారితో చర్చించి అవిశ్వాసం తొలగించుకోవాలని బైజ్వాల్ మంగళవారం కేజ్రీవాల్‌కు లేఖ రాయడంపై సిసోదియా విరుచుకుపడ్డారు. 'ఓ ఐఏఎస్ అధికారి మీ వద్దకు వచ్చి.. ఆప్ మంత్రి తనను దూషించారని ఫిర్యాదు చేస్తే.. అతడు పనికిమాలినవాడైనా మీరు అతడి కన్నీళ్లు తుడుస్తారు. మాతో సమావేశాలను బహిష్కరిస్తున్నా అతడికి మద్దతిస్తారు. మంత్రులతో భేటీలకు వెళ్లాలని కొందరు అధికారులను ఆదేశించాలని ఢిల్లీ కేబినెట్ మిమ్మల్ని రెండ్రోజుల క్రితం కోరింది. మంత్రులతో సమావేశాలకు హాజరు కారాదని, మంత్రులతో మాట్లాడవద్దని జూనియర్ అధికారులపై ఒత్తిడి తెస్తూ ఐఏఎస్‌ల సంఘం ఫత్వా జారీ చేస్తే.. వారితో సర్దుకుపోవాలంటూ మీరు సీఎంకు లేఖ రాశారు. మీరు కూడా ఒకప్పుడు ఐఏఎస్ అధికారే. ఆ కళ్లజోడు నుంచి చూడడం మానండి' అని హితవు పలికారు. దాడికి నిరసనగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సహా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కాగా.. ఢిల్లీలో 20 మంది ఆప్ ఎమ్మెల్యేలపై ఎన్నికల కమిషన్ (ఈసీ) అనర్హత వేటు వేయడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు తన తీర్పును వాయిదా వేసింది.



కొవ్వొత్తుల ప్రదర్శనలో అంశు ప్రకాశ్, ఉద్యోగులు

కాంగ్రెస్ ప్లీనరీకి పానెళ్ల నియామకం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28: కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ మార్చి 16 నుంచి 18 దాకా నిర్వహించనున్న ఏఐసీసీ ప్లీనరీ సమావేశానికి సంబంధించి తీర్మానాలు రూపొందించేందుకు బుధవారం కమిటీలను ఏర్పాటు చేశారు. సంస్థాగత కమిటీ, డ్రాఫ్టింగ్ కమిటీలు సహా కీలక కమిటీలకు చైర్మన్లు, కన్వీనర్లను నియమించారు. తీర్మానాల ముసాయిదాల రూపకల్పన (డ్రాఫ్టింగ్) కమిటీ చైర్మన్‌గా మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌ను, కన్వీనర్‌గా ముకుల్ వాస్నిక్‌ను నియమించారు. సంస్థాగత కమిటీకి ఏఐసీసీ కోశాధికారి మోతీలాల్ వోరా చైర్మన్‌గా, పార్టీ ప్రధాన కార్యదర్శి ఆస్కార్ ఫెర్నాండెజ్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. పార్టీ రాజ్యాంగ సవరణ కమిటీకి గులాం నబీ ఆజాద్ చైర్మన్‌గా.. జనార్దన్ ద్వివేది కన్వీనర్‌గా నియమితులయ్యారు. ఇందులో సీనియర్ నేతలు అహ్మద్ పటేల్, పి.చిదంబరం, మల్లికార్జున్ ఖర్గే, కపిల్ సిబల్ సహా 44 మంది సభ్యులుగా ఉంటారు. రాజకీయ కమిటీకి ఏకే ఆంటోనీ నేతృత్వం వహిస్తారు. ఆర్థిక కమిటీ చైర్మన్‌గా మాజీ మంత్రి పి.చిదంబరం, కన్వీనర్‌గా జైరాం రమేశ్; అంతర్జాతీయ వ్యవహారాల కమిటీ చైర్మన్‌గా ఆనంద్ శర్మ, కన్వీనర్‌గా జ్యోతిరాదిత్య సింధియా; వ్యవసాయ కమిటీ చైర్మన్‌గా హరియాణా మాజీ సీఎం భూపీందర్‌సింగ్ హుడా, కన్వీనర్‌గా మీనాక్షి నటరాజన్ వ్యవహరిస్తారు. అధ్యక్ష బాధ్యతలు స్వీకరించాక రాహుల్‌కు ఇదే తొలి ప్లీనరీ.

ఎంపీల భత్యాలు భారీగా పెంపు

- నియోజకవర్గ అలవెన్సు 60 వేలు
- ఫర్నిచర్‌కు ఐదేళ్లకు రూ.లక్ష

న్యూఢిల్లీ, ఫిబ్రవరి28(ఆంధ్రజ్యోతి): పార్లమెంటు సభ్యుల భత్యాలు (అలవెన్సులు) భారీగా పెరగనున్నాయి. నియోజకవర్గ, కార్యాలయ నిర్వహణ, ఫర్నిచర్ అలవెన్సులను పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. దీనికి అవసరమైన నిబంధనల సవరణకు బుధవారం ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశం ఆమోదం తెలిపింది. భత్యాల పెంపుతో ఖజానాపై ఏటా రూ.46 కోట్ల అదనపు భారం పడనుంది. కేబినెట్ నిర్ణయం ప్రకారం.. నియోజకవర్గ అలవెన్సు నెలకు రూ.60 వేలకు పెరుగుతుంది. ప్రస్తుతం రూ.45 వేలు ఇస్తున్నారు. కార్యాలయ నిర్వహణ అలవెన్సు నెలకు రూ.45 వేల నుంచి 60 వేలకు పెంచనున్నారు. ఫర్నిచర్ అలవెన్సు రూ.లక్షకు పెరగనుంది. ఇది ప్రస్తుతం రూ.75 వేలు ఉంది. ఫర్నిచర్ అలవెన్సును ఒక ఎంపీకి తన ఐదేళ్ల పదవీకాలంలో ఒకసారే ఇస్తారు. తాజా పెంపుతో అలవెన్సులు మొత్తం రూ.2.20 లక్షలు అందనున్నాయి. జీతం రూపంలో ఎంపీలకు నెలకు రూ.50 వేలు లభిస్తోంది. అంటే ఒక్కో ఎంపీపై కేంద్రం నెలకు రూ.2.7 లక్షలు వెచ్చిస్తోంది.

మానవ అక్రమ రవాణా కేసులు ఎన్ఐఏకు

మానవ అక్రమ రవాణా కేసుల దర్యాప్తులో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) ఇక 'నోడల్ అథారిటీ'గా వ్యవహరించనుంది. ఉగ్రవాద నిర్మూలన, ఆ కేసుల శోధన సాగిస్తున్న ఎన్ఐఏ కొత్త బాధ్యతలు చేపట్టనుంది. దీనికి సంబంధించిన ప్రతిపాదనను ప్రభుత్వం బుధవారం ఆమోదించిందని అధికార వర్గాల సమాచారం. మనుషుల అక్రమ రవాణా నిరోధం, బాధితులకు రక్షణ, పునరావాసం ముసాయిదా బిల్లుకు కూడా కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని ఆ వర్గాలు తెలిపాయి. ఈ బిల్లు ప్రకారం పదే పదే నేరం చేసేవారికి యావజ్జీవ కారాగార శిక్ష విధించవచ్చు. మానవ అక్రమ రవాణా కేసులను రెండు రకాలుగా విభజించారు. కొన్ని తరహా నేరాలకు ఏడు నుంచి పదేళ్ల జైలు శిక్ష విధించవచ్చు. తీవ్రమైన నేరాలకు కనీసం పదేళ్ల జైలు శిక్ష పడుతుంది. దీనిని యావజ్జీవ ఖైదుగా కూడా మార్చవచ్చు. వెట్టి చాకిరీ, నిర్బంధ సరొగసీ, బలవంతంగా పనివాళ్లను నియమించుకోవడానికి మాదక ద్రవ్యాలను వాడటం, పెళ్లి పేరుతో మోసగించటం, గర్భవతిని చేయటం లేదా హెచ్ఐవీ/ఎయిడ్స్ వంటి ప్రాణాంతక వ్యాధులను అంటించడం వంటివి తీవ్రమైన నేరాల పరిధిలో చేర్చారు. ఇక ఎన్ఐఏకు అదనపు అధికారాలు కల్పించేందుకు జాతీయ దర్యాప్తు చట్టం, 2008కు ప్రభుత్వం సవరణ తీసుకురానుంది. ప్రత్యేక విభాగం నెలకొల్పేందుకు ఎన్ఐఏకు నిర్భయ నిధి నుంచి ఆర్థిక సహాయం అందుతుందని అధికారులు తెలిపారు.

సీబీఎస్ఈ నీట్ నోటిఫికేషన్‌పై స్టే

- ఢిల్లీ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28: నీట్‌పై సీబీఎస్ఈ నోటిఫికేషన్ అమలును నిలుపుదల చేస్తూ ఢిల్లీ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. పెద్ద సంఖ్యలో అభ్యర్థులు దాఖలు చేసిన వ్యాజ్యాలను విచారణను చేపట్టిన ధర్మాసనం నీట్ నోటిఫికేషన్‌పై స్టే ఉత్తర్వులిచ్చింది. న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ చంద్రశేఖర్‌లతో కూడిన ధర్మాసనం బుధవారం ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. విద్యార్హతలు, వయోపరిమితికి సంబంధించిన నిబంధనలను పలువురు అభ్యర్థులు కోర్టులో సవాలు చేశారు. సాధారణ అభ్యర్థులకు వయోపరిమితి 25 ఏళ్లు, రిజర్వుడు కేటగిరీ అభ్యర్థులకు 30 ఏళ్లు మించరాదని నోటిఫికేషన్‌లో సీబీఎస్ఈ పేర్కొంది. అభ్యర్థుల వ్యాజ్యాలపై సీబీఎస్ఈ, భారత వైద్య మండలి(ఎంసీఐ)కి ధర్మాసనం నోటీసులిచ్చి, సమాధానం కోరింది. తదుపరి విచారణను ధర్మాసనం ఏప్రిల్ 16కు వాయిదా వేసింది. అంతవరకు మధ్యంతర ఉత్తర్వులు అమల్లో ఉంటాయని పేర్కొంది. నీట్‌కు దరఖాస్తు చేసుకునేందుకు చివరి తేదీ మార్చి 9. మే ఆరున పరీక్ష జరుగుతుంది. పిటిషన్లు దాఖలు చేసిన అభ్యర్థులు నీట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చనీ, అంతమాత్రాన పరీక్ష రాసేందుకు అర్హులుగా భావించవద్దని బెంచ్ పేర్కొంది. ఓపెన్ స్కూళ్లలో చదివినవారు, ప్రైవేటుగా చదివిన వారు ఏదో గుర్తింపు పొందిన బోర్డు నుంచి సర్టిఫికెట్ పొంది ఉంటేనే నీట్‌కు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని ధర్మాసనం స్పష్టం చేసింది. ఇదిలావుంటే... ఓపెన్ స్కూలులో చదివినవారు, బయాలజీ లేదా బయోటెక్నాలజీని అదనపు సబ్జెక్టుగా చదివినవారు, 11,12 తరగతులను రెండేళ్లకన్నా ఎక్కువ కాలం చదివినవారు, ప్రైవేటుగా చదివి పాసైన వారు నీట్‌కు అర్హులు కారని సీబీఎస్ఈ తన నోటిఫికేషన్‌లో తెలిపింది.

సీబీఎస్ఈ టెన్త్‌కు 33%మార్కులకే పాస్

- ఈ ఏడాదికే ఈ సడలింపు పరిమితం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28: పదో తరగతి విద్యార్థులకు అర్హత పాస్ మార్కుల విషయంలో సీబీఎస్ఈ సడలింపు ఇచ్చింది. వచ్చే వారంలో బోర్డు పరీక్షలు రాయనున్న పదో తరగతి విద్యార్థులు థియరీలోనూ, ఇంటర్నల్ అసెస్‌మెంట్‌లోనూ కలిపి మొత్తం 33 శాతం మార్కులు తెచ్చుకుంటే పాసైనట్లుగా ప్రకటిస్తారు. ఈ సడలింపు ఈ ఏడాది పదో తరగతి విద్యార్థులకు మాత్రమే పరిమితమని సీబీఎస్ఈ స్పష్టం చేసింది. విద్యార్థులు బోర్డు పరీక్షలలో, ఇంటర్నల్ అసెస్‌మెంట్‌లలో విడివిడిగా 33 శాతం మార్కులు తెచ్చుకోవలసి అవసరం లేదని సీబీఎస్ఈ పేర్కొంది. సీబీఎస్ఈ ఎగ్జామినేషన్ కమిటీ ఫిబ్రవరి 16న సమావేశమై ఈ మేరకు నిర్ణయం తీసుకుంది.

ఎంపీలో కాంగ్రెస్ స్థానాలు పదిలం

భోపాల్/భువనేశ్వర్, ఫిబ్రవరి 28: మధ్యప్రదేశ్ ఉప ఎన్నికల్లో అధికార బీజేపీకి ఆశాభంగం తప్పలేదు. ఉప ఎన్నికలు జరిగిన రెండు స్థానాల్లో కాంగ్రెస్ పట్టు నిలుపుకుంది. ముంగోలిలో 2,124, కొలారస్‌లో 8,083 ఓట్ల ఆధిక్యంతో కాంగ్రెస్ అభ్యర్థులు బీజేపీపై విజయం సాధించారు. ఒడిశాలో మాత్రం కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ తగిలింది. బిజాపూర్ స్థానాన్ని కాంగ్రెస్ నుంచి బిజూ జనతాదళ్ చేజిక్కించుకుంది. ఇక్కడ వరుసగా మూడుసార్లు గెలిచిన ప్రణయ సాహు 10,274 ఓట్లతో మూడో స్థానానికి పరిమితమై, డిపాజిట్ కోల్పోయారు. బీజేడీ అభ్యర్థికి 1,02,871 ఓట్లు, బీజేపీ అభ్యర్థికి 60,938 ఓట్లు లభించాయి. 41,933 ఓట్ల మెజారిటీతో బీజేడీ ఘన విజయం సాధించింది. ఈ మూడు స్థానాల్లోనూ ఫిబ్రవరి 24న ఉప ఎన్నికలు జరిగాయి.

మోదీ చాణక్యంలో కార్తీ

కాంగ్రెస్ నాయకుడు పి. చిదంబరం కుమారుడు కార్తీ చిదంబరాన్ని సీబీఐ అరెస్టు చేసింది. ఐఎన్ఎక్స్ మీడియా సంస్థలో విదేశీ పెట్టుబడులకు సంబంధించి గత ఏడాది మేనెలలో ఆయనపై సీబీఐ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. లండన్ నుంచి తిరిగివచ్చిన కార్తీని మంగళవారం అర్ధరాత్రి చెన్నయ్ ఎయిర్‌పోర్టులోనే పట్టుకొని, అక్కడనుంచి ఢిల్లీ తరలించి పాటియాలాలో కోర్టులో హాజరుపరిచింది. తన ప్రశ్నలకు కార్తీ ఎగవేత, దాటవేత సమాధానాలు ఇస్తున్నారనీ, ఓ పదిహేను రోజులు తమకు అప్పగిస్తే నిజాలు కక్కిస్తామని సీబీఐ వేడుకున్నా, న్యాయస్థానం దానికి ఒక్కరోజే ఆ అవకాశం ఇచ్చింది. కార్తీ చార్టర్డ్ ఎకౌంటెంట్‌ను సీబీఐ సోమవారం అరెస్టు చేయడం, ఆయనకు ఓ పదిహేను రోజుల రిమాండ్ విధించడం తెలిసిందే. వేలాదికోట్లకు బ్యాంకులను ముంచేసిన బడాపారిశ్రామికవేత్తలు ఎంచక్కా కుటుంబాలతో సహా విదేశాలకు ఎగిరిపోతున్న కాలం కనుక, లండన్ నుంచి తిరిగి వచ్చిన కార్తీ 'హిందుస్థాన్ లీవర్' కాదు, 'హిందుస్థాన్ రిటర్నర్' అన్న న్యాయవాది మాటలు న్యాయస్థానం మీద పనిచేసి ఉండవచ్చు!

నీమో, చోక్సీ, రోటోమ్యాక్ వంటి భారీ కుంభకోణాలు రోజుకొక్కటి వెలుగుచూస్తున్న నేపథ్యంలో ప్రజల దృష్టిని మరల్చడానికే మోదీ ప్రభుత్వం కార్తీని అరెస్టు చేసిందనీ, ఇది రాజకీయ కక్షసాధింపు చర్యేనని కాంగ్రెస్ అంటున్నది. వేలకోట్లు ఎగవేసిన పెద్దచేపలను వదిలేసి, పిల్లచేప కార్తీని మాత్రం వేధిస్తున్నారని జాలిపడేవారిపై కాంగ్రెస్ వ్యాఖ్యలు బాగా పనిచేస్తాయి. రాజకీయ విమర్శలను అటుంచితే, కార్తీపై ఉన్న ఆరోపణలు సాధారణమైనవేమీ కావు. తన తండ్రి ఆర్థికమంత్రి కావడంతో ఐఎన్ఎక్స్ మీడియా సంస్థకు మారిషస్‌నుంచి విదేశీపెట్టుబడులు పొందడానికి అనుమతి తెచ్చిపెట్టాడనీ, నిబంధనలకు విరుద్ధంగా మూడువందల కోట్ల పెట్టుబడికి ఫెమా అనుమతులు మంజూరైన ఈ వ్యవహారంలో భారీ ముడుపులు పుచ్చుకున్నాడన్నది ఆరోపణ. ఆయన ప్రత్యక్షంగా అందుకున్న మొత్తం ఎంతన్నది అటుంచితే, కార్తీ కంపెనీగా సీబీఐ చెబుతున్న అడ్వాంటేజ్ ఇండియాలోకి సింగపూర్‌లోని దాని అనుబంధ సంస్థనుంచి అక్రమంగా నిధులు ప్రవహించాయన్నది అసలు వాదన. సీబీఐ గత ఏడాది తయారుచేసిన ఎఫ్ఐఆర్ ప్రకారం, పీటర్ ముఖర్జియా, ఇంద్రాణి ముఖర్జియాలు డైరెక్టర్లుగా ఉన్న ఐఎన్ఎక్స్ మీడియాకు విదేశీ పెట్టుబడులు వరదలాగా పారడానికి కార్తీ సహాయం చేశారు. కేవలం నాలుగుకోట్లు తెచ్చుకోవడానికి అనుమతి ఉన్న ఈ కంపెనీ మూడువందల కోట్లకు పైగా విదేశీ పెట్టుబడులు సేకరించడానికీ, ఆ సొమ్మును అక్రమంగా మరొక కంపెనీకి తరలించడానికీ కార్తీ పలుకుబడి ఉపకరించింది. కార్తీ రంగంలోకి దిగగానే ప్రభుత్వం ఐఎన్ఎక్స్ నుంచి వివరణలు కోరడం కూడా మానివేసింది. ఈ మహత్తర సహకారానికి ఉడతాభక్తిగా కార్తీకి విడతల వారీగా కోట్ల రూపాయల నగదు చెల్లింపులతో పాటు, ఆయన కంపెనీకీ, దాని అనుబంధ కంపెనీలకు కోట్ల విలువైన షేర్ల కేటాయింపులూ జరిగాయి. హత్యానేరం దర్యాప్తు చేస్తుంటే, ఆర్థిక నేరం ఆధారాలు దొరకడమేమిటన్న ప్రశ్నను అటుంచితే, షీనా బోరా హత్య కేసు దర్యాప్తు చేస్తుండగానే, కార్తీ కుంభకోణానికి సంబంధించి బలమైన ఆధారాలు సీబీఐకి చిక్కాయి. జైల్లో ఉన్న ఇంద్రాణి ఇటీవల ఇచ్చిన వాంగ్మూలం కూడా సీబీఐకి బలమైన ఆయుధంగా ఉపకరించింది. ఐఎన్ఎక్స్ మీడియాలో విదేశీపెట్టుబడులు సాధించేందుకు తాను లక్షలాది డాలర్లు లంచాలుగా పంచానంటున్నారు ఆమె.

ఈ వ్యవహారంలో ఏ అక్రమాలూ జరగలేదన్న కార్తీ వాదన విశ్వసించకపోయినా, అసలు లక్ష్యం నేను కాదు నా తండ్రి అన్న మాట మాత్రం నమ్మదగినదే. చిదంబరం పేరును ఎఫ్ఐఆర్‌లో నిందితుడిగా కాక, కుట్ర ఎలా జరిగిందన్న వివరణలో భాగంగా, కార్తీ తండ్రిగా మాత్రమే పలుమార్లు ప్రస్తావించడం వల్ల ప్రభుత్వానికి రాజకీయంగా ఉపయోగం ఉండవచ్చు. కేసు నడుస్తున్నంత కాలం ఈ సీనియర్ కాంగ్రెస్ నాయకుడి పేరు ప్రజల నోళ్ళలో నానుతూ ఉంటుంది. కార్తీమీద ఉన్న ఆరోపణలకు తగిన ఆధారాలున్నాయని అంటున్న సీబీఐ ఏడాది కాలంగా చిదంబరం కుటుంబాన్ని తరుముతున్నది. కార్తీని దేశం విడిచిపోనివ్వకుండా సీబీఐ చేసిన ప్రయత్నాలకు న్యాయస్థానాలు అడ్డుతగులుతూ కార్తీని అనుమతిస్తూ వస్తున్నాయి. ఈ కేసు తనను రాజకీయంగా దెబ్బతీయడానికి పుట్టించిందే తప్ప ఇందులో వీసమెత్తు వాస్తవం లేదంటూ చిదంబరం ఇటీవలే సుప్రీంకోర్టును ఆశ్రయించారు. బలమైన ఆధారాలు లేకుండానే ఓ మాజీ కేంద్రమంత్రిమీద సీబీఐ ఇలా పరోక్షదాడికి ఎందుకు సిద్ధపడుతుంది? అన్న ప్రశ్న సముచితమైనదే కానీ, సీబీఐ అంటున్న ఈ ఆధారాలేవీ రేపు న్యాయస్థానాల్లో వీగిపోయినా ఆశ్చర్యం లేదు. పాలకపక్షానికి ఇంతలోగా దక్కే రాజకీయ లబ్ధే కీలకమైనది. కార్తీ అరెస్టుకు సీబీఐ సంకల్పించిన సమయం కూడా విశేషమైనదే. భారీ కుంభకోణాలు వెలుగుచూసిన ప్రస్తుత నేపథ్యంలో, మోదీ ప్రభుత్వం గత మన్మోహన్ సింగ్ ప్రభుత్వం మాదిరిగా కాక చేతులెత్తేయడం లేదనీ, అవినీతిని ఏ మాత్రం ఉపేక్షించడం లేదన్న భావన తిరిగి రగల్చడానికి ఈ చర్య ఉపకరించవచ్చు. అన్నింటికీ మించి, ఓ సీనియర్ కాంగ్రెస్ నాయకుడిని రచ్చకీడ్చడం ద్వారా కాంగ్రెస్‌ను మరోమారు ఆత్మరక్షణలోకి నెట్టవచ్చు. మరో నాలుగురోజుల్లో పార్లమెంటు సమావేశాలు ఆరంభం కాబోతున్న నేపథ్యంలో, నీమో, చోక్సీ, రోటోమ్యాక్ ఇత్యాది కుంభకోణాలను ఆయుధాలుగా ధరించి మోదీని దెబ్బతీయాలనుకుంటున్న కాంగ్రెస్‌ను కార్తీ చుట్టూ చక్కెర్లు కొట్టేలా చేయవచ్చు. సమావేశాలను సవ్యంగా సాగనీయకుండా విమర్శలు, ప్రతివిమర్శలతో ముగించేయవచ్చు.

ప్రతి పౌరుడూ తన సంక్షేమం పట్ల ప్రభుత్వం కంటే మరింత ఎక్కువగా, మరింత మెరుగైన అవగాహనతో జాగరూకత వహించాలి.
మన బాగు కోసం మనం తాపత్రయపడనప్పుడు పాలకులు ఏదో చేయగలరని మనం ఆశించకూడదు.
డీమానిటైజేషన్ ఈ వైయక్తిక జాగృతిలో నిర్ణయాత్మక పాత్ర వహించలేదని ఎవరు అనగలరు?



మన సంక్షేమం మన బాధ్యత

విజయ్ మాల్యా చాలా సంవత్సరాలుగా ఒక రారాజుగా, కాదు, ఒక చక్రవర్తిగా వైభవోపేత జీవితాన్ని ఆస్వాదిస్తున్నారు– పన్ను చెల్లింపుదారుల సొమ్ముతో సుమా! ఘనత వహించిన ప్రభుత్వం వారు– అధినేతలూ అధికారులూ– చూస్తుండగానే మాల్యా మహాశయుడు న్యూఢిల్లీ నుంచి సుదూర సీమకు భద్రంగా వెళ్ళిపోయారు. జాతి సంపదకు తాను 'సంరక్షకుడు'గా ఉంటానని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఘోషిస్తూ ఉండగానే మాల్యా చల్లగా పదకొండు జంబో సూట్ కేసులతో జారుకున్నారు. ఆయన దేశం నుంచి పరారవుతున్న విషయం మీడియాకు తెలిసిందిగానీ సంబంధిత ప్రభుత్వ విభాగాలకు తెలియనేలేదు మరి.

మాల్యాకు మార్గదర్శకుడు ఎవరు? ఇంకెవరు, లలిత్ మోడీనే. చట్టం కబంధ హస్తాలలో పడకుండా విదేశాలలో చీకూచింతా లేకుండా ఉండవచ్చని లలిత్ ఎప్పుడో నిరూపించారు. నమ్మదగ్గ, శక్తిమంతమైన మిత్రులు ఉంటే ఏదీ అసాధ్యం కాదు కదా. కష్టాలలో ఉన్నప్పుడు ఆదుకొనేవాడు కాక మరెవరు మిత్రుడు? ఇటువంటి విషయాలలో, పౌర సమాజాల నైతిక నిబంధనల కంటే సంఘ విద్రోహుల మధ్య సంఘీభావమే చాలా బలవత్తరమైనది.

సరే, ఇప్పుడు నీరవ్ మోడీ మన కథలోకి–దీని ఇతివృత్తం అవినీతి అని ప్రత్యేకంగా గుర్తుచేయాలా?–ప్రవేశించాడు. నేరానికి పాల్పడడంలో, తన కంటే ముందుగానే ఘనులుగా ప్రసిద్ధికెక్కిన ఆ ఇరువురినీ, మరుగుజ్జులుగా కన్పించే విధంగా చేసిన మహాఘనుడు నీరవ్ మోడీ. విచిత్రమేమిటంటే నీరవ్ తన అవినీతి రికార్డును సృష్టిస్తుండగా ప్రభుత్వం తనకేమీ తెలియనట్టు వ్యవహరించింది. అతిలోక సంఘటనలతో కూడిన కల్పిత కథలలో మాత్రమే మనకు తటస్థించే అమాయక యువతిలా ప్రభుత్వం ప్రతిసారీ నేరస్థుల మాయలో పడిపోతూనే వున్నది. ఎలాగైతేనేం చివరకు ఆ మాయ నుంచి బయటపడి తన విధ్యుక్త ధర్మ నిర్వహణకు పూనుకునే సరికి, పుణ్యకాలం ముగిసిపోతుంది. గుర్రాలు అశ్వశాల నుంచి బయటకు వెళ్ళిపోతున్నాయి.

పిమ్మట జరుగుతున్నదేమిటి? సూటిగా చెప్పుకుందాం. విదేశాలకు పరారైన నేరస్థులను, సంబంధిత దేశాలతో చేసుకున్న ఒప్పందాల ఆధారంగా స్వదేశానికి తీసుకురావడానికి గట్టి ప్రయత్నాలు ప్రారంభమవుతాయి. పన్ను చెల్లింపుదారుల సొమ్ము మరింత వృథా అవ్వడం మినహా ఫలితమేమైనా ఉంటుందా? దేశం నుంచి అక్రమంగా బయటకు వెళ్ళిపోయిన సొమ్ములో ఒక్క నయాపైసా కూడా వెనక్కు రాదు. వస్తుందని విశ్వసించేవారు ఒక్కరూ ఉండరని ఘంటాపథంగా చెప్పవచ్చు. అయినా తరలిపోయిన జాతి సొత్తును, దానిని తరలించిన వ్యక్తులను వెనక్కు తీసుకొస్తామని ప్రభుత్వాధినేతలు అనేక విధాలుగా చెప్తుతారు. నాయకుల మాటలు ప్రజలకు ఒక విధమైన మానసిక ఉపశమనాన్ని కలిగిస్తాయి.

ఈ మానసిక ప్రభావాన్ని పునఃపరిశీలించవలసిన అవసరమున్నది. మీ ఇంటి కావలివాడు చాలా అప్రమత్తంగా ఉంటాడు. ఇంటిలో ఎటువంటి చోరీ జరగకుండా జాగ్రత్త వహిస్తాడు. అటువంటి పరిస్థితుల్లో మీరు అతన్ని పట్టించుకోరు. 'కాపలా కాయడం అతని బాధ్యత. ఆ బాధ్యతను అతను నిర్వర్తిస్తున్నాడు. అంతే కదా' అంటూ ఆ గృహ సంరక్షకుని కర్తవ్య నిష్ఠను మీరు ఏ మాత్రం పట్టించుకోరు.

ఒక వేళ అతను తన బాధ్యత నిర్వహణలో ఏమరచి వుంటే దొంగలు ఇంటిలో చొరబడి విలువైన సంపదను చేజిక్కించుకొని వెళ్ళిపోతారు. చివరి క్షణంలో గమనించిన కావలివాడు అప్రమత్తమవుతాడు. దొంగలను పట్టుకోవడానికి ఆవేశపడిపోతాడు. పోయిన సొమ్ము ఏమాత్రం తిరిగి దక్కదని తెలిసినప్పటికీ మీరు ఆ కావలివాడికి విధిగా కృతజ్ఞతాబద్ధులవుతారు. ఇదొక సహజ మానసిక ప్రభావం.

మనం రెండు సత్యాలను గ్రహించవలసిన సమయామాసన్నమయింది. ఒకటి– ఏ ప్రభుత్వాన్నీ వంచించడం సాధ్యం కాదు, మోసగింపబడాలని ఆ సర్కారు కోరుకుంటే తప్ప. అందరూ నిరక్షరాస్యులే ఉన్న పల్లెలో కూడా ఎవరైనా ఒకరు తన ఆదాయానికి మించి వ్యయం చేస్తుంటే తప్పకుండా విమర్శలపాలవుతాడు. కష్టపడి ఆర్జించిన సొమ్మును ఎవరూ వృథాగా వ్యయం చేయరు కదా. నీతిబాహ్యంగా వ్యవహరించడమంటే నేరానికి పాల్పడడమే కాదూ? ఎవరైనా తన సహచరుల శ్రేయస్సును విస్మరించి స్వార్థ ప్రయోజనాలు సాధించుకోవడానికి ప్రయత్నిస్తున్నాడంటే అతను స్వతస్సిద్ధ నేరస్థుడని స్పష్టంగా చెప్పవచ్చు. రెండోది– నేరస్థుల పరారీని అధికార యంత్రాంగం నిరోధించలేదని ప్రభుత్వం తన నిస్సహాయతను బాహాటంగా చెప్పిందంటే అది ప్రజలకు చెడ్డ వార్తే అవుతుంది. ప్రభుత్వం అలా చెప్పడం చాలా శోచనీయం. అలా చెప్పడమంటే నేరాలను నిరోధించడానికి అవసరమైన వ్యవస్థాగత సంస్కరణలను అమలుపరిచే సంకల్పం తనకు లేదని చెప్పడమే అవుతుంది. ఇది ఎంతైనా ఆందోళనకరమైన విషయం. బాధ్యత నుంచి తప్పించుకోవడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నం వల్లే ఈ భయాందోళనలకు ఆస్కారం కలుగుతోంది.

2011లో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు నీరవ్ మోడీ జాతి సొమ్మును కొల్లగొట్టాడు; 2016లో దేశం నుంచి పరారయ్యాడు (కాంగ్రెస్ పార్టీ 2014 తొలినాళ్ళలోనే అధికారాన్ని కోల్పోయిందన్న విషయం ఇక్కడ అప్రస్తుతం). ఈ విషయమై అధికార పార్టీ నాయకులు పదే పదే చేస్తున్న ప్రకటనలు, సదరు నేరాలకు తావు లేని మంచి రోజులు వస్తాయన్న ఆశాభావాన్ని పూర్తిగా వమ్ము చేస్తున్నాయని చెప్పక తప్పదు.

సరే, కాలం సాగిపోతూనేవున్నది–ఒక మహా కుంభకోణం నుంచి మరో మహా కుంభకోణానికి. ఈ మహాకుంభకోణాల నడుమ కాలంలో భారతీయ మధ్యతరగతి ప్రజలు అనిశ్చిత జీవితాలను గడపడం కొనసాగుతూనే ఉన్నది. జాతి శ్రేయస్సుకు, తత్ఫలితంగా తమకు వైయక్తికంగా దెబ్బ మీద దెబ్బ తగులుతుండగా వారు మరింతగా నిరాశా నిస్పృహల్లో కూరుకుపోతున్నారు.

2014 అనంతరం మధ్యతరగతి ప్రజల ఆర్థిక స్థితిగతుల్లో వచ్చిన మార్పులను గమనంలోకి తీసుకోవలసిన అవసరం ఎంతైనాఉన్నది. 2014కి పూర్వం, అంటే రెండో యూపీఏ ప్రభుత్వ హయాంలో, చిన్న కుటుంబాలలో ఒక ఆర్థిక భద్రతా భావం ఉండేది. కష్టపడి సంపాదించుకున్న దాన్ని వృథాగా వ్యయం చేయకుండా పొదుపుగా వాడుకునే వారు. పైసాకు పైసా కూడబెట్టి దాచుకునేవారు. అలా సంచితమైన సొమ్ముతో మధ్యతరగతి ప్రజలు ఒక భద్రతాభావంతో ఉండే వారు. మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ రెండో ప్రభుత్వం చేపట్టిన డీమానిటైజేషన్ (పెద్ద నోట్లరద్దు)తో ఆ ఆర్థిక భద్రతా భావం కొట్టుకుపోయింది. ప్రజల వద్ద వున్న సొమ్ము అంతా తప్పనిసరిగా, నిర్బంధంగా బ్యాంకుల్లో జమఅయిపోయింది. పెద్దనోట్లను రద్దుచేశారుగానీ బ్యాంకుల్లో అక్రమాలను అరికట్టేందుకు ఎటువంటి చర్యలూ చేపట్టలేదు. ఎన్‌పిఏ (నాన్ పెర్ఫామింగ్ ఎస్సెట్స్–నిరర్థక ఆస్తులు) అనేది ఒక అపప్రయోగం. బ్యాంకింగ్ వ్యవస్థ నుంచి కొల్లగొట్టిన లక్షల కోట్ల రూపాయలను నిజానికి బిఎమ్‌ఏ (బ్లాక్ మనీ ఎస్సెట్స్– నల్లధనం ఆస్తులు) అనాలి. ఈ నల్లధనం ఆస్తులలో సింహభాగం దేశంలో లేదు. అది విదేశాలకు సురక్షితంగా తరలిపోయింది. ఎవరు దీనికి బాధ్యులు? పాలకులు కాదా?

విదేశాల్లో మన దేశ ప్రజలు దాచుకున్న నల్ల ధనం అంతటినీ దేశానికి తీసుకువచ్చి ప్రజల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరుస్తానని మోదీ 2014 సార్వత్రిక ఎన్నికల సందర్భంగా పదే పదే హామీ ఇచ్చారు. అయితే ఆ హామీ ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు. ప్రజలు దీన్ని గురించి ఆలోచించడం లేదు. అయితే ప్రధాని మోదీని వారు ఒకటి కోరుతున్నారు. అలా సంచితమైన నల్లధనం–అక్షరాలా 90లక్షల కోట్ల రూపాయలు– మరింతగా పెరిగిపోకుండా చూడాలని, అందుకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని దేశ ప్రజలు కోరుతున్నారు. మరి నీరవ్ మోడీ తన తెలివితేటలతో ఆ సొమ్మును మరింతగా పెంపొందించాడనడంలో ఎటువంటి సందేహం లేదు. ఈ ఘరానా దొంగల ఘనకార్యాలను ముందస్తుగా అడ్డుకోవడంలో ప్రభుత్వం నిస్సహాయురాలని అధికార పక్షం వారు పదే పదే చెబుతున్న దాన్ని ప్రజలు విశ్వసించలేకపోతున్నారు.

భారీ కుంభకోణాలు బహిర్గతమయినప్పుడు ప్రభుత్వాలు పలు వివరణలు ఇస్తున్నాయి. ఆ నేరాలలో అధికార పక్షం వారికి ఎటువంటి ప్రమేయం లేదన్నదే ఆ వివరణల సారాంశం. ప్రభుత్వాల వివరణలను విశ్వసిస్తున్నవారూ పెద్ద సంఖ్యలో ఉండడం దురదృష్టకరం. జాతిశ్రేయస్సుకు ఎనలేని హాని చేసే నేరాలకు పాలక వర్గాలు పాల్పడుతూనే ఉన్నాయి. అటువంటి నేరాలను నిరోధించాల్సిన తమ నైతిక బాధ్యతను త్యజిస్తున్నాయి. ఇలా ఎందుకు జరుగుతున్నది? ఇందుకు ఒక కారణమున్నది. సామాన్య మానవుడు స్వతహాగా గాడిద అని, తాము ఏంచెప్పినా నమ్ముతాడనే భావనే అందుకు కారణమని చెప్పి తీరాలి. తమ జీవనావసరాలకు కష్టపడి సంపాదించుకున్న సొమ్మును సంరక్షించుకోవడమో లేదా పేదరికంలో మగ్గిపోవడమో సామాన్య ప్రజలు నిర్ణయించుకోవాలి. మరింత స్పష్టంగా చెప్పాలంటే తమ సంక్షేమానికి తామే బాధ్యులు కావలసిన అవసరమున్నది. ప్రతి పౌరుడూ తన సంక్షేమం పట్ల ప్రభుత్వం కంటే మరింత ఎక్కువగా, మరింత మెరుగైన అవగాహనతో జాగరూకత వహించాలి. మన బాగు కోసం మనం తాపత్రయపడనప్పుడు పాలకులు ఏదో చేయగలరని ఆశించకూడదు. డీమానిటైజేషన్ ఈ వైయక్తిక జాగృతిలో నిర్ణయాత్మక పాత్ర వహించిదనడంలో సందేహం లేదు. ఈ దేశంలో సామాన్యుడి సహనం, భోళాతనానికి పరిమితి లేదన్న విషయాన్ని కూడా ఆ ఆర్థిక ప్రయోగం నిస్సందేహంగా నిరూపించింది. నాయకుల మాటలను నమ్మినందువల్లే నోట్లరద్దు సందర్భంగా ఎదురైన కష్టనష్టాలను ప్రజలు భరించారు. తాము కష్టపడి ఆర్జించిన సొమ్ములో, దైనిక అవసరాల కోసం కొద్దిరూపాయల్ని తీసుకోవడానికి ఏ రోజుకారోజు ఈ దేశ ప్రజలు బ్యాంకుల ఎదుట గంటల తరబడి బారులు తీరిన దినాలలో నీరవ్ మోడీ పగలుబడి నవ్వుకొనివుంటాడు కదా.

■ **వాల్సన్ థంపు**

('డైలీ ఓ' సౌజన్యం)

జనవాక్యం

అమరుల స్థూపాన్ని ఆవిష్కరించండి!

హుస్సేన్ సాగర్ ఒడ్డున తెలంగాణ అమల వీరుల స్మృతివనం పేరిట పెద్ద ఎత్తున నిర్మాణం చేయ సంకల్పించారు ముఖ్యమంత్రి కేసీఆర్. అయితే ఇప్పటికే అసెంబ్లీ ఎదురుగా ఉన్న తెలంగాణ అమర వీరుల స్థూపం కనీసం ఆవిష్కరణకు కూడా నోచుకోలేదన్న విషయాన్ని ప్రభుత్వం మరచిపోవడం బాధాకరం.

అమరుల త్యాగాల ఫలితమే తెలంగాణ అన్నది జగద్విదితమే. తొలి తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున లేచిన కెరటంలా ఎగిసిపడింది. వందలాది వీరులు ప్రాణాలు బలిచ్చారు. తుపాకీగుండ్లు గుండెలు చీల్చినా జై తెలంగాణ నినాదంమాత్రం వీడలేదు. అలా, మొదటి దశ ఉద్యమకాలంలో అమరులైన వీరుల గుర్తుగా నిలిచింది అసెంబ్లీ ఎదుటి అమరుల స్థూపం. తెలంగాణ గుండె గాయాన్ని శిలపై కవిత్వీకరించిన శిల్పి యక్కా యాదగిరి. ఆ స్థూపం నాటి నుంచి నేటి వరకూ ఆవిష్కరణకు నోచుకోకపోవడం అత్యంత బాధాకరం. ఇప్పుడు మన పాలన మనది. ఆ స్థూపాన్ని ఇప్పటికైనా ఆవిష్కరించి నాటి అమరులను గౌరవించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది.

– కృష్ణ సి.హెచ్.

ముసలమ్మ జాతరలో గిరిజన సంస్కృతికి అన్యాయం

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కొత్తగూడ మండలం గుంజేడులో ప్రతి రెండేళ్లకొక్కసారి జరిగే శ్రీ ముసలమ్మ గిరిజన జాతర తెలంగాణలో రెండవ అతిపెద్ద గిరిజన జాతరగా పేరుగాంచింది. శ్రీ ముసలమ్మ జాతర ఈ ఏడు ఫిబ్రవరి 28 నుండి మార్చి 3 వరకూ జరుగుతుంది. ఆదివాసీ సాంప్రదాయాల ప్రకారం జరిగే ఈ జారతను తోలెం వంశీయులు వడ్డెలు (పూజారులు)గా ఉండి నిర్వహిస్తారు. జాతర రెండేళ్లకొకసారి జరిగినప్పటికీ ప్రతి శుక్రవారం వేలాది గిరిజన, గిరిజనేతర భక్తులు శ్రీ ముసలమ్మను దర్శించుకొని మొక్కులు తీర్చుకొంటారు. అనాదిగా గిరిజన సాంప్రదాయాలతో సాగే జాతరను 1994 నుండి రాష్ట్ర దేవాదాయ శాఖ నిర్వహిస్తోంది. దీంతో, జాతర ఆదాయం రూ.2.70లక్షలు వస్తున్నప్పటికీ అది గిరిజనులకు దక్కకుండా పోతోంది. అలాగే, ఇక్కడి ఆరుగురు గిరిజ పూజారులలో ముగ్గురికి మాత్రమే పర్మినెంట్ స్కేల్ దక్కుతోంది. గుంజేడు ముసలమ్మ జాతర విగ్రహారాధనలు, హిందూ ఛాయలులేని గిరిజన సాంప్రదాయక ప్రకృతి ఆరాధన పండుగ. కానీ దేవాదాయ శాఖ పరిధిలోకి వెళ్ళిన తరువాత సాంప్రదాయాలకు భిన్నంగా కొందరు గిరిజనేతర వ్యాపారులు ముసలమ్మకు విగ్రహాన్ని తయారు చేసి, ఆ విగ్రహానికొక గుడి కట్టి వ్యాపారమయం చేశారు. గిరిజన వడ్డెల మాటకు విలువే లేకుండా పోయింది. ఇక్కడి సాంప్రదాయక వడ్డెలైన గిరిజన యువకులకు కీసర గుట్టలో హిందూ పూజారులుగా శిక్షణనిచ్చి మంత్ర తంత్రాలతో పూజలు నిర్వహించడం ఆదివాసీ సంస్కృతికి పూర్తిగా విరుద్ధం. ఇప్పటికైనా ముసలమ్మ జాతరలో గిరిజన సాంప్రదాయాలకు విలువిచ్చి, ఇక్కడి ఆదాయాన్ని గిరిజనుల అభివృద్ధికి ఖర్చుచేయాలి.

– గుమ్మడి లక్ష్మీనారాయణ
శ్రీ ముసలమ్మ ఉద్యోగుల సంఘం సలహాదారు

జ్ఞాన జ్యోతి

(కంచి కామకోటి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి మృతిగా)

అజ్ఞానపు అంధకారాలను
జయించిన దివ్య జ్ఞాన జ్యోతి
ఆరిపోయింది!

కోట్ల నమ్మకాల గొంతులు
బిగుసుకు పోయాయి!

ఆధ్యాత్మిక మహా గ్రంథంలోని
69వ పుట చిరిగి
చితిమంటల్లో పడి
శివైక్యమైంది!

ఇప్పుడు
అన్ని ధర్మాలు ఒకటని
ఎవరు చెప్తారు?

– కుంచె చింతాలక్ష్మీనారాయణ

ట్రంప్ ప్రవర్తనా, మోదీ శైలీ రెండూ ప్రమాదకరమే!

ఉత్తమ జర్నలిస్టులకు ప్రతి ఏడాది ప్రదానం చేసే ఎన్.ఆర్. చందూర్ అవార్డ్‌ను స్వీకరించేందుకు వాషింగ్టన్ పోస్ట్, వాల్‌స్ట్రీట్ జర్నల్ లాంటి ప్రతిష్ఠాత్మక పత్రికలకు మేనేజింగ్ ఎడిటర్‌గా పని చేసిన జర్నలిస్టు నరిసెట్టి రాజు ఇటీవల ఢిల్లీకి వచ్చినపుడు ఆంధ్రజ్యోతి అసోసియేట్ ఎడిటర్ ఎ. కృష్ణారావు ఆయనతో జరిపిన ఇష్టాగోష్టి.

అమెరికాలో ప్రింట్‌మీడియా భవిష్యత్తు, అక్కడ పాఠకుల తీరుతెన్నులు...

అమెరికాలో వార్తాపత్రికలకు రోజురోజుకూ సర్క్యులేషన్ తగ్గిపోతోంది. రోజురోజుకూ పాఠకులు, ముఖ్యంగా యువ పాఠకులు డిజిటల్ వేదికల్ని ఆశ్రయిస్తున్నారు. అమెరికాలో దాదాపు 1300 దినపత్రికలున్నాయి. గత అయిదేళ్లగా వాటి సంఖ్యలో పెద్ద మార్పు లేదు. పత్రికలు చదవడం తగ్గిపోవడం కొనసాగుతున్నప్పటికీ న్యూయార్క్ టైమ్స్, వాషింగ్టన్ పోస్ట్, ద వాల్ స్ట్రీట్ జర్నల్ లాంటి పేపర్ల మనుగడకు సమీప భవిష్యత్‌లో ఢోకా లేదు. దీనికి కారణం ఈ పత్రికలు డిజిటల్, టీవీ వంటి రకరకాల వేదికల్ని కూడా ఉపయోగించుకునే మీడియా కంపెనీల్లో భాగం కావడం. అయితే అమెరికాలో చిన్న నగరాలు, పట్టణాల్లో ప్రింట్ మీడియా గడ్డ సమస్యల్ని ఎదుర్కొంటున్నది. రేడియో లాగా ప్రింట్ మీడియా చాలా కాలం ఉండవచ్చు కాని పత్రికల్ని ఎక్కువగా 45–75 మధ్య వయస్సున్న పాఠకులే చదువుతున్నారు.

అంటే డిజిటల్ జర్నలిజం వల్ల ప్రింట్ మీడియా ఆర్థిక సమస్యల్ని ఎదుర్కొంటున్నదన్నమాట...

ఇది క్రమంగా జరిగిన పరిణామం. ఎందుకంటే చాలా వార్తాపత్రికలు కొత్త పాఠకుల్ని, ముఖ్యంగా యువ పాఠకులను చేర్చుకోవడం లేదు. ప్రింట్‌తో పాటు వెబ్, మొబైల్, ఫేస్‌బుక్, ట్విట్టర్, స్నాప్‌చాట్ లాంటి రకరకాల న్యూస్ రూమ్‌లను ఏర్పర్చి మనుగడ సాధించగలుగుతున్నాయి. డిజిటల్ వేదికల పాఠకులే పెరిగినందువల్ల పత్రికలు ఆదాయ సమస్యల్ని ఎదుర్కొంటున్నాయి. ఈ రోజుల్లో అమెరికాలో చాలా న్యూస్ కంపెనీలు డిజిటల్ చెల్లింపులు, చందా పద్ధతులను ఆశ్రయించి ప్రకటనల ఆదాయానికి అదనంగా పాఠకుల నుంచి కూడా ఆదాయాన్ని సంపాదిస్తున్నాయి. డిజిటల్ వీడియో కూడా అభివృద్ధికి బాగానే తోడ్పడుతున్నది. డిజిటల్ పద్ధతుల ద్వారా నిర్దిష్ట వర్గాలను ఉద్దేశించడం సాధ్యం కనుక ప్రకటనదారులు కూడా వాటిని ఇష్టపడుతున్నారు. ప్రింట్‌లో అడ్వర్టైజింగ్ కన్నా డిజిటల్‌లో ప్రకటనలను మరింత సులభంగా లెక్కించవచ్చు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిణామాల్లో అమెరికా మీడియా పాత్ర

వాస్తవాలను, అభిప్రాయాలను వెల్లడించడం ద్వారా న్యూస్ మీడియా అప్పుడూ ఇప్పుడూ రాజకీయాలను, ఎన్నికలను కూడా ప్రభావితం చేయడంలో ప్రధాన పాత్ర పోషిస్తోంది. అమెరికాలో న్యూస్ మీడియాలో ఒక వర్గం (ఎన్‌బిసి) వామపక్ష, మరొక వర్గం (ఫాక్స్) మితవాద రాజకీయాలను అనుసరిస్తున్నాయి. ఎడిటోరియల్ పేజీలకు సంబంధించి అమెరికా వార్తాపత్రికల్లో న్యూయార్క్ టైమ్స్, వాషింగ్టన్ పోస్ట్ వంటివి ఉదారవాద వైఖరిని అనుసరిస్తే, వాల్‌స్ట్రీట్ జర్నల్ వంటివి సాంప్రదాయ వైఖరిని అనుసరిస్తాయి. కాని ఈ పత్రికల్లో వార్తలకు సంబంధించిన పేజీల్లో మాత్రం తటస్థత కనపడుతుంది. కొన్ని మీడియా బ్రాండ్ యజమానులు, ప్రధానంగా టీవీ యజమానులు, అటు రిపబ్లికన్స్ వైపు కానీ, ఇటు డెమోక్రట్ల వైపు కానీ మొగ్గు చూపుతున్నారు. అయితే భారత దేశంలో లాగా రాజకీయనాయకులు కానీ, రాజకీయ పార్టీలు కానీ వార్తాపత్రికలను నడపడం లేదు.



■ మోదీ ప్రభుత్వం మీడియాపై ఒత్తిడి తేవడంలో ఒక పద్ధతి ప్రకారం వ్యవహరించి వారు తమ గొంతు తగ్గించుకునేలా చేస్తోంది. అందుకు రకరకాల ఒత్తిళ్లను ప్రయోగిస్తోంది. ట్రంప్ ప్రవర్తన, మోదీ శైలి రెండూ ప్రజాస్వామ్యానికి ఎంతో ప్రమాదకరం.

■ అమెరికన్ మీడియాకు మరెక్కడా లేని విధంగా పరిశోధనలు చేసేందుకు వీలుగా అమెరికా రాజ్యాంగం వీలు కల్పించింది. భారత దేశంలో ప్రభుత్వమూ, అధికారుల గుప్పిట్లో ఇప్పటికీ ఎంతో సమాచారం నియంత్రణకు గురవుతోంది. జరుగుతున్న అవకతవకల గురించి సాక్ష్యాలు సంపాదించడం భారతదేశంలో సులభం కాదు.

■ భారత దేశంలో మీడియాకు మెజారిటీ ప్రకటనలు ప్రభుత్వం నుంచే రావడం, న్యూస్ ప్రింట్ దిగుమతులను నియంత్రించడం, మీడియాతో సంబంధంలేని వ్యాపారం చేసే మీడియాసంస్థలను శిక్షించడానికి వెనుకాడకపోవడం వంటివి జరుగుతున్నాయి. కనుక మీడియా యజమానులను లొంగదీసుకునే సామర్థ్యం ఎక్కువ.

మీడియా విషయంలో మోదీ, ట్రంప్ మధ్య ఉన్న పోలికలు

మోదీ, ట్రంప్ ఇద్దరూ జనాదరణ గల నాయకులే. సోషల్ మీడియా తదితర మార్గాల్లో ప్రజలను నేరుగా చేరుకునే కళలో వారు నిష్ణాతులే. కాని ప్రధానమంత్రి మోదీ పాలనలో అనుభవం ఉన్న రాజకీయనాయకుడు. ఒక జాతీయ పార్టీతో సుదీర్ఘకాలం సంబంధం ఉన్నవాడు. కాని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాపారంలో విఫలుడైన వ్యక్తి. ఆయన కంపెనీలు ఎన్నో ఏళ్లుగా సమస్యల్ని ఎదుర్కొంటున్నాయి. మోదీ రాజకీయాలకు ఒక సైద్ధాంతిక మూలం ఉన్నది. కాని ట్రంప్ రాజకీయాల వెనుక ఎలాంటి నిజమైన మౌలిక విశ్వాసాలు లేవు. ట్రంప్ తనకు ఇష్టంలేని వార్తలను ఫేక్ న్యూస్‌గా అభివర్ణిస్తారు. తనకిష్టం లేని సిఎన్ఎన్ వంటి ఇతర గ్రూప్‌లపై తప్పుడు ఆరోపణలు చేస్తారు. మోదీ ప్రభుత్వం మీడియాపై ఒత్తిడి తేవడంలో ఒక పద్ధతి ప్రకారం వ్యవహరించి వారు తమ గొంతు తగ్గించుకునేలా చేస్తుంది. అందుకు రకరకాల ఒత్తిళ్లను ప్రయోగిస్తుంది. ట్రంప్ ప్రవర్తన, మోదీ శైలి రెండూ ప్రజాస్వామ్యానికి ఎంతో ప్రమాదకరం. అయితే ట్రంప్‌ను బలంగా విమర్శించడంలో అమెరికన్ మీడియా ఇంకా సమర్థవంతంగా పనిచేస్తోంది. కాని భారత దేశంలో ప్రభుత్వ ఒత్తిళ్ల రీత్యా అప్రకటితంగానే సమస్యల పట్ల మెతకగా వ్యవహరించడం కనపడుతోంది.

పరిశోధనాత్మక జర్నలిజం, కుంభకోణాలకు ప్రాధాన్యత..

పరిశోధనాత్మక జర్నలిజం విషయంలో అమెరికన్ ప్రెస్ ఇంకా బలంగా ఉన్నది. గత ఏడాదిగా అది ఎన్నో పరిశోధనాత్మక, విమర్శనాత్మక కథనాల్ని ప్రచురించింది. వ్యాఖ్యల్ని చేసింది. అమెరికన్ మీడియాకు మరెక్కడా లేని విధంగా పరిశోధనలు చేసేందుకు వీలుగా అమెరికా రాజ్యాంగం తన తొలి సవరణ ద్వారా వీలు కల్పించింది. సమాచార స్వేచ్ఛ చట్టాలు అందుకు మరింత తోడ్పడుతున్నాయి. భారత దేశంలో ప్రభుత్వం, అధికారుల గుప్పిట్లో ఇప్పటికీ ఎంతో సమాచారం నియంత్రణకు గురవుతోంది. జరుగుతున్న అవకతవకల గురించి సాక్ష్యాలు సంపాదించడం భారతదేశంలో సులభం కాదు. అమెరికాలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉన్నది.

పత్రికా స్వేచ్ఛపై దాడులు..

భారత దేశంతో పోలిస్తే మాత్రం అమెరికా ప్రెస్ ప్రత్యక్ష, పరోక్ష ఆంక్షలకు గురి కావడం లేదు. ఒబామా తోపాటు ఇతర అధ్యక్షుల పాలనలో వారు చట్టాన్ని ఉల్లంఘిస్తున్నారని, సున్నితమైన సమాచారాన్ని లీక్ చేస్తున్నారన్న పేరుతో విజిల్ బ్లోవర్స్ వెంటపడి ఉండవచ్చు. కాని అదృష్టవశాత్తు అమెరికన్ పౌర హక్కుల సంఘం, ఇతర మీడియా కంపెనీలు ఇలాంటి చర్యలపై న్యాయస్థానాల్లో పోరాడగలుగుతున్నాయి. అమెరికా న్యాయస్థానాలు పత్రికా స్వేచ్ఛకున్న రాజ్యాంగ హక్కులను కాపాడేందుకు ముందుకు వస్తున్నాయి. గత ఏడాదిగా ట్రంప్ పాలనలో జర్నలిస్టులు, వార్తాసంస్థలపై మౌఖిక దాడులు పెరుగుతున్నాయి. ఇది ప్రమాదకరమైన పరిణామం. భారత దేశంలో మీడియాకు మెజారిటీ ప్రకటనలు ప్రభుత్వం నుంచే రావడం, న్యూస్ ప్రింట్ దిగుమతులను నియంత్రించడం, మీడియాతో సంబంధంలేని వ్యాపారం చేసే మీడియాసంస్థలను శిక్షించడానికి వెనుకాడకపోవడం వంటివి జరుగుతున్నాయి. కనుక మీడియా యజమానులను లొంగదీసుకునే సామర్థ్యం ఎక్కువ. అమెరికాలో ఇలా జరగదు. మన దేశంలో ఎడిటర్స్ గిల్డ్, ప్రెస్ కౌన్సిల్ లాంటి సంస్థలకు అధికారాలు లేవు. అవి ఉన్నా లేనట్లే.

సమాచార హక్కు నామమాత్రమే...

అమెరికాలో రాజ్యాంగ తొలి సవరణ జర్నలిజానికి అత్యంత శక్తిమంతమైన కవచంలా పనిచేస్తుంది. భారతదేశంతో పాటు ప్రపంచంలో ఎక్కడా ఈ పరిస్థితి లేదు. ప్రజాస్వామ్యం వర్ధిల్లాలంటే పత్రికలను తన పని తాను చేసుకోనివ్వాలి. పత్రికా స్వేచ్ఛ గురించి గొప్పలు చెప్పుకుంటారు కాని ఆర్‌టిఐ లాంటి చట్టాలున్నా పత్రికా స్వేచ్ఛకు ఎన్నో అవరోధాలున్నాయి. ప్రభుత్వ సమాచారంలో అధిక భాగం అనేక ఇతర దేశాల్లో లాగా బహిరంగంగా, సులభంగా లభ్యం కాదు. దీని వల్ల ప్రభుత్వానికి, అధికారులకు జర్నలిస్టులపై, జర్నలిజంపై ఎక్కువ అధికారాలు లభిస్తున్నాయి.

'మింట్'లో పనిచేసి వెనక్కి వెళ్లడానికి కారణాలు

'మింట్' పత్రికను 2007లో స్థాపించడం, రెండవ అతి పెద్ద వ్యాపార పత్రికగా అది విజయం సాధించడం లో నాకెంతో గొప్ప అనుభవం లభించింది. భారతీయ న్యూస్ రూమ్‌లో ప్రమాణాలు చాలా తక్కువ. మింట్‌లో ప్రవర్తనా నియమావళి, సవరణలు చేసుకునే విధానాలను నెలకొల్పినందుకు నాకు గర్వంగా ఉన్నది. భారతీయ జర్నలిజంలోనే అది విశిష్టమైనది. కాని జర్నలిస్టులలో ఎక్కువ మంది వాస్తవాలను తనిఖీ చేసుకోవాలనే మౌలిక పద్ధతిని పాటించకపోవడం, సందర్భాన్ని ఉటంకించకపోవడం, విమర్శనాత్మకంగా వ్యవహరించలేకపోవడం భారతదేశంలో ఎక్కువగా కనపడుతోంది. తమను తాము నియంత్రించుకుంటున్నామని మీడియా సంస్థలు చెప్పుకుంటున్నప్పటికీ భారతదేశంలో స్వయం నియంత్రణ దాదాపు లేదు. మరో వైపు విమర్శనాత్మకంగా వ్యవహరిస్తే భారతదేశం పట్ల వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నామని ముద్రవేసే తత్వం ఒకటి కనపడుతోంది.

జర్నలిజంలో రావడానికి ప్రేరణ

హైదరాబాద్‌లో మధ్యతరగతి కుటుంబంలో మా తల్లిదండ్రులు నరిసెట్టి ఇన్నయ్య, వెనిగళ్ల కోమలతో పాటు పెరిగాను. చదువుకోవడం తప్ప జీవితంలో విజయం సాధించడానికి వేరే మార్గం లేని కుటుంబం మాది. నేను, నా చెల్లెలు అస్తమానం పుస్తకాలు, వార్తాపత్రికల మధ్య, ఆకాశవాణి, బిబిసి వార్తలు వింటూ పెరిగాము. మా ఇంటికి వచ్చే వారితో కానీ, బయట కానీ చర్చల్లో పాల్గొంటే మా తల్లిదండ్రులు ప్రోత్సహించేవారే కాని అడ్డు చెప్పేవారు కారు. చైతన్యకళాశాలలో ఇంగ్లీష్ టీచర్ ఆనంది శంకర్ ఇచ్చిన ప్రోత్సాహన్ని మరిచిపోలేను. 1985లో రూరల్ మేనేజిమెంట్‌లో ఎంబిఏ చేసిన తర్వాత నాలో విశ్వాసం పెరిగింది. టైమ్స్ స్కూల్ ఆఫ్ జర్నలిజంలో ప్రొఫెసర్ థామస్ ఓమ్మెన్ నాకు జర్నలిజంలో మౌలిక పాఠాలు నేర్పి విదేశాల్లో చదువుకొమ్మని ప్రోత్సహించారు. ఎకనమిక్స్ టైమ్స్‌లో టిఎన్ నైనన్ మొదట ఉద్యోగం ఇచ్చారు. వీరందరూ నా విజయానికి కారకులు.

యువజర్నలిస్టులకు ఏది అవసరం

ఒక జర్నలిస్టుకు దేనినైనా తెలుసుకోవాలనే ఆసక్తి ఉండాలి. చుట్టూ ఉన్న అన్ని అంశాలపై ప్రశ్నలు వేసేందుకు వెనుకాడకూడదు. ప్రశ్నలకు జవాబులు అన్వేషించడం, వాటిని పాఠకులతో పంచుకోవడం నిరంతరం జరగాలి.

(నరిసెట్టి రాజు ప్రస్తుతం అంతర్జాతీయ మీడియా గ్రూప్ 'గిజ్ మోడో' సిఇఓ గా, వికీమీడియా ఫౌండేషన్ ట్రస్టీగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.)




రోడ్డుపై ఆందోళన వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు (ఇన్‌సెట్‌లో) వృద్ధులకు నచ్చజెప్తున్న స్పీకర్

పింఛన్ కోసం వృద్ధుల ఆందోళన

- స్పీకర్ కాన్వాయ్ అడ్డుకున్న పండుటాకులు
- పోస్టల్ అధికారుల తీరుపై స్పీకర్ ఆగ్రహం

గణపురం, ఫిబ్రవరి 28: పింఛన్ డబ్బుల కోసం వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు జయశంకర్ జిల్లా గణపురంలో బుధవారం రోడ్డెక్కి ఆందోళన చేశారు. మూడు నెలలుగా తమకు డబ్బులు రావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నెలరోజులుగా పోస్టాఫీస్ చుట్టూ తిరిగినా ఎవరూ సమాధానం చెప్పడం లేదని రోడ్డుపై బైఠాయించారు. అదే సమయంలో స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి కాన్వాయ్ గణపురం మీదుగా వెళ్తున్న క్రమంలో సుమారు 400 మంది లబ్ధిదారులు అడ్డుకున్నారు. ఆయన వాహనం దిగి నేరుగా పోస్టాఫీస్‌లోకి వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. డబ్బులు ఎందుకు ఇవ్వడం లేదంటూ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత ఉన్నతాధికారులకు ఫోన్ చేసి రేపటిలోగా పింఛన్‌దారులకు డబ్బులు చెల్లించకపోతే ఎవ్వరినీ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. పోస్టల్ సిబ్బంది తమ పట్ల దురుసుగా వ్యవహరిస్తున్నారని, అనరాని మాటలు అంటున్నారని స్పీకర్‌కు వాపోయారు. పనులన్నీ ఒదులుకుని రోజుల తరబడి పోస్టాఫీస్ వద్దే ఉండాల్సి వస్తుందని తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

రేషన్‌కు ఐరిస్

సిద్దిపేటలో ప్రారంభించిన మంత్రి హరీశ్‌రావు



ఐరిస్ విధానాన్ని పరిశీలిస్తున్న మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట, ఆంధ్రజ్యోతి ఫిబ్రవరి 28: తెలంగాణ పౌరసరఫరాల శాఖ దేశానికే ఆదర్శంగా నిలిచిందని, అనతికాలంలోనే పారదర్శకతకు చిరునామాగా మారిందని భారీనీటి పారుదల శాఖ మంత్రి టీహరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట కలెక్టరేట్‌లో పౌరసరఫరాల శాఖ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. రేషన్‌షాపులో ఐరిస్ విధానాన్ని ప్రవేశపెట్టారు. అనంతరం సివిల్ సప్లయిస్ కమిషనర్ సీవీ ఆనంద్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. రైతు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడం దగ్గర నుంచి రేషన్ షాపుల్లో పేదలకు బియ్యాన్ని అందజేసే వరకు ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశపెట్టిన ఘనత మన రాష్ట్రానికే దక్కుతుందని చెప్పారు. వేలి ముద్రలు సరిగా పడక రేషన్ పంపిణీలో ఏర్పడుతున్న ఇబ్బందులను అధిగమించేందుకు ఐరిస్ విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు. ఆన్‌లైన్ విధానాలతో ప్రభుత్వానికి రూ.500 కోట్ల వరకు మిగులుబాటయ్యాయని వెల్లడించారు. ఈ డబ్బులను కూడా ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో చదివే విద్యార్థులకే ఖర్చు పెడుతున్నామన్నారు. నాణ్యమైన సన్నబియ్యంతో పేద విద్యార్థులకు భోజనం పెడుతున్నామన్నారు. ఇక్కడ పండిన ధాన్యాన్ని మార్కెట్‌కు తరలించకుండా ఈ ప్రాంత రైస్‌మిల్లుల్లోనే మరపట్టించి ఇక్కడి ప్రజలకే బియ్యాన్ని అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో 17వేల రేషన్ దుకాణాల్లో ఈ పాస్ విధానం అమలు చేస్తున్నామని, సాంకేతిక ఇబ్బందుల వల్ల 200 షాపుల్లో మాత్రమే ఆఫ్‌లైన్ ద్వారా సరుకులు పంపిణీ చేస్తున్నట్లు పౌరసరఫరాల శాఖ కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు. వేలి ముద్రలు సరిగా పడకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నందున కళ్లను గుర్తించే ఐరిస్ విధానాన్ని ప్రవేశపెడుతున్నట్లు ప్రకటించారు.

కొమురవెల్లి చైర్మన్‌గిరి గొల్లకుర్మలకే..

కొమురవెల్లి ఆలయ చైర్మన్ పదవిని ఇకపై గొల్లకుర్మలకే కేటాయిస్తామని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. సిద్దిపేటలో గొల్లకుర్మల అభివృద్ధిపై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయంగా కూడా గొల్లకుర్మలకు ప్రాధాన్యత కల్పిస్తున్నామని తెలిపారు. వారికి రాజ్యసభ ఎంపీ పదవితోపాటు ఒక ఎమ్మెల్సీని కూడా ఇవ్వనున్నట్లు హరీశ్‌రావు ప్రకటించారు.

శంకుస్థాపనలో ఉద్రిక్తత

- మంత్రులు రాకముందే యత్నించిన ఎమ్మెల్యే రేవంత్
- అడ్డుకున్న పోలీసులు.. ఆగ్రహించిన కార్యకర్తలు
- శిలాఫలకం దిమ్మె ధ్వంసం



శంకుస్థాపనకు యత్నిస్తున్న రేవంత్‌కు అడ్డుచెప్తున్న పోలీసులు

మద్దూర్, ఫిబ్రవరి 28: మహబూబ్‌నగర్ జిల్లా మద్దూర్ మండలం నందిగామలో బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేసే కార్యక్రమంలో కాంగ్రెస్, టీఆర్ఎస్ మధ్య బుధవారం ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. మొదటగా మంత్రులు జూపల్లి కృష్ణారావు, మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డితో కలిసి నందిగామ రోడ్డు శంకుస్థాపన చేయాల్సి ఉంది. మంత్రులకంటే ముందే వచ్చిన రేవంత్ శంకుస్థాపనకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఆగ్రహించిన కాంగ్రెస్ కార్యకర్తలు పోలీసులను తోయడంతో శిలాఫలకం కూలింది. దీన్ని ఆగ్రహించిన గ్రామ టీఆర్ఎస్ కార్యకర్తలు ఎమ్మెల్యే కాన్వాయ్‌కి అడ్డంగా బైఠాయించారు. కాంగ్రెస్ కార్యకర్తలు తోసుకొని రావడంతో ఉద్రిక్తత ఏర్పడింది. దీంతో పోలీసులు రేవంత్‌ను గ్రామం నుంచి పంపించారు. మన్నాపూర్ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాక కోసం తాము నిరీక్షించామని, నందిగామకు తాము వస్తున్నామని తెలిసి కూడా ఉనికిని చాటుకోవడం కోసం ఇలా చేశారని వారు ఆగ్రహించారు.

గద్వాల మునిసిపల్ సమావేశంలో గొడవ

- వాటర్ బాటిల్, చెప్పు విసురుకున్న కౌన్సిలర్లు



కౌన్సిలర్ల మధ్య జరుగుతున్న వాగ్వివాదం

గద్వాల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో మునిసిపల్ సమావేశం రసాభాసగా సాగింది. బుధవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో 25వ అంశంపై కౌన్సిలర్ల మధ్య వివాదం తలెత్తింది. మునిసిపాలిటీలో 117 గృహాలను వారసుల పేర్లపై మార్పునకు కౌన్సిల్‌లో తీర్మానానికి పెట్టారు. కౌన్సిల్‌కు సంబంధం లేని ఈ తీర్మానాన్ని ఎందుకు ప్రవేశపెట్టారని టీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ మహమూద్ కమిషనర్‌ను ప్రశ్నించారు. ఈ విషయంలో వైస్ చైర్మన్ శంకర్ కౌన్సిలర్‌ను కించపర్చే విధంగా మాట్లాడారు. 3వ వార్డు కౌన్సిలర్ గోవిందు వైస్ చైర్మన్ వ్యాఖ్యలపై తీవ్రంగా అభ్యంతరం చెప్పారు. దీంతో మండిపడిన వైస్ చైర్మన్ వాటర్ బాటిల్‌ను కౌన్సిలర్ గోవిందుపైకి విసిరాడు. ప్రతిగా, ఆవేశానికి గురైన గోవింద్ తన చెప్పును వైస్ చైర్మన్‌పైకి విసిరాడు. ఈ విషయంలో కౌన్సిలర్ల మధ్య తీవ్ర వాగ్వివాదం జరిగింది. చివరకు మునిసిపల్ చైర్‌పర్సన్ కృష్ణవేణి, మూడో వార్డు కౌన్సిలర్‌పై మూడు నెలలపాటు బహిష్కరణ వేటు వేశారు. ఈ విషయంపై కమిషనర్ ప్రభాకర్ మాట్లాడుతూ 25వ అంశంపై గొడవ జరిగిందని తెలిపారు. కౌన్సిల్ నుంచి తీర్మానం చేసి, కేవలం రాటిఫికేషన్ కోసం మాత్రమే పెట్టామని చెప్పారు.

కందుల కొనుగోలు గడువు పెంచండి

- మార్క్‌ఫెడ్ ఎండీకి కిసాన్‌మోర్చా వినతి

హైదరాబాద్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి) : కందుల కొనుగోలు, సేకరణ గడువును మార్చి 31 వరకూ పెంచాలని బీజేపీ కిసాన్ మోర్చా నేతలు కోరారు. ఈ మేరకు మార్క్‌ఫెడ్ ఎండీకి వినతిపత్రం అందజేశారు. కంది రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గోనె సంచులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, దళారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులకు నగదు చెల్లించే విషయంలో జాప్యాన్ని నివారించాలని విజ్ఞప్తి చేశారు. ఎండీని కలిసినవారిలో కిసాన్ మోర్చా నేతలు గోలి మధుసూదన్‌రెడ్డి, బద్దం బాల్‌రెడ్డి ఉన్నారు.

అప్పుల బాధతో ముగ్గురు రైతుల ఆత్మహత్య




జింకల రవి, భూక్యా హేమోజి (ఫైల్)

ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్: అప్పుల బాధతో ముగ్గురు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం మల్లంపల్లి గ్రామానికి చెందిన జింకల రవి (41) ఐదెకరాల్లో పత్తి, మిర్చి వేస్తున్నాడు. పంట దిగుబడిరాక సుమారు రూ.6లక్షలు అప్పులు కావడంతో మంగళవారం పురుగుమందు తాగాడు. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం పెద్దనాగారం జగ్యా తండాకు చెందిన భూక్యా హేమోజి(45) రెండకరాలు కౌలు తీసుకుని వ్యవసాయం చేశాడు. సాగు కోసం రూ.లక్ష అప్పులు చేశాడు. దిగుబడి రాక అప్పులు ఎక్కువ కావడంతో పొలంలో చెట్టుకు ఉరేసుకున్నాడు. జయశంకర్ జిల్లా వెంకటాపురం మండలం పట్వారిపల్లికి చెందిన భూక్య తిరుపతి(38) తన ఎకరన్నరతోపాటు మరో ఎకరం కౌలు తీసుకుని వరి, మిరప వేశాడు. దిగుబడి రాక పోగా, అప్పులు పెరిగిపోయాయి. దీంతో మనస్తాపం చెంది బుధవారం ఇంట్లో పురుగు మందు తాగాడు. ఆస్పత్రికి తీసుకెళ్తుండగా చనిపోయాడు.

ప్రభుత్వ ఆఫీసుల్లో వేలల్లో ఖాళీలు

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు కృష్ణయ్య



చిక్కడపల్లి/హైదరాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : 'రాష్ట్ర విభజన అనంతరం అన్ని ప్రభుత్వ ఆఫీసుల్లో ఖాళీ కుర్చీలే దర్శనమిస్తున్నాయి. సచివాలయం మొదలు డైరెక్టరేట్లు, జిల్లా కార్యాలయాలు, తాలూకా, మండల కార్యాలయాల్లో ఉద్యోగులు లేక వెలవెలబోతున్నాయి' అని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు కృష్ణయ్య అన్నారు. బుధవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని ఓ సెంటర్‌లో పోటీపరీక్షల కోసం కోచింగ్ తీసుకుంటున్న అభ్యర్థులనుద్దేశించి ఆయన మాట్లాడారు. కేంద్ర ఉద్యోగాలకు సంబంధించి బ్యాంకుల్లో 2 లక్షలు, రక్షణ శాఖలో 3.5 లక్షలు, కేంద్ర ప్రభుత్వ శాఖల్లో 2 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని వీటి భర్తీకి త్వరలో ప్రధానిని కలిసి విజ్ఞప్తి చేస్తామన్నారు. రాష్ట్రంలో గ్రూప్ - 1లో 1200, గ్రూప్ - 3లో 8 వేలు, గ్రూప్ - 4లో 36 వేలు క్లరికల్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. వీటి భర్తీకి ఆయా ప్రభుత్వాలు వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కళ్లు తెరిచి ఖాళీలను నిరుద్యోగులతో భర్తీ చేయాలని కోరారు. సమావేశంలో నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ కృష్ణ, రామలింగం, మహేందర్, నర్రి స్వామి పాల్గొన్నారు.

16 ఏళ్ల తర్వాత తల్లిదండ్రుల చెంతకు



భార్య, కూతురుతో మోహన్

కారేపల్లి, ఫిబ్రవరి 28: పాఠశాలకు వెళ్లడం లేదని ఆరో తరగతి చదువుతున్న ఆ బాలుడిని తండ్రి మందలించాడు. దీంతో ఇంట్లో నుంచి వెళ్లిపోయిన ఆ విద్యార్థి 16 ఏళ్ల తర్వాత భార్య కూతురుతో కలసి తిరిగి వచ్చాడు. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం గిద్దవారిగూడేనిక చెందిన ఇస్లావత్ మోహన్ 16 ఏళ్ల క్రితం ఇంట్లో నుంచి వెళ్లిపోయి విజయవాడ ఆనాథాశ్రమంలో ఉన్నాడు. అక్కడ డిగ్రీ వరకు చదువుకుని.. ఓ యువతిని ప్రేమ పెళ్లి చేసుకున్నాడు. వారికి ఓ కూతురు పుట్టింది. 16 ఏళ్ల తర్వాత ఇంటికొచ్చిన మోహన్‌ను చూసిన అతడి తల్లిదండ్రులు ఉప్పొంగిపోయారు.

శతాధిక వృద్ధుడు మృతి

వెల్దుర్తి, ఫిబ్రవరి 28: మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం మాసాయిపేటలో శతాధిక వృద్ధుడు మందులజల్లి బుచ్చయ్య (120) బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు.

ప్లేస్‌మెంట్ రాకపోతే కింకర్తవ్యం..?

కెరీర్ గైడ్



ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, కామర్స్, ఇతర ప్రొఫెషనల్ కోర్సులు చదివే విద్యార్థులు కెరీర్‌లో స్థిరపడటానికి క్యాంపస్ ప్లేస్‌మెంటు మంచి అవకాశం కల్పిస్తాయి. కోర్సు పూర్తికాక ముందే మంచి ఆఫర్‌తో ఉద్యోగం లభిస్తే మంచిదే! ఎంపిక కాకపోతే ఏం చేయాలనే విషయంలోనే విద్యార్థులకు ఆందోళన ఉంటుంది. క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లలో ఎంపిక కాకపోయినా అనేక ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ఉద్యోగ ప్రయత్నాలు చేయవచ్చు. ఉద్యోగ సాధనకు అవసరమైన సామర్థ్యాలు పెంపొందించుకోవచ్చు. విదేశాల్లో పైచదువుల కోసం ప్రయత్నించవచ్చు. వీటితోపాటు అనేక ఇతర ప్రత్యామ్నాయ మార్గాలను తెలుసుకుందాం...

ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, ఇతర ప్రొఫెషనల్ కాలేజీల్లో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ సాధారణంగా ఉంటాయి. కారణాలు ఏవైనా విద్యార్థుల నిష్పత్తితో పరిశీలిస్తే ఆఫర్లు మాత్రం అంత సంఖ్యలో ఉండవు. దీంతో చాలా మంది విద్యార్థులకు నిరాశే మిగులుతుంది. అయితే క్యాంపస్ ప్లేస్‌మెంట్ అనేది విద్యార్థి జీవితంలో ఒక దశ మాత్రమే. తరవాత కూడా విద్య, ఉద్యోగపరంగా చాలా అవకాశాలు ఉంటాయి.

ఉన్నత విద్య వైపు

- క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో ఎంపికవ్వని అభ్యర్థులకు ఉన్న చక్కని అవకాశం ఉన్నత విద్య. బీటెక్ విద్యార్థులు తమ సంబంధిత బ్రాంచ్‌లలో ఎంఈ / ఎంటెక్ చేయవచ్చు. తద్వారా విషయ పరిజ్ఞానం పెరుగుతుంది. అంతేకాకుండా ఉద్యోగావకాశాలు మెరుగవుతాయి. ఈ క్రమంలో బీటెక్ విద్యార్థులు గేట్ (గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్) పరీక్షలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తే.. ఐఐటీ, ఐఐఎస్సీ, నిట్ వంటి సంస్థల నుంచి ఇంజనీరింగ్‌లో పీజీ చేయవచ్చు. అంతేకాకుండా ప్రభుత్వ రంగ సంస్థలు (పీఎస్‌యూ) గ్రాడ్యుయేట్ ఇంజనీర్స్, ట్రైనీ ఇంజనీర్స్ కొలువుల భర్తీ కోసం గేట్ స్కోర్‌ను ప్రామాణికంగా తీసుకుంటున్నాయి. ఆకర్షణీయమైన జీతం, ప్రైవేట్ రంగంతో పోల్చితే సుస్థిరమైన కెరీర్‌కు హామీనిచ్చే పీఎస్‌యూలో కెరీర్ ప్రారంభించేందుకు కూడా గేట్ స్కోర్ ఉపయోగపడుతుంది. కాబట్టి బీటెక్ విద్యార్థులు ఆ దిశగా దృష్టి సారించాలి. తెలుగు రాష్ట్రాల్లో పీజీఈసెట్ నిర్వహిస్తారు. దీని ద్వారా ఇంజనీరింగ్‌లో పీజీ చేసే అవకాశం లభిస్తుంది.
- ఇటీవలి కాలంలో ఇంజనీరింగ్ తరవాత మేనేజ్‌మెంట్ కోర్సులను చదివే ధోరణి పెరుగుతోంది. ప్రస్తుతం అన్ని కంపెనీల్లో ఉన్నత స్థానంలో స్థిరపడిన వారు ఇంజనీరింగ్ + మేనేజ్‌మెంట్ నేపథ్యం నుంచి వచ్చిన వారే. కాబట్టి ఇంజనీరింగ్ తరవాత మేనేజ్‌మెంట్ కోర్సులను ఎంపిక చేసుకోవడం ప్రయోజనకరంగా ఉంటుంది. క్యాట్, మ్యాట్, ఎక్స్‌ఏటీ, సీమ్యాట్ వంటి ప్రవేశ పరీక్షల ద్వారా ఐఐఎం, ఐఐటీ, జేవియర్స్ ఇన్‌స్టిట్యూట్ వంటి ప్రఖ్యాత ఇన్‌స్టిట్యూట్‌ల నుంచి మేనేజ్‌మెంట్ కోర్సులను పూర్తి చేయవచ్చు.
- మేనేజ్‌మెంట్ విద్యార్థులు తమ నైపుణ్యాలను మరింత పెంచుకునేందుకు ఉపయోగపడే సర్టిఫికెట్ కోర్సులు, స్వల్పకాలిక కోర్సులను చేయవచ్చు. ఈ కోర్సుల ద్వారా స్టాక్ బ్రోకర్స్ నుంచి స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో ట్రేడింగ్ విభాగాలు, రీసెర్చ్ ఆపరేషన్స్, ఐపీఓ విభాగాల్లో పలు అవకాశాలు లభిస్తాయి. ఇటువంటి కోర్సులను నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్, బాంబే స్టాక్ ఎక్స్ఛేంచ్ వంటి సంస్థలు అందిస్తున్నాయి. ఆసక్తి ఉంటే సంబంధిత అంశంలో పరిశోధన కోర్సులను ఎంచుకోవచ్చు.
- ఫార్మసీ విద్యార్థులు జీప్యాట్ (గ్రాడ్యుయేట్ ఫార్మసీ ఆప్టిట్యూడ్ టెస్ట్) రాయొచ్చు. జీప్యాట్ లో మెరుగైన ర్యాంక్ సాధించడం ద్వారా దేశంలోని అన్ని ప్రముఖ యూనివర్సిటీలు, కాలేజీల్లో ఎం.ఫార్మసీ (మాస్టర్ ఆఫ్ ఫార్మసీ) కోర్సుల్లో ప్రవేశం పొందొచ్చు. జీప్యాట్ స్కోర్‌ను కొన్ని ఎంఎన్‌సిలు నియామకాల్లో ప్రాతిపదికగా తీసుకుంటున్నాయి. జీప్యాట్‌లో అర్హత సాధించి నిర్దేశించిన ఇన్‌స్టిట్యూట్‌లలో ఎం.ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశం పొందిన విద్యార్థులకు రెండేళ్లపాటు నెలకు రూ.12400 స్కాలర్‌షిప్ లభిస్తుంది కూడా. ఐఐటీలు, ఐఐఎస్సీ వంటి కొన్ని సంస్థలు ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సులను ఆఫర్ చేస్తున్నాయి. వాటిని ఎంచుకోవడం ద్వారా పీజీతోపాటు పీహెచ్‌డీ చేసే అవకాశం ఉంటుంది.

విదేశీ భాషలు

విదేశీ భాషల్లో నైపుణ్యాలు ఉన్నవారికి ప్రపంచ వ్యాప్తంగా ఉపాధి అవకాశాలుంటాయి. ప్రపంచీకరణ నేపథ్యంలో వివిధ రంగాల్లో శరవేగంగా చోటుచేసుకుంటున్న మార్పుల కారణంగా ఫారెన్ లాంగ్వేజ్‌లు తెలిసిన వారికి మంచి అవకాశాలు లభిస్తున్నాయి. ముఖ్యంగా నాన్ - ఇంగ్లీష్ స్పీకింగ్ దేశాల భాష తెలిసిన వారికి మంచి అవకాశాలు ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో.. ఫ్రెంచ్, జర్మన్, రష్యన్, చైనీస్ భాషలు తెలిసిన వారికి డిమాండ్ ఉంది. ఉస్మానియా, ఇఫ్లూ, జేఎన్‌యూ వంటి యూనివర్సిటీలు ఆఫర్ చేస్తున్న ఫారెన్ లాంగ్వేజ్ కోర్సులను అధ్యయనం చేయడం ద్వారా ట్రాన్స్‌లేటర్స్, ఇంటర్‌ప్రిటేటర్, టీచింగ్, ఫ్రీలాన్సింగ్ విభాగాల్లో ఉద్యోగులుగా స్థిరపడొచ్చు.

విదేశీ విద్య

బీటెక్ పూర్తిచేసిన విద్యార్థుల్లో ఎక్కువ మంది లక్ష్యం విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసించడమే. విదేశాల్లో చదవాలంటే జీఆర్‌ఈ, టోఫెల్ వంటి పరీక్షలు రాసి అందులో మంచి స్కోర్ సాధించాలి. తర్వాత ఆసక్తి ఉన్న స్పెషలైజేషన్‌ను ఎంపిక చేసుకుని చేరాలనుకుంటున్న యూనివర్సిటీకి ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాలి. ఈ క్రమంలో ముందుగానే పాస్‌పోర్ట్‌ను సిద్ధం చేసి ఉంచుకోవాలి. సంబంధిత యూనివర్సిటీలో ప్రవేశం ఖరారయ్యాక వీసాకు దరఖాస్తు చేసుకోవాలి. విదేశాల్లో మేనేజ్‌మెంట్ కోర్సులు అభ్యసించాలంటే గ్రాడ్యుయేట్ మేనేజ్‌మెంట్ అడ్మిషన్ టెస్ట్ (జీమ్యాట్) లాంటి పరీక్షల్లో మంచి స్కోరు సాధించాలి. ఇందుకోసం సంబంధిత వెబ్‌సైట్లతోపాటు కెరీర్ ఓరియెంటెడ్ వెబ్ పోర్టళ్ల నుంచి సమాచారం సేకరించాలి.

ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్.. స్టార్టప్స్

స్టార్టప్.. యూత్ సర్కిల్స్‌లో లేటెస్ట్ బజ్. ఎడ్యుకేషన్, ట్రావెలింగ్, బిజినెస్ ఇలా అన్ని రంగాల్లో స్టార్టప్ ప్రాజెక్టులు విస్తరిస్తున్నాయి. ఒక ఐడియా జీవితాన్నే మార్చేస్తుందనేది స్టార్టప్స్ విషయంలో నిజమవుతుంది. ఉద్యోగం కంటే సొంతంగా స్వయం ఉపాధిని పొందాలనుకునే వారికి స్టార్టప్స్ బాగా సరిపోతాయి. ఆలోచనలు నచ్చితే వ్యాపారాభివృద్ధికి అవసరమైన ఫండింగ్ సౌకర్యాన్ని చాలా సంస్థలు కల్పిస్తున్నాయి. అంతేకాకుండా ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలోని చాలా సంస్థలు స్టార్టప్ ఏర్పాటుకు సహాయ సహకారాలు, విజయవంతం కావడానికి సూచనలు, సలహాలు అందించడంతోపాటు స్టార్టప్స్‌పై వర్క్‌షాప్స్ వంటి వాటిని నిర్వహిస్తుంటాయి. వీటిని కూడా ఉపయోగించుకోవడం ద్వారా విద్యార్థులు స్టార్టప్స్‌ను ప్రారంభించవచ్చు. కొన్ని విద్యా సంస్థలు కూడా స్టార్టప్స్ దిశగా ఆసక్తి ఉన్న వారిని ప్రోత్సహిస్తున్నాయి.

ఇంటర్న్‌షిప్స్

ప్రస్తుతం ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్ వంటి ప్రొఫెషనల్ కోర్సుల్లో ఇంటర్న్‌షిప్ తప్పనిసరిగా మారింది. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా జాబ్ రెడీ స్కిల్స్, రియల్ టైం ఎక్స్‌పీరియన్స్‌ను అందించేవి ఇంటర్న్‌షిప్స్. చాలా వరకు కంపెనీలు సమ్మర్‌లో ఇంటర్న్‌షిప్స్‌ను ఆఫర్ చేస్తుంటాయి. వీటిని ఉపయోగించుకోవాలి. కంపెనీకి అవసరమైన ప్రతిభ ఉందంటే ఉద్యోగావకాశం కూడా కంపెనీలు కల్పిస్తాయి.

మరో మార్గం.. హిడెన్ జాబ్స్

- **నెట్‌వర్కింగ్:** చాలా కంపెనీల్లో ఏదైనా వేకెన్సీ ఉంటే దాన్ని నోటిఫికేషన్‌ను జారీ రూపంలో కాకుండా ప్రత్యామ్నాయ విధానాల్లో భర్తీ చేస్తారు. ఇటువంటి జాబ్స్‌ను హిడెన్ జాబ్స్ / అన్‌లిస్టెడ్ జాబ్స్‌గా పేర్కొంటారు. ఒక అంచనా మేరకు దాదాపుగా 60 నుంచి 80 శాతం ఉద్యోగాలు ఎటువంటి అడ్వర్‌టైజ్‌మెంట్స్ లేకుండానే ఈ విధానంలో భర్తీ అవుతున్నాయి. ఇలాంటి హిడెన్ జాబ్స్‌ను తెలుసుకోవడానికి ఉపయోగపడే కీలకమైన సాధనం నెట్‌వర్కింగ్. అంటే పరిచయాలను పెంచుకోవడం, వాటిని ప్రభావవంతంగా వినియోగించుకోవడం. మన ప్రొఫైల్‌ను అనుసరించి సంబంధిత రంగంలోని ప్రొఫెషనల్స్‌తో పరిచయాలు పెంచుకోవాలి. తద్వారా వారి దృష్టిలో ఏదైనా అవకాశం ఉంటే మీ పేరే స్ఫురణకు వస్తుంది.



- **నేరుగా రెజ్యూమె:** కొన్ని కంపెనీలు అభ్యర్థులు నేరుగా రెజ్యూమెను పంపించడాన్ని ప్రోత్సహిస్తాయి. కాబట్టి ముందుగా మీ ప్రొఫైల్‌కు సరిపడే కంపెనీలను లిస్ట్‌వుట్ చేసుకోవాలి. తరవాత ఆయా కంపెనీల రిక్రూట్‌మెంట్ మేనేజర్ల సమాచారాన్ని వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవాలి. ఇప్పుడు వారిని ఉద్దేశిస్తూ నేరుగా కవర్ లెటర్‌తో కూడిన రెజ్యూమెను ఫార్వర్డ్ చేయాలి. అయితే ఇటువంటి కంపెనీలు ఎటిఎస్ (అప్లికెంట్ ట్రాకింగ్ సిస్టమ్స్) ద్వారా రెజ్యూమెలను షార్ట్‌లిస్ట్ చేస్తుంటాయి. కాబట్టి రెజ్యూమెలోని పదాలు, అర్హతలు, నైపుణ్యాలు వంటివి ఎటిఎస్ విధానానికి అనుగుణంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి.
- **జాబ్ లిస్టింగ్ వెబ్‌సైట్స్:** జాబ్ లిస్టింగ్ వెబ్‌సైట్స్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవడం మరో మార్గం. కొన్ని కంపెనీలు రిక్రూట్‌మెంట్ విషయంలో ఇటువంటి వెబ్‌సైట్స్ సహాయం తీసుకుంటూ ఉంటాయి. కాబట్టి ఏదైనా ఒక జాబ్ లిస్టింగ్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవడం ప్రయోజనకరం. రిక్రూటర్లు జాబ్ లిస్టింగ్ వెబ్‌సైట్‌లోని డేటా బేస్ ఆధారంగా జాబ్ సీకర్స్‌కు నేరుగా కాల్ చేస్తుంటారు. కాబట్టి అర్హతలు, అనుభవం, నైపుణ్యాలు, వంటి అంశాల ఆధారంగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. కొన్ని కంపెనీలు సోషల్ మీడియా ద్వారా అప్లికేషన్స్ పరిశీలించి అభ్యర్థులకు నేరుగా కాల్ చేస్తుంటాయి.
- **జాబ్ ఫెయిర్స్, జాబ్ అలర్ట్స్:** వివిధ కంపెనీలు నిర్దేశిత సమయాల్లో జాబ్ ఫెయిర్స్ నిర్వహిస్తుంటాయి. వాటి ద్వారా కూడా హిడెన్ జాబ్స్‌ను దక్కించుకోవచ్చు. ఆన్‌లైన్ జాబ్ లిస్టింగ్ వెబ్‌సైట్స్ లేదా సంబంధిత సేవలను ఆఫర్ చేస్తున్న సర్వీస్ ప్రొవైడర్స్ దగ్గర రిజిస్ట్రేషన్ చేసుకుంటే మన ప్రొఫైల్‌కు సరిపడ జాబ్ అలర్ట్స్ వస్తుంటాయి. వాటి ద్వారా కూడా అవకాశాలను మెరుగుపరుచుకోవచ్చు.

ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యమైతే



యూపీఎస్సీ, ఎస్ఎస్‌సీ, ఆర్ఆర్‌బీ, రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్లు వివిధ ఉద్యోగాలకు సంబంధించి ఎప్పటికప్పుడు నోటిఫికేషన్లు విడుదల చేస్తుంటాయి. సివిల్స్, గ్రూప్స్, ఐఎఫ్ఎస్, వంటి పోస్టుల భర్తీ కోసం తరచుగా ప్రకటనలు వెలువడుతుంటాయి. ప్రస్తుత పోటీ వాతావరణంలో ఈ పరీక్షల్లో ప్రతిభ కనబరచాలంటే నోటిఫికేషనతో నిమిత్తం లేకుండా ముందుగానే ప్రిపరేషన్ ప్రారంభించాలి. గత ప్రశ్నపత్రాలను పరిశీలించాలి. ఇంటర్నెట్, పత్రికలు వంటి మాధ్యమాల ద్వారా సంబంధిత పరీక్షల సమాచారాన్ని తెలుసుకోవాలి. అవసరమైతే కోచింగ్ కూడా తీసుకోవచ్చు.

- ప్రైవేటు రంగంలో ఉద్యోగమే లక్ష్యంగా పెట్టుకున్న వాళ్లు అనుభవానికే ప్రాధాన్యమివ్వాలి. ఫలానా ఉద్యోగమే' కావాలని వేచిచూసి.. సమయం వృథా చేసుకోకుండా.. అందివచ్చిన అవకాశాల్ని వినియోగించుకోవాలి. అనుభవం సంపాదించాలి. తద్వారా ఆ రంగంలో ఉన్నత అవకాశాలను చేజిక్కించుకోవాలి. ఈ క్రమంలో ఉద్యోగం చేస్తూనే సంబంధిత రంగంలో ఉన్నత విద్య అవకాశాలను అన్వేషించాలి. ఇంజనీరింగ్ పట్టభద్రులకు.. చక్కటి అవకాశం ఇంజనీరింగ్ సర్వీసెస్ ఎగ్జామినేషన్. యూపీఎస్సీ నిర్వహించే ఈ పరీక్షలో విజయం సాధిస్తే.. ప్రభుత్వ రంగంలో గ్రూప్-ఎ, బీ ఆఫీసర్లుగా కెరీర్ ప్రారంభించే అద్భుత అవకాశం సొంతమవుతుంది.

'హోదా' కోసం పోరాడుతున్న భారత్

అభివృద్ధి చెందుతున్న దేశ హోదా కోసం పోరాడుతున్న భారత్



ప్రపంచ వాణిజ్య సంస్థలో భారత్‌కు ప్రత్యేక, భేదాత్మక వ్యవహార (ఎస్‌డిటి - స్పెషల్ అండ్ డిఫరెన్షియల్ ట్రీట్‌మెంట్) హోదా ఉంటుందా లేదా అన్న విషయం సందిగ్ధంలో ఉంది. ఈ అంశాన్ని బలపరచడం కోసం పేద దేశాలు చర్చాగోష్టి జరుపుతున్నాయి. దోహా డిక్లరేషన్‌లో సభ్య దేశాలన్నీ ఎస్‌టిడి & డబ్ల్యుటిఓ ఒప్పందంలోని భాగమే. ఇప్పుడు దీన్ని సంస్కరించడానికి పూనుకొన్నారు. యుఎస్, ఇయులు అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఎస్‌డిటి అంశాన్ని తొలగించాలని అంటున్నాయి. తక్కువ అభివృద్ధి చెందిన దేశాలు (ఎల్‌డిసిలు) కూడా ఈ అంశంపై పోరాడుతున్నాయి. 70కి పైగా ఎల్‌డిసి దేశాలు, అభివృద్ధి చెందుతున్న దేశాలు రెండు రకాల ఎస్‌డిటిలు ఉండాలని కోరుతున్నాయి.

- జి20 గ్రూపు ఎల్‌డిసిలోకి వస్తుంది. ఆఫ్రికన్ గ్రూప్, ఎసిపి (ఆఫ్రికన్, కరేబియన్, పసిఫిక్)తో కలిపి అభివృద్ధి చెందుతున్న దేశాల పరిధిని ఎల్‌డిసి దేశాలకంటే పెంచాలనే అభిప్రాయం వ్యక్తమౌతోంది. ఈ క్లిష్ట పరిస్థితుల్లో భారత్‌కు ఎస్‌డిటి హోదా ఉంటుందా లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది. భారత్ ఈ హోదా కోసం ప్రయత్నిస్తుండగా చాలా వరకు అభివృద్ధి చెందుతున్న దేశాలు ఏమీ పట్టనట్లు ఉన్నాయి.

డబ్ల్యుటిఓ చట్టంలో ఎస్‌డిటి

ఎస్‌డిటి ప్రకారం ఈ హోదా ఉన్న దేశాలకు విధాన నిర్ణయాలు, నిబద్ధతలను పాటించడంలో సడలింపులు ఉంటాయి. ఈ అంశాలను ఉపయోగించి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో సబ్సిడీల ద్వారా రైతులకు సహాయం చేస్తున్నారు. అంతేకాకుండా ఆయా దేశాల్లోని విభిన్న ఆర్థిక పరిస్థితులు, అవసరాలను అనుసరించి ఎస్‌డిటి ద్వారా ప్రపంచ వాణిజ్య సంస్థ ఒప్పందాలను అమలు పరచాలి.

ఎస్‌డిటి ప్రొవిజన్స్

పోటీ పరీక్షల ప్రత్యేకం
అంతర్జాతీయ అంశాలు

- ★ అభివృద్ధి చెందుతున్న దేశాల నిబద్ధతను, ఒప్పందాలను దీర్ఘకాలంలో అమలు పరచడం.
- ★ ఈ దేశాలకు వ్యాపారావకాశాలు పెంచే చర్యలు చేపట్టడం.
- ★ డబ్ల్యుటిఓ సభ్యదేశాలన్నీ అభివృద్ధి చెందుతున్న దేశాల ఆసక్తులను కాపాడేలా చూడడం.
- ★ మౌలిక వసతుల కల్పన, తగాదాలు పరిష్కరించడం, సాంకేతిక ప్రమాణాలు అమలుపరచడం అనే నాలుగు ప్రొవిజన్లు ఎస్‌డిటి కింద ఉన్నాయి.

ప్రపంచ మానవహక్కుల దినోత్సవం



'సమానత్వం, న్యాయం, మానవ గౌరవం కోసం నిలబడడం' అనే ఇతివృత్తంతో గత డిసెంబరు 10న ప్రపంచ మానవహక్కుల దినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా నిర్వహించారు.

- ★ మానవ హక్కుల విశ్వవ్యాప్త ప్రకటన విడుదలై 70 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఏడాది క్యాంపెయిన్‌తో ఈ మానవహక్కుల దినోత్సవాన్ని ప్రారంభించారు. 1948 డిసెంబరు 10న యుఎన్ సాధారణ సభ, మానవ హక్కుల విశ్వవ్యాప్త ప్రకటన చేసింది. ఇందులో మానవ హక్కులను వివరిస్తూ ఒక ప్రవేశిక, 30 అధికరణలు ఉన్నాయి. మానవ హక్కుల అంతర్జాతీయ బిల్లు తయారుచేయడానికి ఈ డిక్లరేషనే ప్రాథమికంగా దోహదం చేసింది. ఈ బిల్లు 1976 నుంచి అమల్లోకి వచ్చింది. 500కు పైగా భాషల్లోకి యుడిహెచ్ఆర్ అనువాదమయింది. ఎక్కువ భాషల్లోకి అనువాదమైన పత్రం కూడా ఇదే.


ప్రవేశిక, అధికరణలు

ఈ ప్రకటన ముసాయిదాకు కారణమైన చారిత్రక, సామాజిక కారణాలను ప్రవేశికలో పొందుపరిచారు. 1 - 2 అధికరణలు గౌరవం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం గురించి పేర్కొంటాయి. 3 - 5 అధికరణలు జీవించే హక్కు, బానిసత్వ విముక్తి వంటి వ్యక్తిగత హక్కుల గురించి తెలుపుతాయి. 6 - 11 అధికరణలు మానవ హక్కుల ఉల్లంఘన జరిగినపుడు న్యాయబద్ధమైన పరిష్కారాన్ని వివరిస్తాయి. 12- 17 అధికరణలు సంచార హక్కుల గురించి, 18 నుంచి 21 అధికరణలు దైవ, ప్రజా, రాజకీయ స్వేచ్ఛ, మత హక్కు, ఆలోచించే హక్కు, శాంతియుతంగా సమావేశమయ్యే హక్కు గురించి పేర్కొంటాయి.

- ★ 22 - 27 అధికరణలు వ్యక్తిగత ఆరోగ్యంతోపాటు ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక హక్కులను వివరిస్తాయి. 25వ అధికరణలో ఆహారం, బట్టలు, ఇల్లు, ఆరోగ్య సేవలు, ఇతర అత్యవసర సామాజిక సేవలతో కలుపుకొని వ్యక్తి / కుటుంబం నాణ్యమైన జీవితం గడపడం వారి హక్కని పేర్కొంటూ ఏదైనా అంగవైకల్యం ఉంటే భద్రత కల్పించడం, మాతా శిశు సంక్షేమానికి సూచనలను వివరించారు. 28 - 30 అధికరణలు హక్కుల వినియోగ తీరును వెల్లడిస్తాయి.

డిక్లరేషన్‌లో పొందుపరచిన హక్కులు

సమానత్వపు హక్కు, వివక్ష నుంచి స్వేచ్ఛ, జీవించే హక్కు, వ్యక్తిగత భద్రత, బానిసత్వం నుంచి విముక్తి, హింస నుంచి విముక్తి, చట్టం ముందు వ్యక్తిగా గుర్తింపునిచ్చే హక్కు, చట్టం ముందు సమానత్వపు హక్కు, సంబంధ ట్రిబ్యునల్ ద్వారా పరిష్కారం పొందే హక్కు, నేరం రుజువయ్యే వరకు నిర్దోషిగా పరిగణించే హక్కు, కుటుంబ, ఇంటి, వ్యాపార, గోప్యత విషయంలో ఇతరుల జోక్యం లేకుండా ఉండే హక్కు, దేశంలో, దేశం బయట స్వేచ్ఛగా సంచరించే హక్కు మొదలైనవి.


డాక్టర్ పి.వి. లక్ష్మయ్య
(డాక్టర్ లక్ష్మయ్య ఐఎఎస్ స్టడీ సర్కిల్)

జాబ్ కార్నర్

మిధాని

మిశ్రధాతు నిగమ్ లిమిటెడ్ (మిధాని)- ట్రేడ్ అప్రెంటీస్‌ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం ఖాళీలు: **40**
- ట్రేడ్స్‌వారీ ఖాళీలు: ఫిట్టర్ 15, ఎలక్ట్రీషియన్ 10, మెషినిస్ట్ 5, టర్నర్ 5, వెల్డర్ 5
- అర్హత: పదోతరగతి లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణతతోపాటు సంబంధిత ట్రేడ్‌లో ఐటిఐ పూర్తిచేసి ఉండాలి.
- వయసు: దరఖాస్తు నాటికి 15 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి
- ట్రైనింగ్ వ్యవధి: ఏడాది
- ఎంపిక: అకడమిక్ మెరిట్ ఆధారంగా
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: మార్చి 10
- వెబ్‌సైట్: www.ncvtmis.gov.in

వరంగల్ కేంద్రీయ విద్యాలయ

వరంగల్‌లోని కేంద్రీయ విద్యాలయ - కాంట్రాక్ట్ టీచర్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూ నిర్వహిస్తోంది.

- కాంట్రాక్ట్ వ్యవధి: ఏడాది
- ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ / స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా
- రాత పరీక్ష: మార్చి 14న
- ఇంటర్వ్యూకి అర్హులైన అభ్యర్థుల జాబితా విడుదల: మార్చి 16న
- దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: మార్చి 5 నుంచి
- దరఖాస్తుకు ఆఖరు తేదీ: మార్చి 8
- వెబ్‌సైట్: www.kvwarangal.org

గుల్బర్గా యూనివర్సిటీ

కర్ణాటకలోని గుల్బర్గా యూనివర్సిటీ - అసోసియేట్ ప్రొఫెసర్స్, అసిస్టెంట్ ప్రొఫెసర్స్, ప్రొఫెసర్స్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం ఖాళీలు: **131**
- పోస్టులవారీ ఖాళీలు: అసోసియేట్ ప్రొఫెసర్స్ 39, అసిస్టెంట్ ప్రొఫెసర్స్ 69, ప్రొఫెసర్స్ 23
- విభాగాలు: ఇంగ్లీష్, హిందీ, కన్నడ, సంస్కృతం, ఉర్దూ & పర్షియన్, మరాఠీ, కామర్స్, ఎడ్యుకేషన్, ఫిజికల్ ఎడ్యుకేషన్, లా, బయో కెమిస్ట్రీ, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, మేథమెటిక్స్, మైక్రో బయాలజీ, ఫిజిక్స్, స్టాటిస్టిక్స్, జువాలజీ, ఎకనామిక్స్, హిస్టరీ, సోషియాలజీ, సోషల్ వర్క్, విమెన్స్ స్టడీస్, జర్నలిజం & మాస్ కమ్యూనికేషన్, అప్లయిడ్ ఎలక్ట్రానిక్స్, బోటనీ, ఇన్‌స్ట్రుమెంటేషన్ టెక్నాలజీ, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్, పొలిటికల్ సైన్స్, మెటీరియల్ సైన్స్, సైకాలజీ, విమెన్ స్టడీస్.
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఏప్రిల్ 10
- వెబ్‌సైట్: www.gug.ac.in

అసిస్టెంట్ ప్రొఫెసర్లు

సికింద్రాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ది ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ ఇంటలెక్చ్యువల్ డిజెబిలిటీస్ (ఎన్ఐఈపీఐడీ)- గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది

- పోస్టులు: అసిస్టెంట్ ప్రొఫెసర్, లెక్చరర్, ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్, ఎర్లీ ఇంటర్వెన్షనిస్ట్, ఈసీఎస్ఈ టీచర్, రిహాబిలిటేషన్ థెరపిస్ట్, ఫార్మసిస్ట్, స్పెషల్ ఎడ్యుకేటర్, టీచర్స్ (డ్యాన్స్ / యోగా / మ్యూజిక్ / ఫిజికల్ ఎడ్యుకేషన్ / స్పోర్ట్స్)/ జిమ్ ట్రైనర్ / అసిస్టెంట్ లైబ్రేరియన్/ డేటా బేస్ - నెట్ వర్క్ అడ్మినిస్ట్రేటర్ / సెక్షన్ ఆఫీసర్/ డేటా ఎంట్రీ ఆపరేటర్, హెడ్ మాస్టర్, జనరల్ టీచర్.
- అర్హత: పోస్టును అనుసరించి పీహెచ్‌డీ, పీజీ, డీఎం, డీఎన్‌బీ, ఎండి, ఎంఎస్, డీసీహెచ్, డీపీఎం, ఎంపీటీ , పీజీడీఈఐ, డీఈసీఎస్ఈ, డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
- ఇంటర్వ్యూలు: మార్చి 5 నుంచి 20 వరకు
- ఇంటర్వ్యూ కేంద్రాలు: నోయిడా, నవీ ముంబై, కోల్‌కతా, సికింద్రాబాద్
- వెబ్‌సైట్: www.niepid.nic.in

అంగన్వాడీ టీచర్లు

కరీంనగర్ మహిళాభివృద్ధి & శిశు సంక్షేమ శాఖ - అంగన్వాడీ టీచర్ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది

- పోస్టులు: అంగన్వాడీ టీచర్, మినీ అంగన్వాడీ టీచర్, అంగన్వాడీ హెల్పర్
- అర్హత: పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి.
- వయసు: 21 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: మార్చి 3
- వెబ్‌సైట్: http://wdcw.tg.nic.in





మేగజైన్ కవర్‌పేజ్ కోసం పోజులు
ఎంజాయ్ చేసిన శ్రీదేవి

శ్రీదేవి చెల్లెలుగా అనుపమ్ ఖేర్..!

అది 90వ దశకం..! బాలీవుడ్‌ను శ్రీదేవి ఏలుతున్న రోజులవి! ఏప్రిల్ 1 సంచిక కోసం సినీ బ్లిట్జ్ మేగజైన్ తమ కవర్ పేజ్‌పై ఓ అందాలబొమ్మ ఫొటోను ముద్రించింది. ఆమె శ్రీదేవి చెల్లెలు ప్రభాదేవి అని పేర్కొంది. దీంతో బాలీవుడ్ అంతా షాక్..! కళ్లు, చూపులు, ముక్కు, పెదాలు, హెయిర్‌స్టైల్ ఇలా ఆ ఫొటో అచ్చంగా అతిలోక సుందరిని పోలి ఉంది. ఓరోజు షూటింగ్ ముగించుకుని ఇంటికి వచ్చిన శ్రీదేవికి ఆ మేగజైన్ చూపించి.. 'చూడు ఎలాంటి వార్తలు ప్రచారం చేస్తున్నారో..! నేను కాకుండా నీకు ఇంకో చెల్లెలు ఉందని ఎలా ఫొటో వేశారో చూడు' అని ఆమె సోదరి కస్సుమంది. కానీ ఆ ఫొటోను చూడగానే శ్రీదేవి నవ్వు ఆపుకోలేకపోయింది. ఈ ఫొటోలో ఉన్నది విలక్షణ నటుడు అనుపమ్ ఖేర్ అని ఆమె గుర్తు పట్టింది. ఎందుకంటే అంతకు ముందే 'శ్రీదేవి గారు..మీకు త్వరలో ఓ సర్‌ప్రైజ్ ఇస్తాను' అని అనుపమ్ ఖేర్ అనడం ఆమెకు జ్ఞాపకం వచ్చింది. ఏప్రిల్ ఫస్ట్ సంచిక కోసం అనుపమ్‌ఖేర్‌కు మేకప్ చేసి..శ్రీదేవి చెల్లెలు అంటూ అందరినీ ఏప్రిల్ ఫూల్ చేయాలనుకున్నారు మేగజైన్ నిర్వాహకులు! కవర్‌పేజ్ కోసం ప్రముఖ మేకప్‌మ్యాన్ మిక్కీ కాంట్రాక్టర్, ప్రముఖ బాలీవుడ్ లెన్స్‌మ్యాన్ గౌతమ్ రాజాధ్యక్షలను రప్పించారు. తర్వాత తమ కవర్‌పేజ్‌పై శ్రీదేవి ఇంటర్వ్యూ కూడా తీసుకున్నారు. ఈ అల్లరి పనిని శ్రీదేవి ఎంతో ఎంజాయ్ చేసింది. 'అనుపమ్ జీ..మీరు అచ్చం నాలాగే కనిపించారు. క్రెడిట్ అంతా గౌతమ్, మిక్కీలదే' అంటూ అభినందించింది. అలా మ్యాగజైన్ కవర్‌పేజ్ కోసం అనుపమ్‌ఖేర్ శ్రీదేవి చెల్లెలులా మారిపోయారు. శ్రీదేవి జీవితంలో ఇదో మధుర జ్ఞాపకంగా మిగిలిపోయింది. **- సెంట్రల్ డెస్క్**



శ్రీదేవి, ఆమె ఎంతో ప్రేమించే చిన్ననాటి స్నేహితురాలు పింకీ రెడ్డి (ఫైల్)

జ్వరంతోనే శ్రీదేవి దుబాయ్ వెళ్లింది

- **అలసటగా ఉన్నా వెళ్లక తప్పదంది**
- **ఆ రోజు ఆమెతో మాట్లాడాను**
- **అభాండాలు వేయడం దారుణం**
- **శ్రీదేవి బాల్య స్నేహితురాలు పింకీ రెడ్డి**



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28: 'దుబాయ్ వెళ్లే రోజు శ్రీదేవి తీవ్రమైన జ్వరంతో బాధపడుతోంది. ఆమెకు అస్సలు బాగోలేదు. యాంటీబయాటిక్స్ వేసుకుంటోంది. చాలా అలసటగా ఉంది. కానీ మేనల్లుడి పెళ్లి వెళ్లక తప్పదని చెప్పింది' అని ఆమె చిన్ననాటి స్నేహితురాలు పింకీ రెడ్డి తెలిపారు. శ్రీదేవి, పింకీ రెడ్డి ఎనిమిదేళ్ల వయసు నుంచీ మంచి స్నేహితులు. శ్రీదేవి సూపర్‌హిట్ సినిమా చాందిని నిర్మాతల్లో పింకీ రెడ్డి తండ్రి ఒకరు. 'శ్రీదేవి దుబాయ్ వెళ్లే రోజు ఆమెతో మాట్లాడాను. అదే మేమిద్దరం చివరిసారిగా మాట్లాడుకోవడం' అని పింకీ రెడ్డి చెప్పారు. 'నటిగా శ్రీదేవి ఎదగడాన్ని దగ్గరగా చూశాను. ఆమె ఇక లేదని తెలిసి మేం కుప్పకూలిపోయాం' అని కంటతడి పెట్టారు. కుటుంబమన్నా.. స్నేహితులన్నా శ్రీదేవికి ప్రాణం. వాళ్ల తర్వాతే ఎవరైనా. ఏదైనా. గత ఏడాది నవంబరులో మా అమ్మాయి సీమంతానికి పనిగట్టుకుని వచ్చిందంటే ఊహించగలమా? అదే మేం శ్రీదేవిని చివరిసారి చూడటం' అని గుర్తు చేసుకున్నారు. శ్రీదేవి కాస్మోటిక్ సర్జరీలు చేయించుకున్నారని, అవే వికటించాయని జరిగిన ప్రచారంపై పింకీ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. 'ఆ మాటలు విని తట్టుకోలేకపోయా? లైపోసక్షన్ చేయించుకుందన్నారు. ఫ్యాట్ బర్నర్స్ వాడిందన్నారు. ఆమె మరణాన్ని జోక్‌గా మార్చేశారు. ఆమె చనిపోయిన తర్వాత అలా ఎలా మాట్లాడగలిగారో తెలియదు. ఇంత దారుణంగా మాట్లాడటమే కానీ... ఆమె చేసిన మంచి పనులు గుర్తు రావా?' అని పింకీ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. నిన్న (మంగళవారం) బోనీ కపూర్‌తో మాట్లాడాను... ఆయన గుండె పగిలిపోయి ఉన్నారని చెప్పారు. శ్రీదేవి మృతి వెనక వ్యక్తమైన అనుమానాలను పింకీ రెడ్డి కొట్టిపారేశారు. 'బోనీ-శ్రీదేవి జంట ఎంతో ప్రేమతో ఎంతో అన్యోన్యంగా ఉండేవారు. వాళ్లిద్దరి మధ్య ఎప్పుడైనా చిన్నపాటి తగువులైనా ఉన్నాయా అని అనుమానం వచ్చేది. ఈ బాధాకర సమయంలో లేనిపోనివి చిలువలుపలువలు చేసి చెప్పడం సరికాదు' అని పింకీ రెడ్డి హితవు పలికారు.

నిద్రిస్తున్న అందగత్తె

- **శ్రీదేవి పార్థివదేహాన్ని శవపేటికలోకి మార్చిన అష్రాఫ్ భావోద్వేగం**
- **వృత్తి మెకానిక్.. మృతదేహాల తరలింపులో సాయపడడం ప్రవృత్తి**
- **ఇప్పటివరకు 38 దేశాలకు చెందిన 4,700 మృతదేహాల తరలింపులో చొరవ**



దుబాయ్, ఫిబ్రవరి 28: దేవతలకు మరణం ఉండదు! శ్రీదేవీ అంతే!! ఇది అభిమానుల మాట కాదు. దుబాయ్‌లో ఆమె పార్థివ దేహాన్ని అతిదగ్గర నుంచి చూసిన అష్రాఫ్ అనే వ్యక్తి ఫీలింగ్. అష్రాఫ్ ఓ సామాజిక కార్యకర్త. ఆయన స్వస్థలం కేరళ. వృత్తి మెకానిక్ అయినా.. ప్రవృత్తి సేవాదృక్పథం! దుబాయ్‌లో మరణించిన ప్రవాసీయుల మృతదేహాలను స్వస్థలాలకు తరలించడంలో భాగంగా వారి బంధువులకు ఆయన సాయం చేస్తుంటారు. ఇప్పటివరకు 38 దేశాలకు చెందిన 4,700 మృతదేహాలను తరలించడంలో ఆయన సాయపడ్డారు. అందుకే, దుబాయ్‌లో ఆయన్ను 'ఫ్రెండ్ ఆఫ్ డెడ్'గా పిలుచుకుంటారు. దుబాయ్ నుంచి భారత్‌కు తరలించడంలో భాగంగా.. శ్రీదేవి పార్థివ దేహాన్ని మార్చురీలో నుంచి శవపేటికలోకి మార్చింది అష్రాఫే! ఆ సమయంలో శ్రీదేవిని చూసిన తనకు, ఆమె చనిపోయిందనే భావన అసలు కలగలేదన్నారు. 'గొప్ప అందగత్తె ప్రశాంతంగా నిద్రపోతుందన్నట్టుగానే అనిపించింది' అని అష్రాఫ్ చెప్పారు. నిస్సహాయుల పట్ల అష్రాఫ్ సేవా నిరతిపై 'ఆంధ్రజ్యోతి' ఇదివరకే ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. ఆయనతో ప్రత్యేకంగా మాట్లాడి అభినందించింది. నిన్న మొన్నటి వరకు పెద్దగా ఎవరికీ తెలియని అష్రఫ్ పేరు శ్రీదేవి మృతదేహాన్ని తరలించేందుకు సహకరించడం వల్ల దేశవ్యాప్తంగా మార్మోగుతోంది. అష్రాఫ్ చేస్తున్న సేవలకు ఇప్పటివరకు ఎన్నో పురస్కారాలు, బహుమతులు కూడా వచ్చాయి.




కంచి కామాక్షి, ఆది శంకరాచార్యులు, చంద్రశేఖరేంద్ర సరస్వతి, జయేంద్ర సరస్వతి, విజయేంద్ర సరస్వతి

శతాబ్దాల చరిత గల కంచి పీఠం

చెన్నై, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): దాదాపు 2500 ఏళ్ల క్రితం.. వైదిక సంప్రదాయ వ్యతిరేక శక్తులు, మతాచార పద్ధతుల కారణంగా ప్రాచీన వేద, ధర్మాలు తుడిచిపెట్టుకుపోయే ప్రమాదం ఏర్పడినపుడు.. వాటిని తట్టుకునేందుకు వేద, ధర్మ పరిరక్షణకు శ్రీ ఆదిశంకరాచార్యులు నడుంబిగించారు. అసాధారణమైన యోగ శక్తితో కైలాసంలో పరమేశ్వరుడిని దర్శించుకుని, ఆ హరుడు ప్రసాదించిన ఐదు స్ఫటిక లింగాలతో భారతదేశంలో ఐదు చోట్ల పీఠాలను స్థాపించారని భక్తుల విశ్వాసం. ఆ ఐదు పీఠాల్లో.. శృంగేరి, పూరి, ద్వారకా, బదరీనాథ్ పీఠాల బాధ్యతలను శిష్యులకు అప్పగించి, కంచి పీఠానికి సర్వజ్ఞ పీఠాధిపతిగా ఉన్నారు. శతాబ్దాలుగా ఆ పరంపర కొనసాగుతోంది. క్రీస్తు పూర్వం 509లో ఈ పీఠం ఆవిర్భవించినట్లు చరిత్ర చెబుతోంది. షణ్మత స్థాపనాచార్యులుగా పూజలందుకుంటున్న ఆదిశంకరులు.. కంచిపాలకుడు రాజసేన సహకారంతో కంచిని పునరుద్ధరించి కామాక్షి అమ్మవారికి, వరదరాజస్వామివారికి, శ్రీ ఏకామ్రనాథుడికి ఆలయాలు నిర్మించారు. కంచినే కేంద్రంగా చేసుకుని దక్షిణాదిన వేద పరిరక్షణ, వైదిక సంప్రదాయాల వ్యాప్తికి చర్యలు తీసుకున్నారు.

ఆలయాల పునరుద్ధరణ..

చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి హయాంలో కంచి పీఠం వేద సంరక్షణకు పలు చర్యలు చేపట్టింది. అందులో భాగంగా.. శిథిలావస్థలో ఉన్న ఎన్నో ప్రాచీన ఆలయాలకు మరమ్మతులు చేపట్టి పూజాదికార్యక్రమాలను పునరుద్ధరించారు. 1978లో శంకర జయంతి రోజున కాలడి వద్ద 'కీర్తి స్తంభ' పేరుతో ఒక స్థూపాన్ని స్థాపించారు. జయేంద్ర సరస్వతి స్వామి కూడా ఆ సంప్రదాయాల్ని కొనసాగించి దేశవ్యాప్తంగా ఎన్నో ఆలయాలను పునరుద్ధరించారు. ఢిల్లీ, సికింద్రాబాద్‌లో సుబ్రహ్మణ్య స్వామి, కోవై, సేలంలలో కామాక్షి అమ్మవార్ల కొత్త ఆలయాలను నిర్మించారు. అసోంలోని గౌహతిలో శ్రీ పూర్వ తిరుపతి బాలాజీ మందిర్‌ను నిర్మించారు. ఆ మందిరంలోని వేంకటేశ్వరుని విగ్రహాన్ని 11 అడుగుల ఎత్తుతో తిరుమలేశుడి విగ్రహ నమూనాతో ప్రతిష్ఠించారు. అలాగే గోవాలోని పోండా ప్రాంతంలో బాలాజీ ఆలయాన్ని నిర్మించి, 2000, ఏప్రిల్ 24న మహాకుంభాభిషేకం నిర్వహించారు. చెన్నైలోని కంచి కామకోటి చైల్డ్ ట్రస్టు ఆసుపత్రి సహా దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లోని కంచి కామకోటి పీఠం ఆసుపత్రులను ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించారు.



గురు పరంపరలో..

ఆది శంకరుల తరువాత సురేశ్వరాచార్యుల వారు పీఠాధిపతి అయ్యారు. వారి తరువాత ఉత్తరాధికారం సర్వజ్ఞాత్మన్ సరస్వతి స్వామి నిర్వహించారు. నాటి నుంచి కొనసాగుతున్న గురుపరంపరలో.. కృపా శంకరులు (9వ ఆచార్యులు), మూక శంకరులు (20వ ఆచార్యులు), విద్యాఘన (37వ ఆచార్యులు), అభినవ శంకరులు (38వ ఆచార్యులు), చంద్రకుల సరస్వతి (47వ ఆచార్యులు), విద్యాతీర్థ (51వ ఆచార్యులు), వ్యాసాచల మహాదేవేంద్ర సరస్వతి (54వ ఆచార్యులు), పరమశివేంద్ర సరస్వతి (57వ ఆచార్యులు) స్వామివార్లు కంచి కామకోటి పీఠం ఆశయాలను, లక్ష్యాలను బాగా ముందుకు తీసుకెళ్లినట్లు చరిత్ర చెబుతోంది. కాంచీపురం కేంద్రంగా తమిళనాట అసాధారణ రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో 62వ ఆచార్యులైన చంద్రశేఖరేంద్ర (1746-1783) కుంభకోణంలోని కావేరి తీరాన కొత్త మఠాన్ని స్థాపించారు. 63వ ఆచార్యులుగా చంద్రశేఖరేంద్ర సరస్వతి హయాంలో కంచి కామకోటి పీఠం ఎంతో అభివృద్ధిని సాధించింది. 1840లో కామాక్షి అమ్మవారి ఆలయానికి మరమ్మతులు చేపట్టి, మహాకుంభాభిషేకం నిర్వహించారు. మహాదేవేంద్ర సరస్వతి (65వ ఆచార్యులు) దక్షిణాదిన అన్ని రాష్ట్రాల్లోనూ పీఠం ఆచారవ్యవహారాల వ్యాప్తికి కృషి చేశారు. ఇక ప్రపంచ ప్రసిద్ధి చెందిన పరమాచార్యులు.. నడయాడే దేవుడుగా భక్తులు కొలిచే చంద్రశేఖరేంద్ర సరస్వతిస్వామి 1907లో కంచి కామకోటి పీఠం 68వ ఆచార్యులుగా నియమితులై 87 ఏళ్ల సుదీర్ఘ కాలంపాటు సేవలందించారు. 1954, మార్చి 22న జయేంద్ర సరస్వతి స్వామి తన 19వ ఏట కంచి కామకోటి ఉత్తరాధికారిగా నియమితులయ్యారు. ప్రారంభకాలంలోనే ఒక బాలుడికి యుక్తవయసులోనే సన్యాస దీక్ష ఇచ్చి తన వారసుడిగా ప్రకటించారు. ఆయనే.. శంకర విజయేంద్ర సరస్వతి. 1994లో చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి శివైక్యం కావడంతో జయేంద్ర సరస్వతి 69వ పీఠాధిపతిగా బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఉత్తరాధికారిగా ఉన్న విజయేంద్ర సరస్వతి మఠానికి 70వ అధిపతిగా బాధ్యతలు స్వీకరించనున్నారు.

శ్రీదేవి గొప్ప మానవతావాది

- **ఆమె ఆర్థికసాయం వల్లే బతికాం**
- **అతిలోక సుందరికి ఓ అంధుడి నివాళి**



జతిన్ వాల్మీకి

ముంబై, ఫిబ్రవరి 28: శ్రీదేవి గొప్ప నటిగానే అందరికీ తెలుసునని, కానీ.. ఆమె అంతకంటే గొప్ప మానవతావాది అని జతిన్ వాల్మీకి అనే అంధుడైన ఓ అభిమాని అన్నాడు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన జతిన్.. శ్రీదేవికి నివాళులర్పించేందుకు రెండు రోజులుగా ముంబైలోని ఆమె నివాసం ఎదుట నిరీక్షిస్తున్నాడు. బ్రెయిర్ ట్యూమర్ వచ్చిన తన సోదరుడికి ఆపరేషన్ కోసం శ్రీదేవి రూ.లక్ష ఆర్థిక సాయం చేశారని, ఆస్పత్రి యాజమాన్యంతో స్వయంగా మాట్లాడి మరో రూ.లక్ష మాఫీ చేయించారని జతిన్ తెలిపాడు. నేడు తన సోదరుడు బతికి ఉండటానికి కారణం శ్రీదేవేనని, ఆమె సాయం వల్లే తానూ జీవించి ఉన్నానని అన్నాడు. కానీ, ఆమె కోసం తాను ఏమీ చేయలేనని, కనీసం ఆమె అంతిమయాత్రలోనైనా పాల్గొని నివాళులర్పించాలని వచ్చినట్లు తెలిపాడు.



ప్రపంచంలోనే పే..ద్ద విమానం

ఆ విమానం ప్రపంచంలోనే అతి పెద్దది. ఎంత పెద్దదంటే.. 73 మీటర్ల పొడవు, 117 మీటర్ల రెక్కల వెడల్పు, 6 ఇంజన్లను కలిగి ఉంటుంది. రెండు విమానాలు ఉన్నట్లు ఉండే ఈ పెద్ద విమానం పేరు 'రోక్'. 590 టన్నుల బరువుండే ఈ విమానాన్ని మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు పాల్ అలెన్‌కు చెందిన స్ట్రాటోలాంచ్ సిస్టమ్స్ తయారుచేసింది. తాజాగా రన్‌వేపై వేగంగా వెళ్లే పరీక్షను విజయవంతంగా పూర్తి చేశారు. ప్రస్తుతం ఆ విమానం రన్‌వేపై గంటకు 74 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తోంది. **- న్యూయార్క్**

ఎన్నికల్లో ధనబలానికి చెక్!

- **సుప్రీం తాజాతీర్పుతో చిగురించిన ఆశ**

ప్రజాప్రతినిధులు అడ్డదారుల్లో సంపద పోగేసుకోవటం ద్వారా ఎన్నికల తంతును అపహాస్యం చేస్తూ రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నారని సుప్రీం ధర్మాసనం ఆక్షేపించింది. ఈ ఫిబ్రవరి 16న సుప్రీం ధర్మాసనం జారీచేసిన ఉత్తర్వులు ఎన్నికల ప్రక్రియకు కాయకల్ప చికిత్స జరిగి, ప్రజాస్వామ్యం బలపడుతుందనే విశ్వాసాన్ని కలిగిస్తున్నాయి.


లా-లోచనం
Law lochanam



ఈ ఫిబ్రవరి 16న లోక్‌సభలో 82 శాతం సంపన్న సభ్యులు కొలువుదీరడం విశేషం. ఆర్థిక నేరాలకు పాల్పడి కేసులెదుర్కొంటున్న సభ్యులూ వారిలో ఉన్నారు. ఇతరత్రా నేరారోపణలెదుర్కొంటున్న వారికి కొదవేలేదు. ప్రజాస్వామ్య భారతంలో వెర్రితలలు వేస్తూ విష సంస్కృతిని పులుముకున్న ఎన్నికల ప్రక్రియలో ధనబలానికీ, ధనప్రవాహానికీ అడ్డుకట్ట వేసేందుకు గతంలో జరిగిన ప్రయత్నాలు ఫలించలేదు సరికదా సర్కారు మార్కు రాజకీయ ప్రమేయంతో ప్రక్షాళన ప్రక్రియకు పురిటిలోనే సంధి కొట్టింది. ఓరా కమిటీ, సోమనాథ ఛటర్జీ కమిటీల నివేదికలను ఉదహరిస్తూ సుప్రీం త్రిసభ్య ధర్మాసనం అసోసియేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ కేసు (2002)లో ఓటు వేయడం ప్రజల 'మాట్లాడే హక్కు'గా తీర్మానిస్తూ అభ్యర్థి ఆర్థిక మూలాలూ, వారి గత చరిత్ర, ఇతర వివరాలు తెలుసుకోవటం ఓటరుకు తిరుగులేని హక్కుగా ప్రకటించింది. అభ్యర్థి తన ఆర్థిక వివరాలూ నేర చరిత్ర వంటి అంశాలను వెల్లడించాలనీ, తప్పుడు సమాచారం ఇచ్చిన పక్షంలో వారి అభ్యర్థిత్వాన్ని నిరాకరించాల్సి ఉంటుందనీ, ఈ దిశలో ప్రజాప్రాతినిధ్య చట్టాన్నీ ఎన్నికల నియమావళినీ సవరించి పదును పెట్టాలనీ ప్రభుత్వానికి కోర్టు చేసిన సూచనను సాక్షాత్తూ ప్రభుత్వమే అటకెక్కించింది. చట్టంలో సెక్షను 33-బి చేర్చటం ద్వారా ఈ వివరాలను వెల్లడించాల్సిన అవసరం లేకుండా చేసి, ఎన్నికల సంస్కరణలకు మోకాలడ్డింది.

ప్రజాప్రాతినిధ్య చట్టంలోని 33-ఎ సెక్షను రీత్యా నామినేషను వేసే సమయంలో అభ్యర్థి ఫారం-26లో సూచించిన అఫిడవిట్ ద్వారా తన శాశ్వత ఖాతా సంఖ్య, తనూ, తన కుటుంబసభ్యుల ఆస్తిపాస్తుల వివరాలు ఎన్నికల అధికారికి వెల్లడించాలి. అయితే ఈ వివరాల వాస్తవాలను ధృవీకరించే స్వతంత్ర యంత్రాంగం లేకపోవటాన ఈ అఫిడవిట్ కోరల్లేని పాముగా మారింది. జూన్ 2015లో కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డుకు అందిన సమాచారం ప్రకారం లోక్‌సభ, శాసనసభల సభ్యులుగా గద్దెనెక్కిన చాలా మంది సంపద, పదవీకాలంలోనే 500 రెట్లు పెరిగింది. దీంతో ఫారం-26లోని వివరాలను ప్రత్యక్ష పన్నుల బోర్డు విచారణ జరపడం తప్పనిసరి చేయాలనే ప్రతిపాదన వెలుగులోకి వచ్చినా, ఈ దిశగా ఎన్నికల నియమావళిని సరిచేసే సాహసం పాలక ప్రభుత్వం చేయలేదు. పీపుల్స్ యూనియన్ ఫర్ డెమోక్రాటిక్ రైట్స్ కేసులో (2003) ఎట్టకేలకు సుప్రీంకోర్టు సెక్షను 33-బి రాజ్యాంగ విరుద్ధమని కొట్టివేసింది.

ఈ నేపథ్యంలో ఈ ఫిబ్రవరి 16న జస్టిస్ చలమేశ్వర్, అబ్దుల్ నజీర్‌ల ధర్మాసనం లోక్‌ప్రహరీ కేసులో వెలువరించిన ఆదేశాలు చరిత్రాత్మకమైనవి. ఫారం-26తో సహా ఎన్నికల నియమావళిని సమూలంగా సవరించి ఎన్నికల అభ్యర్థులు తమ ఆదాయ మార్గాలూ, వ్యాపార వివరాలు, తమ బంధుమిత్రులూ, అనుచరగణాల సంపద, ఆస్తిపాస్తులూ కూడా వెల్లడించేలా చట్టం చేయాలనీ, అసత్య ప్రకటన చేసిన అభ్యర్థిని ఎన్నికల్లో పోటీకి అనర్హుడిగా చేయాలనీ ధర్మాసనం ఆదేశించింది. అభ్యర్థి, ఆయన గారి బంధుమిత్ర పరివారం మూటగట్టుకొన్న ప్రభుత్వ కాంట్రాక్టుల వివరాలనూ బహిరంగ పర్చాలనీ, ప్రజాప్రతినిధుల అభ్యంతరకర సంపద వివరాలను ఆరా తీసి, సమగ్ర దర్యాప్తు చేసేందుకు ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పరచాలనీ సుప్రీంకోర్టు అటు ప్రభుత్వాన్నీ, ఇటు ఎన్నికల కమిషనునూ ఆదేశించడం విశేషం. దేశీయ ప్రజాస్వామ్య రథం సజావుగా ప్రయాణించేందుకు, కళంకితుల బారి నుండి కోట్లాది ఓటర్ల హక్కును కాపు కాసేందుకూ, రాజ్యాంగ మూలస్తంభాలైన శాసన వ్యవస్థల విలువలను పెంపొందించేందుకూ సుప్రీం చూపిన చొరవ ప్రశంసనీయం.



- వేదాంతం సీతారామావధాని, భారత సుప్రీంకోర్టు మాజీ సెక్రటరీ జనరల్, సెల్ : 70421 40099



ఆరనిదమ్మా నీ జ్ఞాపకం

▸▸ శ్రీదేవిని కడసారి చూసేందుకు పోటెత్తిన అభిమానులు

▸▸ జనసంద్రమైన ముంబై రోడ్లు

ముంబై, ఫిబ్రవరి 28: 'మా అమ్మ చనిపోయినంత బాధ కలిగింది'.. అని ఓ అభిమాని కన్నీటి పర్యంతమైతే.. 'నేను ఆమెకు గొప్ప అభిమానిని.. కడసారి చూసేందుకు మధ్యప్రదేశ్ నుంచి వచ్చాను' అంటూ ఓ వ్యక్తి భావోద్వేగాన్ని ఆపుకోలేకపోయాడు! వీరే కాదు.. వేలాది మంది తమ ఆప్తులను కోల్పోయినట్టుగా రోదించారు! బుధవారం మహానగరం ముంబై జనసంద్రమే అయింది. అతిలోకసుందరి శ్రీదేవికి కడసారి వీడ్కోలు పలికేందుకు అభిమానులు పోటెత్తారు. మూడు తరాల ప్రజలను ఉర్రూతలూగించిన మహానటిని చివరిసారి చూసేందుకు వయోబేధం లేకుండా పిల్లలు, యువకులు మహిళలు, వృద్ధులు పోటెత్తారు. బరువైన హృదయాలతో తమ అభిమాన నటి పార్థివదేహాన్ని ఉంచిన వాహనాన్ని అనుసరించారు. కొందరు భవనాలపై నుంచి ఆమె అంతిమ యాత్ర ఘట్టాన్ని చిత్రీకరించారు. అంతిమయాత్ర సాగిన ఏడు కిలోమీటర్ల మేర రోడ్లన్నీ కిక్కిరిసిపోయాయి. అంత్యక్రియలకు హాజరైన థానేకు చెందిన బాపూ పవార్‌ను కదిలిస్తే.. పెద్ద పెట్టున రోదించాడు. శ్రీదేవి మరణవార్తను తొలుత తాను నమ్మలేదన్నారు. టీవీ చానళ్ల ద్వారా తెలియడంతో 'ఏడుపు ఆగలేదు' అని చెప్పాడు. దోంబివ్లికి చెందిన అమోల్ పవార్ భార్య శ్రీదేవికి వీరాభిమాని. శ్రీదేవిని ఆఖరిసారి చూడాలన్న ఆకాంక్ష వ్యక్తం చేయడంతో భార్యను తీసుకొని వచ్చానన్నాడు.



మల్లెపూల పల్లకిలో మరలిరాని లోకాలకు!



నుదుట బొట్టు.. కంచిపట్టు చీర

ముంబై, ఫిబ్రవరి 28: ఆకాశాన ఆ మణిదీపాలు.. ఈ ముత్తయిదువను తమలో చేర్చుకునేందుకు వచ్చాయా? చుక్కలన్నీ.. దిక్కులు దాటి విచ్చేసి మల్లెలుగా మారాయా? అంతిమ యాత్ర సందర్భంగా నిండు ముత్తయిదువులా అలంకరించిన శ్రీదేవిని, తెల్లనిపూలతో ఆమె అంతిమ యాత్ర రథాన్ని తీర్చిదిద్దిన తీరు చూస్తే 'అతిలోకసుందరి' కోసం దేవతలే దిగివచ్చారా? అనిపించింది. శ్రీదేవి అంతిమ వీడ్కోలులో భాగంగా లాంఛనాలన్నీ ఆమె అభిరుచికి తగ్గట్టుగానే నిర్వహించారు. అలంకరణ ప్రియురాలైన ఆమెను నిండు ముత్తయిదువలా తీర్చిదిద్దారు. నుదుటన నిండుగా ఎర్రని బొట్టు పెట్టారు.. శ్రీదేవికి కంచిపట్టు చీరలంటే ప్రాణం. ఆమె పార్థివ దేహంపై ఎరుపు, బంగారు రంగు కంచిపట్టు చీరను కప్పారు. మెడలో ఆమెకు ఎంతో ఇష్టమైన నగలను తొడిగారు. ముఖంలోంచి పసుపు రాలుతుందా అన్నట్టుగా ధగధగ వెలిగిపోతున్న ఆ నిండు ముత్తయిదువను గాజు శవపేటికలో ఉంచారు. తెరపై చూసిన తమ అభిమాన నటికి శ్రద్ధాంజలి ఘటించేందుకు వచ్చిన అభిమానుల్లో కొందరు ఉబికి వస్తున్న కన్నీళ్లను ఆపుకోలేకపోయారు. నివాళి కార్యక్రమం ముగిశాక పూలతో అలంకరించిన అంతిమయాత్ర రథంలోకి ఆమె పార్థివ దేహాన్ని చేర్చారు. ఆమెకు ఎంతో ఇష్టమైన తెల్లటి పూలతోనే రథాన్ని తీర్చిదిద్దారు. ముంబైలోని సెలబ్రేషన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో మహానటి అంతిమ సంస్కారాల ఏర్పాట్లను ఆమె సవతి కొడుకు అర్జున్ కపూర్ ముందుండి నడిపించారు. మరిది సంజయ్ కపూర్, నటి రాణి ముఖర్జీ, దర్శకుడు కరణ్ జోహార్ తదితరులు సహకరించారు.



చితికి నిప్పంటించిన కూతుళ్లు!

(మొదటి పేజీ తరువాయి)

వెళ్లిపోయింది. తన కిష్టమైన ఎర్ర రంగు కాంజీవరం పట్టుచీర కట్టుకుని.. పెళ్లి కూతురిలా వెళ్లిపోయింది. జాతీయ జెండాను హత్తుకుని సగర్వంగా భువి నుంచి దివికి ఎగిరిపోయింది. అశేష అభిమానుల అశ్రు నయనాల మధ్య అతిలోక సుందరి శ్రీదేవి అంత్యక్రియలు ముంబైలో ముగిశాయి. అందానికి అర్థంగా..అభినయానికి పర్యాయపదంగా నిలిచిన ఆమె కడపటి చూపుల కోసం.. వేలాదిమంది అభిమానులు పరితపించారు. బుధవారం లక్షల మంది టెలివిజన్ స్ర్కీన్లకు అతుక్కుపోయారు. బాలీవుడ్ తొలి మహిళా సూపర్‌స్టార్‌కు.. నటీనటులు, రాజకీయ వ్యాపార ప్రముఖులు కన్నీటి సుడులతో అల్విదా చెప్పారు. బాలీవుడ్ బాద్‌షాలు కూడా ఆమె చివరి చూపుల కోసం పరుగులు పెట్టారు. దేశం గర్వించే నటిగా గుర్తింపు పొందిన శ్రీదేవికి.. మహారాష్ట్ర ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఆమె పార్థివ దేహానికి త్రివర్ణ పతాకాన్ని కప్పారు. పోలీసులు గౌరవ వందనం సమర్పించి సెల్యూట్ చేశారు.

విలేపార్లేలోని సేవా సమాజ్ స్మశాన వాటికలో శ్రీదేవి భౌతిక కాయానికి ఆమె భర్త బోనీకపూర్ అంత్యక్రియలు నిర్వహించారు. బోనీతోబాటు కూతుళ్ల జాన్వీ, ఖుషీలు తమ తల్లి చితికి నిప్పు అంటించినట్లు తెలుస్తుంది. తన తల్లి మరణించినప్పుడు శ్రీదేవి స్వయంగా దహన సంస్కారాలు నిర్వహించారు. కపూర్ ఖాన్‌దాన్‌తోబాటు బాలీవుడ్, టాలీవుడ్, కోలీవుడ్, శాండల్‌వుడ్, మాలీవుడ్ అన్న తేడా లేకుండా తారాపథమంతా 'చాందినీ' చివరి చూపులకు కదిలి వచ్చింది. దేశంలో ఏ హీరోయిన్‌కీ ఇవ్వనంత ఆప్యాయంగా శ్రీదేవికి వీడ్కోలు పలికింది.

ఇష్టమైన ఎర్ర చీర చుట్టుకుని..

శ్రీదేవి సినీ జీవితం ఎంత గొప్పగా సాగిందో..అంతే వైభవంగా ముగించింది. ఎర్రని కాంజీవరం చీరతో ఆమె భౌతిక కాయాన్ని అలంకరించారు. మంగళవారం రాత్రి దుబాయ్ నుంచి ముంబైకి శ్రీదేవి పార్థివదేహాన్ని ప్రత్యేక విమానంలో కుటుంబ సభ్యులు తీసుకువచ్చారు. అనంతరం లోఖండ్‌వాలాలోని ఆమె నివాసంలో ఉంచారు. బుధవారం ఉదయం అభిమానుల సందర్శనార్థం సెలబ్రేషన్ స్పోర్ట్స్ క్లబ్‌కు శ్రీదేవి భౌతిక కాయాన్ని తరలించారు. ఆమె చివరి చూపుల కోసం సెలబ్రేషన్ స్పోర్ట్స్ క్లబ్ ముందు నాలుగు కిలోమీటర్ల మేర అభిమానులు క్యూ లైన్లలో నిలబడ్డారు. ఇక ఆమె అంతిమ యాత్ర ఇసకేస్తే రాలనంతగా సాగింది. తెల్లని పువ్వులతో అలంకరించిన వాహనంలో శ్రీదేవి పార్థివ దేహాన్ని ఉంచారు. ఆమె భర్త బోనీ కపూర్, సవతి కొడుకు అర్జున్ కపూర్ అభిమానులకు చేతులు జోడించి..అంతిమ యాత్రకు సహకరించాలని కోరారు. దారిపొడవునా శ్రీదేవి అభిమానులు కన్నీటిపర్యంతమవుతూ తమ కుటుంబ సభ్యురాలిని కోల్పోయినంతగా తల్లడిల్లిపోయారు



ఏకాంతంగా దుఃఖించనివ్వండి!

మా గోపత్యకు కాస్త గౌరవమివ్వండి.. మీ మద్దతును మరువలేం

మీడియాకు శ్రీదేవి కుటుంబం విజ్ఞప్తి

ముంబై, ఫిబ్రవరి 28: భారతీయ సినీలోకం మర్చిపోలేని రోజు.. ఫిబ్రవరి 24. లక్షలాది మంది అభిమానులను దిగ్భ్రాంతికి గురిచేస్తూ అతిలోకసుందరి శ్రీదేవి భూమిని విడిచిన పొద్దు అది. శనివారం అర్ధరాత్రి మీడియాలో.. అందాల తార హఠాన్మరణం అని వార్తలు. ఆ క్షణం మొదలు అంత్యక్రియలు పూర్తయ్యే వరకు శ్రీదేవి వార్తలే. ఆమె మరణానంతరం దర్యాప్తు, విచారణ, భౌతికకాయానికి పరీక్షలు, అంత్యక్రియలు ఇలా.. కుటుంబసభ్యులు వాటితోనే గడపాల్సి వచ్చింది. ఏకాంతంగా ఏడ్చి మనసును కాస్త కుదుటపర్చుకునేందుకు వాళ్లకు అవకాశమే దొరకలేదు. అందుకే, అంత్యక్రియలు పూర్తయ్యాక "మేము దుఃఖంలో ఉన్నాం. ఏకాంతంగా ఏడవడానికి అవకాశం దొరకలేదు. మా గోప్యతకు కాస్త గౌరవమిచ్చి దూరంగా ఉండండి" అని మీడియా సంస్థలను కోరారు. ఈ మేరకు కపూర్, అయ్యప్పన్, మార్వా కుటుంబసభ్యులు బుధవారం ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ప్రకటనలో.. 'శ్రీదేవి జీవితాంతం గౌరవంగా బతికారు. ఇకనుంచీ అదే గౌరవం ఇవ్వాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం. మమ్మల్ని ఏకాంతంగా దుఃఖించేందుకు అవకాశం ఇవ్వండి. గత కొన్ని రోజులుగా మేము విషమ పరీక్షను ఎదుర్కొన్నాం. మమ్మల్ని విడిచి త్వరగా వెళ్లిపోయిన శ్రీదేవి ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నాం. ఈ కష్టకాలంలో శ్రీదేవి స్నేహితులు, తోటి నటులు, వెలకట్టలేని అభిమానులు, దేశం, ప్రపంచం.. ఇలా ప్రతీ ఒక్కరు మాకు అండగా నిలిచారు. అందరికీ కృతజ్ఞతలు.' అని తెలిపారు. మీడియా మద్దతును మరువలేమని, అయితే కుటుంబ గోప్యతను దృష్టిలో ఉంచుకొని దూరంగా ఉండాలని విన్నవించారు. 'జాన్వి, ఖుషీకి కుటుంబం ఎప్పటికీ చేదోడువాదోడుగా ఉంటుంది. మనం అందరం శ్రీదేవిపై చూపిన ప్రేమను వాళ్లపైనా చూపిద్దాం. దాంతో వాళ్ల తల్లి లేని బాధ నుంచి కోలుకునే అవకాశం ఉంది. మన వంతుగా సాయం అందించి శ్రీదేవి కలలు కన్న భవిష్యత్తును వారికి అందిద్దాం.' అని పిలుపునిచ్చారు.

అమ్మా.. నేను నీ జాన్వి!

'అమ్మా.. నీదైన మహోజ్వల జీవితం, గొప్ప జీవన విధానంతో నన్ను ప్రపంచంలోనే గర్వపడే కూతురును చేశావు'... మీ మాతృమూర్తిని ఉద్దేశించి లేఖ రాయమంటే ఏమని రాస్తారు? శ్రీదేవి పెద్ద కూతురు జాన్విని కొన్నేళ్ల కిందట ఓ మీడియా సంస్థ అడిగినపుడు ఆమె రాసిన వ్యాక్యమిది! తల్లికి జాన్వి రాసిన ఆ లేఖ ఇప్పుడు ఇంటర్నెట్‌లో వైరల్‌గా మారింది. తల్లి శ్రీదేవిని ఉద్దేశించి రాసిన లేఖలో జాన్వి ఇంకా ఇలా రాసింది. "నీ వైభవోపేతమైన, అంకితభావం, నిబద్ధత, గొప్ప ధైర్యంతో కూడిన స్ఫూర్తిమంతమైన జీవనవిధానం గురించి వింటూ పెరిగానమ్మా. నీలోని ఈ గొప్ప లక్షణాలకు తదనంతర రోజుల్లో సాక్షీభూతంగా నిలిచినందుకు నాది ఎంత అదృష్టమో కదా! నిన్ను నేను అమితంగా ప్రేమిస్తానమ్మా"! శ్రీదేవికి జాన్వి రాసిన ఈ లేఖ నెటిజన్లను కన్నీరు పెట్టిస్తోంది.

పిన్నితో విభేదాల్లేవు



▸▸ అర్జున్‌కపూర్

ముంబై, ఫిబ్రవరి 28: అతిలోక సుందరి శ్రీదేవి మరణం తర్వాత ఆమె సవతి కుమారుడు అర్జున్ కపూర్ తొలిసారి స్పందించాడు. తనకు తన సవతి తల్లితో ఎటువంటి విభేదాలు లేవని, సత్సంబంధాలే ఉండేవని చెప్పాడు. తన తండ్రి జీవితంలో ఉన్న ప్రతి ఒక్కరినీ తాను గౌరవిస్తానని, అది ఆయన కోరిక అని పేర్కొన్నాడు. ఆమెకు చెడు జరగాలని ఎప్పుడూ కోరుకోలేదని స్పష్టం చేశాడు. శ్రీదేవి పట్ల వ్యతిరేక భావమేమైనా ఉందా అన్న ప్రశ్నకు.. "ఆమె మీద, నాన్నమీద నాకు భిన్న అభిప్రాయాలున్నాయి. అయితే వాటినే తలచుకుంటూ ఉండిపోవడం నాకు ఇష్టముండదు" అని అర్జున్ సమాధానమిచ్చాడు. తన సినీ జీవితం గురించి సవతి తల్లితో ఎప్పుడూ మాట్లాడలేదన్నాడు.

అమితాబ్ కన్నీటి నివాళి

శ్రీదేవి మరణాన్ని బిగ్‌బీ అమితాబ్ బచ్చన్ జీర్ణించుకోలేకపోతున్నారు. శ్రీదేవి ఈనెల 24న దుబాయ్‌లో మరణించారు. ఆరోజు రాత్రి తాను చాలా అశాంతికి గురయ్యానని అమితాబ్ ట్వీట్ చేశారు. ఆరోజు నుంచి శ్రీదేవి కోసం ఆయన వరుసగా ట్వీట్లు చేస్తూనే ఉన్నారు. శ్రీదేవి భౌతికకాయం ముంబైకి తీసుకురావడంలో జరిగిన జాప్యం కూడా ఆయన్ను కలవర పెట్టింది. 'గెట్ బ్యాక్ టు లవ్' అని సోమవారం ట్వీట్ చేశారు. శ్రీదేవి పార్థివ దేహం మంగళవారం రాత్రి ముంబై చేరిన తర్వాత 'గెట్ బ్యాక్..గెట్ బ్యాక్.. జస్ట్ బ్యాక్ టు లవ్' ట్వీట్ చేయడం..తొలి మహిళా సూపర్‌స్టార్‌పై ఆయన అభిమానానికి నిదర్శనంగా నిలిచింది.





మరువలేని స్నేహమా..! మరలిరాని నేస్తమా..!

▸▸ శ్రీదేవికి సినీ ప్రముఖుల కన్నీటి వీడ్కోలు

▸▸ చిరంజీవి, రజనీకాంత్, వెంకటేష్ నివాళులు

ముంబై, ఫిబ్రవరి 28: వెండితెర అతిలోక సుందరికి బాధాతప్త హృదయాలతో సినీ ప్రముఖులు కన్నీటి వీడ్కోలు పలికారు. అభిమానుల సందర్శనార్థం శ్రీదేవి భౌతిక కాయాన్ని బుధవారం ఉదయం ఆమె నివాసం నుంచి ముంబైలోని సెలబ్రేషన్స్ క్లబ్‌కు తరలించారు. బాలీవుడ్‌తోబాటు తెలుగు, కన్నడ, మలయాళ, తమిళ సినీ పరిశ్రమలకు చెందిన సెలబ్రిటీలు లోఖండ్‌వాలాలోని సెలబ్రేషన్స్ స్పోర్ట్స్ క్లబ్‌కు తరలివెళ్లారు. శ్రీదేవితో అనేక సినిమాల్లో నటించిన చిరంజీవి, రజనీకాంత్, వెంకటేష్, నాగార్జున, జయప్రద తదితరులు నివాళులు అర్పించారు. శ్రీదేవి భర్త బోనీ కపూర్, కూతుళ్ల జాన్వీ, ఖుషీలను ఓదార్చారు.

భావోద్వేగానికి గురైన తారలు

సెలబ్రేషన్స్ క్లబ్‌లో బుధవారం ఉదయం 9.30 గంటలకు శ్రీదేవి ఆత్మ శాంతి కోసం ప్రార్థనలు జరిగాయి. ఈ సంతాప సభకు ఐశ్వర్యరాయ్, జయా బచ్చన్, చిరంజీవి, ప్రకాష్‌రాజ్, హేమమాలిని, జయప్రదతోబాటు టబు, సోనమ్ కపూర్, దీపికా పడుకోన్, సుస్మితాసేన్, రేఖ, కాజోల్, అజయ్ దేవగన్, అక్షయ్ కుమార్, అక్షయ్ ఖన్నాలు హాజరయ్యారు. ఇంకా కరీనా కపూర్, మలైకా అరోరా, సోహా అలీఖాన్, నేహా ధూపియా, శ్రద్ధా కపూర్, జాన్ అబ్రహమ్, పత్రలేఖ, రాజ్‌కుమార్ రావ్, సిద్ధార్థ మల్హోత్రాలు అభిమాన నటికి శ్రద్ధాంజలి ఘటించారు. ఫ్యాషన్ డిజైనర్ మనీష్ మల్హోత్రా శ్రీదేవి భౌతిక కాయం దగ్గర వెక్కివెక్కి ఏడ్చారు.

రికవరీ పథంలో ఆర్థిక వ్యవస్థ

క్యూ3 వృద్ధి 7.2 శాతం.. జనవరిలో ఇన్‌ఫ్రా వృద్ధి 6.7 శాతం




భారత ఆర్థిక వ్యవస్థ రికవరీ బాట పట్టిన సంకేతాలు వెలువడుతున్నాయి. డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికంలో ఆర్థిక రంగం వృద్ధి రేటు 7.2 శాతానికి చేరింది. ఇది ఐదు త్రైమాసికాల గరిష్ఠ స్థాయి. అలాగే ఆర్థిక రంగానికి అత్యంత కీలకం అయిన 8 మౌలిక రంగాలు కూడా జనవరిలో మెరుగైన వృద్ధిని సాధించాయి. ఒక్క తయారీ రంగం పిఎంఐ మాత్రం కాస్తంత దిగజారినా తిరోగమనానికి, పురోగమనానికి విభజన రేఖ అయిన 50 పాయింట్లకన్నా పైనే ఉండడం ఆశాసూచిక.

న్యూఢిల్లీ : భారత ఆర్థిక వ్యవస్థ అక్టోబరు-డిసెంబరు త్రైమాసికంలో 7.2 శాతం వృద్ధిని నమోదు చేసింది. వ్యవసాయం, తయారీ, నిర్మాణ రంగాలు, కొన్ని సేవల రంగాలు వృద్ధి వేగం అందుకోవడానికి దోహదపడ్డాయి. కేంద్ర గణాంకాల కార్యాలయం (సిఎస్ఒ ఈ వివరాలు ప్రకటించింది. మార్చి 31వ తేదీతో ముగియనున్న 2017-18 ఆర్థిక సంవత్సరంలో ఆర్థిక రంగం 6.6 శాతం వృద్ధిని సాధించవచ్చునని అంచనా వేసింది. గతంలో వేసిన అంచనా 6.5 శాతంకన్నా ఇది కాస్తంత ఎక్కువ. 2016-17 ఆర్థిక సంవత్సరం వృద్ధి 7.1 శాతం ఉంది. అలాగే వర్తమాన ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికం (జూలై-సెప్టెంబరు) వృద్ధి రేటును 6.3 శాతం నుంచి 6.5 శాతానికి ఎగువకు సవరించింది. 2011-12 నిలకడ ధరల ప్రకారం వాస్తవ జిడిపి వర్తమాన ఆర్థిక సంవత్సరంలో 130.04 లక్షల కోట్ల రూపాయలుండవచ్చునని సిఎస్ఒ అంచనా వేసింది. జనవరి 31వ తేదీన సిఎస్ఒ ప్రకటించిన అంచనా 121.96 కోట్ల రూపాయలే. తయారీ రంగంలో స్థూల విలువ జోడింపు సైతం మూడో త్రైమాసికంలో 8.9 శాతానికి పెరిగింది. రెండో త్రైమాసికంలో ఇది 6.9 శాతమే. ఇదే కాలంలో వ్యవసాయ రంగంలో విలువ జోడింపు 2.7 శాతం నుంచి 4.1 శాతానికి, నిర్మాణ రంగంలో 2.8 శాతం నుంచి 6.8 శాతానికి పెరిగాయి. ఆర్థిక సేవలు సహా సేవల రంగం వృద్ధిరేటు 6.4 శాతం నుంచి 6.7 శాతానికి పెరిగింది.

తయారీ పిఎంఐ మళ్లీ దిగువకు...

తయారీ రంగంలో కార్యకలాపాలు మందగించాయి. ఫిబ్రవరిలో ఈ రంగానికి చెందిన పిఎంఐ నాలుగు నెలల కనిష్ఠ స్థాయికి పడిపోయింది. జనవరిలో 52.4 పాయింట్లున్న ఈ పిఎంఐ ఫిబ్రవరిలో 52.1 పాయింట్లకు దిగజారింది. అయితే ఏ రంగం అయినా పురోగమన పథంలో ఉన్నదనేందుకు విభజన రేఖగా భావించే 50 పాయింట్లకన్నా పైనే ఉంది. ఇలా ఇది 50 పాయింట్ల పైనే ఉండడం వరుసగా ఇది ఏడో నెల. గత ఏడాది డిసెంబరులో ఇది 60 నెలల గరిష్ఠ స్థాయి 54.7 పాయింట్లకు చేరింది. గత జూలైలో ప్రవేశపెట్టిన జిఎస్‌టి ప్రభావం ఉన్నప్పటికీ తయారీ రంగం వృద్ధిపథంలోనే ఉండడం ఆశావహమైన స్థితి అని ఐహెచ్ఎస్ మార్కిట్ ఆర్థిక వేత్త అష్నా దోధియా అన్నారు. వస్తుసేవల కోసం డిమాండు ఉన్న కారణంగా ఉత్పత్తిని పెంచేందుకు కార్పొరేట్ సంస్థలు సిబ్బందిని నియమించుకుంటున్నాయని, ఈ నియామకం జనవరి కన్నా పెరిగిందని ఆమె చెప్పారు. రానున్న 12 నెలల కాలానికి డిమాండు విషయంలో కూడా తయారీ రంగం ప్రతినిధులు ఆశావహ దృక్పథాన్నే ప్రకటించారని ఆమె అన్నారు.





కీలక రంగాల జోరు

దేశ ఆర్థిక వ్యవస్థకు అత్యంత కీలకంగా భావించే ఎనిమిది కీలక రంగాలు జనవరి నెలలో త్వరితగతిన విస్తరించాయి. ఆ రంగాల వృద్ధి 6.7 శాతానికి చేరింది. పెట్రోలియం రిఫైనరీ, సిమెంట్ రంగాలు ఈ వృద్ధికి అండగా నిలిచాయి. ఇన్‌ఫ్రా వృద్ధిరేటు గత జనవరిలో 3.4 శాతం ఉండగా డిసెంబరులో 7.4 శాతం ఉంది. ఈ ఎనిమిది కీలక రంగాల్లో బొగ్గు, క్రూడాయిల్, సహజవాయువు, రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువులు, ఉక్కు, సిమెంట్, విద్యుత్ ఉన్నాయి. మొత్తం తయారీ రంగంలో ఈ ఎనిమిది రంగాల వాటా 41 శాతం. జనవరిలో పెట్రోలియం రిఫైనరీ విభాగం 11 శాతం, సిమెంట్ రంగం 20.7 శాతం వృద్ధిని నమోదు చేశాయి. ఈ రెండు విభాగాలు గత జనవరిలో భారీ తిరోగమనంలో ఉన్నాయి. విద్యుత్ ఉత్పత్తి 8.2 శాతం, బొగ్గు ఉత్పత్తి 3 శాతం పెరిగాయి. క్రూడాయిల్ ఉత్పత్తి 3.2 శాతం, సహజవాయువు ఉత్పత్తి 1 శాతం, ఎరువుల ఉత్పత్తి 1.6 శాతం తగ్గాయి. అయితే ఏప్రిల్-జనవరి నెలల మధ్య కాలంలో మాత్రం ఈ రంగాల వృద్ధి గత ఏడాదితో పోల్చితే 5.1 శాతం నుంచి 4.3 శాతానికి తగ్గింది.

రిలయన్స్ ట్రెండ్స్ ప్రచారకర్తగా రానా



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): రిలయన్స్ రిటైల్‌కు చెందిన రెడీమేడ్ దుస్తుల విక్రయ కేంద్రాల నిర్వహణ విభాగం రిలయన్స్ ట్రెండ్స్.. టాలీవుడ్ హీరో రానా దగ్గుబాటిని బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించుకుంది. ఈ విషయాన్ని ప్రకటించేందుకు బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రానా మాట్లాడుతూ.. రిలయన్స్ ట్రెండ్స్ లాంటి కూల్ బ్రాండ్‌కు ప్రచారం చేయడం సంతోషంగా ఉందన్నారు. రిలయన్స్ ట్రెండ్స్ దేశంలోని 220 నగరాల్లో 430 రిటైల్ స్టోర్లను నిర్వహిస్తోంది. ఇందులో 200కు పైగా స్టోర్లు దక్షిణాదిలోనే ఉన్నాయని, వీటి నుంచే 50 శాతానికి పైగా ఆదాయం సమకూరుతోందని రిలయన్స్ ట్రెండ్స్ మార్కెటింగ్ హెడ్ కపిల్ ఖట్టర్ తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో 25 స్టోర్లున్నాయని, ఎపి, తెలంగాణలో మున్ముందు మరిన్ని స్టోర్లను ఏర్పాటు చేయాలనుకుంటున్నట్లు ఆయన చెప్పారు.

బులియన్

బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	ప్రొద్దుటూరు	చెన్నై
24 క్యారెట్లు	31,360	31,400	31,410	31,400	30,530
క్రితం ముగింపు	31,590	---	---	31,500	30,700
22 క్యారెట్లు	29,030	29,150	28,890	29,080	29,080
క్రితం ముగింపు	29,250	---	---	29,160	29,240
వెండి (కిలో)	39,300	39,700	39,300	39,400	41,300
క్రితం ముగింపు	39,700	---	---	39,800	41,600

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	72.00	విజయవాడ	73.00
కరీంనగర్	73.00	గుంటూరు	72.00
వరంగల్	72.00	ఒంగోలు	75.00
మహబూబ్‌నగర్	72.00	చిత్తూరు	66.00
కర్నూలు	72.00	నెల్లూరు	68.00
విశాఖపట్నం	83.00	అనంతపురం	65.00
గోదావరి	75.00		

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.05 — నెక్ (100 గుడ్లు)

హైదరాబాద్	345.00	చిత్తూరు	388.00
వరంగల్	347.00	చెన్నై	395.00
విజయవాడ	340.00	నమక్కల్	380.00
గోదావరి	340.00	బెంగళూరు	385.00
విశాఖపట్నం	350.00	ముంబై	390.00

ఫారెక్స్ (థామస్‌కుక్ రేట్లు) (రూపాయల్లో..)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
యుఎస్ డాలర్	59.22	68.67
పౌండ్	82.33	95.48
యూరో	72.41	83.98
ఆస్ట్రేలియా డాలర్	46.12	53.37
బహ్రెయిన్ దినార్	160.37	183.78
కువైట్ దినార్	179.61	223.69
ఒమని రియాల్	157.05	179.67
సౌదీ రియాల్	15.74	18.67
సింగపూర్ డాలర్	44.66	52.92
యుఎఇ దిరమ్	16.12	18.84


మరింత నీరసించిన రూపాయి

ఫారెక్స్ మార్కెట్లో రూపాయి 30 పైసలు నష్టపోయి మూడు నెలల కనిష్ఠ స్థాయికి పడిపోయింది. మార్కెట్ ముగిసే సమయానికి డాలర్ మారకంలో రూపాయి 65.17 వద్ద ముగిసింది.

సెన్సెక్స్‌ను వెంటాడిన అమెరికా వడ్డీ రేట్ల భయాలు

» బ్యాంకింగ్ షేర్లలో కొనసాగిన అమ్మకాల ఒత్తిడి

ముంబై: భారత స్టాక్ మార్కెట్‌కు మళ్లీ వడ్డీ రేట్ల భయం పట్టుకుంది. అమెరికా కేంద్ర బ్యాంక్ 'ఫెడరల్ రిజర్వ్' మరింత వేగంగా వడ్డీ రేట్లు పెంచబోతోందన్న భయంతో బుధవారం ఇన్వెస్టర్ల భారీఎత్తున అమ్మకాలకు దిగారు. దీంతో బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్ 162.35 పాయింట్ల నష్టంతో 34184 పాయింట్ల వద్ద, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ 61.45 పాయింట్ల నష్టంతో 10492 పాయింట్ల వద్ద క్లోజయ్యాయి. మెటల్, బ్యాంకింగ్, ఎఫ్ఎంసిజి, క్యాపిటల్ గూడ్స్, పవర్, ఇన్‌ఫ్రాటెక్, హెల్త్‌కేర్, ఆయిల్ అండ్ గ్యాస్, పిఎస్‌యు కంపెనీల షేర్లలో అమ్మకాల ఒత్తిడి కొనసాగింది. డాలర్‌తో రూపాయి మారకం రేటు డీలా పడడంతో ఐటి షేర్లకు మాత్రం కొద్ది స్థాయిలో డిమాండ్ లభించింది. పిఎన్‌బి కుంభకోణం ప్రభావంతో యాక్సిస్ బ్యాంక్, యెస్ బ్యాంక్, ఐసిఐసిఐ బ్యాంక్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ వంటి బ్యాంకింగ్ షేర్లలో బుధవారం కూడా అమ్మకాల ఒత్తిడి కొనసాగింది.



కోలుకున్న పిఎన్‌బి షేర్లు

నిన్న మొన్నటి వరకు నష్టాలు చవిచూసిన పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి) షేరు బుధవారం స్వల్ప లాభాలతో ముగిసింది. ట్రేడింగ్ ప్రారంభంలో బిఎస్ఇలో ఒక దశలో 6.45 శాతం నష్టంతో రూ.92 స్థాయిని తాకిన ఈ షేరు చివరికి 3.05 శాతం నష్టంతో రూ.101.35 వద్ద ముగిసింది. ఫిబ్రవరి 14న నీరవ్ మోదీ కుంభకోణం వెలుగు చూసినప్పటి నుంచి పిఎన్‌బి షేరు దాదాపు 31 శాతం నష్టపోయింది. దీంతో మదుపరులు రూ.20,000 కోట్ల వరకు నష్టపోయినట్టు అంచనా.

హెచ్‌జి ఇన్‌ఫ్రా ఐపిఒ విజయవంతం

హెచ్‌జి ఇన్‌ఫ్రా ఇంజినీరింగ్ కంపెనీ ఐపిఒ ఆఖరి రోజైన బుధవారం ముగిసే సరికి ఐదు రెట్లు ఓవర్ సబ్‌స్క్రైబ్ అయింది. రూ.263-270 ధరలో కంపెనీ 1.21 కోట్ల షేర్లను ఐపిఒ ద్వారా జారీ చేసింది. అయితే ఈ ఐపిఒ ద్వారా 6.02 కోట్ల షేర్లకు బిడ్స్ వచ్చాయి.

సంధ్యా మెరైన్స్ పబ్లిక్ ఇష్యూ

ఆంధ్రప్రదేశ్ నుంచి మరో రొయ్యల కంపెనీ తొలి పబ్లిక్ ఇష్యూకు వస్తోంది. విశాఖపట్నం కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న సంధ్యా మెరైన్స్ తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపిఒ) కోసం క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ సంస్థ సెబికి దరఖాస్తు చేసింది. ఈ ఇష్యూలో భాగంగా కంపెనీ కొత్తగా రూ.300 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లు జారీ చేయనుంది. ఇదిగాక ప్రస్తుత వాటాదారుల్లో కెవి ప్రసాద్, సూర్య నారాయణమ్మ, కె ఆనంద్ కుమార్, కె అరుణ్ కుమార్ తమ వాటా నుంచి 1.26 కోట్ల షేర్లు ఆఫర్ ఫర్ సేల్ ద్వారా అమ్మకానికి పెడుతున్నారు. ఐపిఒ ద్వారా సమీకరించే నిధులతో కొత్తగా రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్, దాణా మిల్లు ఏర్పాటు చేయాలని కంపెనీ భావిస్తోంది.

ఎపిలో అవాడా 500 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టులు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అవాడా పవర్ ప్రైవేట్ లిమిటెడ్ ఆంధ్రప్రదేశ్‌లో 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ ప్రాజెక్టులను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ఇటీవల విశాఖపట్నంలో జరిగిన సిఐఐ భాగస్వామ్య సదస్సులో రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సోలార్ ప్రాజెక్టుల కోసం 3,500 కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టనున్నామని, ఫలితంగా 1,200 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయని అవాడా గ్రూప్ ఛైర్మన్ వినీత్ మిట్టల్ తెలిపారు. అంతేకాకుండా 24 లక్షల కుటుంబాలకు విద్యుత్ సరఫరా చేసే అవకాశం ఉంటుందన్నారు.

హైదరాబాద్‌లో సర్వీస్‌నౌ ఆర్ అండ్ డి కేంద్రం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): న్యూయార్క్ స్టాక్ ఎక్స్ఛేంజీలో నమోదైన టెక్నాలజీ సొల్యూషన్ల సంస్థ సర్వీస్‌నౌ.. హైదరాబాద్‌లో నూతన పరిశోధనా, అభివృద్ధి (ఆర్ అండ్ డి) కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. హైటెక్ సిటీలో ఉన్న ఈ కేంద్రం కంపెనీకి ఆసియాలోనే తొలి ఆర్ అండ్ డి కేంద్రం కావడం విశేషం. ఈ కేంద్రం ద్వారా ప్రాంతీయ, అంతర్జాతీయ క్లయింట్లకు సర్వీసులు అందించనున్నట్టు కంపెనీ తెలిపింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ), మెషిన్ లెర్నింగ్ సామర్థ్యాల పెంపునకు అవసరమైన ప్రొడక్ట్ ఇంజనీరింగ్ టీమ్స్ అభివృద్ధిలో ఈ కేంద్రం కీలకంగా వ్యవహరించనున్నట్టు కంపెనీ వెల్లడించింది. 2020నాటికి 400 కోట్ల డాలర్ల వార్షిక రాబడిని సాధించాలన్న లక్ష్యంతో సర్వీస్‌నౌ ఉంది. దీనికి హైదరాబాద్ కేంద్రం ఎంతగానో దోహదపడుతుందని కంపెనీ భావిస్తోంది. 2013 సంవత్సరంలో హైదరాబాద్‌లో ఇద్దరు ఉద్యోగులతో కంపెనీ కార్యకలాపాలు మొదలయ్యాయి. ప్రస్తుతం ఇక్కడ ఉద్యోగుల సంఖ్య 500కు పైగా ఉంది. కొత్త కేంద్రం ప్రారంభంతో ఉద్యోగుల సంఖ్య రెండింతలుకానుందని, ఇందుకు సరిపోయేంత స్థలం ఉన్నట్టు కంపెనీ తెలిపింది.

ఎయిర్‌సెల్ దివాలా!

» ఎన్‌సిఎల్‌టి వద్ద పిటిషన్ దాఖలు

» టెలికాం రంగంలో తీవ్రమైన పోటీ, అప్పుల గుదిబండే ప్రధాన కారణం

» జియో దెబ్బకు మరో ఆపరేటర్ బలి

న్యూఢిల్లీ: దేశీయ టెలికాం రంగంలో రిలయన్స్ జియో ధాటికి మరో ఆపరేటర్ చేతులెత్తేసింది. గత కొద్దికాలంగా ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న ఎయిర్‌సెల్ దివాలా తీసినట్లు ప్రకటించింది. ముంబైలోని జాతీయ కంపెనీల చట్టం ట్రిబ్యునల్ (ఎన్‌సిఎల్‌టి) వద్ద సంస్థ దివాలా పిటిషన్ దాఖలు చేసింది. దివాలా స్మృతి కోడ్ 2016లోని సెక్షన్ 10 ప్రకారంగా ఎయిర్‌సెల్ సెల్యులార్, డిష్‌నెట్ వైర్‌లెస్, ఎయిర్‌సెల్ లిమిటెడ్‌లపై దివాలా పరిష్కార చర్యలను ప్రారంభించాలని ట్రిబ్యునల్‌ను కోరినట్లు కంపెనీ బోర్డు సభ్యులు ప్రకటించారు. 4జీ సేవలతో జియో విధ్వంసకర ఎంట్రీ నేపథ్యంలో టెలికాం రంగంలో తీవ్రతరమైన పోటీతోపాటు చట్టపరమైన, నియంత్రణ పరమైన సవాళ్లు, భారీగా పేరుకుపోయిన అప్పుల కుప్ప ఇంకా పెరుగుతున్న నష్టాలు.. అన్నీ వెరసి వ్యాపారం, సంస్థ ప్రతిష్ఠపై ప్రతికూల ప్రభావం చూపాయని బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఎయిర్‌సెల్ పేర్కొంది.

రుణదాతలు, వాటాదారులతో కొలిక్కిరాని చర్చలు

అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ కమ్యూనికేషన్‌లో తమ వైర్‌లెస్ వ్యాపారాన్ని విలీనం చేయాలన్న ప్రయత్నాలు విఫలమయ్యాయని, ఇందుకు సంబంధించి రెండు సంస్థల మధ్య కుదిరిన ఒప్పందం గత ఏడాది సెప్టెంబరులో రద్దయిందని ఎయిర్‌సెల్ పేర్కొంది. సంస్థ ఆర్థిక సంక్షోభంపై రుణదాతలు, వాటాదారులతో సమగ్రంగా చర్చించడం జరిగిందని, కానీ రుణ పునర్వ్యవస్థీకరణ, ఫండింగ్‌పై వారితో ఏకాభిప్రాయం కుదరలేదని తెలిపింది. సమగ్ర చర్చలతోపాటు ఈ ఏడాది జనవరిలో ప్రారంభించిన వ్యూహాత్మక రుణ పునర్వ్యవస్థీకరణ ప్రయత్నాలు కొలిక్కిరాలేదని ఎయిర్‌సెల్ వెల్లడించింది. ప్రస్తుత పరిస్థితుల్లో దివాల చట్టం ప్రకారంగా పరిష్కార చర్యలే సరైన మార్గమని అన్పించిందని సంస్థ పేర్కొంది. కార్పొరేట్ దివాలా పరిష్కార ప్రక్రియ (సిఐఆర్‌పి) అంటే ఆస్తులను వేలం వేసి రుణాలు తీర్చడం మాత్రమే కాదని, అందరి ప్రయోజనాల దృష్టిలో పెట్టుకొని సంస్థను సంక్షోభం నుంచి గట్టెక్కేందుకు ఉత్తమైన పరిష్కారాన్ని అన్వేషించడమని ఎయిర్‌సెల్ అభిప్రాయపడింది.

మెరుగైన సేవలందించేకు ప్రయత్నిస్తాం..

కష్టకాలంలోనూ కస్టమర్లకు నిరంతరాయ సేవలందించేందుకు కృషి చేస్తామని ఎయిర్‌సెల్ పేర్కొంది. ఇందుకు వారి మద్దతు కోరింది.

టెక్ వ్యూ

మైనర్ మద్దతు స్థాయి 10450

నిఫ్టీ 60 పాయింట్ల దిగువన కీలక స్థాయి 10500 కన్నా దిగజారి చివరిలో మైనర్ రికవరీ సాధించింది. అయినా మళ్లీ విఫలమై అప్రమత్తంగా క్లోజయింది. గత రెండు రోజుల రికవరీని నిలబెట్టుకోలేకపోయింది. కీలక 20, 50 డిఎంఏల వద్ద కరెక్షన్‌లో పడింది. గత కొద్ది రోజులుగా సైడ్‌వేస్, ఆటుపోట్ల ధోరణిలో ట్రేడవుతోంది.

గురువారం స్థాయిలివే...

నిరోధం : 10550 **మద్దతు :** 10450

- రికవరీ బాట పడితే మైనర్ అప్‌ట్రెండ్ కోసం ఇంట్రాడే నిరోధం 10550 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం 10630. ఆ పైన మాత్రమే మైనర్ అప్‌ట్రెండ్ ఏర్పడుతుంది.
- మైనర్ మద్దతు స్థాయి 10450 కన్నా దిగజారితే మరింత డౌన్‌ట్రెండ్‌లో పయనిస్తుంది. ప్రధాన మద్దతు స్థాయి 10300.
- బ్యాంక్ నిఫ్టీ ఊహించిన దాని కన్నా ఎక్కువ కరెక్షన్ సాధించి కీలక మద్దతు స్థాయి 25000 చేరువకు వెళ్లింది. భద్రత కోసం ఇక్కడ రికవరీ తప్పనిసరి.

■ వి.సుందర్ రాజా

ఆస్ట్రో వ్యూ

సాధారణ నిస్తేజం

తిథి : ఫాల్గుణ శుద్ధ చతుర్దశి

నక్షత్రం : మఖ

రోహిణి, హస్త, శ్రవణం నక్షత్ర జాతకులు, కన్య, మకర రాశుల వారు అప్రమత్తంగా ఉండాలి.

నిఫ్టీ : 10492.85 (-61.45)

ట్రెండ్ మార్పు వేళలు : 12.43

ధోరణి : గ్రహగతులను బట్టి మెరుగ్గా ప్రారంభమై 9.35 వరకు అదే ధోరణిలో ఉంటూ 11 గంటల నుంచి ముగింపు వరకు నిస్తేజంగా మారే ఆస్కారం ఉంది.

ట్రేడింగ్ వ్యూహం...

నిఫ్టీ ఫ్యూచర్స్ 11.30 సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా దిగువన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో షార్ట్ పొజిషన్లు తీసుకుని మూడు గంటల సమయానికి క్లోజ్ చేసుకోవాలి.

నిరోధం : 10535, 10570

మద్దతు స్థాయిలు : 10450, 10415

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

గమనిక : ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి www.thefinanciala strologer.blogspot.in

భెల్ షేర్‌హోల్డర్లకు 40 శాతం మధ్యంతర డివిడెండ్

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరాని(2017-18)కి షేర్‌హోల్డర్లకు 40 శాతం మధ్యంతర డివిడెండ్ పంచినట్లు ప్రభుత్వ రంగ విద్యుత్ పరికరాల తయారీ సంస్థ భెల్ ప్రకటించింది. డివిడెండ్ రూపంలో మొత్తం రూ.293.71 కోట్లు చెల్లించినట్లు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో సంస్థ తెలిపింది. సంస్థలో కేంద్రానికి 63.06 శాతం వాటా ఉంది. డివిడెండ్‌లో ప్రభుత్వ వాటా కింద రూ.185.21 కోట్ల విలువైన చెక్కును భెల్ సిఎండి అతుల్ సోబ్తీ కేంద్ర మంత్రులు అనంత్ గీతే, బాబుల్ సుప్రియోలకు అందజేశారు.

బిఎస్ఇలో తెలుగు రాష్ట్రాల కంపెనీల షేర్లు

ADITYA SPIN. 8.2(8.29)40
AGRO TECH FO 630.15(632.85)1001
AISHWARYA TE 5.82(5.8)6406
ALPHAGEO (I) 809.15(809)1161
ALU FLUORIDE 114.15(113.5)4047
AMAR RAJA BA 822.5(816)15362
ANDHRA BANK 46.05(45)234133
ANDHRA CEMEN 10.91(10.9)19448
ANDHRA PETRO 58.9(59.8)50595
ANJANI PORTL 191.3(192.95)2335
ASTRA MICRO 90.65(92)88532
AUROB.PHARMA 613.45(614.35)125106
AVANTEL LTD 533.9(534.3)1214
AVANTI FEEDS 2401.95(2395.2)8146
B.N.RATHI SE 41.4(41.5)856
BALAJI AMINE 644.55(657.95)12227
BAMBINO AGRO 236.05(238.15)3265
BARTRONICSIN 12.88(13.27)14458
BHAGIRA.CHEM 301.7(306.4)21813
BHAGYA INL 48.65(50.5)212768
BHARATFIN 1025.5(1028.65)18887
BNR UDYOG 30.6(31.35)247
CAMBRIDGE 73.75(72.35)332
CCHHL 13.8(14)21246
CCL PRODUCTS 297.45(298.65)2325
CELESTIAL 17.25(17.2)8470
CIL SECURITS 30.25(30)2811
COROM INTER 558.3(543)10655
CUBEX TUBING 25.4(26.65)1282
CYBERMATE 3.26(3.18)22358
CYIENT 636.5(629.5)8417
DANLAW TECH. 66.75(68.4)4317
DECAN CEMENT 569(556.6)482
DHAN ROTO SP 53.55(53.6)6426
DIAMONPOWER 13.1(13.45)16733
DIVI'S LAB. 1023.3(1035)118407
DIVYA.GRANIT 92.5(97.05)305
DQ ENT 14.3(14.7)4150
DR.REDDY'S 2235.65(2234.15)40886
EMPEE SUGARS 3.89(3.92)7189
EVEREST ORG. 143.25(147.55)579
FACOR ALLOYS 3.01(3.06)137263
FIRSTOBJ 15.75(15.05)2725
GATI LTD. 111.75(113.25)74368
GAYATRI BIO 8.82(8.81)205
GAYATRI PROJ 211.55(212.3)10028
GENNEX LAB 4.36(4.33)108899
GMR INFRASTR 18.95(18.8)2487550
GODAVARI DRU 34.9(34.75)100
GOLDST INFRA 217.1(218.75)33632
GOLDSTONE EN 15(14.75)7254
GRANULES (I) 118.4(117.25)198172
GVK POWERINF 16.95(17.15)485300
HBL P SYS 55.55(56.2)41295
HERITGFOOD 669.95(675)612
I.C.S.A. IND 3.06(3.2)22472
IKF TECHNO .65(.64)114730
INCAP LTD. 88.1(88.35)914
IPAPPM 308.5(314.05)5363
IVRCL LTD 4.45(4.42)76447
KAKATIYA CEM 291.8(294.1)1866
KALLAM SPG. 31(31.1)29223
KARAN WOO-SN 1.9(1.99)100
KAVERI SEED 499.55(506.2)13628
KCP LTD 127.4(130.35)17493
KERNEX MICRO 41.75(43.45)14638
KNR CONST 308.9(308.25)7300
KREBS BIOCHM 171.05(162.95)4143
LANCO INFRA 1.27(1.33)321150
LOKESH MACH 65.95(66.3)3403
LOTUS CHOC 51.3(52.3)3254
MADHUCON PRJ 27.35(27.45)26851
MOLD-TEK TEC 60.95(59.25)545
MOSCHIP SEMI 32(32)48946
MSR INDIA 51.95(50.35)10439
N C L IND. 228.3(230.6)4895
NACLIND 43.5(44.6)10951
NATCO PHARM 799.2(769.55)64968
NCC 131.35(130.05)764483
NEHA INTER. 7.18(7.44)16771
NETTLINX LTD 76.6(78.5)75723
NEULAND LAB. 719(718.85)1052
NIHAR INFO 14.75(15.5)192
NILE LTD. 803.75(810.9)1533
NTL 4.14(3.96)1004
OIL COUNTRY 42.7(42.5)3669
PADMALAYA TE 4.64(4.85)13197
PALRED 89.85(92.15)3668
PANYAM CEMEN 46.4(47.35)8474
PENNAR STEEL 58.6(60.6)36402
PFL INFOTECH 8.38(8.81)662
PHYTOCHEM I. 61.8(62)5227
PITTI LAMIN. 93.95(91.25)16029
POKARNA LTD 215.05(215.85)263
PRAJAY ENGS. 11.75(12.35)24706
PREMIER EXPL 388.5(391)1540
PRISM CEMENT 126.3(122.55)82086
RAIN 381(399.2)1689102
RAJ PACKAGIN 37.05(37.2)6319
RAJVIR IND 43(44.05)50
REG.CERAMIC 5.85(5.66)879
RESTILE CER. 6.97(6.9)770
SAGAR CEM. 980(980.85)608
SAMKRG PIST. 298.8(302.65)4847
SAMPRE NUTRI 51(52)1844
SANGHI IND. 116.35(117.9)24122
SATVAH.ISPAT 22.55(22.6)5777
SAVEN TECHNO 25.6(25.7)11272
SMPL 1.41(1.4)38508
SMS PHARMACE 87.5(88.4)10644
SREE RAYALA 165.8(165.55)240
STEEL EXCH 30.05(31)64033
SURANATP 5.57(5.5)350
SURYACHAKRA .95(1)26349
SURYAMBA SP 76.7(77.85)2
SURYLAK.COTT 80.05(78.9)4998
SUVEN LIFE S 188.35(190.55)38039
TAJ GVK HOTL 166.1(166.05)1482
TANLA 34.7(31.7)398380
TRANSCORP IN 33.5(34.1)1013
TRANSGENE BI 2.5(2.39)49473
TRANSPORT CO 272.9(276.6)4919
USHER AGRO 6.28(6.61)1345
VICEROY HOTE 15.7(15.7)16019
VIJAY TEXTIL 52.3(55)8239
VIMTA LABS 208.75(204.3)1166
VIRAT CRANE 51.75(51)2904
VIRINCHI 118.8(120.25)24809
VISAKA IND. 689.7(689.45)7297
VISTA PHARMA 53.5(48.95)862810
VIVIMED LABS 77.35(76.95)101527
VST INDUS. 3172(3201)15
WATERBASE 311.9(307.05)155815
XLENERGY 2.8(2.89)15998
YBRANTDIGI 5.05(5.16)119721
ZEN TECH 117.6(115.9)11385
ZENOTECH 43.2(44.5)6558

హైదరాబాద్ నుంచి మరిన్ని సర్వీసులు

ముంబై: ఏడు కొత్త ఎటిఆర్ విమానాలతో హైదరాబాద్, చెన్నై నుంచి మరిన్ని సర్వీసులు నడపనున్నట్లు ఇండిగో ప్రకటించింది. మార్చి 25 నుంచి హైదరాబాద్-నాగ్‌పూర్-హైదరాబాద్ రూట్‌లో రెండు డైరెక్ట్ డైలీ ఫ్లైట్లను, హైదరాబాద్-మంగళూరు-హైదరాబాద్ మార్గంలో రోజుకు మూడు విమాన సర్వీసులు నడపనున్నట్లు సంస్థ తెలిపింది. మే 1 నుంచి చెన్నై-మంగళూరు-చెన్నై రూట్‌లో రెండు డైరెక్ట్ డైలీ ఫ్లైట్లను ప్రవేశపెట్టనున్నట్లు ఇండిగో వెల్లడించింది. ప్రస్తుతం సంస్థ వద్ద 155 విమానాలున్నాయి. అందులో 151 ఎయిర్‌బస్ ఎ320లు కాగా మిగతా నాలుగు ఎటిఆర్ విమానాలు. చౌక విమానయాన సేవల సంస్థ అయిన ఇండిగో.. 50 మార్గాల మధ్య రోజూ వెయ్యికిపైగా విమాన సర్వీసులు నడుపుతోంది.

కొంప ముంచిన మీడియా లంచం

ఐఎన్ఎక్స్ కేసు నేపథ్యం



కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ ఆర్థిక మంత్రి, దేశాన్ని డ్రీమ్ బడ్జెట్లతో అలరించిన చిదంబరం కుమారుడు కార్తీ చిదంబరం మనీలాండరింగ్ కేసులో అరెస్ట్ అయ్యారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి) స్కామ్ దాని వెన్నంటి బయటకొస్తున్న వరుస బ్యాంకు కుంభకోణాలు దేశాన్ని కుదిపేస్తున్న తరుణంలో కార్తీ అరెస్ట్ ప్రాధాన్యత సంతరించుకొంది. కార్తీ అరెస్ట్ వెనక రాజకీయం ఉందా లేదా చట్టం తనపని తాను చేసుకుపోతున్నదా... అన్న విషయాన్ని పక్కనబెడితే ఇప్పుడందరి ఆసక్తీ కార్తీ అరెస్ట్‌కు దారితీసిన ఐఎన్ఎక్స్ మీడియా వ్యవహారం పైకి మళ్లింది. ఇంతకూ ఈ ఐఎన్ఎక్స్ మీడియా కేసు ఏమిటీ? ఈ కేసులో కార్తీ ప్రమేయం ఎంత? ఆయన అరెస్ట్‌కు దారితీసిన అంశాలపై ఇడి, సిబిఐ కథనాలు ఏమిటీ? ఆంధ్రజ్యోతి పాఠకుల కోసం...

అసలేం జరిగింది?

ఐఎన్ఎక్స్ మీడియా తన వ్యాపారానికి అవసరమైన నిధులను విదేశీ పెట్టుబడుల రూపంలో సమీకరించేందుకు నిర్ణయించింది. మీడియాలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు విధిగా ఎఫ్ఐపిబి ఆమోదం ఉండి తీరాలి. అందువల్ల ఎఫ్ఐపిబి ఆమోదం కోసం 2007 సంవత్సరంలో దరఖాస్తు చేసింది. మారిషస్ కేంద్రంగా ఉన్న ముగ్గురు నాన్ రెసిడెంట్ ఇన్వెస్టర్లు (ఎన్ఆర్ఐ) తమ సంస్థలో ఇన్వెస్ట్ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు వెల్లడించింది. ఐఎన్ఎక్స్ మీడియాలోకి వచ్చే ఎఫ్‌డిఐ నుంచి కొంత మొత్తాన్ని ఇన్వెస్ట్ చేసి మరో అనుబంధ సంస్థ ఐఎన్ఎక్స్ న్యూస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో 26 శాతం వాటా తీసుకోనున్నట్టు వెల్లడించింది.

- ఐఎన్ఎక్స్ మీడియా ఎఫ్‌డిఐ, ఎన్ఆర్ఐ ఇన్వెస్ట్‌మెంట్ ప్రతిపాదనను ఎఫ్ఐపిబి షరతులతో ఆమోదించింది. ఐఎన్ఎక్స్ సమీకరించే ఎఫ్‌డిఐ గరిష్ఠ పరిమితిని 4.62 కోట్ల రూపాయలుగా పేర్కొంది. ఐఎన్ఎక్స్ మీడియా ఈ సొమ్ములో కొంతభాగాన్ని ఐఎన్ఎక్స్ న్యూస్‌లో ఇన్వెస్ట్ చేసేందుకు నిర్ద్వంద్వంగా తిరస్కరించింది.
- ఐఎన్ఎక్స్ మీడియా ఈ షరతులను పట్టించుకోలేదు. విదేశీ ఇన్వెస్టర్లకు ఒక్కో షేరును 800 రూపాయల ప్రీమియంతో జారీ చేసి సుమారు 305 కోట్ల రూపాయల విదేశీ నిధులను సమీకరించింది. ఎఫ్ఐపిబి వద్దని చెప్పినప్పటికీ వినకుండా ఐఎన్ఎక్స్ న్యూస్‌లో 26 శాతం వాటా కూడా తీసుకుంది.
- ఈ ఉల్లంఘనలపై ఆదాయం పన్ను శాఖ మొదట దృష్టి పెట్టింది. 2008లో నోటీసులు జారీ అయ్యాయి. ఆ వెంటనే ఐఎన్ఎక్స్ మీడియా ప్రమోటర్లు, కార్తీ చిదంబరాన్ని ఆశ్రయించారు. ఆయన్ను అడ్డుపెట్టుకొని ఈ వివాదంలోంచి బయటపడేందుకు ప్రయత్నించారు. ఈ సహాయానికి గానూ కార్తీ చిదంబరం "పరోక్ష యాజమాన్యం"లోని అడ్వాంటేజ్ స్ట్రాటజిక్ కన్సల్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థకు 10 లక్షల డాలర్లను ముట్టజెప్పారు. కార్తీ ఇళ్లు, కార్యాలయాలపై జరిగిన దాడుల్లో తమకు సాక్ష్యాధారాలు లభించాయని సిబిఐ చెబుతోంది

మూడు ముఖ్య పాత్రలు..

ఈ కేసులో మూడు ముఖ్యపాత్రలు కనిపిస్తాయి. ఒకటి- ఫారిన్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డ్ (ఎఫ్ఐపిబి), రెండు- ఐఎన్ఎక్స్ మీడియా, మూడు-కార్తీ చిదంబరం.

ఎఫ్ఐపిబి: సాధారణంగా ఆటోమేటిక్ రూట్‌లో అనుమతి లేని విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి ప్రతిపాదనలను పరిశీలించి ఈ సంస్థ ఆమోదిస్తుంది.

ఐఎన్ఎక్స్ మీడియా: స్టార్ మీడియాలో కీలక పాత్ర నిర్వహించిన పీటర్ ముఖర్జీ, ఇంద్రాణి ముఖర్జీ ప్రమోట్ చేసిన సంస్థ. దేశంలో టీవీ చానళ్లను ఏర్పాటు చేసేందుకు ప్రారంభించారు. ప్రస్తుతం వీరిద్దరు ఇంద్రాణి ముఖర్జీ కుమార్తె షీనా బోరా హత్య కేసులో జైల్లో ఉన్నారు.

కార్తీ: మాజీ కేంద్ర ఆర్థిక మంత్రి చిదంబరం కుమారుడు. వ్యాపారవేత్త. వయస్సు 46 ఏళ్లు.

వాద ప్రతివాదాలు...

సిబిఐ ఆరోపణలు, దాడులను కేవలం కుట్రపూరితమైన రాజకీయ కక్షలతో కూడినవిగా కార్తీ చిదంబరం చెబుతున్నారు. చిదంబరం వాదన కూడా అదే. వాస్తవానికి 10 లక్షల రూపాయలు పెద్ద మొత్తం ఏమీ కాదని, అంతకంటే ఎక్కువే కార్తీ చిదంబరానికి ఐఎన్ఎక్స్ మీడియా నుంచి ముట్టిందని మరికొందరి వాదన.

- 2006-2011 మే నెల వరకు అడ్వాంటేజ్ స్ట్రాటజిక్ కన్సల్టింగ్‌లో కార్తీ కి మెజార్టీ వాటా ఉందేదని చెప్పేందుకు ఆధారాలున్నాయి.

చిదంబరం మెడకు ఎయిర్‌సెల్-మాక్సిస్

ఐఎన్ఎక్స్ మీడియాతో పోలిస్తే చిదంబరం, కార్తీ చిదంబరం ఇద్దరినీ ఎయిర్‌సెల్-మాక్సిస్ కేసు తీవ్రంగా ఇక్కట్లపాలు చేసే అవకాశం ఉంది. ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతోంది. అప్పట్లో టెలికామ్ మంత్రిగా ఉన్న దయానిధి మారన్ ఒత్తిడితో ఎయిర్‌సెల్‌ను తాను బలవంతంగా మలేసియా కంపెనీ మాక్సిస్‌కు విక్రయించాల్సి వచ్చిందని ఆరోపిస్తూ ఎయిర్‌సెల్ ప్రమోటర్ సి శివశంకర్ కేసులు పెట్టారు. ఇదిలా ఉండగా ఎయిర్‌సెల్‌ను మాక్సిస్ కొనుగోలు చేసేందుకు కేబినెట్ ఆమోదం కోరాల్సి ఉండగా దానిని పక్కనబెట్టి అప్పట్లో ఆర్థికమంత్రిగా ఉన్న చిదంబరం తానే గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని బిజెపి నేత సుబ్రమణియన్ స్వామి ఆరోపించారు. ఎయిర్‌సెల్‌ను తమ పరం చేసినందుకు కార్తీ చిదంబరం కంపెనీల ద్వారా దయానిధి మారన్ కుటుంబానికి చెందిన సన్ టీవీకి భారీగా నిధులను మాక్సిస్ సమకూర్చినట్టు ఆరోపణ. ఇందులో కార్తీకి చెందిన అడ్వాంటేజ్ కన్సల్టింగ్ కూడా సొమ్ము చేసుకుంది. అడ్వాంటేజ్‌లో డైరెక్టర్లు నలుగురు కార్తీ బినామీలు కాగా దీని హోల్డింగ్ కంపెనీ ఆస్‌బ్రిడ్జ్ . ఈ ఆస్‌బ్రిడ్జ్ ఓనర్ కార్తీ. ఈ కంపెనీకి వివిధ దేశాల్లోని అనేక కంపెనీలతో ఉన్న అల్లిబిల్లి లావాదేవీలను సిబిఐ, ఇడి ఛేదించాల్సి ఉంది. చెన్నై కేంద్రంగా ఉన్న అడ్వాంటేజ్‌కు విదేశాల్లోనూ అనుబంధ సంస్థలున్నాయి. వాసన్ ఐకేర్‌లో ఈ సంస్థ పెట్టుబడులు వివాదాస్పదంగా మారాయి. ఈ కేసు రానున్న రోజుల్లో దేశంలో క్రోనీ కాపిటలిజం చీకటి కోణాల్ని బట్టబయలు చేయడంతో పాటు చిదంబరం కుటుంబాన్ని రాజకీయంగా తీవ్రంగా దెబ్బ తీసే అవకాశం ఉంది.

కెనరా బ్యాంక్‌కు రూ. 515 కోట్ల టోపీ

» ఆర్‌పి ఇన్ఫోసిస్టమ్స్‌పై సిబిఐ కేసులు

కోల్‌కతా: తవ్వే కొద్దీ బ్యాంకు కేటుగాళ్ల మోసాలు బయట పడుతున్నాయి. నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీ, విక్రమ్ కొఠారీల పేర్లు మరవక ముందే... బ్యాంకు రుణాలను దర్జాగా కొట్టేసిన మరో మోసగాడి పేరు బయటకు వచ్చింది. శిబాజీ పంజా అనే వ్యక్తి కోల్‌కతా కేంద్రంగా ఆర్‌పి ఇన్ఫోసిస్టమ్స్ అనే పేరుతో ఒక కంపెనీ ఏర్పాటు చేసి కెనరా బ్యాంక్ నాయకత్వంలోని 17 బ్యాంకులను రూ.515.15 కోట్లకు ముంచినట్టు సిబిఐ తాజాగా కేసులు నమోదు చేసింది. లేని నిల్వలు ఉన్నట్టు హామీగా చూపడం, డాక్యుమెంట్ల ఫోర్జరీ, ఇతర కంపెనీల నుంచి పైసా కూడా బకాయిలు అందాల్సి లేకపోయినా, డాక్యుమెంట్ల ఫోర్జరీ ద్వారా బకాయిలు రావలసి ఉందని చూపించడం, నిజంగానే కొద్ది మొత్తం రావలసి ఉన్నా ఫోర్జరీ ద్వారా దాన్ని అధికంగా చూపించడం ద్వారా పంజా, అతడి సహచరులు బ్యాంకుల నుంచి వందల కోట్ల రూపాయలు రుణాలుగా కొట్టేశేవాడు. తాజా కేసులో పంజాతోపాటు ఆర్‌పి ఇన్ఫోసిస్టమ్స్ మరో ఇద్దరు డైరెక్టర్లు కౌస్తువ్ రే, వినయ్ బఫ్నా, కంపెనీ వైస్ ప్రెసిడెంట్ (ఫైనాన్స్) దేబ్‌నాథ్ పాల్‌పైనా సిబిఐ కేసులు బుక్ చేసింది. రుణాల మంజూరులో వీరితో కుమ్మక్కైన కొంతమంది కెనరా బ్యాంక్ అధికారులపైనా కేసులు నమోదైనట్టు సమాచారం.

రాజకీయ సంబంధాలు!

ప్రస్తుతం సిబిఐ కేసులు బుక్ చేసిన శిబాజీ పంజా, పశ్చిమ బెంగాల్ సిఎం మమతా బెనర్జీకి సన్నిహితుడని భావిస్తున్నారు. పంజా ఆర్‌పి గ్రూప్ పేరుతో సినిమాల నిర్మాణం, కంప్యూటర్ల మార్కెటింగ్ వంటి అనేక వ్యాపారాలు చేసేవాడు. ఒకపుడు 'చిరాగ్' పేరుతో కంప్యూటర్లు కూడా మార్కెట్ చేశాడు. ఐడిబిఐ బ్యాంక్‌ను రూ.180 కోట్లకు ముంచినందుకు జూన్, 2015లోనే సిబిఐ పంజాపై కేసు నమోదు చేసింది. ఈ కేసులోనూ పంజాతో పాటు కౌస్తువ్ రే, వినయ్ బఫ్నాలపైనా సిబిఐ కేసులు నమోదు చేసింది.

అనధికారిక ప్రతినిధి

ఆహ్వానం లేకపోయినా మమతా బెనర్జీతో కలిసి విదేశీ టూర్లలోనూ పంజా కనిపించేవాడు. ఫిబ్రవరి 2015లో మమతా బెనర్జీ బంగ్లాదేశ్‌లో జరిపిన మూడు రోజుల పర్యటనలోనూ పంజా అనధికారిక ప్రతినిధిగా పాల్గొన్నాడు. ఒక కేసుకు సంబంధించి ఢిల్లీ పోలీసు శాఖకు చెందిన ఆర్థిక నేరాల విభాగం జారీ చేసిన లుక్ అవుట్ నోటీసుతో, పశ్చిమ బెంగాల్ పోలీసులు పంజా ఆ టూర్ నుంచి వచ్చీ రాగానే ఎయిర్‌పోర్టులో అరెస్టు చేశారు.

ఎస్‌బిఐ వడ్డీ బొనాంజా!

- డిపాజిట్‌దారులకు మరింత రాబడి
- బల్క్, రిటైల్ డిపాజిట్ రేట్లు 0.75 శాతం వరకు పెంపు

ముంబై: దేశంలో అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకైన ఎస్‌బిఐ (స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) డిపాజిట్లపై చెల్లించే వడ్డీ రేట్లను గణనీయంగా పెంచింది. అందులో బల్క్ (రూ.కోటి నుంచి రూ.10 కోట్ల వరకు) టర్మ్ డిపాజిట్లపై వడ్డీని కాలపరిమితిని బట్టి 0.75 శాతం వరకు పెంచింది. రిటైల్ (రూ.కోటి లోపు) టర్మ్ డిపాజిట్ రేట్లు 0.5 శాతం వరకు పెరిగాయి. ఈ సవరణలు తక్షణమే అమల్లోకి వస్తాయని బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఎస్‌బిఐ పేర్కొంది. గడిచిన నాలుగు నెలల్లో ఎస్‌బిఐ బల్క్ డిపాజిట్ రేట్లను సవరించడం ఇది మూడోసారి.

రిటైల్ డిపాజిట్లు

- ఏడాది నుంచి రెండేళ్లలోపు కాలపరిమితి డిపాజిట్లపై చెల్లించే వడ్డీరేటు 0.15 శాతం పెరిగింది. దీంతో డిపాజిట్ రేటు 6.25 శాతం నుంచి 6.40 శాతానికి చేరుకుంది.
- రెండేళ్ల నుంచి పదేళ్లలోపు మెచ్యూరిటీ తీరే డిపాజిట్లపై మరో అర (0.50)శాతం వడ్డీ అదనంగా లభించనుంది. అంటే వడ్డీ రేటు 6 శాతం నుంచి 6.50 శాతానికి పెరిగింది.

బల్క్ డిపాజిట్లు

- ఏడాది నుంచి రెండేళ్లలోపు కాలపరిమితి డిపాజిట్లపై చెల్లించే వడ్డీ 0.50 శాతం పెంచడంతో 6.25 శాతం నుంచి 6.75 శాతానికి చేరుకుంది.
- రెండేళ్ల నుంచి మూడేళ్ల లోపు వరకు డిపాజిట్ రేటును 0.75 శాతం పెంచడంతో 6 శాతం నుంచి 6.75 శాతానికి పెరిగింది.

రూ.10 కోట్లకు పైగా డిపాజిట్లు

- ఏడాది నుంచి రెండేళ్లలోపు డిపాజిట్లపై వడ్డీ రేటు 0.50 శాతం పెరగడంతో 6.25 శాతం నుంచి 6.75 శాతానికి ఎగబాకింది.
- రెండు నుంచి మూడేళ్లలోపైతే 0.75 శాతం పెంపుతో 6.75 శాతానికి చేరుకుంది.

గత నెల నుంచే మొదలైన పెంపు

దేశీయ బ్యాంకింగ్ రంగంలో వడ్డీ రేట్ల పెంపు గత త్రైమాసికం నుంచే మొదలైంది. ఇప్పటికే చాలా బ్యాంకులు తమ డిపాజిట్, రుణ రేట్లను సవరించాయి. ప్రైవేట్ రంగంలో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్, యెస్ బ్యాంకుల వడ్డీ రేట్లు జనవరి నుంచి సరాసరిగా 0.5 శాతం నుంచి 0.10 శాతం వరకు పెరిగాయి. దాదాపు అన్ని ప్రభుత్వ రంగ బ్యాంకులు బల్క్ డిపాజిట్ రేట్లను 0.15 శాతం నుంచి 1.25 శాతం మేర పెంచాయి.

రుణాలు మరింత ప్రియంకానున్నాయా?

ఎస్‌బిఐ డిపాజిట్ రేట్లను భారీగా పెంచడం మున్ముందు రుణాలు మరింత భారం కానున్నాయన్న సంకేతాలిస్తోంది. ప్రస్తుతం రుణాలపై వడ్డీరేటును మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేట్స్ (ఎంసిఎల్ఆర్) ఆధారంగా నిర్ణయిస్తారు. అంటే, డిపాజిట్లతోపాటు ఇతర మార్గాల్లో నిధుల సేకరణ వ్యయం పెరిగితే రుణ రేట్లు పెరిగే అవకాశం ఉంటుంది. గత రెండు నెలలుగా డిపాజిట్ రేట్లు పెరుగుతున్న నేపథ్యంలో త్వరలోనే రుణాలపై అదనపు వడ్డింపు మొదలుకావచ్చు. పైగా వచ్చే ద్రవ్యపరపతి సమీక్షలో ఆర్‌బిఐ కీలక వడ్డీ రేట్లను పెంచే అవకాశాలు లేకపోలేవని కొందరు విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. అదే గనుక జరిగితే బ్యాంకులు రుణాలపై వసూలు చేసే వడ్డీ కూడా గణనీయంగా పెరగవచ్చు.

హార్లే డేవిడ్సన్ రెండు కొత్త బైక్‌లు

లో రైడర్ ధర రూ. 12.99 లక్షలు.. డీలక్స్ ధర రూ. 17.99 లక్షలు



హార్లే డేవిడ్సన్ కొత్త బైక్‌ను విడుదల చేస్తున్న పీటర్ మెకెన్జీ

న్యూఢిల్లీ: అమెరికాకు చెందిన ప్రీమియం బైక్‌ల తయారీ కంపెనీ హార్లే డేవిడ్సన్ భారత మార్కెట్లోకి రెండు కొత్త బైక్‌లను తెచ్చింది. సాఫ్టెయిల్ పోర్ట్‌ఫోలియోలో భాగంగా వీటిని విడుదల చేసినట్టు కంపెనీ తెలిపింది. లో రైడర్ పేరుతో తెచ్చిన బైక్ ధర 12.99 లక్షల రూపాయలుండగా.. డీలక్స్ పేరుతో తెచ్చిన బైక్ ధర 17.99 లక్షల రూపాయలుగా ఉంది. 2017 అక్టోబరులో నాలుగు ఎంవై18 సాఫ్టెయిల్ మోడళ్లను కంపెనీ విడుదల చేసింది. కొత్తగా తెచ్చిన బైక్‌లతో వీటి సంఖ్య ఆరుకు పెరిగింది. ఈ రెండు బైకుల్లో అద్భుతమైన ఫీచర్లను కంపెనీ జోడించింది. లో రైడర్ బైక్‌లో 19 అంగుళాల ఫ్రంట్, 16 అంగుళాల రియర్ రేడియేట్ కాస్ట్ వీల్స్ ఉన్నాయి. స్టాండర్డ్ ఎబిఎస్ (యాంటీ లాక్ బ్రేకింగ్ సిస్టమ్) కూడా ఇందులో ఉన్నాయి. ఇక డీలక్స్ బైక్‌లో ముందు నుంచి వెనుక వరకు రెట్రో మోడర్న్ ఎల్ఇడి లైటింగ్, రన్నింగ్ లైట్లు, టోంబ్‌స్టోన్ టెయిల్ వంటి ఫీచర్లున్నాయి.

దేశీయంగా సాఫ్టెయిల్ పోర్ట్‌ఫోలియోను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో ఈ కొత్త బైక్‌లను తెచ్చినట్టు వీటి విడుదల కార్యక్రమంలో కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ (భారత్, చైనా) పీటర్ మెకెన్జీ తెలిపారు. ఈ మోడళ్లలో 1745 సిసి మిల్‌వాకీ-ఐట్ 107 ఇంజన్ ఉన్నట్టు చెప్పారు. ఈ బైక్‌లు చాలా వేగంగా దూసుకుపోతాయని, ఇంతకు ముందటి బైక్‌లతో పోల్చితే బరువు తక్కువగా ఉంటుందని ఆయన తెలిపారు. భారత మార్కెట్ చాలా పరిణతి చెందిందని, ఇక్కడి కస్టమర్లు ఇన్నోవేషన్, టెక్నాలజీ, సౌకర్యానికి ప్రాధాన్యం ఇస్తున్నట్టు మెకెన్జీ చెప్పారు. ఈ నేపథ్యంలో ప్రీమియం మోటార్‌సైకిళ్లకు డిమాండ్ పెరుగుతోందన్నారు.

బైక్‌ల ధరలో మార్పు

టూరింగ్, సివిఒ విభాగంలోని బైక్‌ల ధరలను హార్లే డేవిడ్సన్ సవరించింది. రోడ్ కింగ్ బైక్ ధరను 28.37 లక్షల రూపాయల నుంచి 24.99 లక్షల రూపాయలకు తగ్గించగా.. స్ట్రీట్ గ్లైడ్ స్పెషల్ ధరను 29.99 లక్షల రూపాయల నుంచి 33.50 లక్షల రూపాయలకు పెంచింది. రోడ్ గ్లైడ్ స్పెషల్ ధరను 35.61 లక్షల రూపాయల నుంచి 32.99 లక్షల రూపాయలకు, సివిఒ టిఎం లిమిటెడ్ ధరను 53.72 లక్షల రూపాయల నుంచి 49.99 లక్షల రూపాయలకు తగ్గించింది.

ఆదిభట్లలో నేడు టాటా-బోయింగ్ యూనిట్ ప్రారంభం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి) : ఐటి, రక్షణ రంగ సంస్థల ఏర్పాటుతో అంతర్జాతీయ ఖ్యాతి అందుకున్న హైదరాబాద్ సమీపంలోని ఆదిభట్ల ప్రత్యేక ఆర్థిక మండలం (సెజ్)లో టాటా గ్రూప్‌తో కలిసి బోయింగ్ ఏర్పాటు చేసిన యూనిట్‌ను కేంద్ర రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్, రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి కె తారక రామారావు గురువారం ప్రారంభించనున్నారు. ఈ సెజ్‌లో టాటా గ్రూప్ ఇప్పటికే కొన్ని విమానాలు, హెలికాప్టర్లలో వినియోగించే విడిభాగాలు తయారు చేస్తోంది. బోయింగ్‌తో కలిసి ఏర్పాటు చేసిన ఈ యూనిట్‌తో ఆదిభట్ల సెజ్‌లో యూనిట్లు ఏర్పాటు చేసేందుకు మరిన్ని అంతర్జాతీయ వైమానిక దిగ్గజ కంపెనీలు ముందుకు వస్తాయని భావిస్తున్నారు.

ద్రవ్య లోటుకు చమురు సెగ

» దిగుమతి సుంకాల పెంపుతో మేకిన్ ఇండియాకు దెబ్బ

» ఆర్‌బిఐ మాజీ గవర్నర్ సుబ్బారావు హెచ్చరిక



సింగపూర్ : పెరుగుతున్న ముడి చమురు ధరలతో ద్రవ్యలోటును కట్టడి చేయడం మున్ముందు భారత్‌కు సవాల్‌కానుందని ఆర్‌బిఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు హెచ్చరించారు. 'ఇండియా ఇన్ ఎ గ్లోబలైజ్డ్ వరల్డ్' పేరుతో దక్షిణాసియా అధ్యయనాల సంస్థ (ఐఎస్ఎఎస్) నిర్వహించిన సదస్సులో సుబ్బారావు ఈ హెచ్చరిక చేశారు. ముడి చమురు ధరలు తక్కువ స్థాయిలో ఉండటం వల్లనే గత నాలుగేళ్లుగా భారత ద్రవ్య లోటు, కరెంట్ ఖాతా లోటు (సిఎడి) అదుపులో ఉన్నాయన్నారు. ఇప్పుడు ముడి చమురు ధరల పెరుగుదలతో సిఎడి మళ్లీ పెరిగిపోయే ప్రమాదం కనిపిస్తోందన్నారు.

సుంకాల పెంపు సరికాదు

బడ్జెట్‌లో కొన్ని వస్తువులపై దిగుమతి సుంకం పెంచడాన్ని సుబ్బారావు వ్యతిరేకించారు. ఈ చర్య 'భారత్‌లో తయారీకీ ఎసరు పెట్టే ప్రమాదం ఉంది' అన్నారు. ఇతర దేశాల వాణిజ్య రక్షణ విధానాలను విమర్శిస్తూ మరోపక్క మనమూ దిగుమతి సుంకాలు పెంచడాన్ని తప్పుబట్టారు. దీని వల్ల అంతర్జాతీయంగా మన దేశ విశ్వసనీయత దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు.

వాణిజ్య మిగులు

పటిష్టమైన వాణిజ్య విధానాలు, ఉత్పాదకత పెంచుకోవడం ద్వారా మాత్రమే దీర్ఘకాలంలో వాణిజ్య మిగులు సాధ్యమవుతుందని దువ్వూరి స్పష్టం చేశారు. కరెన్సీ మారకం రేటు ఇందుకు ఏ మాత్రం ఉపయోగపడదన్నారు. భారత్-చైనా వాణిజ్యమే ఇందుకు ఉదాహరణ అన్నారు. 2001 సంవత్సరంలో చైనాతో కేవలం 100 కోట్ల డాలర్లు మాత్రమే ఉన్న భారత వాణిజ్య లోటు 2016 నాటికి 5,000 కోట్ల డాలర్లకు పెరిగిపోయిందన్నారు. ఈ మధ్యకాలంలో చైనా కరెన్సీ యువాన్‌తో భారత కరెన్సీ రూపాయి మారకం రేటు 70 శాతం పడిపోయినా, సమర్థవంతమైన వాణిజ్య విధానాల ద్వారా చైనా ద్వైపాక్షిక వాణిజ్యంలో మిగులును గణనీయంగా పెంచుకుందని చెప్పారు.

పట్టుకోండి చూద్దాం!

సిబిఐ దర్యాప్తునకు సహకరించేందుకు నీరవ్ నిరాకరణ



న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంక్(పిఎన్‌బి)కు రూ.12,800 కోట్ల మేర కుచ్చుటోపీ పెట్టిన నీరవ్ మోదీని పట్టుకోవడం కేంద్ర ప్రభుత్వానికి సవాలుగా మారింది. గతనెలలోనే విదేశాలకు చెక్కేసిన ఈ ఘరానా మోసగాడు.. చిక్కను, దొరకను అంటున్నాడు. కేసు విచారణలో సహకరించేందుకు ససేమీరా అంటున్న నీరవ్.. వీలైతే పట్టుకోండి చూద్దాం అని సవాలు విసరకనే విసురుతున్నాడు. పిఎన్‌బి కుంభకోణంపై దర్యాప్తు చేస్తున్న సిబిఐ.. విచారణకు హాజరు కావాలంటూ నీరవ్ మోదీ అధికారిక ఇ-మెయిల్ ఐడీకి లేఖ రాసింది. కానీ తాను మాత్రం, వ్యాపారాల్లో బిజీగా ఉండటం వల్ల ఇప్పట్లో ఇండియాకు రావడం కుదరదని సమాధానమిచ్చాడు. దాంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన దర్యాప్తు ఏజెన్సీ.. వచ్చేవారంలోగా తమముందు ప్రత్యక్షంగా హాజరు కావాలని నీరవ్‌ను హెచ్చరించింది. తాను దేశంలోని ఇండియన్ మిషన్‌ను సంప్రదిస్తే వెంటనే భారత్‌కు పంపించే ఏర్పాట్లు చేస్తారని ఆదేశించింది. అంతేకాదు, కోరినప్పుడల్లా విచారణకు హాజరుకావడం తప్పనిసరని, వచ్చేవారంలో తమ కార్యాలయంలో ప్రత్యక్షంగా హాజరుకావాలని నిర్దేశించింది.

పిఎన్‌బి ఆడిటర్ ఎంకె శర్మ అరెస్ట్

పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో అంతర్గత చీఫ్ ఆడిటర్ ఎంకె శర్మను సిబిఐ అరెస్ట్ చేసింది. ఈ స్కాంకు సంబంధించి అరెస్ట్ అయిన తొలి బ్యాంక్ ఆడిటర్ ఇతనే. బ్యాంక్‌లో శర్మది చీఫ్ మేనేజర్ స్థాయి హోదా. బ్రాంచ్ లావాదేవీలను ఆడిట్ చేసి ఏవైనా లోపాలుంటే జోనల్ ఆడిట్ ఆఫీసుకు రిపోర్టు చేయాల్సిన బాధ్యత ఈయనదే. కుంభకోణం వెలుగుచూసిన ముంబైలోని బ్రాడీ హౌజ్ బ్రాంచ్ శర్మ పరిధిలోనే ఉంది.

ఏమాత్రం సంహించం: రవిశంకర్ ప్రసాద్

బ్యాంకింగ్ రంగంలో మొండిబకాయిలు యుపిఎ ప్రభుత్వం నుంచి వారసత్వంగా వచ్చిన సమస్యే నన్న కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్.. ఆర్థిక మోసాలను తమ ప్రభుత్వం ఏమాత్రం సహించదని, దోషులకు కఠినంగా శిక్షించేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకుంటామన్నారు. పిఎన్‌బి స్కాంపై దర్యాప్తు కొనసాగుతున్న నేపథ్యంలో మంత్రి వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

కరప్షన్‌ను కేన్సర్‌తో పోల్చవద్దు..

బ్యాంక్‌లో వెలుగు చూసిన కుంభకోణాన్ని పిఎన్‌బి ఎండి, సిఇఒ సునీల్ మెహతా కేన్సర్‌తో పోల్చడంపై ప్రముఖ కేన్సర్ స్పెషలిస్ట్, పద్మభూషణ్ పురస్కార గ్రహీత విశ్రాంత అభ్యంతరం వ్యక్తం చేశారు. అవినీతి (కరప్షన్) నేరమని, సిగ్గుపడాల్సిన విషయమని, కానీ కేన్సర్ కాదని ఆమె పేర్కొన్నారు. రెండింటికీ అసలు పోలికే లేదన్నారు.

లుమినస్ పవర్ నుంచి సరికొత్త బ్రాండ్

» అమేజ్ పేరుతో బ్యాటరీల తయారీ

» ప్రచారకర్తగా విరాట్ కోహ్లీ నియామకం



న్యూఢిల్లీ: పవర్ బ్యాకప్ పరిష్కారాలందించే లుమినస్ పవర్ అమేజ్ పేరుతో సరికొత్త బ్రాండ్‌ను లాంచ్ చేసింది. ఈ బ్రాండ్ ద్వారా బ్యాటరీను ఉత్పత్తి చేయాలనుకుంటోంది. ఈ బ్రాండ్ వృద్ధి కోసం వచ్చే 3-5 ఏళ్లలో రూ.150 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు సంస్థ తెలిపింది. అమేజ్ బ్రాండ్ ఉత్పత్తులకోసం ప్రత్యేక ప్లాంట్‌ను నిర్మించడంతోపాటు దేశవ్యాప్తంగా సేల్స్ అండ్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకొనేందుకు ఈ పెట్టుబడులను ఉపయోగించుకోనున్నట్లు లుమినస్ వెల్లడించింది. అంతేకాదు, అమేజ్ బ్రాండ్ కోసం క్రికెటర్ విరాట్ కోహ్లీని ప్రచారకర్తగా నియమించుకున్నట్లు సంస్థ తెలిపింది. ఈ సందర్భంగా లుమినస్ పవర్ టెక్నాలజీస్ ఎండి విపుల్ సబర్వాల్ మాట్లాడుతూ.. బ్యాటరీల ఇండస్ట్రీలో అసంఘటిత మార్కెట్ అవసరాలు తీర్చేందుకు ఈ బ్రాండ్‌ను లాంచ్ చేశామన్నారు. ప్రస్తుతం దేశంలో బ్యాటరీల ఇండస్ట్రీ సైజు రూ.10 వేల కోట్ల స్థాయిలో ఉండగా.. అందులో అసంఘటిత మార్కెట్ వాటా 40 శాతంగా ఉందన్నారు.



నాగార్జునసాగర్‌లోని కంట్రోల్ రూంలో ఇరు రాష్ట్రాల అధికారుల చర్చలు

సాగర్ జగడం

(మొదటి పేజీ తరువాయి)

బుధవారం అంగీకరించింది. అలాగే తాజా జల వివాదంపై చర్చించడానికి వీలుగా శుక్రవారం ప్రత్యేకంగా సమావేశం కావాలని కృష్ణా బోర్డు నిర్ణయించింది. కృష్ణా బేసిన్‌లో లభించే నీటిలో ఏపీకి 66 శాతం, తెలంగాణకు 34 శాతం కేటాయించారు. ప్రస్తుతం నాగార్జునసాగర్, శ్రీశైలం రిజర్వాయర్లలో ఉపయోగించుకోవడానికి వీలుగా 36 టీఎంసీల నీరుంది. ఈ నీరంతా తెలంగాణకు చెందినదిగా పరిగణిస్తున్నారు. ఎందుకంటే ఏపీకి కేటాయించిన 66 శాతం నీటిని ఇప్పటికే ఉపయోగించుకుందని అధికారులు చెబుతున్నారు. కృష్ణా బోర్డు కూడా ఏపీ కోటా ముగిసిందని ప్రకటించింది. ఈ మేరకు మంగళవారం ఇరు రాష్ట్రాలకు లేఖ రాసింది. బోర్డు ఆదేశాల మేరకు బుధవారం ఉదయం సాగర్ నుంచి ఏపీకి నీటిని నిలిపివేశారు. ఏపీకి కృష్ణా బోర్డు కేటాయించింది 60 టీఎంసీలు కాగా.. వారు కుడి కాల్వ ద్వారా నాలుగు నెలల్లో 62.5 టీఎంసీల నీటిని వాడుకున్నారని తెలంగాణ సీఈ సునీల్ తెలిపారు. కేటాయించిన నీటి కంటే 2.5 టీఎంసీలు ఎక్కువగా వాడుకున్నారని, అందుకే బోర్డు ఆదేశాల మేరకు కుడి కాల్వకు నీటి విడుదలను నిలిపివేశామని చెప్పారు. దీంతో నాగార్జునసాగర్ డ్యాంపైన ఏపీ అధికారులు హడావుడి చేశారు. ఏపీ అధికారులు కంట్రోల్ రూంకు వెళ్లకుండా భద్రతా సిబ్బంది అడ్డుకోవడంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇరు రాష్ట్రాల పోలీసులు అక్కడికి చేరుకున్నారు. మరోవైపు కుడికాల్వకు నీటి విడుదల కుగాను సాగర్ డ్యాం దగ్గర రెగ్యులేటర్‌ను ఆపరేట్ చేసుకోవాలని, తెలంగాణ అధికారులు అభ్యంతరం చెబితే పోలీసుల రక్షణ తీసుకోవాలంటూ ఏపీ ఈఎన్‌సీ రాసిన లేఖతో ఎస్ఈ రంగంలోకి దిగారు. కృష్ణా బోర్డు కేటాయింపులతో తమకు సంబంధంలేదని ఏపీ అధికారులు తెలంగాణ అధికారులతో వాదించారు. ఈ క్రమంలో ఏపీ సీఎం చంద్రబాబు కూడా తమకు నీరు విడుదల చేయాలని కృష్ణా బోర్డు సభ్య కార్యదర్శి పరమేశంతో మాట్లాడారు. కనీసం 2000 క్యూసెక్కులైనా విడుదల చేయాలని కోరారు. ఈ నేపథ్యంలో ఐదు రోజుల పాటు నాగార్జునసాగర్ కుడికాల్వకు రోజుకు 2వేల క్యూసెక్కుల నీటి విడుదలకు బోర్డు అంగీకరించింది. ఈ మేరకు బుధవారం సాయంత్రం నుంచి కుడి కాల్వకు నీటిని విడుదల చేశారు. అలాగే ఈ వివాదంపై చర్చించడానికి శుక్రవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తున్నట్టు బోర్డు ప్రకటించింది. ఈ సమావేశానికి హాజరు కావాలని ఇరు రాష్ట్రాల నీటిపారుదల శాఖ అధికారులకు సమాచారం అందించింది. మరోవైపు ఏపీ అధికారుల తీరును నిరసిస్తూ ఫైలాన్ కాలనీలో టీఆర్ఎస్ నాయకులు నిరసన తెలిపారు.

నక్సల్స్ ప్రభావిత జిల్లాల్లో రోడ్లకు రూ.547 కోట్లు

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని నక్సల్స్ ప్రభావిత జిల్లాల్లో రోడ్ల నిర్మాణానికి రూ. 547 కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసినట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఆ నిధులతో కుమ్రంభీం, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల్లో రోడ్లను విస్తరిస్తామని ఆయన చెప్పారు. రహదారులు, భవనాల శాఖపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇంజనీర్ ఇన్ చీఫ్ ఆర్ అండ్ బీ ప్రధాన కార్యాలయంలో బుధవారం సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల క్యాంప్ ఆఫీస్ భవనాలు, జిల్లాల్లో ఇతర ప్రభుత్వ భవన నిర్మాణాలను మే నెల నాటికి పూర్తి చేయాలని ఈ సందర్భంగా తుమ్మల ఆదేశించారు. పూర్తయిన భవనాలను ఉగాదికి గృహప్రవేశానికి సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఆర్ అండ్ బీ ముఖ్య కార్యదర్శి సునీల్ శర్మ, ఇంజనీర్ ఇన్ చీఫ్‌లు రవీందర్ రావు, గణపతి రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. రాష్ట్రంలో వివిధ రంగాల్లో విశేష సేవలందించిన మహిళలను ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మార్చి 8వ తేదీన సత్కరిద్దామని అధికారులకు సూచించారు. ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులతో బుధవారం సచివాలయంలో మంత్రి సమావేశమయ్యారు. బేటీ బచావో బేటీ పఢావో కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేసి కేంద్రం ప్రశంసలు పొందినందుకు హైదరాబాద్ జిల్లా అధికారులను మంత్రి అభినందించారు.

ఉద్యాన వర్సిటీకి 100 కోట్లు ఇవ్వండి : పోచారం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఉద్యాన యూనివర్సిటీకి రూ.100 కోట్లు కేటాయించాలని కేంద్ర వ్యవసాయ మంత్రి రాధామోహన్‌సింగ్‌ను రాష్ట్ర మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డిని కోరారు. ఇండియన్ అగ్రికల్చర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో బుధవారం జరిగిన భారత వ్యవసాయ పరిశోధన మండలి 89వ వార్షిక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. కేంద్రమంత్రిని అక్కడే కలిసి 4 వినతి పత్రాలు అందజేశారు. కృషి విజ్ఞాన కేంద్రాలు ఏర్పాటు చేయాలని, రైతులు, అధికారులు కలసి చర్చించుకునే వేదికగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసే కిసాన్ భవన్‌కు కేంద్ర సాయం ఇవ్వాలని, రాష్ట్రంలో అదనంగా పండిన కందులు కొనుగోలు చేయాలని కోరారు. రాధామోహన్‌సింగ్ సానుకూలంగా స్పందించారని తెలిపారు.

పరీక్షల ఏర్పాట్లపై మంత్రి కడియం సమీక్ష

హైదరాబాద్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలను ఎలాంటి పొరపాట్లు జరగకుండా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఉప ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి ఆదేశించారు. టెన్త్, ఇంటర్ పరీక్షల నిర్వహణపై సచివాలయంలో బుధవారం కలెక్టర్లు, ఎస్పీలు, డీఈవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. దూరప్రాంతాల్లో, ఏజెన్సీ ఏరియాల్లో ఉన్న పరీక్షా కేంద్రాలకు ప్రత్యేక బందోబస్తు కల్పించాలన్నారు. విద్యార్థుల రవాణాకు సంబంధించి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, హెల్ప్‌డెస్కులు ఏర్పాటు చేయాలన్నారు.

సీనియర్ ఐఏఎస్ రాజీవ్ రంజన్‌కు పదోన్నతి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ కేడర్ సీనియర్ ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రాను జాతీయ గంగానది ప్రక్షాళన మిషన్ డైరెక్టర్ జనరల్‌గా ప్రభుత్వం నియమించింది. ఇప్పటివరకు ఆయన కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు అదనపు కార్యదర్శిగా ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ కేడర్ ఐఏఎస్ అధికారి రెడ్డి సుబ్రహ్మణ్యంకు కేంద్ర మానవవనరుల అభివృద్ధి శాఖలో ఉన్నత విద్యాశాఖ కార్యదర్శిగా పదోన్నతి లభించింది.

మోదీపై కేసీఆర్‌వి దిగజారుడు వ్యాఖ్యలు : లక్ష్మణ్

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ప్రధాని మోదీపై సీఎం కేసీఆర్ దిగజారుడు వ్యాఖ్యలు చేశారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ మండిపడ్డారు. సీఎం పదవిలో ఉన్నారన్న సోయి లేకుండా చౌకబారు వ్యాఖ్యలు చేయడం దారుణమని, ఇప్పటికైనా భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. శ్యాంప్రసాద్ ముఖర్జీ, దీన్‌దయాళ్ గురించి మాట్లాడేముందు వారి చరిత్ర తెలుసుకోవాలని కేసీఆర్‌కు హితవు పలికారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయని టీఆర్ఎస్.. పెట్టుబడి పథకంతో రైతుల ఓట్లకు గాలం వేస్తోందని విమర్శించారు. సింగరేణిలో వారసత్వ ఉద్యోగాలు, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ సమస్యల్ని గాలికి వదిలేసిన కేసీఆర్.. మరోసారి వారిని దగా చేసేందుకు సిద్ధమవుతున్నారని ఆరోపించారు.

ఎన్‌సీఆర్‌బీ ట్రోఫీ అందుకున్న ఏడీజీ అంజనీకుమార్

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మక నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో(ఎన్‌సీఆర్‌బీ) ట్రోఫీని అదనపు డీజీపీ(శాంతిభద్రతలు) అంజనీకుమార్ అందుకున్నారు. చెన్నైలో బుధవారం జరిగిన ఆల్ ఇండియా పోలీస్ డ్యూటీమీట్‌లో తమిళనాడు సీఎం పళనిస్వామి చేతుల మీదుగా డీజీపీ మహేందర్ రెడ్డి తరపున అంజనీ కుమార్ ఈ ట్రోఫీ అందుకున్నారు. పోలీసింగ్‌లో టెక్నాలజీ వాడకంపై ఎన్‌సీఆర్‌బీ నిర్వహిస్తున్న పోటీల్లో టీఎస్‌కాప్ యాప్ 2017 ఉత్తమ ఆవిష్కరణగా ట్రోఫీకి ఎంపికైన సంగతి తెలిసిందే.

తొందరొద్దు.. సమయం ఇవ్వండి : తహసీల్దార్లు

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : తహసీల్దార్ల రిజిస్ట్రేషన్‌లో తొందరపాటు వద్దని, కొంత సమయం ఇవ్వాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషిని బుధవారం తెలంగాణ తహసీల్దార్ల సంఘం (టీజీటీఏ) వ్యవస్థాపక అధ్యక్షుడు లచ్చిరెడ్డి, అధ్యక్షుడు గౌతంప్రసాద్ కలిసి విన్నవించారు. ఏకకాలంలో రిజిస్ట్రేషన్లు కాకుండా ప్రయోగాత్మకంగా ఒక మండలంలో రిజిస్ట్రేషన్లకు అనుమతినించాలని, ఫలప్రదమైతే అంతటా వర్తింపచేయాలన్నారు.

ఒక్క యాప్.. 150 సేవలు

అందుబాటులోకి 'టీ-యాప్ ఫోలియో'.. ఆవిష్కరించిన మంత్రి కేటీఆర్



'టీ-యాప్ ఫోలియో' బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి కేటీఆర్, డీజీపీ మహేందర్ రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆస్తిపన్ను చెల్లింపులకు ఒక యాప్.. పోలీసు ఫిర్యాదులకు మరో యాప్.. రవాణాశాఖకు ఇంకో యాప్.. ఇలా వేర్వేరు ప్రభుత్వ శాఖలకు వేర్వేరు మొబైల్ అప్లికేషన్లు(యాప్) అందుబాటులో ఉండగా.. ఇప్పుడు అన్ని ప్రభుత్వశాఖల సేవలన్నీ ఒకే యాప్‌లో అందుబాటులోకి వచ్చాయి. మీ-సేవలో అందిస్తున్న పలు సేవలు కలిపి మొత్తం 150 రకాల సేవలు అందించే 'టీ-యాప్ ఫోలియో' యాప్‌ను ప్రభుత్వం రూపొందించింది. దీన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి కేటీఆర్ బుధవారం ఆవిష్కరించారు. ఈ తరహా సేవలను ప్రస్తుతం కర్ణాటక అందిస్తుండగా.. రెండో రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని మంత్రి తెలిపారు.

టీవ్యాలెట్‌తో రూ. 100కోట్ల లావాదేవీలు

ల్యాండ్‌ఫోన్ కోసం సంవత్సరాల తరబడి నిరీక్షించే పరిస్థితి నుంచి నిమిషంలో మొబైల్‌ఫోన్ కొనుక్కునే స్థాయికి దేశం అతి తక్కువ కాలంలో అభివృద్ధి చెందిందని కేటీఆర్ అన్నారు. దీనికి ప్రధానిగా పీవీ నరసింహారావు ప్రవేశపెట్టిన సంస్కరణలే కారణమని కొనియాడారు. సమాచార శూన్యం నుంచి సమాచార విప్లవం సాధించాక ప్రభుత్వ పాలన అంతా మొబైల్ పాలనకు మారిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా ఉపయోగిస్తూ జాతీయస్థాయిలోనే అగ్రగామిగా కొనసాగుతుందన్నారు. పెద్దనోట్ల రద్దు తర్వాత డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించేందుకు రాష్ట్రం ప్రారంభించిన టీ-వ్యాలెట్ యాప్ దేశంలోనే మొట్టమొదటిదని, దీంతో ఇప్పటివరకు రూ.100 కోట్ల లావాదేవీలు పూర్తిచేశామని చెప్పారు. 'టీ-యాప్ ఫోలియో' ద్వారా ప్రస్తుతానికి 150 రకాల సేవలు అందిస్తామని, ఏడాదిలోపు వెయ్యి సేవలు అందించడం ప్రభుత్వ లక్ష్యమన్నారు. 'ఈ యాప్‌తో తమ ఆదాయానికి గండి పడుతుందని మీ-సేవ ఆపరేటర్లు ఆందోళన చెందొద్దు. మీ ఆదాయాన్ని పెంచేందుకు అదనపు సేవలకు అవకాశం కల్పిస్తాం' అని మంత్రి భరోసా ఇచ్చారు. ఈ ఏడాది చివర్లోగా టీ-ఫైబర్ ప్రాజెక్టు పూర్తవుతుందని, ఇది రాష్ట్రంలో మరో విప్లవానికి నాంది పలుకుతుందన్నారు. నివాసాలకు 15 ఎంబీపీఎస్, పోలీసు స్టేషన్లు, పీహెచ్‌సీలు, గ్రామ పంచాయతీలు, పాఠశాలలకు 1 జీబీపీఎస్ వేగంతో ఇంటర్‌నెట్ సౌకర్యం అందిస్తామన్నారు. సీఎం కేసీఆర్ ఇటీవలే ప్రకటించిన రైతు ప్రాంగణాలకు టీ-ఫైబర్ ద్వారా ఇంటర్‌నెట్ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. టెన్నిస్ అంతర్జాతీయ ర్యాంకింగ్స్‌లో టాప్-100 సాధించిన హైదరాబాద్ క్రీడాకారుడు విష్ణువర్ధన్‌ను ఈ సమావేశంలో మంత్రి ప్రత్యేకంగా అభినందించారు.

భూ క్రయవిక్రయాల నమోదుకు 'ధరణి' యాప్

తాము అమ్మిన, కొనుగోలుచేసిన భూ వివరాలను ప్రభుత్వ రికార్డుల్లో నమోదు చేసుకునేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారని రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారీ అన్నారు. దీనికి పరిష్కారంగా త్వరలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో 'ధరణి' యాప్ ప్రారంభిస్తామని ప్రకటించారు. రైతులు భూ వివరాలు యాప్‌లో నమోదు చేస్తే రికార్డుల్లోనూ మారిపోతుందన్నారు. ఐటీ, పరిశ్రమల శాఖల ముఖ్యకార్యదర్శి జయేష్‌రంజన్ మాట్లాడుతూ.. మీ-సేవలో అందిస్తున్న సేవలన్నీ త్వరలో 'టీ-యాప్ ఫోలియో ద్వారా అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీ బూర నర్సయ్య గౌడ్, డీజీపీ మహేందర్ రెడ్డి, పౌరసరఫరా శాఖ కమిషనర్ సీవీ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

'టీ-యాప్ ఫోలియో' ప్రస్తుత సేవలు

- ఈ మొబైల్ యాప్‌ను ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఫీచర్‌ఫోన్ వినియోగదారులు సైతం 14406కి ఫోన్ చేసి ఈ సేవలను వినియోగించుకోవచ్చు.
- మొబైల్, ల్యాండ్‌ఫోన్ల చెల్లింపులు, ఇంటర్నెట్, డీటీహెచ్ చెల్లింపులు చేసుకోవచ్చు.
- రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖలకు సంబంధించి అడంగల్/పహాణీ, ఆర్‌వోఆర్ 1బి, మ్యుటేషన్, ఈ-పట్టాదారు పాసుపుస్తకం, ఎంఫ్ఎంబీ పత్రం, ఇనాం భూముల స్వాధీనత హక్కు ధ్రువీకరణ, రిజిస్ట్రేషన్ దస్తావేజు పత్రాలకు దరఖాస్తు చేసుకోవచ్చు.
- ఆదాయ, కుల, జనన, మరణ, నివాస, ధ్రువీకరణ పత్రాలకు దరఖాస్తు చేయొచ్చు.
- జీహెచ్ఎంసీ ఆస్తిపన్ను చెల్లించవచ్చు.
- భద్రాచలం సీతారామచంద్ర స్వామి, యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి, వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయాల సేవలు, వసతి బుకింగ్ సౌకర్యం దీని ద్వారా పొందొచ్చు.
- రవాణాశాఖ పరిధిలోని కొత్త లైసెన్సు స్లాట్ బుకింగ్, డ్రైవింగ్ లైసెన్సు టెస్ట్ ఫీజు, లైసెన్స్ పునరుద్ధరణ లాంటి సేవలు పొందవచ్చు. లైఫ్ ట్యాక్స్, ట్రాఫిక్ చలాన్ చెల్లించవచ్చు. మీసేవ కేంద్రాలు, చౌక ధరల దుకాణాల వివరాలనూ పొందవచ్చు. దీంతోపాటు జీహెచ్ఎంసీ, పర్యాటక శాఖ, హైదరాబాద్ మెట్రో వివరాలను ఈ యాప్ ద్వారా పొందవచ్చు.



సూర్యాపేట జిల్లా చిల్పకుంట్లలో మంచి నీటి నల్లాను ప్రారంభిస్తున్న కేటీఆర్, జగదీశ్‌రెడ్డి

కాంగ్రెస్ నేతలు కుక్కల్లా మొరుగుతూనే ఉంటరు

- బస్సు యాత్రలో జానా బాబా 40 దొంగలు
- ఇంటింటికీ తాగు నీళ్లిచ్చి తీరుతాం: కేటీఆర్

సూర్యాపేట/నూతనకల్,ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నేతలు కుక్కల్లా మొరుగుతూనే ఉంటారని, వారిని పట్టించుకోవద్దని ప్రజలకు మంత్రి కేటీఆర్ సూచించారు. మిషన్ భగీరథలో భాగంగా 175 గ్రామాలకు రక్షిత నీటి సరఫరా పథకాన్ని బుధవారం సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం చిల్పకుంట్ల గ్రామంలో ఆయన ప్రారంభించారు. అనంతరం మద్దిరాలలో జరిగిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ.. అది కాంగ్రెస్ నేతల బస్సు యాత్రలా లేదని, జానా బాబా 40 దొంగల యాత్రలా ఉందని ఎద్దేవా చేశారు. బస్సు యాత్ర చేస్తున్న నాయకులపై నేర చరిత్ర ఉందన్నారు. "ఓటుకు నోటు కేసులో దొరికిన చిల్లర దొంగ రేవంత్‌రెడ్డి.. గత ఎన్నికల్లో డబ్బులతో దొరికిన ఉత్తమ్.. వాళ్లు వచ్చి నీతులు చెబుతున్నరు. కాంగ్రెస్ నేతలంతా దొంగలే. వారి బస్సు యాత్రను చూసి ప్రజలు నవ్వుకుంటున్నరు. కిరణ్‌కుమార్ తెలంగాణకు ఒక పైసా ఇవ్వనంటే నోరు మెదపని చేతకాని దద్దమ్మలు కాంగ్రెస్ నేతలు" అని కేటీఆర్ దుయ్యబట్టారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి మంచి నీరు ఇచ్చి తీరుతామన్నారు. "మేము తన్నాల్సి వస్తే నల్లగొండ జిల్లాలో ఒక్క కాంగ్రెస్ నేత మిగలడు. కానీ మేం ఆ పని చేయం. రాజకీయ ఘర్షణకు తావు లేకుండా తుంగతుర్తి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తాం. మమల్ని తన్నాల్సి వస్తే ప్రజలే బ్యాలెట్ అనే ఆయుధం ద్వారా మమ్ములను దింపుతారు" అని మంత్రి జగదీశ్‌రెడ్డి ఆవేశంగా అన్నారు.



ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను అభినందిస్తున్న హరీశ్‌రావు, కడియం శ్రీహరి, నాయిని నర్సింహారెడ్డి, జగదీశ్‌రెడ్డి

ఎస్సీ, ఎస్టీల సంక్షేమమే లక్ష్యం

- ఎర్రోళ్లకు చిన్న వయసులో పెద్ద బాధ్యత: కడియం
- ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా ఎర్రోళ్ల శ్రీనివాస్ ప్రమాణం

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, ఇందుకోసం సీఎం కేసీఆర్ ఎన్నో పథకాలను ప్రవేశపెట్టారని ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి అన్నారు. ఆయా పథకాలు ఎలా అమలవుతున్నాయో సమీక్షించి.. ప్రభుత్వానికి సలహాలు, సూచనలు చేయాల్సిన బాధ్యత ఎస్సీ, ఎస్టీ కమిషన్‌పై ఉందన్నారు. బుధవారం రవీంద్రభారతిలో జరిగిన తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, సభ్యుల బాధ్యతల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎర్రోళ్ల శ్రీనివాస్ చిన్న వయసులోనే పెద్ద బాధ్యత నిర్వహించడం సంతోషంగా ఉందని, చట్టాలను పటిష్ఠంగా అమలు చేయాల్సిన బాధ్యత కమిషన్‌పై ఉందని అన్నారు. హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. ఉద్యమంలో పనిచేసిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుందన్నారు. కాగా ఎస్సీ, ఎస్టీ కమిషన్.. సీఎం కేసీఆర్ ఆలోచనలను ముందుకు తీసుకెళ్తూ ప్రభుత్వానికి అండగా ఉండాలని కోరుకుంటున్నట్లు మంత్రి హరీశ్‌రావు తెలిపారు. దళితులపై దాడులను అరికట్టడంలో కమిషన్ తనవంతు పాత్ర పోషించాలని మంత్రి జగదీశ్‌రెడ్డి కోరారు. సీఎం కేసీఆర్ ఆలోచనలకు అనుగుణంగా దళితులకు సంక్షేమ పథకాలు అందేలా పనిచేస్తానని ఎర్రోళ్ల శ్రీనివాస్ తెలిపారు. బాధితులు కమిషన్ కార్యాలయానికి రావాల్సిన అవసరం లేదని, తమ సమస్యపై ఒక్క ఫోన్‌కాల్, ఎస్సెమ్మెస్ చేసినా, పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, జోగు రామన్న, తలసాని, డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి, జీహెచ్ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్, ఎంపీలు ఎమ్మెల్యేలు హాజరై ఎర్రోళ్లకు శుభాకాంక్షలు తెలిపారు.

రైతన్నల ఆత్మహత్యలు ఆగాలి

- కాళేశ్వరం, మిషన్ భగీరథ మంచి ప్రయత్నాలు : శ్రీ మాతా అమృతానందమయి దేవి

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): దేశంలో రైతుల పరిస్థితి బాగోలేదని, ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని సద్గురు శ్రీ మాతా అమృతానందమయి దేవి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితులు పూర్తిగా మారాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. అందరికీ అన్నం పెట్టే రైతన్నకు అవసరమైన వసతులు సమకూర్చడం సమాజం బాధ్యత అని అన్నారు. ఈ బాధ్యతను తెలంగాణ ప్రభుత్వం గొప్పగా నెరవేరుస్తోందని ప్రశంసించారు. సముద్రం పాలవుతున్న నీటిని కాళేశ్వరం లాంటి ప్రాజెక్టుల ద్వారా పంట పొలాలకు తరలించడం, ప్రతి ఇంటికి సురక్షిత మంచినీటి కోసం మిషన్ భగీరథ పథకం అమలు చేయడం మంచి నిర్ణయాలని అభినందించారు. భారతదేశ యాత్రలో భాగంగా తెలంగాణలో పర్యటిస్తున్న అమ్మ.. సికింద్రాబాద్‌లోని మాతా అమృతానందమయి మఠంలో భక్తులకు బుధవారం దర్శనమిచ్చి, ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు.. మఠానికి వెళ్లి అమ్మ ఆశీర్వాదం తీసుకున్నారు. రాష్ట్రంలో ప్రాజెక్టులు త్వరగా పూర్తయి, రైతులకు సాగునీరు అందేలా ఆశీర్వదించాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా ప్రాజెక్టుల గురించి అమ్మ వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాళేశ్వరం, పాలమూరు ఎత్తిపోతల పథకాలు, మిషన్ కాకతీయతో పాటు వ్యవసాయాభివృద్ధి, రైతు సంక్షేమానికి కేసీఆర్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను హరీశ్ వివరించారు. దీనికి ఆమె స్పందిస్తూ రైతన్నలకు అండగా ఉండాలని పిలుపునిచ్చారు. ఆత్మహత్యలు చేసుకున్న రైతుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణలో 20 గ్రామాలను దత్తత తీసుకుంటానన్నారు.



హైదరాబాద్‌లో మాతా అమృతానందమయి దేవిని కలిసిన మంత్రి హరీశ్‌రావు

సత్యమార్గం, శాంతి మార్గమే ప్రధానం: హరీశ్‌రావు

మాతా అమృతానందమయి మఠం సందర్శించిన సందర్భంగా హరీశ్‌రావు అక్కడి భక్తులతో మాట్లాడారు. ఇప్పుడు సమాజానికి కావల్సింది శాంతి మార్గం, సత్య మార్గమే అని అన్నారు. ఈ సన్మార్గాన్ని అందిస్తున్నందునే సద్గురు శ్రీ మాతా అమృతానందమయి దేవిని దేశమంతా అమ్మగా పిలుస్తోందన్నారు. దైవత్వంగా కొనియాడటానికి ఆమె మానవత్వమే కారణమన్నారు. అమ్మ చేసిన సేవ, చూపిస్తున్న ప్రేమ మానవ జాతికి మంచి సందేశమన్నారు. ఒత్తిడిని జయించడానికి శాంతి, సహనం ఎంతో ప్రధానమన్నారు. తోటి మానవుడి హితం కోరి చేసే పనులే మనల్ని చరితార్థులను చేస్తాయన్నారు.

విలీనం ప్రసక్తే ఉండదు

- ఆ అధికారం మోత్కుపల్లికి లేదు
- అలా మాట్లాడే వారు పార్టీ వ్యతిరేకులే
- తెలంగాణలో 'నారా' నాయకత్వం ఉండదు
- కార్యకర్తలకు చంద్రబాబు దిశానిర్దేశం



చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరుతున్న మాజీ ఎమ్మెల్యే బండి పుల్లయ్య

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీని.. ఏ పార్టీలోనూ విలీనం చేసే ప్రసక్తే లేదని టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తేల్చి చెప్పారు. పార్టీని విలీనం చేస్తామనే అధికారం మోత్కుపల్లి సహా ఎవరికీ లేదని, అలా ఎవరైనా మాట్లాడితే వారు పార్టీ వ్యతిరేకులేనని స్పష్టం చేశారు. ఒకరిద్దరు నాయకులు కుప్పిగంతులు వేసినంత మాత్రాన పార్టీకి నష్టమేమీ ఉండదని అభిప్రాయపడ్డారు. రాజకీయ అవసరాలను బట్టి, కార్యకర్తల మనోభావాలకు అనుగుణంగా పొత్తులపై నిర్ణయం తీసుకుంటామని ప్రకటించారు. ఎన్టీఆర్‌భవన్‌లో టీడీపీటీఎస్ అధ్యక్షుడు రమణ అధ్యక్షతన బుధవారం జరిగిన పార్టీ సర్వసభ్య సమావేశానికి చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యకర్తల సందేహాలను నివృత్తి చేయడంతోపాటు నాయకత్వానికి దిశానిర్దేశం చేశారు. టీడీపీతో పొత్తు ఉండబోదని బీజేపీ నాయకులు ఏకపక్షంగా ప్రకటించుకున్నారని, అందరితో మాట్లాడి తగిన సమయంలో తగిన నిర్ణయం తీసుకుంటానని పేర్కొన్నారు. రానున్న ఎన్నికలకు సర్వ శక్తులు వడ్డాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో టీడీపీ జెండా ఎగురవేయాలంటే నారా కుటుంబం నాయకత్వ బాధ్యతలు చేపట్టాలని కార్యకర్తలు నినాదాలు చేయగా.. బాబు వారించారు. పార్టీని కాపాడుకోవాలంటే స్థానిక నాయకత్వం బలపడాలన్నారు. కాగా, చంద్రబాబు పర్యటన రెండు గంటలు ఆలస్యమవడంతో పొలిట్‌బ్యూరో, కేంద్రకమిటీ నాయకులతో జరగాల్సిన సమావేశం గురువారానికి వాయిదా పడింది. 40 ఏళ్ల రాజకీయ ప్రస్థానం పూర్తిచేసుకున్న బాబుకు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. కాగా, వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన పొలిట్‌బ్యూరో సభ్యుడు మోత్కుపల్లి నర్సింహులు సమావేశానికి హాజరుకాలేదు. టీడీపీని వీడుతారంటూ ప్రచారం జరుగుతున్నప్పటికీ వంటేరు ప్రతాప్‌రెడ్డి ఎన్టీఆర్ భవన్‌కు వచ్చారు. మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బండి పుల్లయ్య, జనగామకు చెందిన రాజారెడ్డి, ఎమ్మార్పీఎస్ నాయకుడు ఆనంద్ టీడీపీలో చేరగా, పార్టీ కండువాలు కప్పి చంద్రబాబు ఆహ్వానించారు.


జర్నలిస్టులకు ఆర్థిక భరోసా ఉండాలి

- అప్పుడే పనిలో సమర్థత కనబరుస్తారు: స్వామిగౌడ్
- జర్నలిస్టుల కుటుంబాలకు మీడియా అకాడమీ ఆర్థిక సాయం

హైదరాబాద్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులకు ఆర్థిక భరోసా ఉంటేనే వృత్తి నిర్వహణను సమర్థవంతంగా నిర్వహించగలుగుతారని, అప్పుడే ప్రజాస్వామ్యం నిలబడుతుందని శాసనమండలి చైర్మన్ కె.స్వామిగౌడ్ అన్నారు. చిన్న, మధ్య, పెద్ద పత్రికలనే తారతమ్యం లేకుండా జర్నలిస్టులందరినీ ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఇటీవల మృతి చెందిన జర్నలిస్టుల కుటుంబాలకు, అనారోగ్యం, ప్రమాదాలకు గురైన జర్నలిస్టులకు రాష్ట్ర మీడియా అకాడమీ బుధవారం పబ్లిక్ గార్డెన్స్‌లోని తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో కర్ణాటక ప్రెస్ అకాడమీ బృందం సమక్షంలో చెక్కులు పంపిణీ చేసింది. తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ మీడియా సలహాదారు కేవీ రమణాచారి, ఎంపీ కే కేశవరావు, ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్, సీనియర్ జర్నలిస్టు గౌరీశంకర్, టీయూడబ్ల్యూజే నేత పల్లె రవికుమార్, తెలంగాణ టుడే ఎడిటర్ శ్రీనివాస్‌రెడ్డి, మల్లేపల్లి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

వర్తమానం, భవిష్యత్తు.. టీఆర్ఎస్‌దే: పల్లా

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : రాజకీయాల్లో వర్తమానం, భవిష్యత్తు.. టీఆర్ఎస్‌వేనని ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ చరిత్రగానే మిగిలిపోతుందని, బీజేపీది వర్తమానం మాత్రమేనని వ్యాఖ్యానించారు. రైతాంగానికి మేలు చేసే పార్టీలకు మాత్రమే దేశ రాజకీయాల్లో భవిష్యత్తు ఉంటుందని స్పష్టం చేశారు. టీఆర్ఎస్ఎల్పీలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ నేతలు ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని టీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు సూచించారు. చీఫ్ విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బోడకుంటి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, భూపాల్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపిస్తున్న కేసీఆర్‌ను విమర్శిస్తే సహించేది లేదన్నారు.



మహా నిర్యాణం

(మొదటి పేజీ తరువాయి)

దర్శనమిచ్చిన ఆయన.. అంతలోనే అస్వస్థతకు గురయ్యారు. బాత్‌రూమ్‌కు వెళ్లి అక్కడే స్పృహతప్పి పడిపోయారు. సేవకులు స్వామీజీని సమీపంలోని ఏబీసీ హాస్పిటల్‌కు తరలించారు. వైద్యులు ఆయనకు స్వస్థత చేకూర్చేందుకు ఎంతగా ప్రయత్నించినప్పటికీ ఉపయోగం లేకపోయింది. గుండెపోటుతో ఆయన ఉదయం 9 గంటలకు నిర్యాణం చెందినట్టు మఠం నిర్వాహకులు ప్రకటించారు. జయేంద్ర పార్థివదేహాన్ని ఆసుపత్రి నుంచి అంబులెన్సులో శంకర మఠానికి తీసుకెళ్లారు. అక్కడ మఠం సంప్రదాయాల మేరకు పార్థివదేహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తుల సందర్శనార్థం ధ్యానమఠంలో ఉంచారు. స్వామి భౌతికకాయంపై పుష్పమాలను, ఆయన ఉపయోగించిన ధ్యానరుద్రాక్ష మాలను ఉంచి.. కంచి నూతన పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి అంజలి ఘటించారు.

శోకసంద్రం..

జయేంద్ర సరస్వతి నిర్యాణంతో కాంచీపురంలోని మఠం శోకసంద్రమైంది. మఠం నిర్వాహకులు, భక్తులు స్వామిని తలచుకుంటూ కన్నీటి పర్యంతమవుతున్నారు. నుదుట విభూతి, కుంకుమతో.. చేతులు జోడించి.. ధ్యానముద్రలో ఉన్న స్వామి పార్థివ దేహాన్ని చూసి.. 'జయ జయ శంకర.. హర హర శంకర' అంటూ భక్తులు స్వామికి అశ్రుతర్పణం చేశారు. కాగా గురువారం ఉదయం 10 గంటలకు జయేంద్ర పార్థివదేహం మఠంలోని శ్రీ చంద్రశేఖరేంద్ర సమాధి పక్కనే బృందావన ప్రవేశం చేస్తుందని మఠం వర్గాలు తెలిపాయి. పార్థివదేహానికి గురువారం ఉదయం 7 గంటల వరకు భక్తులు అంజలి ఘటించవచ్చు. అనంతరం జయేంద్ర సరస్వతి స్వామి ముక్తికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. జయేంద్ర సరస్వతి స్వామి పార్థికదేహానికి కూడా ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం 10 గంటలకు అంతిమసంస్కారాలు పూర్తి చేస్తారు. మంటపం ముందున్న గదిలో కూర్చుని నిత్యం ఆయన భక్తులకు ఆశీస్సులు అందజేసిన చోటే పార్థివ దేహాన్ని ఖననం చేయనున్నట్లు మఠం వర్గాలు తెలిపాయి.

కంచిలోనే తుది శ్వాస

తీరిన చివరి కోరిక

చెన్నై, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కంచి అంటే జయేంద్ర సరస్వతికి ఎనలేని ఇష్టం. అందుకే తన తుది శ్వాస ఆ గడ్డ మీదే విడవాలని ఆయన గాఢంగా కోరుకున్నారని మఠం వర్గాలు తెలిపాయి. కంచిలోనే.. అదీ కామాక్షి అమ్మవారి సన్నిధి సమీపంలోనే బుధవారం ఆయన శివైక్యం పొందారు. గత నెలలో శ్వాస తీసుకోవడానికి ఆయన ఇబ్బంది పడగా మఠం నిర్వాహకులు చెన్నైలోని శ్రీ రామ చంద్రా మెడికల్ ఆస్పత్రికి తరలించారు. కొద్దిసేపటికే ఆయన కోలుకున్నా.. ఆస్పత్రిలోనే విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు. అయినా, కంచికి వచ్చిన జయేంద్ర.. అమ్మవారి ఆలయ సమీపంలోని ఆస్పత్రిలో తుది శ్వాస విడిచారు.

సమస్యల పరిష్కారానికి భక్తుల వద్దకే..

తన భక్తుల కోసం ఒక కిలోమీటర్ ఎక్కువ నడవడానికైనా జయేంద్ర సరస్వతి సిద్ధపడతారు. భక్తుల తగాదాలు పరిష్కరించేందుకు ఆసక్తి చూపుతారు. ఉన్నతాధికారులు, రాజకీయనాయకులు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు.. ఇలా ఎవరైనా సరే ఏదైనా వివాదం ఉంటే తానే స్వయంగా పరిష్కరించేందుకు ఏమాత్రం వెనుకాడరు.

విషాదంలో స్వగ్రామం

జయేంద్ర సరస్వతి శివైక్యం చెందారన్న వార్తతో.. ఆయన పుట్టిపెరిగిన ఇరుల్నీకి (తంజావూరు జిల్లా) గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఊరి సామాజిక, ఆధ్యాత్మిక అభివృద్ధికి స్వామి ఎంతగానో సహాయం చేశారని గ్రామస్థులు గాద్గదిక స్వరాలతో తెలిపారు. చంద్రశేఖర గ్రామీణాభివృద్ధి ట్రస్టు దారా స్వామి ఇరుల్నీకిలో పలువురు మహిళలకు కుట్టుపనిలో శిక్షణ ఇప్పించారని, ఒక ఆస్పత్రి, గ్రామస్థుల దాహార్తి తీర్చే ఓవర్‌హెడ్ ట్యాంకు పాఠశాల భవనం వంటివి కట్టించారని గుర్తు చేసుకున్నారు.



జయేంద్ర సరస్వతి పార్థివదేహం వద్ద విలపిస్తున్న శిష్యులు

బృందావన ప్రవేశ కార్యక్రమం ఇలా..

ఉదయం ఏడు గంటలకు అభిషేకం, తర్వాత ఆరతి కార్యక్రమాలు నిర్వహిస్తారు. అనంతరం దేశం నలుమూలల నుంచీ వచ్చిన పండితులు నాలుగు వేదాల్లోని మంత్రాలను పఠిస్తారు. తర్వాత ప్రత్యేక పూజ నిర్వహించి... స్వామి పార్థివదేహాన్ని బుధవారమంతా ప్రజల సందర్శనార్థం ఉంచిన ప్రధాన హాల్‌కు తీసుకెళ్తారు (మహాపెరియవ చంద్రశేఖరేంద్ర సరస్వతి పార్థివదేహాన్ని ఖననం చేసిన బృందావనానికి అనుబంధంగా ఉంటుందీ హాల్). అక్కడ స్వామి పార్థివదేహాన్ని వెదురు బుట్టలో ఉంచి లాంఛనంగా కపాలమోక్షం కార్యక్రమం నిర్వహించి ఖననం చేస్తారు. సమాధిని మూలికలు, వస, ఉప్పు, చందనపు చెక్కలతో నింపుతారు. నందకుమార్, శివ స్థపతులు సమాధిని నిర్మిస్తారు. అనంతరం దానిపై తులసి మొక్కను పెడతారు.

అందరూ క్షేమంగా ఉండాలి

జయేంద్ర తుది ఆశీస్సులు

చెన్నై, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): 'ప్రజలంతా క్షేమంగా వుండాలి. సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో విలసిల్లాలి.' ఇవీ.. కంచి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి తుది ఆశీస్సులు. జనవరి 16న చెట్‌పేట్‌లోని పూజశ్రీ జయేంద్ర తమిళ పాఠశాల పంచమ వార్షికోత్సవం సందర్భంగా జయేంద్ర సరస్వతి స్వామీజీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ ఆశీస్సులందజేశారు. ఆ కార్యక్రమానికి ఆయన హాజరు కావాల్సి వున్నా అనారోగ్యం కారణంగా గైర్హాజరయ్యారు. దీంతో కంచి నుంచే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా భక్తులకు సందేశం ఇచ్చారు. జయేంద్రసరస్వతి చివరగా పాల్గొన్న బహిరంగ కార్యక్రమం అదే. కామాక్షి అమ్మవారి ఆలయంలో జరుగుతున్న మాసి బ్రహ్మోత్సవాల సందర్భంగా.. మంగళవారం రాత్రి 9 గంటలకు ఆలయానికి వెళ్లిన జయేంద్ర.. తన స్వహస్తాలతో అమ్మవారికి దీపారాధన కూడా చేశారు. ఆ పూజ ముగించుకొని మఠానికి తిరిగివెళ్తూ మార్గమధ్యలో కనిపించిన తమిళనాడు పాఠశాల విద్యాశాఖ మంత్రి సెంగోట్టయ్యన్‌కు ఆశీస్సులందజేశారు.



నాలుగేళ్ల క్రితం ఫిబ్రవరి 28నే నటరాజస్వామికి పూజలు

చెన్నై, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): అది 2014, ఫిబ్రవరి 28 చిదంబరం నటరాజస్వామికి జయేంద్ర సరస్వతి పూజలు చేసిన రోజు. సరిగ్గా నాలుగేళ్ల తర్వాత అదే రోజు ఫిబ్రవరి 28నే శుక్ల త్రయోదశి సందర్భంగా నటరాజస్వామికి అభిషేకాలు జరిగాయి. ఇంతటి విశేషమైన రోజున ఆయన తుది శ్వాస విడవడం విశేషంగా భక్తులు భావిస్తున్నారు.



చంద్రశేఖరేంద్ర వద్ద వేదాధ్యయనం చేస్తున్న జయేంద్ర

సుబ్రహ్మణ్యం నుంచి జయేంద్ర సరస్వతిగా...

చెన్నై, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): 80 ఏళ్ల క్రితం- తమిళనాడులోని తిరువారూర్ జిల్లా మన్నార్గుడి - తిరుత్తురైపూండి మధ్యలో ఉన్న ఇరుల్‌నీక్కి అనే గ్రామం ప్రపంచ ఖ్యాతికెక్కుతుందని ఎవరూ ఊహించి ఉండరు. జయేంద్ర సరస్వతి జన్మించినది అక్కడే. 1935 జులై 18న పుట్టిన ఆయన అసలు పేరు సుబ్రహ్మణ్యం మహాదేవ. తల్లిదండ్రులు మహాదేవ అయ్యర్ - సరస్వతి లకు ఆయన తొలి సంతానం.

ఐదోఏటే విల్లుపురంలోని భీమనాయకన్ గార్డెన్ వద్ద ఉన్న ప్రాథమిక పాఠశాలలో సుబ్రహ్మణ్యాన్ని చేర్పించారు. అక్కడ మూడేళ్లపాటు విద్యాభ్యాసం చేసిన అనంతరం 8వ యేట(1943, మే 9న) ఆదిత్యపురం గ్రామంలో మహదేవ అయ్యర్- తన కుమారుడికి ఉపనయనం చేయించారు. 1948లో ఋుగ్వేద సంహిత పూర్తి చేశారు. ఆ సమయంలో మహదేవ అయ్యర్ కుటుంబం విల్లుపురం నుంచి తిరుచ్చికి మారింది. దాంతో సుబ్రహ్మణ్యం తిరువానైకోయిల్ ప్రాంతంలో ఉన్న శంకరాచార్య మఠానికి చెందిన జగద్గురు విద్యాస్థాన్‌లో చేరారు. ఆ సమయంలో- పరమాచార్య చంద్రశేఖరేంద్ర మహాస్వామి తన వారసుడి కోసం అన్వేషిస్తున్నారు. కంచి మఠం ఆస్థాన విద్వాన్ కృష్ణశాస్త్రి సుబ్రహ్మణ్యం అసాధారణ ప్రతిభను గుర్తించారు. మహాస్వామికి ఆ విషయం నివేదించారు. ఆయన కూడా పరీక్షించి- సుబ్రహ్మణ్యంను తన వారసుడిగా, కంచి పీఠాధిపతిగా నియమించాలనుకుంటున్నట్లు తండ్రి మహదేవ అయ్యర్‌కు కబురు పంపారు. మొదట అంగీకరించకపోయినా, తరువాత సుబ్రహ్మణ్యం తల్లిదండ్రులు ఒప్పుకున్నారు.

సుబ్రహ్మణ్యం మేజర్ అయిన రోజు అంటే 1954 మార్చి 22న చంద్రశేఖరేంద్ర సరస్వతి తన వారసుడిగా సుబ్రహ్మణ్యం మహాదేవ అయ్యర్ పేరు ప్రకటించి, జయేంద్ర సరస్వతిగా నామకరణం చేశారు. జయేంద్ర 16 ఏళ్లపాటు చంద్రశేఖరేంద్రస్వామి ఆధ్యాత్మిక పర్యవేక్షణలో గొప్ప తత్వవేత్తగా, ఆధ్యాత్మికవేత్తగా ఎదిగారు. 1970లో తన తొలి స్వతంత్ర యాత్రను జయేంద్ర సరస్వతి చేపట్టారు.



నివాళులర్పిస్తున్న తమిళ రాజకీయ నేతలు స్టాలిన్, వైగో తదితరులు

ఆధ్యాత్మిక నాయకుడిని కోల్పోయాం

జయేంద్ర నిర్యాణంపై రాష్ట్రపతి సంతాపం.. సేవలు స్ఫూర్తిదాయకం: ఉప రాష్ట్రపతి

పేదల జీవితాల్లో మార్పు తెచ్చారు: మోదీ



ప్రధాని కాకముందు జయేంద్రతో నరేంద్ర మోదీ

చెన్నై, ఫిబ్రవరి 28: కంచి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి నిర్యాణంపై రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, ప్రధాని నరేంద్ర మోదీ, కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, పలువురు నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. 'మన దేశం గొప్ప ఆధ్యాత్మిక నాయకుడిని, సామాజిక సంస్కర్తను కోల్పోయింద'ని రాష్ట్రపతి నివాళులర్పించారు. మానవాళి సంక్షేమానికి, ఆధ్మాత్మికత పెంపొందించడానికి జయేంద్ర సరస్వతి చేసిన సేవలు స్ఫూర్తిదాయకమని ఉప రాష్ట్రపతి ట్విటర్‌లో పేర్కొన్నారు. 'జగద్గురు పూజ్యశ్రీ జయేంద్ర సరస్వతి శంకరాచార్య ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలకు మార్గదర్శకులు. ఆయన నెలకొల్పిన సంస్థలు పేదలు, బలహీన వర్గాల ప్రజల జీవితాలను మార్చాయ'ని ప్రధాని ట్విటర్‌లో నివాళులర్పించారు. ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది భక్తులకు జయేంద్ర సరస్వతి బోధనలు మార్గదర్శకమని, ఆయన ఆత్మకు శాంతి కలగాలని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ పేర్కొన్నారు. జయేంద్ర సరస్వతి బోధనలను రాబోయే తరాలు సైతం గుర్తుంచుకుంటాయని బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా చెప్పారు. అయోధ్య వివాదం పరిష్కారానికి జయేంద్ర సరస్వతి ఎంతో చొరవతో ముస్లిం నాయకులతో చర్చలు జరిపారని బీజేపీ నేత ఎల్‌కే అడ్వాణీ గుర్తు చేశారు. పశ్చిమ బెంగాల్, తమిళనాడు పాండిచ్చేరీ ముఖ్యమంత్రులు మమతా బెనర్జీ, కె.పళనిస్వామి, నారాయణసామి, డీఎంకే కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎంకే స్టాలిన్, తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు టి.సౌందరరాజన్, తమిళనాడు కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్.తిరునవుక్కరసర్, పీఎంకే నేత ఎస్.రామదాస్, డీఎండీకే చీఫ్ విజయ్‌కాంత్ తదితరులు కూడా సంతాపం వ్యక్తం చేశారు.

గవర్నర్, చంద్రబాబు, కేసీఆర్ విచారం

జగద్గురు జయేంద్ర సరస్వతి నిర్యాణం మానవాళికి భర్తీ చేయలేని నష్టమని తెలుగు రాష్ట్రాల గవర్నర్ నరసింహన్ తన సంతాప సందేశంలో పేర్కొన్నారు. కంచి పీఠం అభివృద్ధికి జయేంద్ర సరస్వతి గొప్ప సేవ చేశారని తెలంగాణ సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. కంచి కామకోటి పీఠాన్ని హిందూ సమాజంలో అట్టడుగు వర్గాలవారికి చేరువ చేసిన ఘనత జయేంద్ర సరస్వతికి దక్కుతుందని ఏపీ సీఎం చంద్రబాబు నివాళులర్పించారు. ఎంపీ కవిత, మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్, తెలంగాణ అర్చక సమాఖ్య ప్రతినిధులు భాస్కరభట్ల రామశర్మ, రాజేశ్వరశర్మ, మురళీధర్ సంతాపం వ్యక్తం చేశారు.

జయతో దోస్తీ జైలుకు నడిపించింది

మహబూబ్‌నగర్‌లో జయేంద్ర అరెస్ట్

చెన్నై, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కంచి పీఠాధిపతిగా వెలుగొందిన సమయంలో జయేంద్ర సరస్వతి హవా అంతా ఇంతా కాదు... యావద్దేశం ఆయనకు కాల్మొక్కింది. ఆయన కూడా అనేక రాజకీయ వ్యవహారాల్లో వేలు పెట్టారు. ఆయనకు తమిళనాడు ప్రభుత్వ అధినేత్రి జయలలిత నుంచి పూర్తి మద్దతు ఉండేది. కానీ చివరకు జయతో నెరపిన రహస్య లావాదేవీలే ఆయన జీవితాన్ని పెనుమలుపు తిప్పాయి. రుగ్వేదం చదువుకొన్న ఓ ధార్మికుడు జైలు ఊచలను లెక్కపెట్టాల్సిన దుస్థితి ఏర్పడింది. అనేక సామాజిక కార్యక్రమాలకు కంచి మఠం తరపున నాందీప్రస్తావన చేసిన జయేంద్ర- ఆసుపత్రులు, విద్యాలయాలకు భారీగా విరాళాలు సేకరించేవారు. ఆ కాలేజీల ఏర్పాటే ఆయనకు శరాఘాతంగా మారింది. ఆయనతో విరోధం పెంచుకున్న జయ అవకాశం కోసం వేచి చూశారు. అదే సమయంలో కంచిలోని వరదరాజ స్వామి ఆలయంలో మేనేజర్‌గా పనిచేస్తున్న శంకర్‌రామన్- అదే ఆలయ ప్రాంగణంలో హత్యకు గురయ్యాడు. శంకర్‌రామన్‌కు జయేంద్ర వ్యవహారాలన్నీ బాగా తెలుసు. ముఖ్యంగా కొన్ని లోగుట్లు.. కంచి మఠానికి వ్యతిరేకంగా శంకర్‌రామన్ కొన్ని కరపత్రాలను సోమశేఖర గణపతి పేరుతో వేశారు. ఆ తరువాత జరిగిన శంకర్‌రామన్ హత్య పూర్తిగా జయేంద్ర మెడకు చుట్టుకొంది. కంచి పీఠం నుంచే హంతకులకు ఆదేశాలు వెళ్లాయని సీఐడీ దర్యాప్తులో తేలింది.



జయేంద్ర వద్ద ఆశీస్సులు పొందుతున్న జయ (ఫైల్)

దీపావళి నాడు అరెస్ట్

జయ దీనిని అడ్వాంటేజిగా తీసుకొన్నారు. అప్పుడు జయేంద్ర తెలంగాణలోని మహబూబ్‌నగర్‌లో పర్యటనలో ఉన్నారు. అక్కడ ఒక కాటన్ మిల్స్‌లోని ఆలయంలో త్రిలోక విశ్వకల్యాణ యజ్ఞాన్ని స్వయంగా చేయిస్తున్నారు. తమిళనాడు ప్రత్యేక బృందం పోలీసులు ఆరేడు సుమోల్లో వచ్చి- అర్ధరాత్రి ఆయనను నిద్ర లేపారు.. వెంటనే తమతో రావల్సిందిగా కోరారు.. కానీ ఆయన ఒప్పుకోలేదు. తప్పదని చెప్పడంతో- ఆయన నేనేమైనా వీరప్పన్‌నా అని కూడా అడిగారు. చివరకు విధిలేక- జయేంద్ర అనుసరించారు. అక్కణ్నుంచి హైదరాబాద్ వరకూ వాహనంలో తీసుకొచ్చి తరువాత వెల్లూరు తీసుకెళ్లి 2004 నవంబరు 12 వ తేదీన అరెస్ట్ చేశారు. ఆరోజు దీపావళి. జయేంద్ర అరెస్ట్ దేశవ్యాప్తంగా సంచలనం రేపింది. అనేక హిందూ సంస్థలు దీన్ని తీవ్రంగా ఖండించాయి. ఈ కేసు విచారణ సుమారు పదేళ్లపాటు సాగింది. చివరకు దోషులందరినీ నిర్దోషులుగా తేల్చి వదిలేశారు.

కంచి మఠాధిపతిగా విజయేంద్ర సరస్వతి

తెలుగు కుటుంబంలో జననం..

1983 మే 29న.. పదమూడో ఏట సన్యాస దీక్ష



జయేంద్ర సరస్వతికి పాదపూజ చేస్తున్న విజయేంద్ర

చెన్నై, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఇన్నాళ్లూ బాల పెరియవాళ్ (చిన్నస్వామి)గా భక్తులు వ్యవహరిస్తున్న విజయేంద్రసరస్వతి.. కంచి కామకోటి 70వ పీఠాధిపతిగా బాధ్యతలు స్వీకరించారు. స్వామి జయేంద్ర సరస్వతి నిర్యాణం చెందిన వెంటనే ఆయన పీఠాధిపతిగా బాధ్యతలు స్వీకరించారు. శుక్లత్రయోదశిని పురస్కరించుకుని విజయేంద్ర మఠంలో పూజలు నిర్వహిస్తుండగా.. జయేంద్ర సరస్వతి నిర్యాణం చెందినట్లు వార్త అందింది. దీంతో తీవ్ర భావోద్వేగానికి గురైన విజయేంద్ర.. కొద్దిసేపు భగవన్నామస్మరణ చేశారు. 1969, మార్చి 13వ తేదీన తిరువళ్లూరు జిల్లా తండలం గ్రామంలో తెలుగు కుటుంబంలో జన్మించిన ఆయన్ని 13 ఏళ్ల ప్రాయంలోనే.. అంటే 1983, మే 29వ తేదీన జయేంద్ర సరస్వతి వారసుడిగా ప్రకటించారు. ఆయన అసలు పేరు శంకర నారాయణన్. తండలం పంచాయతీ పాఠశాలలో విద్యాభ్యాసం చేశారు. పాఠశాల ముగిసిన తరువాత సాయంత్రం వేళల్లో సంస్కృత, వేదాధ్యయనం చేసేవారు. ఆయన తండ్రి కృష్ణమూర్తి శాస్త్రి వేదపండితులు. పోలూర్‌లోని శ్రీ శంకర కైంకర్య సభ పాఠశాలలో ఋుగ్వేదం బోధించేవారు. శంకరనారాయణన్ ఆరో తరగతి వరకూ పాఠశాలలో విద్యాభ్యాసం చేశాక తండ్రి బాటలోనే నడిచి వేదం వైపు ఆకర్షితులయ్యారు. పలుశాస్త్రాలను అభ్యసించారు. ఎనిమిదేళ్ల ప్రాయంలో తొలిసారి ఆయన.. జయేంద్ర సరస్వతిని దర్శించారు. ఆ తరువాత అవకాశం లభించినప్పుడల్లా జయేంద్ర సరస్వతి నిర్వహించే నవరాత్రి పూజలకు తప్పకుండా హాజరయ్యేవారు. 11 ఏళ్ల ప్రాయంలో మహాస్వామి చంద్రశేఖరేంద్ర సరస్వతి దర్శనం ఆయనకు లభించింది. శంకరనారాయణన్ ప్రతిభ, ఆధ్యాత్మిక భావాలు, ఇతర అంశాలను గమనించిన జయేంద్ర సరస్వతి.. తన వారసుడిగా ఆ బాలుడినే తీసుకోవాలని నిర్ణయించారు. అలా 1983, మే 29న సన్యాస దీక్ష చేయించి, శంకర విజయేంద్ర సరస్వతిగా నామకరణం చేశారు. నాటి నుంచి విజయేంద్ర సరస్వతి దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో పర్యటించి, అద్వైతాన్ని ప్రచారం చేశారు.

విదేశాలకు వెళ్లిన తొలి కంచి పీఠాధిపతి

చెన్నై, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కంచి పీఠాధిపతుల్లో విదేశాలకు వెళ్లిన తొలి వ్యక్తి జయేంద్ర సరస్వతి. పరమాచార్య చంద్రశేఖరేంద్ర సరస్వతి బాటలో భారతదేశ వ్యాప్తంగా తీర్థయాత్రలు చేసిన ఆయన 1988లో నేపాల్‌లో పర్యటించారు. ఆ సందర్భంగా నేపాల్ రాజు ఆయనకు ఎర్ర తివాచీ పరిచి ఘనస్వాగతం పలికారు. 1998లో కైలాస మానస సరోవర్ యాత్ర నిర్వహించారు. ఆది శంకరుల తర్వాత మానస సరోవర్‌కు వెళ్లిన ఏకైక కంచి పీఠాధిపతిగా ఆయన పేరు తెచ్చుకున్నారు. కైలాసంలో, మానస సరోవర్ వద్ద ఆదిశంకరుల విగ్రహాన్ని ప్రతిష్ఠించి నిత్యపూజలకు ఏర్పాట్లు చేపట్టారు. 2000వ సంవత్సరంలో బంగ్లాదేశ్‌లో పర్యటించారు. అయితే, కంచి మఠాధిపతి సముద్రాలు దాటి విదేశాలకు వెళ్లడమేంటన్న అప్పట్లో విమర్శలు వచ్చాయి.



జయేంద్ర సరస్వతితో నేపాల్ రాజ దంపతులు

జయేంద్ర సరస్వతికి ముస్లింల నివాళి

కాంచీపురం: కంచి పీఠం.. ఏ మతాన్ని తక్కువ చేయకుండా అన్ని మతాలపై నమ్మకం ఉంచిన సర్వమత సమ్మేళన వేదిక. పీఠాధిపతులు అన్ని మతాలను సమాన దృష్టితో చూసి గొప్ప ఆధ్యాత్మిక వేత్తలుగా నిలిచిపోయారు. జయేంద్ర సరస్వతికి ముస్లింలు నివాళి అర్పించడమే అందుకు నిదర్శనం. స్థానిక జుమ్మా మసీదుకు చెందిన ముస్లింల బృందం బుధవారం కంచి పీఠానికి వచ్చి జయేంద్ర సరస్వతికి సంతాపం ప్రకటించారు. ఉత్తరాధికారి విజయేంద్ర సరస్వతిని కలిసి సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా మసీదు ఇమామ్ జే మహ్మద్ మాట్లాడుతూ.. చంద్రశేఖరేంద్ర సరస్వతి పీఠాధిపతిగా ఉన్నప్పటి నుంచి కంచి మఠంతో తమకు సుహృద్భావ సంబంధాలున్నాయని చెప్పారు. పీఠం పరిసరాల్లో మసీదు ఉండడాన్ని పలువురు వ్యతిరేకిస్తే ఆయన తమకు అండగా నిలిచారని గుర్తు చేసుకున్నారు.




జయేంద్ర సరస్వతి పార్థివ దేహానికి నివాళులర్పించడానికి వచ్చిన ముస్లింలు

ఆంధ్రజ్యోతి
స్పోర్ట్స్
నిజామాబాద్ • గురువారం 1 మార్చి 2018

డేవిస్ కప్ ప్రైజ్‌మనీలో కెప్టెన్, కోచ్‌కూ వాటా..!

న్యూఢిల్లీ: డేవిస్ కప్ ప్రైజ్‌మనీ పంపకాల్లో నాన్ ప్లేయింగ్ కెప్టెన్ మహేష్ భూపతి, కోచ్ జీషన్ అలీకి కూడా వాటా దక్కనుంది. కొత్త ఫార్ములా ప్రకారం ప్రైజ్ మనీలో కెప్టెన్, కోచ్‌లు కూడా వాటా తీసుకునేందుకు ఆలిండియా టెన్నిస్ అసోసియేషన్ (ఐటా) అనుమతినిచ్చింది. సమ పంపకాల ప్రతిపాదన మహేష్ భూపతిదేనని టెన్నిస్ వర్గాలు తెలిపాయి.

దక్షిణాఫ్రికా X ఆస్ట్రేలియా
తొలి టెస్టు-తొలి రోజు
మధ్యాహ్నం 1.30 నుంచి
సోనీ సిక్స్‌లో...



డోపీగా తేలిన భారత అథ్లెట్

● జావలిన్ త్రోయర్ దావిందర్‌పై నిషేధం ఖాయం?

న్యూఢిల్లీ: భారత అథ్లెటిక్స్‌లో డోపింగ్ కలకలం. టాప్ జావలిన్ త్రోయర్ దావిందర్‌సింగ్ కాంగ్ డోప్ పరీక్షలో పట్టుబడ్డాడు. గతేడాది నవంబర్‌లో నిర్వహించిన డోప్ పరీక్షలో దావిందర్ విఫలమైనట్టు ప్రపంచ అథ్లెటిక్స్ సమాఖ్య బుధవారం ప్రకటించింది. నిరుడు నవంబర్ 10న భారత్‌లోని పటియాలాలో అంతర్జాతీయ అథ్లెటిక్స్ సమాఖ్య (ఐఏఏఎఫ్) ఆధ్వర్యంలోని అథ్లెటిక్స్ స్వచ్ఛత విభాగం (ఏఐయూ) అథ్లెట్లకు డోప్ పరీక్ష నిర్వహించింది. ఈ పరీక్షల్లో దావిందర్ నిషేధిత అనబాలిక్ స్టెరాయిడ్‌ను వాడినట్టు తేలిందని ఏఐయూ తెలిపింది. వాడా నిబంధనల ప్రకారం దావిందర్‌పై నాలుగేళ్ల నిషేధం పడే అవకాశముంది.

దక్షిణాఫ్రికాతో భారత్ తొలి పోరు

● హాకీ వరల్డ్‌కప్ షెడ్యూల్ విడుదల

న్యూఢిల్లీ: హాకీ వరల్డ్‌కప్‌లో భారత జట్టుకు అనుకూల డ్రా దక్కింది. పూల్-సిలో భారత్‌తోపాటు ఒలింపిక్ రజత పతక విజేత బెల్జియం, వరల్డ్ నెం:11 కెనడా, ఆఫ్రికా కాంటినెంటల్ చాంపియన్ దక్షిణాఫ్రికా జట్లు చోటు దక్కించుకున్నాయి. భువనేశ్వర్‌లో నవంబర్ 28 నుంచి డిసెంబర్ 16 వరకు పురుషుల వరల్డ్‌కప్ జరగనుంది. టోర్నీ షెడ్యూల్‌ను అంతర్జాతీయ హాకీ సమాఖ్య బుధవారం విడుదల చేసింది. ఆరంభ మ్యాచ్‌లో ఆతిథ్య భారత్.. దక్షిణాఫ్రికాతో తలపడనుంది. డిసెంబర్ 2న బెల్జియంతో, డిసెంబర్ 8న కెనడాతో టీమిండియా ఆడనుంది. గ్రూప్ టాపర్‌గా నిలిచే జట్లు నేరుగా క్వార్టర్స్‌కు చేరుకోనున్నాయి. డిసెంబర్ 12-13 తేదీల్లో క్వార్టర్ ఫైనల్స్, 15న సెమీఫైనల్స్, 16న ఫైనల్ మ్యాచ్‌లు జరగనున్నాయి.

ఏ పూల్‌లో ఎవరు?

పూల్-ఎ: అర్జెంటీనా, న్యూజిలాండ్, స్పెయిన్, ఫ్రాన్స్; **పూల్-బి:** ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, ఐర్లాండ్, చైనా; **పూల్-సి:** బెల్జియం, భారత్, కెనడా, సౌతాఫ్రికా; **పూల్-డి:** నెదర్లాండ్స్, జర్మనీ, మలేసియా, పాకిస్థాన్.



యువరాజ్ సింగ్.. టీమిండియా అత్యుత్తమ ఆల్‌రౌండర్లలో ముందు వరుసలో ఉండే క్రికెటర్. అండర్-19 వరల్డ్ కప్ నుంచి వరల్డ్ టీ-20, వన్డే ప్రపంచ కప్‌లు నెగ్గిన భారత జట్లలో కీలక పాత్ర పోషించిన ఆటగాడు. చిన్న వయసులోనే జట్టులోకి వచ్చి.. అనతి కాలంలోనే అద్భుత క్రికెటర్‌గా ఎదిగి.. ప్రాణాంతక కేన్సర్‌ను జయించి మరీ పునరాగమనం చేసిన పోరాట యోధుడు. కుర్రాళ్లతో పోటీలో మళ్లీ జట్టులోకి వచ్చేందుకు నిర్విరామంగా కృషి చేస్తున్న ఈ పంజాబ్ వీరుడు ఆటకు వీడ్కోలు పలికేందుకు సిద్ధమవుతున్నట్టు కనిపిస్తోంది. వచ్చే ఏడాది రిటైర్మెంట్‌పై ఒక నిర్ణయానికి వస్తానని చెప్పడం చూస్తుంటే యువీ కెరీర్ ముగిసేందుకు మరెంతో కాలం పట్టదనిపిస్తోంది.

అప్పుడు నిర్ణయిస్తా

- 2019 వరకు ఆడతా
- ఈ ఐపీఎల్ నాకు కీలకం
- రిటైర్మెంట్‌పై యువరాజ్

మొనాకో: డాషింగ్ క్రికెటర్ యువరాజ్ సింగ్ నోట రిటైర్మెంట్ మాట..! టీమిండియాకు దూరమైన యువీ.. 2019 వరకు క్రికెట్ ఆడతానని, ఆ తర్వాత వీడ్కోలుపై ఒక నిర్ణయం తీసుకుంటానని చెప్పాడు. చివరగా గతేడాది జూన్‌లో వన్డే ఆడిన యువీ.. ఈ ఐపీఎల్ తన కెరీర్‌కు కీలకం కానుందన్నాడు. మెగా లీగ్‌లో రాణిస్తే వచ్చే వరల్డ్‌కప్‌లో పాల్గొనే భారత జట్టు రేసులో నిలిచే ఆస్కారం ఉంటుందని అతను భావిస్తున్నాడు. 'ఈ ఐపీఎల్‌లో బాగా ఆడాలని అనుకుంటున్నా. 2019 వరకు కెరీర్ కొనసాగించాలంటే అందుకు ఈ టోర్నీ నాకెంతో కీలకం కానుంది. ఏ అవకాశం వచ్చినా సద్వినియోగం చేసుకుంటూ వచ్చే ఏడాది వరకూ క్రికెట్ ఆడాలనుకుంటున్నా. ఆ తర్వాత కెరీర్‌పై ఒక నిర్ణయం తీసుకుంటాన'ని బుధవారం లారెస్ వరల్డ్ స్పోర్ట్స్ అవార్డుల కార్యక్రమంలో పాల్గొన్న యువీ తెలిపాడు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై తన అభిప్రాయాలు పంచుకున్నాడు.

ఆ ఒక్కటే బాధ..

భారత్ నెగ్గిన 2011 వరల్డ్‌కప్ వరకూ జట్టులో రెగ్యులర్ ఆటగాడిగా ఉన్న యువరాజ్ కేన్సర్ బారిన పడడంతో అతని కెరీర్ గాడి తప్పింది. తర్వాత ఆ మహమ్మారిని జయించి తిరిగొచ్చినప్పటికీ భారత టెస్టు జట్టులో తన కంటూ స్థానాన్ని ఏర్పరచుకోకపోవడం తన కెరీర్‌లో బాధాకరమైన అంశమని యువీ చెప్పాడు. 'నిజం చెప్పాలంటే నా కెరీర్ మొదలైన తొలి ఆరేడు సంవత్సరాల్లో నేను ఉచ్ఛ స్థితిలో నిలిచా. కానీ, అప్పుడు టెస్టు జట్టులో పలువురు దిగ్గజ క్రికెటర్లు ఉండడంతో నాకు సరైన అవకాశాలు లభించలేదు. తీరా అవకాశం వచ్చినప్పుడు నేను కేన్సర్ బారిన పడ్డా. కానీ, అవి నా నియంత్రణలో ఉండేవి కాదుగా. అందుకే.. ఇప్పుడు నాకు ఎన్ని మ్యాచ్‌ల్లో ఆడే అవకాశం వస్తే అన్నింటిలోనూ ఆడాలని చూస్తున్నాన'ని యువీ వివరించాడు.

కోహ్లీసేనది అద్భుత ప్రదర్శన

భారత్ తరఫున లారెస్ అంబాసిడర్‌గా అవార్డుల వేడుకకు హాజరైన యువరాజ్.. సౌతాఫ్రికా గడ్డపై కోహ్లీసేన బాగా రాణించిందని కొనియాడాడు. 'ఇదో గొప్ప ప్రదర్శన. టెస్టు సిరీస్ కోల్పోయిన తర్వాత మన జట్టు సభ్యులందరూ సమష్టిగా రాణించారు. టెస్టు సిరీస్ కూడా పోటాపోటీగానే నడిచింది. అందులో ప్రతికూల ఫలితం వచ్చినా.. వన్డే సిరీస్‌లో ఏకపక్ష విజయం సాధించారు. భారీ పరుగులతో కోహ్లీ జట్టును ముందుండి నడిపించాడు. స్పిన్నర్లు కుల్దీప్ యాదవ్, చాహల్ చాలా బాగా బౌలింగ్ చేశారు. ప్రత్యర్థిని ఇబ్బందులకు గురి చేశారు. ఆ తర్వాత టీ-20 సిరీస్‌లోకి అడుగు పెట్టిన భారత్ అదే జోరును కొనసాగించగలిగింది. ఇలా విదేశీ గడ్డపై మూడు సిరీస్‌లు ఆడి రెండింటిని గెలుచుకురావడం టీమిండియా ఆధిపత్యాన్ని తెలుపుతోంద'ని పేర్కొన్నాడు.

నిలకడతో లక్ష్య సాధన

సౌతాఫ్రికా గడ్డపై విజయం ఇచ్చిన జోష్‌లో కోహ్లీసేన ఇప్పుడు ఇంగ్లండ్, ఆస్ట్రేలియా పర్యటనల్లోనూ విజయఢంకా మోగించాలని చూస్తోంది. ఆ లక్ష్యాన్ని చేరాలంటే భారత్ నిలకడగా రాణించాల్సి ఉంటుందని యువీ చెబుతున్నాడు. 'మన జట్టు విదేశాల్లోనూ ఆధిపత్యం చెలాయించగలదని నమ్మేందుకు ఇది మంచి ఆరంభం. ఇలాంటి విజయాలను ఇంగ్లండ్, ఆస్ట్రేలియాలోనూ అందుకుంటే మనకు తిరుగుండదు. ఇప్పటికైతే మన జట్టు ప్రపంచాన్ని జయించేందుకు సిద్ధంగా ఉన్నది. ఇంగ్లండ్, ఆస్ట్రేలియా సిరీస్‌లు మన సత్తాకు పరీక్ష కాబోతున్నాయి. ఒకవేళ అక్కడా నిలకడైన ప్రదర్శనలు చేస్తే ఆటగాళ్లలో ఎంతో ఆత్మవిశ్వాసం నిండుతుంద'ని చెప్పుకొచ్చాడు.


అవార్డుల కార్యక్రమంలో యువీ

ఎంత ఆడితే అంత..

ఏజ్ గ్రూప్ క్రికెట్ నుంచి అంచలంచలుగా ఎదిగిన యువీ ఇప్పుడు ఈ స్థాయిలో నిలిచాడు. ఇప్పుడు అతని బాటలో నడుస్తున్న యువ క్రికెటర్లు పృథ్వీ షా, శుభ్‌మన్ గిల్ వంటి అండర్-19 వరల్డ్‌కప్ హీరోలు మొన్నటి ఐపీఎల్ వేలంలో కోట్లు దక్కించుకున్నారు. అయితే, వర్ధమాన ప్లేయర్లు డబ్బుల గురించి ఆలోచించొద్దని యువీ సూచిస్తున్నాడు. 'కుర్రాళ్లు ఎంతబాగా ఆడితే వారికి అంత డబ్బు దానంతట అదే వస్తుంది. అందువల్ల డబ్బు గురించిన ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఇప్పుడు వాళ్లు మరింత మెరుగ్గా రాణించి భారత జట్టులోకి ఎంత తొందరగా వస్తామా అన్న దానిపై దృష్టి నిలపాలి. పృథ్వీ, శుభ్‌మన్, అభిషేక్ శర్మల్లో గొప్ప ప్రతిభ ఉంది. తొందర్లోనే వాళ్లను భారత జట్టులో చూస్తానని భావిస్తున్నా. అంతర్జాతీయ క్రికెటర్ల నుంచి నేర్చుకునేందుకు.. ఆ స్థాయి క్రికెట్ అనుభూతి పొందేందుకు ఐపీఎల్ కుర్రాళ్లకు మంచి వేదికగా నిలుస్తుందనడంలో సందేహం లేదు. అందువల్ల ఇది చాలా ముఖ్యమైన టోర్నమెంట్. కుర్రాళ్లు దాన్ని ఆస్వాదించాల'ని యువీ పేర్కొన్నాడు.

ఐపీఎల్‌లో డీఆర్ఎస్!

న్యూఢిల్లీ: అనేక చర్చల తర్వాత ఈ ఏడాది ఐపీఎల్‌లో డీఆర్ఎస్‌ను అనుమతించేందుకు బీసీసీఐ ఒప్పుకునే అవకాశం కనిపిస్తోంది. నిర్ణయ సమీక్ష పద్ధతి అమలుపై చాలా ఏళ్లుగా వ్యతిరేకంగా ఉన్న బోర్డు.. 2016లో భారత్‌లో ఇంగ్లండ్ పర్యటన సందర్భంగా దానికి తొలిసారి అంగీకరించింది. ఇప్పుడు ఐపీఎల్‌లోనూ అమలు చేసే ఆలోచనతో ఉన్నట్టు తెలుస్తోంది. అయితే, దీనిపై ఇంకా అధికారిక ప్రకటన రాలేదు. 'కొంత కాలంగా డీఆర్ఎస్ అమలు విషయంలో బోర్డు ముందున్నది. ఈ సీజన్‌లో ఐపీఎల్‌లోనూ అమలు చేస్తే బాగుంటుందని భావిస్తున్నాం. మన దగ్గర మిగతా అన్ని వ్యవస్థలు ఉత్తమంగా ఉన్నాయి. మరి డీఆర్ఎస్ మాత్రం ఎందుకు ఉండకూడద'ని బోర్డు అధికారి ఒకరు ప్రశ్నించారు.



కోహ్లీ కెప్టెన్సీ.. ఓ వైరస్!

న్యూఢిల్లీ: దక్షిణాఫ్రికా టూర్‌లో రెండు సిరీస్‌లు నెగ్గి చరిత్ర సృష్టించిన భారత జట్టు, కెప్టెన్ విరాట్ కోహ్లీపై కోచ్ రవిశాస్త్రి ప్రశంసల జల్లు కురిపించాడు. ముఖ్యంగా విరాట్ కెప్టెన్సీ వైరస్‌లా పాకిందన్నాడు. 'కోహ్లీ లాంటి సారథి ముందుండి నడిపిస్తే.. ఆ తాలూకూ ఉత్తేజం వైరస్ తరహాలో జట్టు మొత్తానికి పాకింద'ని శాస్త్రి అన్నాడు. భారత జట్టు ఓడిపోతుంటే.. కొందరికి సంతోషమని విమర్శకులపై ఎదురుదాడి చేశాడు.

సర్ఫరాజ్ నోట.. 'రఫీ' పాట

దుబాయ్: పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్) మ్యాచ్‌ల్లో అలసి పోయిన ఆటగాళ్లు క్రికెట్ నుంచి చిన్న బ్రేక్ తీసుకున్నారు. ఓ పార్టీకి వెళ్లిన క్రికెటర్లు.. బాలీవుడ్ సినిమా పాటలతో సేద తీరారు. ముఖ్యంగా లెజెండరీ సింగర్ మహమ్మద్ రఫీ పాడిన 'క్యా హువా తేరా వాదా' పాటను సర్ఫరాజ్ ఎంతో అద్భుతంగా ఆలపించాడు. 'తేరా హోనే లగా హు'ను పాక్ టాపార్డర్ బ్యాట్స్‌మన్ అసద్ షఫీక్ పాడగా.. దబాంగ్ సినిమాలోని 'తేరే మస్త్ మస్త్ నయన్' పాటతో సౌతాఫ్రికా స్పిన్నర్ తాహిర్ ఆకట్టుకున్నాడు.


రోజర్ ఫెడరర్


'లారెస్' హీరో ఫెడరర్

- రోజర్‌కు రెండు అవార్డులు
- మహిళల్లో సెరెనాకు ..


భార్యతో దిగ్గజ అథ్లెట్ మైకేల్ జాన్సన్

మొనాకో: టెన్నిస్ దిగ్గజం రోజర్ ఫెడరర్‌కు మరో అరుదైన గౌరవం. లేటు వయసులోనూ కుర్రాళ్లకు దీటుగా ఆడుతూ గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు కొల్లగొడుతున్న 36 ఏళ్ల ఈ స్విస్ స్టార్ ప్రతిష్ఠాత్మక లారెస్ అవార్డుకు ఎంపికయ్యాడు. ప్రముఖ లారెస్ అకాడమీ ప్రతిఏటా ప్రపంచ స్థాయిలో అత్యుత్తమ ఆటతీరును కనబరిచిన క్రీడాకారులను ఎంపికచేసి ఈ పురస్కారాలను అందజేస్తుంది. గతేడాదికిగాను ప్రకటించిన అవార్డుల్లో ఫెడరర్ రెండు పురస్కారాలను దక్కించుకోవడం విశేషం. ప్రపంచ అత్యుత్తమ క్రీడాకారునితో పాటు అత్యుత్తమ పునరాగమన ప్లేయర్ (బెస్ట్ కమ్‌బ్యాక్ అవార్డు)గానూ ఫెడరర్ నిలిచాడు. స్పోర్ట్స్‌మన్ ఆఫ్ ది ఇయర్ అవార్డు కోసం సాకర్ కింగ్ క్రిస్టియానో రొనాల్డో, బ్రిటన్ స్టార్ అథ్లెట్ మో ఫరా, ఎఫ్-1 హీరో హామిల్టన్, టెన్నిస్ నంబర్‌వన్ నడాల్ లాంటి స్టార్లతో పోటీపడి ఫెడరర్ విజేతగా నిలిచాడు. మంగళవారం రాత్రి ఇక్కడ అంగరంగ వైభవంగా జరిగిన వేడుకలో ఫెడరర్ పురస్కారాలను అందుకున్నాడు. భారత క్రికెటర్ యువరాజ్ సింగ్‌తో పాటు మైకేల్ జాన్సన్, బోరిస్ బెకర్, నవ్రతిలోవా, మోనికా సెలెస్‌లాంటి స్పోర్ట్స్ సెలబ్రిటీస్ ఈ వేడుకకు హాజరయ్యారు. గతేడాది ఫెడరర్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌తో పాటు వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్స్ గెలిచాడు. ఐదేళ్ల తర్వాత ఓ మేజర్ టోర్నీలో చాంపియన్‌గా నిలవడం ఫెడరర్‌కిదే తొలిసారి కావడంతో బెస్ట్ కమ్‌బ్యాక్ అవార్డు అతన్ని వరించింది. ఇక అమెరికా టెన్నిస్ స్టార్ సెరెనా విలియమ్స్ ప్రపంచ అత్యుత్తమ క్రీడాకారిణి అవార్డును గెలుచుకుంది. నిరుడు ఆస్ట్రేలియన్ ఓపెన్ నెగ్గి రికార్డుస్థాయిలో 23వ గ్రాండ్‌స్లామ్‌ను సెరెనా ఖాతాలో వేసుకున్న సంగతి తెలిసిందే. 'ఇప్పుడు ప్రపంచం నా దగ్గర ఉంది' అని అవార్డు అందుకున్న తర్వాత ఫెడరర్ వ్యాఖ్యానించాడు.

'కామన్వెల్త్' బాక్సింగ్ జట్టులో హుస్సాముద్దీన్



న్యూఢిల్లీ: కామన్వెల్త్ క్రీడల్లో పాల్గొనే భారత బాక్సింగ్ జట్టును ప్రకటించారు. ఎలాంటి ట్రయల్స్ లేకుండానే ఎంపిక చేసిన ఈ జట్టులో తెలంగాణకు చెందిన యువ బాక్సర్ మహ్మద్ హుస్సాముద్దీన్ (56 కిలోలు) చోటు దక్కించుకున్నాడు. గత వారం జరిగిన స్ట్రాండ్జా టోర్నీలో హుస్సాముద్దీన్ కాంస్యం నెగ్గిన సంగతి తెలిసిందే. పురుషుల జట్టులో 8మంది, మహిళల జట్టులో ముగ్గురిని ఎంపికచేశారు.

జట్ల వివరాలు: పురుషులు-అమిత్ ఫాంగాల్ (49 కి.), హుస్సాముద్దీన్ (56 కి.), మనీష్ కౌశిక్ (60 కి.), మనోజ్ కుమార్ (69 కి.), వికాస్ క్రిషన్ (75 కి.), సతీశ్ కుమార్ (+91 కి.), సుమిత్ సాంగ్వాన్ (91 కి.), గౌరవ్ సోలంకి (52 కి.); **మహిళలు-**మేరీకోమ్ (48 కి.), లోవ్లినా బొర్గోహిన్ (51 కి.), సరితా దేవి (60 కి.).



టోక్యో ఒలింపిక్స్ మస్కట్ ఆవిష్కరణ

టోక్యో: 2020 ఒలింపిక్స్‌కు సంబంధించిన మస్కట్‌లను జపాన్ ఆవిష్కరించింది. వీటికి ఇంకా పేర్లు నిర్ణయించకపోయినా.. సూపర్ హీరోలను పోలిన విధంగా డిజైన్ చేశారు. ఎంపిక చేసిన మూడు డిజైన్ల నుంచి ఆ దేశంలోని స్కూల్ పిల్లలు ఎక్కువగా ఓటు చేసిన మస్కట్‌లకు ఆమోదముద్ర వేశారు. విశ్వ క్రీడలకు ఎంపిక చేసిన మస్కట్‌కు పెద్ద కళ్లతోపాటు చెవులు మొనదేలి ఉన్నాయి. ఇక పారాలింపిక్స్ మస్కట్ 'సాధారణంగా ఎంతో ప్రశాంతంగా ఉంటుంది. కానీ అవసరమైనప్పుడు శక్తిని ప్రదర్శిస్తుందనే స్ఫూర్తితో డిజైన్ చేసినట్టు చెప్పారు.


మెరిసిన స్టోక్స్.. ఇంగ్లండ్ గెలుపు



స్టోక్స్

మౌంట్ మాంగనుయ్: ఐదు నెలల వేటు తర్వాత బరిలోకి దిగిన బెన్ స్టోక్స్ (63 నాటౌట్, 2/42) ఆల్‌రౌండ్ ప్రదర్శనకు ఇయాన్ మోర్గాన్ (62) కెప్టెన్ ఇన్నింగ్స్ తోడవడంతో న్యూజిలాండ్‌తో రెండో వన్డేలో ఇంగ్లండ్ ఆరు వికెట్ల తేడాతో గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన కివీస్ 49.4 ఓవర్లలో 223 పరుగులకే కుప్పకూలింది. శాంట్నర్ (63 నాటౌట్), గప్టిల్ (50) మినహా మిగతా వారంతా విఫలమయ్యారు. అనంతరం ఇంగ్లిష్ జట్టు 37.5 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని చేరుకుంది.

'బస్ డ్రైవర్ అంటూ స్లెడ్జింగ్ చేశాడు'

ముంబై: 2002లో లార్డ్స్‌లో జరిగిన నాట్ వెస్ట్ సిరీస్ ఫైనల్లో ఇంగ్లండ్‌పై భారత్ విజయం సాధించినప్పుడు అప్పటి కెప్టెన్ సౌరవ్ గంగూలీ తన జెర్సీని విప్పి గెలుపు సంబరాలు చేసుకోవడం గుర్తుండే ఉంటుంది. అయితే ఆ మ్యాచ్‌లో టీమిండియా బ్యాట్స్‌మన్ మహమ్మద్ కైఫ్ అజేయంగా 87 పరుగులతో మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్ ఆడాడు. ఆ వన్డేలో ఇంగ్లండ్ క్రికెటర్లు తనను ఎలా స్లెడ్జ్ చేశారో.. ట్విటర్ వేదికగా కైఫ్ గుర్తు చేసుకున్నాడు. 'యువీ, నువ్వు ఏదో మాట్లాడుతూ కనిపించారు? ఇంగ్లండ్ ప్లేయర్లు ఏమైనా స్లెడ్జింగ్ చేశారా?' అని ఓ అభిమాని ప్రశ్నించాడు. దీనికి ఇంగ్లిష్ కెప్టెన్ నాసిర్ హుస్సేన్ తనను 'బస్ డ్రైవర్' అని అన్నాడని కైఫ్ చెప్పాడు. నాట్ వెస్ట్ సిరీస్ ఫైనల్లో ఇంగ్లండ్ నిర్దేశించిన 326 పరుగుల భారీ లక్ష్యాన్ని భారత్ మూడు బంతులు మిగిలుండగానే ఛేదించింది.


కైఫ్


నాసిర్



తండ్రీకొడుకుల భయమే నిజమైంది!

నన్ను అరెస్టు చేస్తారేమో.. సుప్రీంలో కార్తి ఆందోళన

నా కుటుంబాన్ని వేధిస్తున్నారు .. ఇదంతా రాజకీయ కక్షతోనే..

సుప్రీంలో చిదంబరం పిటిషన్.. విచారణకు రాకముందే కార్తి అరెస్ట్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28: మోదీ సర్కారు దూకుడు చూసి చిదంబరం, ఆయన కొడుకు కార్తి ముందే భయపడ్డారు! ఐఎన్ఎక్స్ కేసులో అరెస్టు చేస్తారని శంకించారు! తాను సొంత పనిమీద లండన్ వెళ్లానని, తానేమీ పారిపోనని.. విచారణ తేదీని వాయిదా వేయాలని కార్తి సుప్రీంకోర్టును ఆశ్రయించారు! ఆ పిటిషన్ విచారణ సందర్భంగా ఆయన దర్యాప్తు సంస్థల తీరుపై ఆందోళన వ్యక్తం చేశారు. తాను లండన్ నుంచి రాగానే అరెస్టు చేయాలని భావిస్తున్నారని న్యాయస్థానం ఎదుట వాపోయారు! మరోవైపు చిదంబరం కూడా తనను, తన కుటుంబ సభ్యులను దర్యాప్తు సంస్థలు వేధిస్తున్నాయని, వాటిని నిరోధించాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అది ఇంకా విచారణకే రాలేదు! మొత్తానికి తండ్రీకొడుకులు భయపడిందే జరిగింది! లండన్ నుంచి వచ్చిన కార్తిని బుధవారం ఉదయం చెన్నై విమానాశ్రయంలోనే సీబీఐ అధికారులు అరెస్టు చేశారు. ఐఎన్ఎక్స్ మీడియా కేసులో ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. సీబీఐ అధికారుల దర్యాప్తు, ఈడీ నోటీసులపై కార్తి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఐఎన్ఎక్స్ మీడియా కేసు విచారణలో భాగంగా మార్చి 1న హాజరు కావాలంటూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ఇచ్చిన నోటీసులపై స్టే ఇవ్వాలని లేదా విచారణ తేదీని వాయిదా వేయాలని న్యాయస్థానాన్ని కార్తి అభ్యర్థించారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్‌పై గత నెల 23న విచారణ చేపట్టగా కార్తి తరపు న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపిస్తూ.. సీబీఐ అధికారుల ఉద్దేశం ఏంటో తనకు అర్థం కావడం లేదని, కార్తిని అరెస్టు చేయాలని చూస్తున్నారా? అని అడిగారు. ఈ వాదనను సీబీఐ తరపు న్యాయవాది, అదనపు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తోసిపుచ్చారు. కార్తి 'సాధారణ నేరస్థుడు' కాదని పేర్కొన్నారు. ఆయన్ను అరెస్టు చేస్తామని తామెప్పుడూ చెప్పలేదన్నారు. కానీ, అరెస్టు విషయంలో సీబీఐదే తుది నిర్ణయమని తెలిపారు. సీబీఐ కేసు విచారణ జరుగుతుండగా.. ఈడీ ఇచ్చిన నోటీసులపై స్టే విధించాలని లేదా వాయిదా వేయాలని కోరడం సరికాదని చెప్పారు. వాదనలు విన్న ధర్మాసనం తదుపరి విచారణను మార్చి 6కి వాయిదా వేసింది. మరోవైపు ఈ కేసులో కీడును శంకించిన చిదంబరం.. తనను, తన కుటుంబ సభ్యులను అదేపనిగా వేధిస్తున్నారని, దీన్ని ఆపాలని కోరుతూ ఇటీవల సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కార్తిపై నమోదైన ఐఎన్ఎక్స్ మీడియా కేసుకు సంబంధించి సుప్రీంకోర్టులో జరుగుతున్న విచారణను చిదంబరం దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన 'సీబీఐ, ఈడీలు చట్టవిరుద్ధమైన విచారణలతో నన్ను, నా కుటుంబ సభ్యులను వేధిస్తున్నాయి. రాజకీయ కక్ష సాధింపుల్లో భాగంగానే ఇవి జరుగుతున్నాయి. దర్యాప్తు సంస్థల వేధింపులను అడ్డుకోండి' అని కోరుతూ స్వయంగా సుప్రీంలో పిటిషన్ వేశారు. కానీ, ఈ పిటిషన్ విచారణకు రాకముందే కార్తిని సీబీఐ అధికారులు అరెస్టు చేయడం విశేషం.

కార్తి అరెస్ట్

(మొదటి పేజీ తరువాయి)

విచారించి, మరో విమానంలో నేరుగా ఢిల్లీకి తీసుకెళ్లారు. కార్తికోసం విమానాశ్రయానికి చేరుకున్న కుటుంబీకులు, స్నేహితులు కార్తిని సీబీఐ అరెస్టు చేసినట్లు మీడియాలో వచ్చిన వార్తలను చూసి కన్నీటి పర్యంతమయ్యారు. కార్తి బుధవారం చెన్నై చేరుకోవాల్సి ఉండటంతో సీబీఐ అధికారులు ఆయన్ని చెన్నై విమానాశ్రయంలో అరెస్టు చేయాలని ముందుగానే పథకం వేసుకున్నారు. రెండు రోజుల ముందే ఢిల్లీకి చెందిన సీబీఐ అధికారులు చెన్నై చేరుకున్నారు. లండన్ నుండి కార్తి చిదంబరం బ్రిటిష్ ఎయిర్‌వేస్ విమానంలో బయలుదేరినట్లు ముందుగానే తెలుసుకున్న సీబీఐ అధికారులు బుధవారం వేకువజాము రెండు గంటలకే చెన్నై విమానాశ్రయం వద్ద మాటు వేశారు. ఐదు గంటలకు రావాల్సిన విమానం ప్రతికూల వాతావరణం కారణంగా ఆలస్యంగా ఉదయం 7.30 గంటలకు వచ్చింది. కార్తి చిదంబరం లగేజీ తనిఖీని పూర్తి చేసుకుని ఎనిమిది గంటలకు విమానాశ్రయం వెలుపల అడుగు పెట్టగానే చుట్టుముట్టి నిర్బంధించారు. కస్టమ్స్ విభాగం గదిలోకి తీసుకువెళ్లి గంటకు పైగా విచారణ జరిపారు. 9.50గంటలకు కార్తి చిదంబరంను అరెస్టు చేస్తున్నట్లు ప్రకటించారు. 46 ఏళ్ల కార్తిని ఢిల్లీకి చేరుకోగానే సీబీఐ కేంద్ర కార్యాలయానికి తరలించారు. అక్కడే వైద్య పరీక్షలు నిర్వహించి పటియాలా హౌస్ కోర్టులో హాజరు పరిచారు.

పటియాలా కోర్టులో కోటలాంటి భద్రత

చెన్నైలో అరెస్టు సమయానికే ఢిల్లీలోని పటియాలా హౌస్ కోర్టు ఆవరణలో పెద్ద ఎత్తున బారికేడ్లు నిర్మించారు. పెద్ద ఎత్తున పోలీసులను దించారు. సీబీఐ అధికారులు, డిఫెన్స్ న్యాయవాదులు, మీడియా ఉరుకులు పరుగులతో కోర్టు ఆవరణలో కోలాహలం యుద్ధరంగాన్ని తలపించింది. కార్తి తల్లి నళిని చిదంబరం స్వయంగా సీనియర్ న్యాయవాది. ఆమె కూడా కోర్టు హాలుకు వచ్చి కూర్చున్నారు. కోర్టు వాదనలు ముగిశాక తల్లీ కుమారులు మాట్లాడుకున్నారు. మీడియాతో మాట్లాడేందుకు నళిని నిరాకరించారు. ప్రస్తుతం లండన్ పర్యటనలో ఉన్న చిదంబరం తన కార్యక్రమాలన్నీ రద్దు చేసుకొని కష్టకాలంలో తనయుడి దగ్గర ఉండేందుకు ఢిల్లీకి తిరిగి వస్తున్నారు. ఆయన ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో ప్రసంగించాల్సి ఉంది. తనయుడి అరెస్టు వార్త వినగానే ఢిల్లీకి బయల్దేరారు.

బాస్‌ల కోసమే అరెస్టు

ఐఎన్ఎక్స్ మీడియా సంస్థలోకి నిబంధనలకు విరుద్ధంగా 26 శాతం విదేశీ పెట్టుబడులను అనుమతించేందుకు 2007లో కార్తి ఏకంగా మిలియన్ డాలర్లు డిమాండ్ చేశాడని, సంప్రదింపుల అనంతరం ఏడు లక్షల డాలర్లు(రూ.4.5 కోట్లు) ముడుపులుగా పుచ్చుకున్నారని సీబీఐ ఆరోపించింది. పలుమార్లు విచారణకు పిలిచినా ఆయన సహకరించలేదని, ఆయన్ను 15 రోజుల కస్టడీకి ఇవ్వాలని కోరింది. కార్తి తరఫున అభిషేక్ సింఘ్వీ న్యాయస్థానంలో వాదించారు. గత తొమ్మిది నెలలుగా సీబీఐ, ఈడీలు అడిగినపుడల్లా కార్తి హాజరై విచారణకు సహకరిస్తున్నారని, ఆయన్ను అరెస్టు చేయాల్సిన అవసరమేంటని ప్రశ్నించారు. రాజకీయ బాస్‌లను సంతృప్తి పరచేందుకే సీబీఐ అరెస్టుకు పూనుకుందని చెప్పారు. హిందుస్థాన్ లీవర్స్‌ను(మాల్యా, నీరవ్ మోదీ) ఏమీ చేయలేకపోయిన సర్కారు హిందుస్థాన్ రిటర్నర్స్‌ను(కార్తి చిదంబరం) ఇబ్బందుల పాలు చేస్తోందని వ్యాఖ్యానించారు. కార్తి కోర్టు ఆదేశాలను అడ్డం పెట్టుకొని పదే పదే యూరప్‌కు ప్రయాణిస్తున్నారని, అక్కడ ముడుపుల ఆధారాలను మాయం చేసే అవకాశం ఉందని సీబీఐ వాదించింది. దాంతో న్యాయస్థానం ఆయన్ను ఒకరోజు పోలీసు కస్టడీలో ఉంచుకొనేందుకు అనుమతి ఇచ్చింది.

అందరూ సమానులే: బీజేపీ

కార్తి అరెస్టును బీజేపీ సమర్థించింది. చట్టం ముందు అందరూ సమానులేనని, చట్టానికి ఎవరూ అతీతులు కాదని బీజేపీ వ్యాఖ్యానించింది. చట్టం తన పని తాను చేసుకుపోతోందని బీజేపీ నేత సబితా పాత్ర చెప్పారు. అలోక్ వర్మ నేతృత్వంలోని సీబీఐ ఎట్టకేలకు పేరుకు తగ్గ స్థాయిలో వ్యవహరించిందని బీజేపీ నేత సుబ్రహ్మణ్య స్వామి కొనియాడారు. సీబీఐ ఇప్పుడు పంజరంలో చిలుక కాదని, చెప్పిందల్లా పలికే చిలుకని కాంగ్రెస్ నేత కపిల్ సిబల్ వ్యాఖ్యానించారు. హత్య కేసులో ఇరుక్కున్న దంపతుల వాంగ్మూలాన్ని ఆధారంగా చేసుకొని కార్తిని అరెస్టు చేసిన సీబీఐ పరిస్థితి చూస్తుంటే అదెంత ఒత్తిడిలో ఉందో అర్థం అవుతోందని చెప్పారు.



పటియాలా కోర్టు వద్ద కార్తి

టార్గెట్ మా నాన్నే: కార్తి

తన తండ్రిని లక్ష్యంగా చేసుకొనే మోదీ సర్కారు తనపై తప్పుడు కేసులు బనాయిస్తోందని కార్తి చిదంబరం ఆరోపించారు. కోర్టు హాలు నుంచి బయటకు వస్తూ ఆయన మీడియాతో మాట్లాడారు. కేసులన్నీ రాజకీయ దురుద్దేశంతో కూడుకున్నవన్నారు. తాను నిర్దోషిగా తేలతానని విశ్వాసం వ్యక్తం చేశారు.

ఎడతెగని న్యాయ పోరాటం

ఐఎన్ఎక్స్ మీడియా కేసులో ఎఫ్ఐఆర్ దాఖలు చేసిన 9 నెలలకు సీబీఐ కార్తిని అరెస్టు చేయగలిగింది. ఈ మధ్యకాలంలో కింది కోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకు ఎడతెగని న్యాయపోరాటం జరిగింది. నిరుడు మే 15న సీబీఐ ఎఫ్ఐఆర్ దాఖలు చేసింది. గత ఏడాది జూన్ 16, జూలై 28 తేదీల్లో కార్తి చిదంబరంపై లుకౌట్ సర్క్యులర్ జారీ చేసింది. ఈ మధ్యకాలంలో ఆయన విదేశీ ప్రయాణానికి అనుమతించాలని పలుమార్లు కోర్టులను ఆశ్రయించారు. గత నవంబరులో సుప్రీంకోర్టు కుమార్తె చదువు కోసం అవకాశమివ్వగా, ఈ ఏడాది ఫిబ్రవరిలో మద్రాస్ హైకోర్టు వ్యాపార కార్యకలాపాలపై విదేశాలకు వెళ్లేందుకు అనుమతి ఇచ్చింది. లుకౌట్‌పై మద్రాస్ హైకోర్టు గత ఏడాది ఆగస్టులో స్టే ఇవ్వగా సుప్రీం దాన్ని ఎత్తేసింది. కార్తి చిదంబరం సీబీఐ దర్యాప్తునకు సహకరించాలని ఆదేశించింది. తిరిగి సుప్రీం కోర్టు కేసును గత నెల మద్రాస్ హైకోర్టుకు పంపించింది. లుకౌట్‌లపై హైకోర్టు స్టే కొనసాగుతుందని స్పష్టం చేసింది. కేసును 2 నెలల్లో పరిష్కరించాలని హైకోర్టును ఆదేశించింది. ఐఎన్ఎక్స్ మీడియా కేసులో తనను నిందితుడిగా చేర్చడాన్ని సవాలు చేస్తూ కార్తి మద్రాస్ హైకోర్టులో నిరుడు ఆగస్టులో పిటిషన్ వేశారు. తన పరిధిలోని అంశం కాదని, ఢిల్లీ హైకోర్టుల్లో వేసుకోవాలని మద్రాస్ హైకోర్టు తేల్చిచెప్పింది. మార్చి 1న విచారణకు రావాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఇచ్చిన సమన్లను సవాలు చేస్తూ కార్తి ఈ నెల 23న హైకోర్టును ఆశ్రయించారు.

అరెస్టు కక్ష సాధింపు: కాంగ్రెస్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28: కార్తి చిదంబరం అరెస్టు రాజకీయ కక్షసాధింపు అని ఆ పార్టీ ఆరోపించింది. ప్రభుత్వం కుంభకోణాల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే ఇటువంటి చర్యలకు పాల్పడుతోందని విమర్శించింది. అయినా వాస్తవాలు మాట్లాడకుండా తమను అడ్డుకోలేరని, మోదీ ప్రభుత్వ అవినీతిని వెలుగులోకి తెచ్చి.. ప్రజల ముందు నిలబెడతామని కాంగ్రెస్ మీడియా ఇన్‌చార్జి రణ్‌దీప్ సుర్జేవాలా అన్నారు. గడచిన పది రోజుల్లో దేశంలో రూ.30 వేల కోట్ల కుంభకోణాలు వెలుగులోకి వచ్చాయని, కానీ.. వీటిపై ప్రధాని మోదీ ఒక్క మాట కూడా మాట్లాడకుండా మౌన మోదీగా మిగిలిపోయారని విమర్శించారు. కాగా ప్రభుత్వం చట్టాన్ని దుర్వినియోగం చేస్తోందని మరో సీనియర్ నేత కపిల్ సిబల్ ఆరోపించారు. దర్యాప్తు సంస్థలు చేతనైతే కార్తికి వ్యతిరేకంగా ఆధారాలు సమర్పించాలని సవాలు చేశారు

ఐఎన్ఎక్స్ కుంభకోణం ఏమిటి?

2007లో ఐఎన్ఎక్స్ మీడియా విదేశాల నుంచి రూ.305 కోట్ల నిధులను సేకరించేందుకు విదేశీ పెట్టుబడుల బోర్డు (ఎఫ్ఐపీబీ) అనుమతి ఇచ్చింది. విదేశీ సంస్థలకు 26 శాతం వరకు వాటాలు తీసుకొనేందుకు అనుమతి ఇచ్చి నిబంధనలు ఉల్లంఘించారని, అందుకు ఏడు లక్షల డాలర్లు కార్తి ప్రతిఫలంగా తీసుకున్నారని సీబీఐ ఆరోపిస్తోంది. గత ఏడాది మే 15న ఈ అంశంపై సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఐఎన్ఎక్స్ మీడియా అధినేతలు పీటర్, ఇంద్రాణీ ముఖర్జీలు ఇద్దరూ ఇప్పటికే తమ కుమార్తె షీనాబోరాను హత్యచేసిన కేసులో జైల్లో ఉన్నారు. తాను, పీటర్ ఢిల్లీలోని ఒక స్టార్ హోటల్లో కార్తిని కలిశామని, ఆయన మిలియన్ (పది లక్షల) డాలర్లు లంచం డిమాండ్ చేశారని ఇంద్రాణీ చెప్పారు. తాము ఏడు లక్షల డాలర్లు చెల్లించామన్నారు. ఎఫ్ఐపీబీ నోటిఫికేషన్, ఇతర వివరాల కోసం మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ చార్జీల కింద కార్తి చిదంబరం పరోక్షంగా యజమానిగా ఉన్న అడ్వాంటేజ్ స్ట్రాటజిక్ కన్సల్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థకు పది లక్షలు చెల్లించామని, కార్తి చిదంబరానికి సంబంధం ఉన్న ఇతర కంపెనీలకు మిగిలిన చెల్లింపులు జరిగాయని తెలిపారు. కార్తి మీద, ఆయన కంపెనీల మీద, ముఖర్జీ దంపతుల మీద, వారి కంపెనీల మీద సీబీఐ కేసులు నమోదు చేసింది. "విశ్వసనీయ వర్గాల" సమాచారం ఆధారంగా ఈ ఆరోపణలు చేస్తున్నట్లు సీబీఐ ఎఫ్ఐఆర్ పేర్కొంది. ఈ కేసులో ఈడీ కూడా దర్యాప్తు చేస్తోంది. సీబీఐ ఈ కేసు దర్యాప్తులో భాగంగా చిదంబరం కుటుంబ సభ్యుల నివాసాలు, కార్యాలయాల్లో సోదాలు చేసింది. ఈడీ కార్తి చిదంబరాన్ని పలు మార్లు ప్రశ్నించింది. విదేశాల్లో దాచిన ముడుపులను మరోచోటికి తరలించి, ఆధారాల్లేకుండా చేస్తారనే అనుమానంతో సీబీఐ ఆయనపై లుకౌట్ నోటీసు కూడా జారీ చేసింది. అయితే, గత నవంబరులో సుప్రీంకోర్టు కార్తికి లండన్‌కు వెళ్లేందుకు అనుమతి ఇచ్చింది. కుమార్తె అడ్మిషన్ పేరుతో ఆయన న్యాయస్థానాన్ని ఆశ్రయించి అనుమతి తెచ్చుకున్నారు. 2006లో ఎయిర్‌సెల్-మాక్సిస్ సంస్థలోకి విదేశీ పెట్టుబడులను ఎఫ్ఐపీబీ అనుమతించడం పైనా సీబీఐ దర్యాప్తు చేస్తోంది. ఐఎన్ఎక్స్ మీడియా కేసులో కార్తి చిదంబరానికి చార్టెడ్ ఎకౌంటెంట్‌గా పనిచేస్తున్న ఎస్.భాస్కరరామన్‌ను ఇదివరకే సీబీఐ అరెస్టు చేసింది. ఆయన బెయిలు పిటిషన్‌ను గురువారం ఢిల్లీ ప్రత్యేక న్యాయస్థానం విచారించనుంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao, on behalf of Aamoda Publications Pvt. Ltd., at the Aamoda press at Gollapalli road.,Dharmaram(B)Village,Dichpally Mandal, Nizamabad- 503230. Editor: K. Srinivas, Ph. Nos. 08461-245301, 245306. Fax 245307, RNI NO: AP TEL /2004/12975 .Managing Director : Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

శ్రీ శక్తి

చేనేత వస్త్రాలు అందరికీ అందుబాటు ధరల్లో లభించాలి. చేనేతకారులు తాము నేసిన బట్టలను తాము కూడా వేసుకోగలిగే స్థాయికి చేరుకోవాలి. ఈ రెండు లక్ష్యాలతో పని చేయడం ప్రారంభించారు. మొదలుపెట్టాక కానీ తెలియలేదు వీటితో పాటు మరో ముఖ్యమైన అంశం ఉందని. అది... వాళ్ల జీవనాధారాన్ని మెరుగుపరిచే ఆదాయంలో పెరుగుదల. ఆ దిశగా పనిచేయడం మొదలుపెట్టారు విజయ స్మిత. గ్రామీణ ప్రాంతాల్లో చేనేతకారుల గురించి పనిచేస్తున్నందుకు 'చిత్రిక' సంస్థ హార్వర్డ్ ప్రాజెక్టుకు ఎంపికైంది. ఆ సందర్భంగా విజయ స్మిత చేనేత ప్రయాణం ఆమె మాటల్లోనే...



చేనేతకు ఆదారం!

"మాది హైదరాబాద్. కానీ మా కుటుంబ మూలాలు మాత్రం తమిళనాడులో ఉన్నాయి. జీవనోపాధి కోసం తాత వాళ్లు హైదరాబాద్‌కి వలస వచ్చారు. శంషాబాద్ దగ్గర పౌరోహిత్యం చేసేవారు. మాది మూడో తరం. బీకాం హానర్స్ చేశాక గుజరాత్‌లోని 'ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ మేనేజ్‌మెంట్ ఆనంద్' (ఇర్మా)లో ఎంబిఎ, రూరల్ మేనేజ్‌మెంట్ చేశాను. అందులో భాగంగా రెండు నెలల పాటు గ్రామాల్లో ఉండాలి. అలా కచ్‌కి వెళ్లాము. అక్కడ ఉన్న క్లే, టెర్రకోటా, చేనేత, ప్రింటింగ్, ఎంబ్రాయిడరీ వంటి క్రాఫ్ట్స్ బాగా ఆకర్షించాయి. మొదటిసారి వాటిపట్ల ఆసక్తి కలిగింది అక్కడే. మాస్టర్స్ పూర్తయ్యాక క్రాఫ్ట్స్ రంగంలో పనిచేయాలి అనుకున్నా. క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో 'ప్రథమ్' అనే సంస్థలో ప్లేస్‌మెంట్ వచ్చింది. నా మొదటి ఉద్యోగం వైజాగ్‌లో. మనసులో క్రాఫ్ట్స్ గురించి ఉంటే ఇక అక్కడేం చేస్తాను. అందుకే నెల రోజులు చేసి మానేశాను. ఆ తరువాత క్రాఫ్ట్స్ గురించి పరిశోధించాను. మాతృభాష తమిళం అయినప్పటికీ నాకు తెలుగే బాగా వచ్చు. అందుకని ఇక్కడే పనిచేయాలని నిర్ణయించుకున్నా.

తొమ్మిది నెలలు తిరిగినా...

మా కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతోనే 'చిత్రిక'ను 2005 అక్టోబర్‌లో రిజిస్టర్ చేశాను. శ్రీకాకుళం జిల్లాలోని పొందూరులో ఖాదీ ఫేమస్ కాబట్టి అక్కడి నుంచి పని ప్రారంభిద్దాం అనుకున్నా. తీరా వెళ్తే ఖాదీ అనేదే లేదక్కడ. కాటన్ నేసి, ఖాదీ పేరిట అమ్ముతున్నారు. సహకార సంఘాలతో కలిసి పని చేద్దామా అనుకున్నా. కానీ అవి చాలా పాతవి. వాటితో కలిసి పని చేయడం కష్టం అనిపించింది. మాతో కలిసేందుకు ఎవరూ ముందుకు రాలేదు. ఎందుకంటే అక్కడ అప్పటికే షావుకార్లు ఉన్నారు. నేతకారుల్లో కొందరు వీళ్లకి బంధువులు కూడా. కొత్తగా వచ్చిన మమ్మల్ని వాళ్లు అంగీకరించడం కష్టం కదా! అందుకే నేను

> **వదిలేసి పారిపోదాం అనుకున్నా...**
>
> ❖ సంస్థ ప్రారంభించినప్పుడు చేనేతకారులు అడిగే ప్రశ్నలకు నా దగ్గర సమాధానాలు ఉండేవి కావు. దాంతో వదిలేసి పారిపోదాం అనిపించింది.
>
> ❖ తూర్పు గోదావరిలో షేర్ క్యాపిటల్ వెయ్యి రూపాయలు కట్టమని అడుగుతూ ఎంత తిరిగానో మాటల్లో చెప్పలేను.
>
> ❖ ప్రొడ్యూసర్ కంపెనీలు నేతకు ముందు చేయాల్సిన ఐదు దశల పనిని చేసి మెటీరియల్‌ను ఇస్తాయి. మిగతా రెండు దశల పనిని నేతకారులు చేస్తారు.

తొమ్మిది నెలలు తిరిగినా ఎవరూ పట్టించుకోలేదు. తరువాత ఆ ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తి సాయం తీసుకున్నా. పొందూరుకి సమీపంలోని 'దేవర వలస' అనే ఊరుకి వెళ్లాం. అక్కడ్నించి ఖాదీ, కాటన్‌లను నేసి పొందూరుకి పంపిస్తారు. పొందూరు అని పేరే.. కానీ శ్రీకాకుళం, దాని చుట్టుపక్కల ఊళ్ల నుంచి నేసి, పొందూరుకు పంపిస్తుంటారు. అలా దేవరవలస నుంచి పని మొదలుపెట్టాం. మేము వెళ్లినప్పుడు ఆ ఊళ్లో సంఘాలేవీ లేవు. పది మందితో పని మొదలుపెట్టి 'మ్యూచ్‌వల్లీ ఎయిడెడ్ సొసైటీ'ని రిజిస్టర్ చేశాం. పది మందితో మొదలై... ఆ సంఖ్య నాలుగేళ్లలో నలభైమందికి చేరింది.

అవి కూడా నేస్తున్నాం

సమస్య ఎక్కడ వచ్చిందంటే ప్రత్యేకమైనవి, ఎక్కువ ధర ఉన్నవి వీళ్లు నేసే వాళ్లు కారు. వేతనాలు కూడా తక్కువ నుంచి ఓ మాదిరిగా ఉండేవి. అదే పొందూరులో ఖాదీ నేసే వాళ్లకైతే వేతనాలు బాగున్నాయి. పెన్షన్, బోనస్‌లు కూడా వస్తాయి. ఈ రోజున పొందూరులో నేతకారులకి రెండొందల రూపాయలు వస్తుంటే... కాటన్ నేతకారులకి 40 రూపాయలు వస్తున్నాయి. నాది మేనేజ్‌మెంట్ బ్యాక్‌గ్రౌండ్ కావడం వల్ల డిజైనింగ్ మీద అంత పట్టు ఉండేది కాదు. దానికి తోడు పవర్‌లూమ్ పోటీ చాలా ఎక్కువ. పవర్‌లూమ్‌లో నేసింది తక్కువ రేటులో లభిస్తున్నప్పుడు... చేనేత వైపు చూడరు కదా. విజయవాడ హ్యాండ్లూమ్ మార్కెట్ బాగుందని అక్కడికి వెళ్లాం. అక్కడేమో అన్ని రకాలు కలిపి అమ్మేవారు. మామూలు వెరైటీ చేసినంత కాలం ఎదగలేదు. లోకల్ నుంచి మంగళగిరి డైయింగ్‌కి మార్చాను. ఆ తరువాత కొందరు స్టాఫ్‌ను చేర్చుకున్నా. అప్పుడే డిజైనర్‌గా సంయుక్త చేరారు. ఆమె వచ్చాక మంగళగిరి డైయింగ్ నుంచి చీరాల మెకనైజ్డ్ డైయింగ్‌కు మారిపోయాం. ఒక టీంలా ఏర్పడ్డాక 2010 నుంచి పొందూరులో ప్రాముఖ్యత కలిగిన ఖాదీ, జామ్‌దాని, కుప్పడం వెరైటీలు నేయడం మొదలుపెట్టాం. అప్పట్నించీ ఆదాయం మెరుగైంది. మీటరు 120 నుంచి 140 రూపాయల నుంచి మూడొందల రూపాయలు, అంతకంటే ఎక్కువ ధరకి అమ్మేలా తయారైంది. 20 వేల కంటే ఎక్కువ వేతనం సంపాదించే నేతకారులు తయారయ్యారు. అలాగే ప్రొడక్ట్ నేచర్ కూడా మారిపోయింది.

ఆ ఉద్యోగమైనా చేస్తాం కానీ...

సంస్థకి గుర్తింపు రావడంతో మాలో ఆత్మవిశ్వాసం పెరిగింది. వనరులు రావడం మొదలైంది. 2013లో తూర్పు గోదావరి జిల్లాలో పని మొదలుపెట్టాం. అక్కడ అన్ని రకాల నేతలు ఉన్నాయి. శ్రీకాకుళంలో పది మంది సభ్యులతో మొదలుపెడితే, గోదావరిలో 50 మందితో మొదలుపెట్టాం. శ్రీకాకుళంలో 2500 రూపాయల వేతనంతో మొదలుపెడితే... ఇక్కడ ఆరు వేల రూపాయలతో ప్రారంభించాం. ప్రారంభించిన మొదటి ఏడాది నష్టం ఏర్పడింది కానీ ఆ తరువాత పుంజుకుంది. ప్రారంభంలో నేతన్నల జీవనాధారం మెరుగుపర్చడం మీదనే దృష్టి ఉండేది. కానీ డిజైన్లలో మార్పు తీసుకురాకపోతే ఆదాయం రావడం కష్టం అనేది ప్రాక్టికల్‌గా పనిచేయడం మొదలుపెట్టాక తెలిసింది. ఏ చేతి వృత్తినైనా నైపుణ్యాలు లేని పనిగా పరిగణిస్తారు. నిజానికి వాళ్లు నైపుణ్యం కలిగిన వాళ్లు. అందుకని నైపుణ్యం లేని వారికి ఇచ్చే కనీస వేతనాలు కాకుండా... నైపుణ్యం కలిగిన వాళ్లకి ఇచ్చే కనీస వేతనాలు ఇవ్వాలి. నేత పని వాళ్లకి ఆదాయం లేదు, గౌరవం లేదు. అందుకని వాచ్‌మెన్‌గా చేసినా నెలకు ఎనిమిదివేలు వస్తాయని ఆ ఉద్యోగాలు చేయడానికి ఇష్టపడుతున్నారు. ఈ పరిస్థితి మారాలంటే ఆదాయం బాగుండాలి. వర్క్‌షెడ్స్ ఏర్పాటుచేసి, ప్రొఫెషనల్ వాతావరణాన్ని కల్పించే ప్రయత్నం చేస్తున్నాం.

మూడు కోట్ల లక్ష్యం!

శ్రీకాకుళం, తూర్పు గోదావరి జిల్లాల్లో రెండు ప్రొడ్యూసర్ కంపెనీలున్నాయి. శ్రీకాకుళంలో 'వంశధార వీవర్స్', తూర్పు గోదావరి జిల్లాలో 'గోదావరి వీవర్స్'. ఈ కంపెనీల్లో 350 సభ్యులు ఉంటే 250 మంది చురుగ్గా ఉన్నారు. చేనేత కుటుంబాల నుంచి వచ్చిన వాళ్లు నేత నేయడమే కాకుండా ఈ పనికి సంబంధించిన అకౌంట్స్, మార్కెటింగ్, డైయింగ్, డిజైనింగ్ పనుల్లో కూడా ఉన్నారు. మా దగ్గర అలా 14 మంది పనిచేస్తున్నారు. ప్రొడ్యూసర్ కంపెనీలకు మార్కెటింగ్ సపోర్టు ఇవ్వడంతో పాటు టెక్నో మేనేజిరియల్, డిజైనింగ్ స్కిల్స్‌లో శిక్షణిస్తున్నాం. గతేడాది 2.5 కోట్ల రూపాయల అమ్మకాలు చేశాం. ఈ ఏడాది 3 కోట్లు చేయాలనేది లక్ష్యం. తెలంగాణ రాష్ట్రంలోని నల్గొండ, నారాయణపేటల్లో కూడా పని మొదలుపెట్టబోతున్నాం."

> **ఇలా వచ్చా...**
>
> 
>
> 'చిత్రిక'లో డిజైనర్‌గా పనిచేస్తారు సంయుక్త. తను ఈ రంగంలోకి రావడం గురించి వివరిస్తూ "మాది చిత్తూరు జిల్లా. చెన్నైలో జిడ్డు కృష్ణమూర్తి స్కూల్‌లో ఒక ప్రోగ్రామ్ ప్రారంభించారు. అందులో చేరా. అది సెల్ఫ్ డిస్కవరీ మోడల్‌లో ఉంటుంది. అది చేస్తూ... కరస్పాండెన్స్ ద్వారా డిగ్రీ చేశాను. జిడ్డు కృష్ణమూర్తి స్కూల్‌లో చేతి మగ్గం యూనిట్ ఉంది. అక్కడ నేత నేర్చుకున్నాను. నేతకు సంబంధించిన రంగంలో పనిచేస్తే నా కెరీర్ బాగుంటుంది అనిపించింది. ఆ తరువాత నిఫ్ట్‌లో టెక్స్‌టైల్ డిజైనింగ్‌లో, పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేశాను. అప్పట్నించీ హ్యాండ్లూమ్ ఎంటర్‌ప్రైజెస్‌తోనే పనిచేస్తూ వచ్చాను. చిత్రికలో ఏడేళ్ల నుంచీ ఉన్నాను. చిత్రికలో చేరినప్పుడు విజయ మెటర్నిటీ లీవ్‌లో ఉన్నారు. అందుకని నేను ప్రొడక్షన్, మార్కెటింగ్ చూసుకున్నాను. తను వచ్చాక డిజైన్ మీద ఫోకస్ పెట్టాను. మా పని ఎలా ఉంటుందంటే... నేత కారుల నైపుణ్యం ఏంటి? ఏం నేస్తారు? ఏ మార్పులు చేస్తే ప్రొడక్ట్‌ను బాగా అమ్మగలం అనేవి గమనించడం. నాకు నేత, మగ్గం పనులు వచ్చు కాబట్టి. వాళ్లకి అర్థమయ్యేలా చెప్పగలుగుతున్నా"అన్నారు.

> **అప్పుడు 15... ఇప్పుడు 140**
>
> 
>
> ఇందులో 2014 నుంచి సభ్యురాలిగా ఉన్నారు రుద్రాక్ష చంద్రకాంత కుమారి. తూర్పు గోదావరి జిల్లా, మండపేటకు చెందిన ఈమె మాట్లాడుతూ "పని ఎక్కువ, ఆదాయం తక్కువ అని నేత పని మానేశాం. మగవాళ్లు వేరే పనులకు వెళ్లడం మొదలుపెట్టారు. కానీ 'చిత్రిక' వాళ్లు వచ్చి ఆడవాళ్లే డైరెక్టర్లుగా ఉండి పని చేసుకోవచ్చన్నారు. హైదరాబాద్‌కి తీసుకొచ్చి పోచంపల్లి పార్క్, ఫ్యాబ్ ఇండియా, నిఫ్ట్ సంస్థలను చూపించి స్ఫూర్తి నింపారు. కొత్త డిజైన్లలో శిక్షణ ఇచ్చి, లోన్లు ఇప్పిస్తాం అన్నారు. యార్న్ ఇవ్వడానికి ఒక వెయ్యి రూపాయలు కడితే చాలన్నారు. నేత నేశాక వాళ్లే ఇంటికొచ్చి డబ్బులిచ్చి ప్రొడక్ట్ తీసుకుంటారు. దానివల్ల పని మానేసిన మగవాళ్లు కూడా తిరిగొస్తున్నారు. మొదట పదిహేను మగ్గాలు ఉండేవి ఇప్పుడు 140 మగ్గాలు వచ్చాయి" అని సంతోషంగా చెప్పారు.

• కిరణ్మయి

ఫోటోలు: రాజేష్ జంపాల

సహజ రంగులు రంగేళీ!

హోలీ ఆనందం కలకాలం నిలవాలంటే ఎటువంటి హానీ కలిగించని రంగుల్నే ఎంచుకోవాలి. ఇందుకోసం కృత్రిమమైనవి కాకుండా సహజసిద్ధమైన రంగులనే వాడాలి. మరి సహజసిద్ధమైన రంగులెక్కడ దొరుకుతాయి? అనుకుంటున్నారా? వాటిని ఇంట్లోనే తయారు చేసుకోవచ్చు.

పసుపు: ఈ రంగు లేకపోతే హోలీ పండగే లేదు. గంధాన్ని అరగదీసి లేదా పొడి చేసి నీళ్లలో కలిపి వాడొచ్చు. పేస్ట్ రూపంలో కావాలనుకుంటే గంధం పొడిలో కొద్దిగా రోజ్ వాటర్, కొబ్బరి నూనె కలపాలి. ఎండబెట్టిన నారింజ తొక్కలను పొడి చేసినా పసుపు



రంగు వస్తుంది. కాబట్టి నారింజ తొక్కల్ని ఒక ట్రేలో పరిచి, పైన గుడ్డతో కప్పి ఎండబెట్టాలి. తర్వాత ఫుడ్ ప్రాసెసర్‌లో వేసి మెత్తగా పొడి చేయాలి.

ఆకుపచ్చ: పాల కూర, నిమ్మపొడి, పుదీనా పొడులతో ఆకుపచ్చ రంగు తయారవుతుంది. వీటిలో ఏదో ఒక దాన్ని ఎంచుకుని నీళ్లలో కలిపితే ఆకుపచ్చ రంగు రెడీ!

ఎరుపు: గులాబీ రేకులను ఎండబెట్టి మిక్సీలో వేసి పొడి చేయాలి. ఎక్కువ మొత్తంలో కావాలనుకుంటే దాన్లో మైదా పిండి కలపొచ్చు.

గులాబీ: బీట్‌రూట్ దుంపలను ఎండబెట్టి మిక్సీజార్‌లో వేసి పొడి చేయాలి. దీన్లో శెనగపిండి కలిపితే బోల్డెంత గులాబీ రంగు రెడీ.

నీలం: నీలి రంగు మందారాలను పొడిచేస్తే అందమైన నీలి రంగు వస్తుంది. అదే నీలి రంగు వెట్ బ్లూ కలర్‌లో కావాలంటే ఇండిగో ట్రీ(నీలి చెట్టు) కాయలను పొడి చేసి నీళ్లలో కలపాలి.

జెట్ బ్లాక్ (కారు నలుపు): ఉసిరిని ఇనుప గిన్నెలో రాత్రంతా ఉంచితే నలుపు రంగు వస్తుంది. అందులో మీకు నచ్చిన రంగుకు వచ్చే వరకు నీళ్లు పోయాలి. లేదా నల్ల ద్రాక్షల రసాన్ని కూడా వాడొచ్చు. గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే నల్ల ద్రాక్షల రసం తీశాక అందులో నీళ్లు ఎక్కువగా పోయాలి. లేకపోతే బంక బంకగా ఉంటుంది.



సందర్భం

రంగుల పండుగ



హోలీ పండుగను ఫాల్గుణ శుద్ధ పూర్ణిమ నాడు జరుపుకొంటారు. దీన్నే పంచాగాలు 'హోళికాదహన పర్వం'గా పేర్కొన్నాయి. ఈ రోజుకు చాలా ప్రత్యేకతలున్నాయి. హోలికా, హోళికా దాహో, వహ్న్యోత్సవం, హుతాశనీ పూర్ణిమ, మదన పూర్ణిమ, డోలా పూర్ణిమ, అశోక పూర్ణిమా వ్రతం, ధామ త్రిరాత్రి వ్రతం, లక్ష్మీనారాయణ వ్రతం, కల్యాణ వ్రతం, శశాంక పూజ, శయన దాన వ్రతం, బ్రహ్మ సావర్ణిక మన్వాది లాంటివి ఈ రోజే రావటం విశేషం. వీటిలో కొన్నింటికి పరస్పర సంబంధం ఉంది. ఒక రోజుకు ఇన్ని ప్రత్యేకతలుండటం వల్ల ఫాల్గుణ శుద్ధ పూర్ణిమ నాడు జరుపుకొనే హోలీ పండుగలో ఇతర పండుగల వేడుకలు కలసిపోయాయి. 'కామదహనం' కూడా ఈ రోజే అని పలువురి అభిప్రాయం. ఫాల్గుణ బహుళ పాడ్యమి నాడు వసంతోత్సవం. ఫాల్గుణ బహుళ పంచమి నాడు 'రంగ్‌పంచమి'. అసలు కామదేవుని దహనం, హోళికా దహనాల నేపథ్యమే వేరు. కామదహనం, హోలీ వేర్వేరు పండుగలు. సమీప తిథులలో లేక ఒకే తిథిలో సంభవించడం వల్ల రెండూ ఒకటేనన్న అపోహ ఏర్పడింది.

అలాగే, ఈ దహనాలకూ, వసంతోత్సవానికీ కూడా సంబంధం లేదు. హోలీనాడు రాత్రి వేసే మంటలను కామ దేవుని దహనానికి ప్రతీకగా భావించడాన్ని పండితులు అంగీకరించరు. దానికి కారణం ఉంది. తారకాసుర వధ జరగాలంటే కుమార స్వామి జన్మించాలి. లోకకల్యాణం కోసం దేవతల కోరిక మేరకు మన్మథుడు.. ధ్యానంలో ఉన్న శివునిపై పుష్ప బాణ ప్రయోగం చేస్తాడు. శివుడు మూడోకన్ను తెరచి మన్మథుని భస్మం చేస్తాడు. ఇలాంటి బాధాకర సంఘటనను ఉత్సవంగా చేసుకనే వేడుకగా చేసుకోవటం సమంజసం కాదనే భావన ఉంది.

పిల్లలను తింటున్న 'హోళిక' అనే రాక్షసిని దగ్ధం చేసిన కథకూ-హోళికా దహన పర్వం రోజున మంటలు వేయటం తగిన సందర్భంగా కనిపిస్తుంది. అందువల్ల ఇది పిల్లలకు సంబంధించిన మంగళకర ఉత్సవం అయింది. అందువల్లనే పిల్లలకు మిఠాయి పేర్ల దండ/ పంచదార చిలుకల దండ వేసే ఆచారం ఉంది. ఈ రోజున జరుపుకునే హోలికా పూజా విధిలో చివరన రాత్రి వేళ హోళికా చితిని కాల్చే క్రతువు ఉంటుంది.

పూర్వకాలంలో పూర్ణిమ తర్వాత వచ్చే పాడ్యమి రోజునే ఈ వసంతోత్సవాన్ని గతంలో కొందరు సంవత్సరాదిగా జరుపుకునేవారని పండితుల అభిప్రాయం. పక్షం రోజుల్లో రాబోయే చైత్ర శుక్ల పాడ్యమికి, అంటే చాంద్ర సంవత్సరాదికి నాందిగా జరుపుకొనే ఉత్సవంగా దీన్ని కొందరు భావిస్తారు. మరికొందరు (వసంత) రుతువుకు సంబంధించిన పండుగగా భావిస్తారు. అందువల్లనే పాడ్యమి నాడు రంగులు జల్లుకొనే వేడుకలు చేసుకుంటారు. మహారాష్ట్రీయులు పంచమిని 'రంగ్ పంచమి'గా రంగులు జల్లుకునే వేడుక దినంగా పాటిస్తారు.

• వద్దిపర్తి కృష్ణ

పేరెంటచ్

చదువులో బ్రేక్ ఉండాల్సిందే!

పరీక్షల సమయంలో పిల్లల మనసు 24 గంటలూ చదువు మీదే లగ్నమై ఉండాలంటారు కొంతమంది తల్లిదండ్రులు. నిజానికి, ఇలా చదవడం వల్ల కలిగే లాభం కన్నా నష్టమే ఎక్కువ. ఎందుకంటే, చదువుకు సంబంధించి ఏ రెండు సీరియస్ విషయాల మధ్యనైనా ఎంతో కొంత విరామం చాలా అవసరం. అలాగైతేనే చదివిన విషయాలు బుర్రలో రిజిస్టర్ అవుతాయి. విరామం దొరకాలంటే... చదువుకు ఏ మాత్రం సంబంధం లేని మరో విషయం మీదకి మనసు మళ్లాలి. ఉదాహరణకు పాటలు వినడం, డిస్కవరీ చానల్ లాంటివి చూడటం లేదా ఇంట్లోనే తేలికపాటి వ్యాయామం చేయడం వంటివన్నమాట.

అయితే కొందరు తల్లిదండ్రులకు ఇలాంటివి బొత్తిగా నచ్చవు. అందుకే అడుగడుగునా ఆంక్షలు విధిస్తారు. ఈ ధోరణితో పిల్లల మెదడు మీద విపరీతమైన ఒత్తిడి పడుతుంది. అయినా సరే ఆ బాధంతా అలాగే భరిస్తూ, కిక్కురుమనకుండా... రోజుకు 16 లేదా 18 గంటలు కళ్లను పుస్తకం మీదే పెడతారు. కొందరు తల్లిదండ్రులైతే పుస్తకంలోకి తలదూర్చినంత మాత్రాన చదువుతున్నాడన్న గ్యారెంటీ ఏమిటి అనుకుని బయటికి చదవమంటారు. నిజంగా ఇది పిల్లల గొంతుమీద కత్తిపెట్టడం లాంటిదే. ఇలా రకరకాలుగా కట్టడి చేస్తూ, తీరా పరీక్షలైపోయాక చూస్తే తక్కువ మార్కులే కనపడతాయి. ఈ విధమైన ఫలితాలకు తల్లిదండ్రుల తప్పే ఎక్కువ. పిల్లలకు ఏ మాత్రం విరామం ఇవ్వకుండా, వారిని పరీక్షల పేరిట భయభ్రాంతులకు గురిచేయడం ఏమాత్రం మంచిది కాదు. ప్రణాళికా బద్ధంగా చదివితే ఫలితం ఉంటుంది కానీ 'చదువూ... చదువూ...' అంటూ పిల్లల్ని వేధించడం వల్ల ప్రతికూల ప్రభావం పడే అవకాశాలే ఎక్కువ. అందుకే పరీక్షా సమయాల్లో చదువుతో పాటు వినోదం పేరిట కాస్త విరామం ఇవ్వడం తల్లిదండ్రుల కనీస బాధ్యత.



నగధగ

వయ్యారి వంకీలు



పరికిణీ కట్టినా, చీర చుట్టినా చేతులకు వంకీలు లేనిదే నిండుదనం రాదు. మరీ ముఖ్యంగా వేడుకల సందర్భంగా చేసే అలంకరణలో, వంకీలు తాజా ఫ్యాషన్‌లో భాగంగా ట్రెండ్ సృష్టిస్తున్నాయి. స్టయిల్‌గా ఉండే వంకీలు మొదలుకుని, భారీగా సంప్రదాయం ఉట్టిపడే వాటి వరకూ వంకీల్లో ఎన్నో రకాలున్నాయి.

మేలు జాతి రాళ్లు: రాత్రి వేళల్లో జరిగే వేడుకల్లో ఎంతలా మెరుపులు మెరిపిస్తే అంత ఆకర్షణ. అందుకే ధరించే నగల్లో మేలు జాతి రాళ్లకు స్థానం కల్పించాలి. భారీ నగలు ధరించటం ఇష్టం లేని వాళ్లు, కుడి మోచేతికి కొద్దిగా పై భాగాన వంకీ ధరిస్తే చాలు. అందరి దృష్టి మీపైనే. అయితే ఈ వంకీల్లో వజ్రాలు, కాబొచాన్ గోమేధికాలు, కెంపులు పొదిగినవైతే మరింత ఆకర్షణీయంగా ఉంటాయి. ఈ రకం వంకీలు 50 నుంచి 80 గ్రాముల్లో దొరుకుతాయి.

పూర్తి బంగారంతోనూ: పూర్తి బంగారంతో తయారుచేసిన వంకీ సాదాసీదాగా ఉంటే ఏం బాగుంటుంది? అందుకని అరుదైన డిజైన్లను ఏరికోరి ఎంచుకోవాలి. చరిత్రను ప్రతిబింబించే వంకీలైతే అందరిలో ఆసక్తిని కూడా రేకెత్తిస్తాయి. ఇలాంటి వాటిలో చెప్పుకోదగినవి....టెంపుల్, నక్ష డిజైన్ల వంకీలు. వీటి మీదుండే నగిషీ, పనితనం చూడ ముచ్చటగా ఉంటుంది. లతలు, పువ్వులతో కూడిన డిజైన్లు కూడా ఆకర్షణీయంగా ఉంటాయి. కాబట్టి తరుగు కాస్త ఎక్కువైనా, ప్రత్యేకంగా కనిపించే వంకీలు ఎంచుకోవాలి.



వంకీలు ఇలా ఉండాలి: వంకీలు ఎంచుకునేటప్పుడు వాటిని చేతికి ధరించాలి. ధరిస్తేనే అది సౌకర్యంగా ఉందో, లేదో తెలుస్తుంది. కొన్ని వంకీలు గుచ్చుకుంటూ ఉంటాయి. మరికొన్ని దుస్తులకు తగులుకుంటూ అసౌకర్యాన్ని కలిగిస్తాయి. కాబట్టి చేతికి మరీ నొక్కుకోకుండా, అలాగని వదులుగా జారిపోకుండా సౌకర్యవంతంగా ఉండేలా చూసుకోవాలి.



• మంజుల రావు
మంజుల జ్యువెల్స్,
హైదరాబాద్.

ప్రేమ యాత్ర



అరకు

ఎక్కడికి పోదాము చిన్నదానా?

ఈ మధ్యే ప్రేమికుల రోజు అయిపోయింది. ప్రేమ ప్రతిపాదనలూ, ఆమోదాలూ, గిఫ్టులు ఇచ్చుకోవడాలూ, మనసులు పుచ్చుకోవడాలూ అయిపోయే ఉంటాయి. ఇక ప్రేమ యాత్రలకు ప్రణాళికలు మొదలెట్టారా? ఒక్క నిమిషం ఆగండి! బృందావనాలూ, నందనవనాలూ అక్కర్లేదన్న కవిగారి మాట కాస్త నిజమే కానీ, ఆహ్లాదం కలిగించే ప్రదేశాలకు వెళ్లొస్తే బంధం మరింత బలపడుతుందనేది కాదనలేని వాస్తవం! అలాంటి గమ్యాలు మన దేశంలో చాలానే ఉన్నాయి. దేనికదే ప్రత్యేకత కలిగిన అలాంటి కొన్ని ప్రదేశాలివి.

అరకు

ఎక్కడిదాకానో ఎందుకూ? మన తెలుగు రాష్ట్రాల ఊటీగా పేరుపొందిన అరకు ప్రణయజీవులకు ప్రకృతి వరం లాంటిది. ఎత్తయిన కొండలు.. వాటిని కప్పేసే పొగమంచు మేఘాలు. మెల్లగా వీస్తూ మనసును ఆహ్లాద పరిచే చల్లటి గాలి! ఆహ్లాదకరమైన వాతావరణానికీ, సహజసిద్ధమైన ప్రకృతి రామణీయతకూ అరకు చిరునామా.

ఎక్కడుంది?: ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం జిల్లాలో

ఎలా వెళ్లాలి?: రోడ్డు, రైలు, విమాన మార్గాలద్వారా విశాఖపట్నం చేరుకొని, అక్కడినుంచి అరకు వెళ్లవచ్చు. విశాఖపట్నం నుంచి అరకుకు బస్సు సర్వీసులు విస్తృతంగా ఉన్నాయి. కిరండోల్ మార్గంలో విశాఖ నుంచి అరకుకు రైలు మార్గంలో ప్రయాణిస్తే గొప్ప అనుభూతులు మీ సొంతమవుతాయి.

ఏం చూడొచ్చు?: చుట్టూ దట్టమైన అడవుల మధ్య ప్రయాణాన్ని ఆస్వాదించాలంటే విశాఖపట్నం నుంచి కిరండోల్ ప్యాసింజర్‌లోనో, ఈ మధ్య ప్రవేశపెట్టిన అద్దాల రైలులోనో ప్రయాణించండి. అనంతగిరి కొండల్లో కాఫీ తోటలు, అరకుకు సుమారు ముప్పై కిలోమీటర్ల దూరంలో ఉన్న బొర్రా గుహలు, పద్మాపురం గార్డెన్, గిరిజన సంస్కృతికి అద్దం పట్టే ట్రైబల్ మ్యూజియం, ఉమా కోటిలింగేశ్వరస్వామి కొలువైన పుణ్యగిరి ఆలయం, దగ్గర్లోని చాపరాయి జలపాతం... ఇలా సందర్శనీయ స్థలాలకిక్కడ కొదవలేదు.

అండమాన్ దీవులు

ఒకప్పుడు ఖైదీలను తరలించే ప్రాంతంగా ముద్రపడిన అండమాన్ ఇప్పుడు ప్రేమికులకు హృదయాల్ని బంధించే చెరసాల. సువిశాలమైన సముద్ర తీరాలు మీమీద సమ్మోహనాస్త్రాలు సంధిస్తాయి. ప్రకృతి సౌందర్యం అంతా అక్కడే కొలువైనట్టు కనిపిస్తుంది. చెట్టాపట్టాలేసుకొని విహరించడానికి ఇంతకంటే అనువైన గమ్యం మరొకటి లేదని మీరే చెబుతారు!

ఎక్కడున్నాయి?: కేంద్రపాలిత ప్రాంతమైన అండమాన్-నికోబార్

ఎలా వెళ్లాలి?: చెన్నై, కోల్‌కతా, విశాఖపట్నం, ఢిల్లీ, భువనేశ్వర్, హైదరాబాద్ నుంచి అండమాన్ రాజధాని పోర్ట్‌బ్లెయిర్‌కు నేరుగా విమానాలున్నాయి. ఓడ మీద వెళ్లాలనుకుంటే చెన్నై, కోల్‌కతా, విశాఖపట్నం నుంచి పోర్ట్‌బ్లెయిర్ చేరుకోవచ్చు. విశాఖపట్నం నుంచి ఓడలు నెలలో కొన్ని రోజుల్లో సర్వీసులను నడుపుతుంటాయి. ఓడ ప్రయాణం రెండు నుంచి రెండున్నర రోజులపాటు సాగుతుంది.



ఏం చూడొచ్చు?: దేశంలో అత్యుత్తమ బీచ్‌లలో ఒకటైన రాధానగర్ బీచ్. హ్యావెలాక్ ఐలాండ్‌లో ఉన్న ఈ బీచ్ అండమాన్ వెళ్లే వారు సందర్శించే ప్రదేశాల్లో తప్పనిసరిగా ఉంటుంది. తెల్లగా పరుచుకున్న మెత్తటి ఇసుకలో హాయిగా నడవొచ్చు, తీరంలో సన్‌బాత్ (సూర్యరశ్మి స్నానం) చెయ్యొచ్చు, కెరటాల్లో జలకాలాడొచ్చు. అదే దీవిలోని ఎలిఫెంట్ బీచ్ ప్రాంతం బోట్ రైడింగ్‌కూ అనుకూలంగా ఉంటుంది. కాలాపత్థర్ బీచ్... ఇంకా మరెన్నో బీచ్‌లు మనసు దోచుకుంటాయి. బోట్ల మీద విహారాలు, స్కూబా డైవింగ్ కూడా కొన్ని చోట్ల చెయ్యొచ్చు. పోర్ట్‌బ్లెయిర్ లోని జైలు, అక్కడి రోస్ ఐలాండ్‌లో ఉన్న బ్రిటిష్ వారి మొదటి పరిపాలనా కేంద్రం, నీల్ ఐలాండ్‌లో ప్రకృతి సిద్ధమైన శిలా తోరణం... ఇలా ఎన్నని చెప్పాలి?

అలెప్పీ



తూర్పు దేశాల వెనిస్‌గా ఖ్యాతిగాంచిన అలెప్పీకి వెళ్లగానే 'లాహిరి లాహిరి లాహిరి'లో పాట గుర్తొస్తుంది. సరస్సుల్లో హౌస్ బోట్ల మీద ఏకాంత విహారం... ఆకుపచ్చటి తోటల మధ్య మెలికలు తిరుగుతూ సాగిపోయే బోట్లు... ఇరుపక్కలా స్వాగతం పలికే కొబ్బరి చెట్లు... దీనికి సాటి వచ్చే అనుభూతి మరెక్కడ దొరుకుతుంది?

ఎక్కడుంది?: కేరళలో

ఎలా వెళ్లాలి?: హైదరాబాద్, విశాఖపట్నం నగరాల నుంచి అలెప్పీకి రైలు సౌకర్యం ఉంది. సమీప విమానాశ్రయం కొచ్చిలో ఉంది. అక్కడి నుంచి సుమారు 55 కిలో మీటర్ల దూరంలో ఉన్న అలెప్పీని రోడ్డు మార్గం ద్వారా చేరుకోవచ్చు.

ఏం చూడొచ్చు?: ఇక్కడి వెంబనాడ్ సరస్సు ఆసియాలో అతి పెద్ద మంచి నీటి కొలనుల్లో ఒకటి. హౌస్ బోటింగ్ విహారానికి ఇది ఎంతో అనువుగా ఉంటుంది. ఇక అష్టముడి సరస్సులో దాదాపు ఏడెనిమిది గంటలసేపు ప్రయాణించవచ్చు. శరీరాల్నే కాదు, మనసుల్ని కూడా ఈ ప్రయాణాలు సేదతీరుస్తాయి. అలెప్పీ బీచ్, అక్కడికి సుమారు పదకొండు కిలోమీటర్ల దూరంలోని మరారి బీచ్ చూసి తీరాల్సిందే. అపురూపమైన కుడ్య చిత్రాలకు నిలయం కృష్ణాపురం ప్యాలెస్ లాంటివి ఎన్నో సమీపంలో పర్యాటకులను ఆకట్టుకుంటాయి.

సిమ్లా

ఆపిల్ పండు... ప్రేమ చిహ్నాల్లో ఒకటి. అలాంటిది... ఇష్టపడే వారితో ఆపిల్ తోటల్లో విహారం ఇంకెంత ప్రియంగా ఉంటుంది! మంచు వానల్లో తడిసి ముద్ద కావాలన్నా, చల్లటి వాతావరణాన్ని ఆస్వాదిస్తూ, అపురూపమైన కట్టడాల మధ్య విహరిస్తూ గొప్ప అనుభూతిని గుండెల్లో నింపుకోవాలన్నా సిమ్లాకు ప్రయాణం కట్టాల్సిందే!



ఎక్కడుంది?: హిమాచల్‌ప్రదేశ్‌లో

ఎలా వెళ్లాలి?: రైళ్లలో ఢిల్లీ, చండీగఢ్ వెళ్లి రోడ్డు మార్గంలో సిమ్లా చేరుకోవచ్చు. ఢిల్లీ నుంచి సిమ్లాకు 340 కి.మీల దూరం ఉంటుంది. చండీఘడ్ నుంచి 115 కి.మీల దూరం ఉంది. ఈ నగరాల నుంచి బస్సుల్లో సిమ్లా వెళ్లొచ్చు. ఇక ఢిల్లీ నుంచి కాల్కాకు రైల్లో వెళ్తే, అక్కడినుంచి సిమ్లాకు టాయ్ ట్రైన్ సౌకర్యం ఉంది. సిమ్లాలో విమానాశ్రయం ఉంది. అయితే ఎక్కువ సర్వీసులు ఉండవు. చండీగఢ్‌కు విమానంలో వెళ్లి అక్కడినుంచి సిమ్లా చేరుకోవడం ఉత్తమం.

ఏం చూడొచ్చు?: వీలైనంత వరకూ టాయ్ ట్రైన్‌లో ప్రయాణం చెయ్యండి. దాదాపు తొంభై అయిదు కిలోమీటర్ల మేర పర్వతాల మధ్య సాగే ఈ యాత్ర కలకాలం గుర్తుండిపోతుంది. అలాగే సుమారు రెండువేల మీటర్ల ఎత్తులో ఉన్న హిమాలయన్ బర్డ్ పార్క్, దేశంలో అతి పురాతనమైన రెండో చర్చి అయిన క్రైస్ట్ చర్చి, బ్రిటిష్ వలస పాలకుల కాలంలో వైస్రాయ్‌ల నివాసం, సిమ్లా ఒప్పందం జరిగిన స్థలం అయిన వైసెరెగల్ లాడ్జ్ లాంటివి తప్పనిసరిగా చూడాల్సిన ప్రదేశాలు. ఇక షాపింగ్ కోసం, మంచి ఫుడ్ కోసం, వినోదాలకోసం పారమాల్ రోడ్ ఉండనే ఉంది.

ఉదయ్‌పూర్



'సిటీ ఆఫ్ లేక్స్'గా ప్రసిద్ధమైన ఉదయ్‌పూర్ అపూర్వమైన కట్టడాలకూ, దేవాలయాలకూ నిలయం. మేవాడ్ రాజుల కాలం నాటి కోటలు, హవేలీలూ, అప్పటి వైభవాన్ని కళ్లకు కట్టే మ్యూజియంలు... మిమ్మల్ని ఒక సరికొత్త లోకానికి తీసుకెళ్తాయి.

ఎక్కడుంది?: రాజస్థాన్‌లో

ఎలా వెళ్లాలి?: హైదరాబాద్ నుంచి చిత్తోర్‌గఢ్, విశాఖపట్నం నుంచి ఝాన్సీ ప్రాంతాలకు వెళ్లి, అక్కడి నుంచి రైలు, రోడ్డు మార్గాల్లో ఉదయ్‌పూర్ చేరుకోవచ్చు. ఉదయ్‌పూర్‌లో అంతర్జాతీయ విమానాశ్రయం ఉంది.

ఏం చూడొచ్చు?: పిచోలా, ఫతేసాగర్ సరస్సులు, సిటీ ప్యాలెస్, బగోరే కీ హవేలీ, లేక్ ప్యాలెస్ తదితర అపురూప కట్టడాలు, జగదీశ్ టెంపుల్, జగ్ మందిర్ లాంటి ఆలయాలు, షహేలియోం కీ బారీ ఉద్యానవనం, జానపద కళలకు నిలయమైన భారతీయ లోక్ కళా మ్యూజియం... ఇలా ఎన్నెన్నో.

తీర్థయాత్ర



తిరుపతమ్మ చిన్న తిరునాళ్ళు

ఏడాదికి రెండు తిరునాళ్ళు నిర్వహించే అరుదైన దేవాలయాల్లో కృష్ణా జిల్లా పెనుగంచిప్రోలులోని శ్రీ తిరుపతమ్మ ఆలయం ఒకటి. పదిహేడవ శతాబ్దంలో ఆ ప్రాంతంలో జీవించిన తిరుపతమ్మ మహిమల గురించి ఇక్కడి వారు ఇప్పటికీ కథలుగా చెప్పుకుంటూ ఉంటారు. తిరుపతమ్మ, ఆమె భర్త గోపయ్య విగ్రహాలు కొలువుతీరిన ఈ ఆలయాన్ని సందర్శించి, పూజలు చేస్తే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల విశ్వాసం. తిరుపతమ్మ పెద్ద తిరునాళ్ళు ప్రతి సంవత్సరం మాఘ శుద్ధ పౌర్ణమి నాడు మొదలై అయిదురోజులు జరుగుతాయి. చిన్న తిరునాళ్ళను ఫాల్గుణ శుద్ధ పౌర్ణమి నుంచి అయిదు రోజులు నిర్వహిస్తారు. ఇవి రేపటి (శుక్రవారం) నుంచి ప్రారంభం అవుతాయి.

ఎప్పుడు?: మార్చి రెండో తేదీ నుంచి మార్చి ఆరో తేదీ వరకూ

ఎక్కడ?: కృష్ణా జిల్లా పెనుగంచిప్రోలు మండల కేంద్రంలో

ఎలా వెళ్లాలి?: విజయవాడకు 72, గుంటూరుకు సుమారు 108 కిలోమీటర్లు, జగ్గయ్యపేటకు 25 కిలోమీటర్ల దూరంలో పెనుగంచిప్రోలు ఉంది. తెలుగు రాష్ట్రాల నుంచి జగ్గయ్యపేటకు, అక్కడి నుంచి పెనుగంచిప్రోలుకు చేరుకోవచ్చు. సమీపంలోని ప్రధాన రైల్వే స్టేషన్ విజయవాడ. దగ్గర్లోని విమానాశ్రయం కూడా విజయవాడ (గన్నవరం)లోనే ఉంది.

ఉత్సవ వివరాలు:

మార్చి 2- అఖండ జ్యోతి స్థాపన, నిత్య కల్యాణమూర్తులకు అభిషేకం, సామూహిక కుంకుమార్చన

మార్చి 3- తిరుపతమ్మ పుట్టింటి వంశం వారి ఇళ్ళ నుంచి పసుపు, కుంకుమ బండ్ల ఉత్సవం

మార్చి 4- రథోత్సవం (గ్రామోత్సవం)

మార్చి 5- దివ్య ప్రభోత్సవం (ప్రాకార ఉత్సవం)

మార్చి 6- బోనాలు, మొక్కుబడుల సమర్పణ

విదేశాల్లో చదువుతున్నారా?



ట్రావెల్ యాప్


అమెరికా, ఆస్ట్రేలియా,న్యూజిలాండ్.... ఇలా విదేశాల్లో చదువుకునే విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఒక యాప్ ఉందన్న విషయం తెలుసా? ఆ యాప్ పేరే 'ఫ్లైట్స్ బై స్టూడెంట్ యూనివర్స్'. ఇది అమెరికాలో చదువుతున్న ఇద్దరు విద్యార్థుల కృషి ఫలితం. విదేశాల్లో చదువు, వసతి సదుపాయాలు బాగా ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. పైగా ఏదో ఒక సందర్భంలో సొంత దేశానికి వెళుతున్న వారూ ఉంటారు. అప్పుడు విమానం ధరల్ని భరించడం కష్టమే. విద్యార్థుల బడ్జెట్‌కు తగ్గట్టుగా టిక్కెట్ ధరలు ఉండేలా 'స్టూడెంట్ యూనివర్స్' అనే ఓ ట్రావెల్ ఏజెన్సీని ఎన్సన్ అనే విద్యార్థి 1992లో స్థాపించాడు. డిస్కౌంట్‌లో టిక్కెట్ ధరలను అందించడంతో ఇది బాగా క్లిక్ అయింది. ఆ తర్వాత ఇది ప్రైవేట్ ఇన్వెస్టర్ల చేతిలోకి వెళ్లడంతో అంతర్జాతీయ ట్రావెల్ సంస్థగా ఆవిర్భవించింది. ఇప్పటికీ ఇది విజయవంతంగా నడుస్తోంది. ఇంతకీ, దీన్ని ఎలా ఉపయోగించుకోవాలంటారా...సరైన ధ్రువపత్రాలతో ఈ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుంటే చాలు!

సన్నీ ఫేవరెట్ స్పాట్స్!

స్టార్ డెస్టినేషన్

బాలీవుడ్ సంచలనాత్మక శృంగార తార సన్నీ లియోన్ తెలుగులో కూడా 'కరెంట్ తీగ', 'పీఎస్‌వి గరుడవేగ' చిత్రాల్లో తెలుగు ప్రేక్షకుల్ని కూడా అలరించింది. కెనడాలో పుట్టి, అమెరికా పౌరసత్వం పొంది, ప్రస్తుతం భారతదేశంలో నివసిస్తున్న సన్నీకి ప్రయాణాలంటే తగని మక్కువ. మరి వాటి గురించి ఆమె ఏం చెబుతుంది?

నచ్చిన ప్రదేశం: ప్రపంచంలో నాకు నచ్చే ఒకే ఒక ప్రదేశం అంటే చెప్పడం చాలా కష్టం. అయితే నా ఫస్ట్ ఛాయిస్ న్యూయార్క్. అది ఎప్పుడూ సందడిగా ఉంటుంది. కొత్త శక్తిని అందిస్తుంది. భారతదేశంలో ఢిల్లీ నాకు బాగా నచ్చుతుంది. అక్కడ స్ట్రీట్ ఫుడ్ తినడం నాకు భలే ఇష్టం. అమెరికాలో సియాటెల్ నగరం చాలా బాగుంటుంది. నేను మొట్టమొదటి ఇల్లు కొనుక్కున్నది అక్కడే. షాపింగ్ కోసం దుబాయ్‌ని మించింది నాకు కనిపించలేదు.





కొన్ని జ్ఞాపకాలు: నేను కెనడాలో సార్నియా అనే చిన్న పట్టణంలో పుట్టాను. నా తల్లితండ్రులు భారతీయులు. అందుకే మొదటిసారి ఇండియా వచ్చినప్పుడు నా మూలాలను తెలుసుకోగలిగాను. అవి చాలా అద్భుతం అనిపించాయి. అలాగే నేపాల్ వెళ్ళినప్పుడు ప్రశాంతంగా, అందంగా ఉన్న ప్రదేశాలనూ, ప్రజల స్నేహ స్వభావాన్నీ చూసి ముగ్ధురాలినయ్యాను. నా భర్తతో కలిసి చేసిన థాయ్‌లాండ్ పర్యటన కూడా నా మనసులో మంచి జ్ఞాపకంగా నిలిచిపోయింది.

అన్నీ పక్కన పెట్టేస్తా: ప్రయాణాలంటే నాకు చాలా ఇష్టం. కానీ ఎప్పుడంటే అప్పుడు కుదరదు కదా! నా వరకూ హాలిడే అంటే నా కోసం నేను సమయం కేటాయించుకోవడం, మరి దేని గురించీ ఆలోచించకపోవడం! అందుకే ఎక్కడికైనా వెళ్ళాలనుకున్నప్పుడు మిగిలిన పనులన్నీ పక్కన పెట్టేస్తాను. కొత్త చోటుకు వెళ్తే అక్కడ చూడాల్సినవన్నీ చూస్తాను. ఇక లోకల్ ఫుడ్ రుచి చూడకుండా వదలను.

అవి తప్పకుండా కొంటా: నాకు వంట చెయ్యడం ఇష్టం. అందుకే వంట గదికి పనికొచ్చే సామాన్లు, వెరైటీ వంట దినుసులు ఏవైనా దొరుకుతాయేమోనని చూస్తాను. అలాంటివి తప్పకుండా కొంటాను. అలాగే మా బ్రదర్ కోసం లేటెస్ట్ గ్యాడ్జెట్స్ తీసుకుంటాను.

అరుదైన తాబేళ్ళ పురిటిగడ్డ!

ట్రావెల్ గైడ్

మహారాష్ట్రలోని కొంకణ్ ప్రాంతంలో ఉన్న చాలా చిన్న గ్రామం వేల్స్ దీన్ని ఎకో విలేజ్‌గా తీర్చిదిద్దారు. ప్రతి సంవత్సరం శీతకాలం, వేసవికాలం మధ్య అరుదైన ఆలివ్ రిడ్లే తాబేళ్ళు ఇక్కడ తీర ప్రాంతంలో గుడ్లు పెడతాయి. ఆ గుడ్లలోంచి బయటికొచ్చి, చిట్టి చిట్టి అడుగులు వేస్తూ సముద్రం వైపు నడిచే ఈ తాబేలు పిల్లల్ని చూడడానికి పర్యాటకులు, ఫోటోగ్రాఫర్లు పెద్ద సంఖ్యలో ఇక్కడికి వస్తూ ఉంటారు. సందర్శకులకు అద్భుతమైన ఎకో-టూరిజం అనుభూతిని ఇచ్చే వేడుక ఇది.

వేల్స్ (కొంకణ్) తాబేళ్ళ పండుగ



ఎక్కడ?: మహారాష్ట్రలోని రత్నగిరి జిల్లా వేల్స్ గ్రామంలో

ఎప్పుడు?: ఈ ఏడాది మార్చి 10 నుంచి ఏప్రిల్ నెల మధ్య వరకూ

ప్రత్యేకత ఏమిటి?: 2006లో 'సహ్యాద్రి నిసర్గ మిత్ర' అనే స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఆ గ్రామస్థులు మొదటిసారి ఈ ఫెస్టివల్ నిర్వహించారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం ఇది జరుగుతోంది. టూర్ ఆపరేటర్లు ప్రతి శని, ఆది వారాల్లో ప్యాకేజీలను ముంబయి, పుణేల నుంచి ఏర్పాటు చేస్తున్నారు. ప్రాథమికంగా ఈ ఏడాది మార్చి 10న మొదలై, ఏప్రిల్ ఒకటో తేదీన చాలా టూర్లు ముగుస్తాయి. అయితే కొన్ని సంస్థలు ఏప్రిల్ 15 వరకూ కూడా టూర్లు నిర్వహిస్తున్నాయి.

మరికొంత సమాచారం: శీతకాలం, వేసవికాలాల్లో మాత్రమే తాబేలు పిల్లలు వేల్స్ బీచ్‌లో కనిపిస్తాయి. జనవరి నుంచి ఏప్రిల్ వరకూ తాబేళ్ళను ఇక్కడ చూడవచ్చు. వాతావరణ పరిస్థితుల మీద ఆధారపడి తాబేళ్ళు గుడ్లను పొదుగుతూ ఉంటాయి. కాబట్టి దానికి అనుగుణంగా ప్రతి సంవత్సరం టూర్ల తేదీలు నిర్ణయమవుతాయి. అలాగే తాబేలు పిల్లలు వాటిని సంరక్షించే చోట స్థిరంగా ఉండిపోవు. ఏ రోజు గుడ్డులోంచి బయటికొచ్చిన పిల్లను ఆ రోజు సముద్రంలోకి వదిలేస్తారు. అలా వదిలే సమయం కూడా కచ్చితంగా పాటిస్తారు. ఉదయం 7.00 నుంచి 7.30 గంటల మధ్య, సాయంత్రం 6.00 నుంచి 6.30 గంటల మధ్య ఈ తంతు జరుగుతుంది.

వేల్స్ చుట్టుపక్కల చూడదగ్గవి: బన్‌కోట్ ఫోర్ట్, హరిహరేశ్వర ఆలయం, హరిహరేశ్వర్ బీచ్, దగ్గర్లోని దపోలీలో కోటలు, గుహలు, వేడి నీటి బుగ్గలు

ఎలా వెళ్లాలి?: ముంబాయికి 225 కిలోమీటర్లు, పుణేకి 195 కిలోమీటర్ల దూరంలో వేల్స్ గ్రామం ఉంది. ఆ నగరాలకు తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల నుంచి రైలు, విమాన సదుపాయాలు ఉన్నాయి. హైదరాబాద్ నుంచి బస్సులున్నాయి. అక్కడి నుంచి రోడ్డు మార్గాల్లో వేల్స్‌కు చేరుకోవచ్చు.

బస ఎక్కడ?: వేల్స్‌లో హోటళ్ళు లేవు. ఈ సీజన్లో కొన్ని ఇళ్ళను పర్యాటకుల బసకు అనుకూలంగా (హోమ్ స్టే) ఉంచుతారు. టూర్ ఆపరేటర్ల ద్వారా బుక్ చేసుకుంటే వసతి వాళ్ళే ఏర్పాటు చేస్తారు.




బాధను పంచుకుంటున్న వెంకటేశ్, జయప్రద

అతిలోక సుందరికి అశ్రునివాళి


తల్లితో శ్రద్ధాకపూర్


ముఖేశ్ రిషి, బాబా సెహగల్

తెలుగువాణ్ణి అని సంతోషించారు!

- నటుడు జానీ లీవర్



"శనివారం రాత్రి ఒక షో చేసి ఇంటికి వచ్చాను. రాత్రి ఒంటి గంటకు (శ్రీదేవి ఇక లేరనే) వార్త తెలిసింది. నిద్ర పట్టలేదు. హిందీలో మేము కలిసి నటించాం. అయితే... తొలిసారి ఆమెను కలిసినప్పుడు 'నేను తెలుగువాణ్ణి' అని తెలిసి సంతోషించారు. మా కాంబినేషన్‌లో వచ్చిన చిత్రాల్లో 'ధాల్‌బాజ్'లోని సన్నివేశాలు ప్రేక్షకులను ఎంతో నవ్వించాయి. మేం కలిసిన ప్రతిసారి ఎక్కువగా తెలుగులో మాట్లాడుకునేవాళ్ళం.

వందేళ్ళకు ఒక్కసారి.....

- వివేక్ ఒబెరాయ్


తండ్రీకొడుకులు సురేశ్ ఒబెరాయ్, వివేక్ ఒబెరాయ్

"నిజాయితీగా చెప్పాలంటే.. శ్రీదేవి ఇక లేరనే వార్త వినగానే షాకయ్యాను. చిన్న వయసులో, జీవితంలో ఇంకా ఎంతో ముందుకు వెళ్తోన్న సమయంలో ఈ విధంగా జరుగుతుందని ఎవరూ ఊహించలేదు. ఆమెతో కలిసి పని చేయాలనేది నా కల. నేను శ్రీదేవిగారిని కలిసిన ప్రతిసారీ 'మేడమ్... మీరూ, నేనూ కలిసి ఒక చిత్రం చేయాలి. మీతో కలిసి పని చేశాననే గౌరవం నాకు దక్కాలి' అనేవాణ్ణి. అటువంటి నాకు శ్రీదేవి ఇక లేరనే వార్త పెద్ద షాక్. నేనే కాదు.. మా నాన్న (నటుడు సురేశ్ ఒబెరాయ్), కుటుంబ సభ్యులు షాక్‌లో ఉన్నారు. నాన్న ఆమెతో చాలా చిత్రాలు చేశారు. ఇద్దరూ కలిసి నటించారు. నేను బోనీజీ (బోనీ కపూర్) నిర్మించిన రెండు చిత్రాల్లో నటించాను. నన్ను ఒకరోజు వాళ్ళింటికి భోజనానికి పిలిచారు. అప్పుడు నేను ఆమెకు ఎంత పెద్ద అభిమానినో చెప్పాను. ఆమె చేసిన ప్రతి పాత్ర ఒక ఆణిముత్యమే. 'సద్మా', 'ధాల్‌బాజ్', 'మిస్టర్ ఇండియా' వంటి చిత్రాల్లో విభిన్న పాత్రలు చేశారు. శ్రీదేవి-బోనీజీ కుటుంబంతో మా కుటుంబానికి మంచి స్నేహపూర్వక సంబంధాలున్నాయి. మాకు మాత్రమే కాదు, భారతీయ చిత్రపరిశ్రమకు ఇది తీరని లోటు! తెలుగు, తమిళ్, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో దేశవ్యాప్తంగా చిత్రాలు చేశారు. అందం, అభినయం, సూపర్‌స్టార్ ఇమేజ్ కలబోసిన నటి శ్రీదేవి మేడమ్. వందేళ్ళకు ఒక్కసారి మాత్రమే అటువంటి నటులు వస్తారు. వెరీ వెరీ స్పెషల్ పర్సన్‌ను మనం కోల్పోయాం."

ఇప్పటికీ నమ్మలేకపోతున్నా

-బప్పీలహరి



'శ్రీదేవి ఇక మనతో లేరు అనే విషయాన్ని నేను ఇప్పటికీ నమ్మలేకపోతున్నా. మన అందరి జ్ఞాపకాల్లో ఆమె పదిలంగా ఉంటుంది. ఎప్పటికీ ఆమె మన 'సూపర్‌స్టారే' కన్నీళ్ళ పర్యంతమవుతూ సంగీత దర్శకుడు బప్పీలహరి చెప్పిన మాటలు ఇవీ. శ్రీదేవి కోసం బప్పీలహరి కంపోజ్ చేసిన 'నైనో మే సప్నా' పాట ట్రెండ్ క్రియేట్ చేసింది. 'హిమ్మత్‌వాలా' చిత్రం కోసం బప్పీలహరి స్వరపరిచిన ఈ పాటతో శ్రీదేవి ఉత్తరాది ప్రేక్షకుల మనసులు దోచుకొంది. శ్రీదేవి మృతి సందర్భంగా 'కభీ అల్విద నా కెహనా' పాటను ఆమెకు అంకితం ఇస్తున్నట్టు బప్పీలహరి ప్రకటించారు. 'తోఫా', 'హిమ్మత్‌వాలా', 'మవాలి', 'పత్థర్ కే ఇన్‌సాన్', 'గురు' తదితర శ్రీదేవి నటించిన చిత్రాలకు బప్పీలహరి అద్భుతమైన బాణీలు సమకూర్చారు.

నా కూతురికి పెద్దమ్మ!

- రాణీ ముఖర్జీ



"శ్రీదేవితో నాకున్న అనుబంధం ఇప్పటిది కాదు. నా చిన్నతనం నుంచే ఆమెతో పరిచయం ఉంది. ఆమె షూటింగ్‌లో ఉందని తెలియగానే నేను స్కూలు నుంచి ఇంటికి రాకుండా నేరుగా లొకేషన్‌కి వెళ్లేదాన్ని. 'అరే లడ్డూ' అని ఆమె నన్ను ఆప్యాయంగా పలకరించేవారు. ఈ మధ్య కలిసినప్పుడు కూడా నా 'హిచ్‌కీ' సినిమాను చూడాలని ఉందని చెప్పారు. తప్పక చూపిస్తానన్నాను. ఇప్పుడు చూడటానికి ఆమె లేరు" అని రాణీ ముఖర్జీ అన్నారు. శ్రీదేవితో తనకున్న అనుబంధాన్ని ఆమె గుర్తుచేసుకున్నారు. రాణి మాట్లాడుతూ "నాకు 2015లో అదిరా పుట్టింది. అప్పటి నుంచి నాకు శ్రీదేవిగారు నాకు పలు విషయాల్లో సలహాలు ఇచ్చేవారు. నటనలోనే కాదు, వ్యక్తిగతంగానూ నాకు స్ఫూర్తిని పంచారు. శ్రీదేవిగారు నాతో ప్రేమగా ఉన్న రోజులను మర్చిపోలేను. ఆమె నాకు అక్కలాంటిది. నా కుమార్తెకు పెద్దమ్మలాంటిది. అంత గొప్ప నటి మరణం పరిశ్రమకే కాదు, నాలాంటి నటీనటులకు కూడా తీరని లోటు. నాకు ఉన్న చనువు కారణంగా ఆమె మరణవార్తను ఇంకా నమ్మలేకపోతున్నా" అని చెప్పారు.

ఆర్జీవీ... శ్రీదేవి కోరుకున్నది ఇది కాదు!

- హిందీ టీవీ నటి కవితా కౌశిక్



"ఎవరొకర్ని బాధపెట్టాలని లేదా ఎవరొకరిపై నేరం నెట్టాలనేది నా ఉద్దేశం కాదు. కానీ, లేట్ సూపర్‌స్టార్ జీవితంలో తెరవెనుక సన్నివేశాల్లో నిజాలను తెలుసుకోవలసిన అవసరం ఉంది. శ్రీదేవి అభిమానులకు ఇది నా ప్రేమలేఖ" అంటూ సోషల్ మీడియాలో దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ అక్షర నివాళి అర్పించిన సంగతి తెలిసిందే. ఈ లేఖపై హిందీ సీరియళ్ళలో నటించే నటి కవితా కౌశిక్ మండిపడ్డారు. వర్మ ట్వీట్‌ను ఆమె కోట్ చేసి... "బహుత్ గలత్ కర్ రహే హై ఆప్ (మీరు చాలా పెద్ద తప్పు చేస్తున్నారు)! మీరు చెబుతున్నట్టు... ఆమె తన వ్యక్తిగత జీవితానికి చెందిన విషయాలను చాలా రహస్యంగా కాపాడుకున్నారు. అటువంటి అంశాలను మీరు బయటపెట్టడం సమంజసం కాదు. ఇప్పుడు మీ నోరు మూయించడానికి గానీ... తనని తాను రక్షించుకోవడానికి గానీ... ఆమె (శ్రీదేవి) ఇక్కడ లేరు. ఆమె జీవిత పుస్తకంలో పేజీలను ప్రతి ఒక్కరూ చదివేలా మీరు ఎందుకు తెరుస్తున్నారు. ఆమె కోరుకున్నది ఇది కాదు. డోంట్ డూ దిస్ (ఇలా చేయకండి)" అని పేర్కొన్నారు.

డైలీ సుడోకు - 118

							6	
	5		8				2	9
6		3			9			
5			4	6				3
8			9		3			1
9				1	8			7
			6			4		5
3	4				1		8	
	7							

ఎలా పూరించాలి?

ప్రతి బాక్స్‌లోనూ 9 గళ్లు ఉంటాయి.

నిలువుగానూ, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి.

ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

సుడోకు- 117 సమాధానం

7	6	2	8	4	9	3	1	5
9	5	4	7	1	3	8	6	2
3	8	1	5	6	2	4	9	7
6	1	3	9	7	5	2	4	8
4	2	7	6	8	1	5	3	9
5	9	8	2	3	4	1	7	6
1	7	6	3	2	8	9	5	4
2	4	9	1	5	7	6	8	3
8	3	5	4	9	6	7	2	1

రేపటి నుంచి థియేటర్లు బంద్!

దక్షిణ భారత థియేటర్లలో శుక్రవారం నుంచి చలనచిత్రాల ప్రదర్శనను నిలిపివేయనున్నట్టు తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ డిజిటల్ కమిటీ ఛైర్మన్ దామోదర ప్రసాద్ తెలిపారు. తెలుగు ఫిల్మ్ చాంబర్ సెక్రటరీ ముత్యాల రాందాస్‌తో కలిసి బుధవారం ఆయన విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. దామోదర్ ప్రసాద్ మాట్లాడుతూ "ఇప్పటివరకూ డిజిటల్ ప్రొవైడర్లతో మూడు సార్లు(హైదరాబాద్, చెన్నై, బెంగుళూరులో) సమావేశం అయ్యాం. వీపీఎఫ్(వర్చువల్ ప్రింట్ ఫీస్) చార్జీలను రద్దు చేయాలని, థియేటర్లలో మూడు ట్రైలర్లను ప్రదర్శించుకునే వెసులుబాటు మాకు కల్పించాలని, వాణిజ్య ప్రకటనల నిడివిని ఎనిమిది నిమిషాలకు కుదించాలని డిమాండ్ చేశాం. వాస్తవానికి డిజిటల్ విధానం మొదలైన ఐదేళ్లకే వీపీఎఫ్‌లు రద్దు కావాలి. ప్రపంచవ్యాప్తంగా ఆ పద్ధతే నడుస్తోంది. ఆంగ్ల చిత్రాలను ఇక్కడ ప్రదర్శించే సందర్భాల్లోనూ అదే విధానాన్ని అనుసరిస్తున్నారు. బాలీవుడ్‌లో మనకన్నా తక్కువ వీపీఎఫ్ ఛార్జీలు వసూలు చేస్తున్నారు. కానీ మన దగ్గర ఇంకా పాత చార్జీలు నడుస్తున్నాయి. దీని గురించి డిజిటల్ ప్రొవైడర్లను పలుమార్లు పరిశ్రమ తరఫున సంప్రదించాం. ఇటీవల కూడా వారితో దక్షిణ భారత చలనచిత్ర పరిశ్రమ జాయింట్ యాక్షన్ కమిటీ జరిపిన చర్చలు విఫలమయ్యాయి. ఆ సందర్భంగా 'మేం మార్చి 2 నుంచి థియేటర్లలో ప్రదర్శనలు నిలిపివేస్తామ'ని చెప్పినప్పుడు... ప్రొవైడర్లలో ఓ వ్యక్తి 'ఆల్ ది బెస్ట్ టు ద ఇండస్ట్రీ' అని వ్యంగ్య ధోరణిలో అన్నాడు. సినిమా పరిశ్రమ మీద ఆధారపడి జీవించే వాళ్లు అలా మాట్లాడటం ఎంతవరకు సమంజసం? దక్షిణాదిన అన్ని పరిశ్రమల్లోనూ అసంతృప్తి ఉంది. అందుకే అందరం కలిసి థియేటర్ల బంద్ చేస్తున్నాం" అని చెప్పారు. ముత్యాల రాందాస్ మాట్లాడుతూ "గత రెండు నెలల నుంచి డిజిటల్ ధరలు విపరీతంగా పెరిగాయి. పొరుగు రాష్ట్రాల వారు కూడా ఇదే విషయంతో ఇబ్బంది పడుతున్నారు. అందుకే అందరం కలిసి జాయింట్ యాక్షన్ కమిటీని ఏర్పాటు చేశాం. కమిటీ ఛైర్మన్ గా డి.సురేష్ బాబు గారు, కన్వీనర్ గా పి. కిరణ్ గారు బాధ్యతలు తీసుకున్నారు. ఇదే విషయమై గత ఆరేళ్ల నుంచి సురేష్ బాబుగారు, సి.కల్యాణ్ గారు, ఎన్. వి ప్రసాద్ గారు అంతా కలిసి పోరాటం చేసినా డిజిటల్ యాజమాన్యాలు దిగిరాలేదు. పలుమార్లు వాళ్లు సమావేశాలకు గైర్హాజరయ్యారు. అందుకే ఇప్పుడు థియేటర్లలో ప్రదర్శనలు నిలిపేస్తున్నాం. బుధవారం ఉదయం తెలంగాణ రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ గారి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లాం. ఆయన కూడా సానుకూలంగా స్పందించారు. ప్రభుత్వం తరఫున ఎల్లవేళలా సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు. మా పోరాటానికి ఏపీ, తెలంగాణ రాష్ట్రాలలోని థియేటర్ల యాజమాన్యం పూర్తిగా మద్దతిచ్చింది. నిర్మాతలు, ఎగ్జిబిటర్లు, పంపిణీ దారులు అంతా ఒకే తాటిపైకి వచ్చి పోరాటానికి చేయూతనివ్వడం ఆనందంగా ఉంది" అని అన్నారు.


ముత్యాల రామదాసు, దామోదర్ ప్రసాద్

తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో మార్చి 2 నుండి థియేటర్స్‌లో సినిమాలు నిలిపివేత

తెలుగు చలనచిత్ర పరిశ్రమకు అత్యంత భారంగా తయారైన డిజిటల్ ప్రొవైడర్స్ ఛార్జీలకు వ్యతిరేకంగా ప్రొడ్యూసర్స్, ఎగ్జిబిటర్స్, డిస్ట్రిబ్యూటర్స్ మార్చి 2, 2018 వ తేది నుండి ప్రదర్శనలు నిలిపివేయుటకు నిర్ణయం తీసుకోవడమైనది. కావున ప్రేక్షకులు సహకరించవలసిందిగా మా మనవి.

– తెలుగు చలనచిత్ర పరిశ్రమ



ఆరున... భరత్ ఆలోచనలు


మహేశ్‌బాబు

ఓ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అంటే ఎలా ఉండాలి? ఆయనకంటూ ఒక విజన్ ఉండాలి. ముందుచూపుతో ఆలోచించి రాష్ట్ర ప్రజలకు ఏమేం చేయగలరో లేదా ఏమేం చేస్తారనేది ముందుగా చెప్పగలగాలి. మహేశ్‌బాబు కూడా తన విజన్‌ను, ఆలోచనలను చెప్పనున్నారు. కొరటాల శివ దర్శకత్వంలో ఆయన కథానాయకుడిగా నటిస్తున్న సినిమా 'భరత్ అనే నేను'. ఇందులో మహేశ్ ముఖ్యమంత్రిగా నటిస్తున్న సంగతి తెలిసిందే. శ్రీమతి డి. పార్వతి సమర్పణలో డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై డీవీవీ దానయ్య నిర్మిస్తున్న ఈ సినిమాకు సంబంధించి 'ది విజన్ ఆఫ్ భరత్'ను ఈ నెల 6వ తేదీన విడుదల చేయనున్నారు. అంటే... టీజర్ అన్నమాట! అందులో మహేశ్ పాత్ర తాలూకా స్వభావాన్ని, ఆలోచనలను ఆవిష్కరించే అవకాశం ఉంది. కథానాయిరగా కైరా అడ్వాణీ, కీలక పాత్రధారులుగా ప్రకాశ్‌రాజ్, శరత్‌కుమార్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి పాటలు: రామజోగయ్యశాస్త్రి, సినిమాటోగ్రఫీ: రవి కె.చంద్రన్, ఎస్.తిరునవుక్కరసు, ఎడిటింగ్: శ్రీకర్‌ప్రసాద్, సంగీతం: దేవిశ్రీ ప్రసాద్.

సరికొత్త ప్రేమికుడు


రాజ్‌తరుణ్

ప్రేమ... ప్రతి సినిమాలోనూ ప్రేక్షకులకు సరికొత్తగా పరిచయమవుతుంది! దర్శకులు ప్రేమ చుట్టూ ఎన్ని కథలు అల్లినా ప్రతి సినిమాలోనూ కొత్తగా కనిపిస్తుంది! అందుకనే, ప్రేమ నేపథ్యంలో ప్రతి ఏడాది పలు సినిమాలు వస్తుంటాయ్! రాజ్‌తరుణ్ హీరోగా 'అలా ఎలా?' ఫేమ్ అనీశ్ కృష్ణ దర్శకత్వంలో శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై 'దిల్' రాజు నిర్మాణ సారథ్యంలో రూపొందుతోన్న సినిమా 'లవర్'. ఈ టైటిల్‌కి తెలుగులో 'ప్రేమికుడు' అని అర్థం! సినిమా పేరులో ప్రేమ ఉన్నప్పుడు కథలో ఉండకుంగా ఉంటుందా? ప్రేమలోని సరికొత్త కోణాలను స్పృశించేలా చిత్రం తెరకెక్కుతోందని దర్శకుడు అనీశ్ కృష్ణ తెలిపారు. 'దిల్' రాజు మాట్లాడుతూ "అనీశ్ కృష్ణ మంచి కథను రాశాడు. అందులో కథానాయకుడిగా రాజ్ తరుణ్ చక్కగా కుదిరాడు. ప్రస్తుతం చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. జూన్ 14న సినిమాను విడుదల చేయాడానికి సన్నాహాలు చేస్తున్నాం" అన్నారు. ఈ చిత్రానికి కూర్పు: ప్రవీణ్ పూడి, ఛాయాగ్రహణం: సమీర్‌రెడ్డి.

ఆ కసితోనే 'దండుపాళ్యం 4'

– వెంకట్

"'బాహుబలి' తర్వాత సీక్వెల్ పరంగా అంత క్రేజ్ తెచ్చుకున్న చిత్రం 'దండుపాళ్యం'. కానీ కొందరి ఈగోల కారణంగా 'దండుపాళ్యం2' నేను అనుకున్న రీతిలో తెరమీదికి రాలేదు. ప్రేక్షకులు ఆశించిందీ తెరమీదకు రాలేదు. అందువల్ల ఆ కసితో నేను 'దండుపాళ్యం 4' నిర్మిస్తున్నాను. ఇందులో పాత గ్యాంగ్‌తో పాటు కొత్త గ్యాంగ్ కూడా ఉంటుంది. 'దండుపాళ్యం' రీసెర్చ్‌లో మాకు దొరికిన సమాచారంతో పది సీక్వెల్స్ తీయొచ్చు" అని నిర్మాత వెంకట్ అన్నారు. వెంకట్ మూవీస్ పతాకంపై కె.టి.నాయక్ దర్శకత్వంలో వెంకట్ నిర్మించనున్న చిత్రం 'దండుపాళ్యం 4'. మార్చి 8న ప్రారంభం కానున్న ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను హీరో శ్రీకాంత్ చేతుల మీదుగా బుధవారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈసినిమా గురించి శ్రీకాంత్ మాట్లాడుతూ "నేను నటించిన చిత్రాల్లోనూ 'మహాత్మ'కు, 'పెళ్లిసందడి'కి సీక్వెల్స్ చేయాలని చాలా మంది అనుకున్నారు. కుదర్లేదు. ప్రస్తుతం 'దండుపాళ్యం' సీక్వెల్స్ మాత్రం వస్తూనే ఉన్నాయి. ఇందులోని కథావస్తువు అలాంటిది. దాన్ని ఆధారంగా చేసుకుని ఎన్ని పార్టులైనా చేయవచ్చు" అని అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "చూడ్డానికి సాఫ్ట్‌గా ఉన్నవాళ్లు క్రైమ్ మూవీస్ చేయకూడదనేం లేదు. నేను చూడ్డానికి సాఫ్ట్‌గానే ఉన్నప్పటికీ ఈ సబ్జెక్ట్‌ని బాగా డీల్ చేస్తాను" అని చెప్పారు. ఈ కార్యక్రమంలో వోల్గా వీడియోస్ బాబ్జీ కూడా పాల్గొన్నారు.


కె.టి.నాయక్, శ్రీకాంత్, వెంకట్

